

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 23

మంగళవారం 15-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



JEE MAIN - 2025 (Session 2) లో 300/300 మార్కులు సాధించిన శ్రీచైతన్య రెసిడెన్షియల్ విద్యార్థులకు మాత్రమే మ్యాథ్స్‌లో తెలిసిన విజయ రహస్యం ఏంటి?





10వ తరగతి పూర్తిచేసి – IIT-JEE / NEETలో టాప్ ర్యాంక్స్ సాధించాలని కలలుగనే విద్యార్థుల కోసం Most Advanced Programmes

IPL SUPER 60 | AIIMS SUPER 60

మ్యాథ్స్/బయాలజీ, ఫిజిక్స్ & కెమిస్ట్రీలలో రిజల్ట్ ఓరియంటెడ్ ఫౌండేషన్‌తో... ఇంటర్‌తో పాటు IIT/డాక్టర్ సీట్‌ను ఈజీగా సాధించవచ్చు.

శ్రీచైతన్య మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్ ప్రోగ్రామ్స్‌తోనే NEET లో టాప్ ర్యాంక్స్ ఎలా సాధ్యం?

ఒక లక్ష్యం పెట్టుకుని శ్రీచైతన్యను ఫాలో అయితే మీరు అనుకున్నది సాధిస్తారు.



మా పేరెంట్స్ కు నన్ను డాక్టర్‌గా చూడాలని కల. అందుకే నేను శ్రీచైతన్యని ఎంచుకున్నాను. డాక్టర్ సీట్ సాధించే లక్ష్యంతో డిజైన్ చేసిన శ్రీచైతన్య AIIMS-SUPER 60 ప్రోగ్రాం వల్లనే నాలో కాన్ఫిడెన్స్ రెట్టింపు అయింది. డైలీ ప్రాక్టీస్, మాక్ టెస్ట్‌లు, వీకెండ్ టెస్టులు, సైన్స్‌పై పట్టు సాధించే విధంగా ఎప్పటికప్పుడు డౌట్స్ క్లారిఫై సెషన్స్ నిర్వహించడంతో నా టార్గెట్ ఈజీగా రీచ్ అయ్యాను.

– Gattu Bhanu Teja
(AIIMS, Delhi)

NEET కోసం అడ్వాన్స్డ్ ఫౌండేషన్ ప్రోగ్రాం తో నా అన్ని సందేహాలు క్లియర్ అయ్యాయి.



NEET ర్యాంక్ నిర్ణయించే ఫిజిక్స్‌లో నేను చాలా సందిగ్ధంలో ఉన్నప్పటికీ శ్రీచైతన్య అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ ప్రోగ్రాం వల్ల ఏది అవసరం, ఎంతవరకు అవసరం అనే విషయాలు ప్రారంభంలోనే స్పష్టత రావడంతో, ఫిజిక్స్‌లో 180/180 మార్కులు సాధించాను. తద్వారా NEETలో 720/720 మార్కులతో ఆలిండియా 1st ర్యాంక్ సాధించగలిగాను.

– B Varun Chakravarthi
(AIIMS, Delhi, NEET All-India Open Category 1st Rank)

శ్రీచైతన్య ప్రోగ్రామ్స్ మరియు ఫ్యాకల్టీ చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తే, మీరు IIT సీటు సాధించవచ్చు.



నేను IIT-JEEలో ఆలిండియా టాపర్‌గా నిలిచానంటే దానికి కారణం శ్రీచైతన్యలో ఇంటర్‌తో పాటే IIT-JEE లక్ష్యంగా సైంటిఫిక్ అప్రోచ్‌తో కూడిన IPL-SUPER 60 ప్రోగ్రాం మరియు ఫ్యాకల్టీ సపోర్ట్. ఈ విషయంలో వారి సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేను.

– V Chidvilas Reddy
(CSE, IIT Mumbai, JEE Advanced All-India Open Category 1st Rank)

మా పేరెంట్స్ - నన్ను శ్రీచైతన్యలో చేర్చడంతోనే నా ఆత్మ విశ్వాసం పెరిగింది... IIT-JEEలో టాప్ ర్యాంకర్ గా నిలిచాను.



నా తల్లిదండ్రుల కల, నన్ను IITianగా చూడాలని. పదవ తరగతి తరువాత కాలేజీ ఎంపికపై ఆలోచిస్తుండగా శ్రీచైతన్య గురించి తెలుసుకొని శ్రీచైతన్యలో చేరడం జరిగింది. ఈరోజు నేను IITలో సీట్ సాధించానంటే, దానికి గల కారణం శ్రీచైతన్య పర్ఫెక్ట్ గైడెన్స్, స్టడీ మెటీరియల్ అని ఖచ్చితంగా చెప్పొచ్చు.

– S Venkata Koundinya
(CSE, IIT Madras, JEE Main All-India Open Category 1st Rank)

శ్రీచైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్‌లో ఉండటం వలన కఠినమైన మ్యాథ్స్ - సులభంగా క్రాక్ చేసి JEE MAIN – 2025 (Session 2)లో 300/300 మార్కులు సాధించగలిగాను.
నేను నా జూనియర్స్‌కి చెప్పేది ఒక్కటే



- మీరు అనుకున్న గోల్ సాధించాలంటే శ్రీచైతన్య ప్రోగ్రామ్స్‌తో మీరు ప్రయాణం సాగిస్తే చాలు!
- శ్రీచైతన్య ప్రోగ్రామ్స్ మరియు ఫ్యాకల్టీ చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తే, మీరూ IIT సీటు సాధించవచ్చు.
- ఒక లక్ష్యం పెట్టుకుని శ్రీచైతన్యను ఫాలో అయితే మీరు అనుకున్నది సాధిస్తారు.
- స్కూల్ స్థాయిలోనే శ్రీచైతన్య ఇచ్చిన ఫౌండేషన్ JEE Main లో 300 కి 300 మార్కులు సాధించడంలో ఎంతో ఉపయోగపడింది.


నేను ఈ రోజు IIT-JEEలో సక్సస్ కావడానికి కారణం శ్రీచైతన్యలో ఉండే వన్-టు-వన్ అడాప్షన్, డైలీ టీచింగ్ షెడ్యూల్, అసైన్మెంట్స్, స్టడీ అవర్స్, డౌట్స్ క్లారిఫై చేసే విధానం, ఎగ్జామ్ పాటర్న్ పై పూర్తి పట్టు సాధించే విధంగా విద్యాబోధన.

– Ajay Reddy Vangala
JEE Main 2025, Session-2, 300/300 Marks, As Per NTA Provisional Key

JEE ADV. 2024 - ఓపెన్ కేటగిరిలో ఆలిండియా టాప్ 10 లోపు 5 ర్యాంకులు



NEET 2024 - 720 కి 715 మార్కులు ఆపైన సాధించిన 11 మంది విద్యార్థులు



JEE MAIN 2024 - ఆలిండియా టాప్ 10 లోపు 4 ర్యాంకులు



ప్రతియేటా వేలాది తెలుగు విద్యార్థుల్ని ఇంజనీర్లుగా మారుస్తున్న ప్రోగ్రాములు

IPL SUPER 60 | IPL IC | C-IPL | C-120

ప్రతియేటా వేలాది తెలుగు విద్యార్థుల్ని డాక్టర్లుగా మారుస్తున్న ప్రోగ్రాములు

AIIMS SUPER 60 | ELITE NEET | MPL | MEDICON

Infinity Learn

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Ph.: 040 66 06 06 06 | srichaitanya.net

*T&C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
మంగళవారం ॥ 15-4-2025

గైనకాలజిస్ట్‌లు, సైకియాట్రిస్ట్‌లు, సైకాలజిస్ట్‌లు, లైఫ్ కోచ్‌లు.. అందరూ చెబుతున్నదీ, అవగాహన పెంచుతున్నదీ.. మెనోపాజ్‌తో మహిళ జీవితం అయిపోదని, అదొక ఫేజ్ అని, సహజమైన మార్పు అనే! దాన్ని ఆమె సాఫీగా దాటి.. లైఫ్‌ని ఉత్సాహంగా రీస్టార్ట్ చేయాలంటే ఆ దశ మీద అందరికీ అవగాహన ఉండాలని!

ఆ ఉద్దేశాన్ని ఈ క్యాంపెయిన్ కాస్తయినా నెరవేర్చిందని.. సైలెంట్‌గా ఉన్న ఆ అంశాన్ని చర్చలోకి తెచ్చిందని భావిస్తున్నాం! మెనోపాజ్ గురించి మరికొందరు నిపుణులు చెబుతున్న మరికొన్ని విషయాలను తెలుసుకుందాం..

సహజమైన మార్పు ఇది.. మనమూ మారుదాం!

మెనోపాజ్ అర్థం చేసుకుందాం

నిర్వహణ: సరస్వతి రమ



డాక్టర్ ప్రణతి రెడ్డి

45- 55 ఏళ్ల మధ్య వచ్చే పెరిమెనోపాజ్‌లో శారీరక, మానసిక, హార్మోన్ల, భావోద్వేగపరమైన మార్పులెన్నో కనిపిస్తుంటాయి. ఆ ఒత్తిడిని చాలామంది మహిళలు ఎవరి సహాయం లేకుండానే దాటేస్తుంటారు. సహాయం తీసుకోవాలనే ఎరుక వాళ్లకు లేక, అండగా ఉండాలనే గ్రహింపు కుటుంబాలకు రాక! కానీ ఇప్పుడా ఆలోచనను మార్చుకోవాలి. అర్థం చేసుకోవాలి. సపోర్ట్ ఇవ్వాలి!

మెనోపాజ్‌ను మనతో సహా తూర్పుదేశాలన్నీ పాజిటివ్‌గానే చూస్తున్నాయి. ఇది మహిళ జీవితంలో అత్యంత సహజమైన దశ. సింప్టమ్స్ తీవ్రంగా ఉండి దైనందిన జీవితం కూడా కష్టమైనప్పుడు తప్ప దీన్ని దాటడానికి మెడికల్ సపోర్ట్ అంతగా అవసరం ఉండదు. ఒకరకంగా చెప్పాలంటే ఇదొక ఆసక్తికరమైన మార్పు. కాబట్టి దీని గురించి మాట్లాడ్డానికి సిగ్గుపడనక్కర్లేదు. బిడియం అంతకన్నా వద్దు. 45- 55 ఏళ్ల మధ్య వచ్చే పెరిమెనోపాజ్‌లో శారీరక, మానసిక, హార్మోన్ల, భావోద్వేగపరమైన మార్పులెన్నో కనిపిస్తుంటాయి. ఆ ఒత్తిడిని చాలామంది మహిళలు ఎవరి సహాయమూ లేకుండానే దాటేస్తుంటారు. సహాయం తీసుకోవాలనే ఎరుక వాళ్లకు లేక, అండగా ఉండాలనే గ్రహింపు కుటుంబాలకు రాక! కానీ ఇప్పుడా ఆలోచనను మార్చుకోవాలి. అర్థం చేసుకోవాలి. సపోర్ట్ ఇవ్వాలి!

కుటుంబాలకు ఆ అవగాహన రావాలంటే పెరిమెనోపాజ్‌లోని మహిళలు తాము అనుభవిస్తున్న శారీరక, మానసిక సమస్యల గురించి కుటుంబానికి చెప్పాలి. చర్చించాలి. అప్పుడే ఆమె పరిస్థితిని కుటుంబం అర్థం చేసుకోగలదు. అండగా నిలబడగలదు. అంతేకాదు ఆ దశలోని మహిళలు తమ మానసిక భారాన్ని తేలిక చేసుకోవడానికి పదిమందితో కలుస్తూ .. మాట్లాడుతూ ఉండాలి. నడివయసు స్త్రీలలో చాలా మార్పులు కనిపిస్తుంటాయి. అయితే వయసుతో వచ్చిన మార్పులేమిటీ, ఈస్ట్రోజన్ తగ్గడం వల్ల వచ్చిన మార్పులేమిటో కనుక్కోవడం కష్టమే! సమస్యలు తీవ్రంగా ఉంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆ మహిళ వైద్యులను సంప్రదించాలి. ఆమె చెప్పింది వైద్యులు శ్రద్ధగా విని, అవసరమైన సలహాలు, సూచనలతో ఆమె ఆ దశను సాఫీగా దాటేలా సాయం చేస్తారు. ఇలాంటి ప్రయత్నాల వల్ల పెరిమెనోపాజ్ పట్ల సమాజంలో అవగాహన కలిగే అవకాశం ఉంది.

కష్టం లేకుండా పెరిమెనోపాజ్ దశను దాటేందుకు కొన్ని చిట్కాలు...

డైట్ : పెరిగిన బరువును తగ్గించుకోవడం కోసం భోజన మోతాదును, అందులోని అధిక కొవ్వు పదార్థాలను తగ్గించుకోవాలి కానీ పూర్తిగా భోజనాన్నే మానేయకూడదు! రోజు మొత్తంలో తీసుకునే భోజనంలో 30 శాతం లేదా అంతకంటే తక్కువ కొవ్వు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. శాచురేటెడ్ ఫ్యాట్ ఉన్న ఫ్యాటీ మీట్స్, హోల్ మిల్క్, ఐస్‌క్రీమ్స్, చీజ్ లాంటివాటికి దూరంగా ఉండాలి. మసాలానూ దరిచేరనివ్వద్దు. చక్కెర, ఉప్పునూ తగ్గించాలి. గ్రిల్డ్, స్మోక్ ఫుడ్‌కి నో చెబితే మంచిది. ఫైబర్, కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలను, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను డైట్‌లో చేర్చాలి. రోజుకు ఎనిమిది నుంచి పది గ్లాసుల వరకు నీటిని తాగాలి. మద్యం పూర్తిగా మానేయాలి. కాఫీ తగ్గించాలి.

వ్యాయామం: క్రమం తప్పని వ్యాయామంతో శారీరక ఆరోగ్యమే కాదు మానసిక ఆరోగ్యమూ సొంతమవుతుంది. అందుకే రోజూ 45 నిమిషాల పాటు కచ్చితంగా వాకింగ్ చేయాలి. యోగా, మెడిటేషన్, ప్రాణాయామాన్నీ ప్రాక్టీస్ చేయాలి. క్రియేటివ్ వర్క్‌ని వెదుక్కోవాలి. ఇది ఉత్సాహాన్నిస్తుంది. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్లు, చుట్టాలు, స్నేహితులతో కలుస్తుండాలి. హాట్ ఫ్లషస్ ఇబ్బందిగా మారితే.. వాటిని ట్రిగర్ చేస్తున్నవేవో గమనించి వాటికి దూరంగా ఉండాలి. పడక గదిని చల్లగా ఉంచుకోవాలి. డీప్ బ్రీతింగ్ ప్రాక్టీస్ చేయాలి. వాకింగే కాక స్విమ్మింగ్, డాన్సింగ్, సైక్లింగ్ ఇలా ఇష్టమైన దాన్ని ఎంచుకోవచ్చు. విటమిన్ ఇ సప్లిమెంట్స్ తీసుకోవాలి. 40 నుంచి 60 గ్రాముల సోయా ప్రొటీన్‌ను డైట్‌లో చేర్చుకోవాలి. వీటన్నిటి సహాయంతో పెరిమెనోపాజ్ దశను హాయిగా దాటేయొచ్చు.

– డాక్టర్ ప్రణతి రెడ్డి
క్లినికల్ డైరెక్టర్, రెయిన్‌బో హాస్పిటల్స్

పాజ్ నుంచి పుంజుకుందాం..



మెనోపాజ్ అనేది ప్రతి మహిళ జీవితంలో సహజమైన ప్రక్రియ. దీని తర్వాత కూడా ఆమెకు 30 ఏళ్లు పైబడిన ఆరోగ్యకర మైన, చురుకైన జీవితం ఉంటుంది. అందుకే మెనోపాజ్‌లో వచ్చే మార్పులు, సమస్యల గురించి తెలుసుకోవడం, అవగాహన పెంపొందించుకోవడం అత్యంతవసరం! ఈ దశలోని శారీరక మార్పులు మహిళల మానసిక ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. హాట్ ఫ్లషస్.. ఆ వెంటనే చెమటలు పట్టడం వంటివి మహిళ దైనందిన జీవితాన్ని ఇబ్బందిగా మారుస్తాయి. వెజైనల్ డ్రైనెస్ వైవాహిక జీవితం మీద ప్రభావం చూపిస్తుంది. అది ఆమెలో ఆందోళనకు తద్వారా ఇతర మానసిక సమస్యలకూ దారితీయవచ్చు. ఈ సమయంలో కొందరు మహిళలు బరువు పెరుగుతారు. కీళ్లనొప్పులు, అలసట, ఏకాగ్రత లోపించడం వంటివీ అనుభవంలోకి వస్తుంటాయి. ఇవన్నీ మానసిక ఇబ్బందులకు దారితీస్తుంటాయి. ఈ మొత్తంలో ప్రధానంగా చర్చించుకోవాల్సింది మెనోపాజ్‌లో వచ్చే డిప్రెషన్ లేదా కుంగుబాటు గురించి. మహిళలకు మెనోపాజ్ కంటే ముందు డిప్రెషన్ ఉన్నా లేకపోయినా.. ఈ దశలో దీనిబారినపడే ప్రమాదం రెండు నుంచి నాలుగింతలు ఎక్కువని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుకే ఈ టైమ్‌లో కుటుంబం ఆమెకు అండగా నిలవాలి. కానీ మన దేశంలో దీని పట్ల సరైన అవగాహన లేక కుటుంబాల నుంచి కోరుకున్న మద్దతు లభించట్లేదు. అందుకే మెనోపాజ్ ప్రభావాన్ని కుటుంబమూ అర్థం చేసుకొని, అవగాహన పెంచుకోవాలి. మెనోపాజ్ తర్వాతా ఆమె జీవితం సాఫీగా సాగిపోయేలా సహకరించాలి. లేకపోతే ఒత్తిడి పెరిగి అది ఆమెను వేగంగా వృద్ధాప్యానికి చేరువచేస్తుంది. డిప్రెషన్ లక్షణాలు ఏమాత్రం కనపడినా జంకు, సందేహం లేకుండా వెంటనే మానసిక వైద్యనిపుణులను కలవాలి. ఏ మానసిక సమస్యకైనా కౌన్సెలింగ్ రూపంలోనో.. మందులో రూపంలోనో.. ఇంకే ఇతర సపోర్ట్ రూపంలో అయినా చికిత్స ఉంటుంది. దాని కంటే ముందు మంచి ఆహార అలవాట్లు, ఎక్సర్‌సైజ్, మెడిటేషన్‌ను జీవనశైలిలో భాగం చేసుకోవాలి. సమస్యలను సాటి మహిళలతో పంచుకోవడానికి, చర్చించడానికి సందేహించవద్దు. షేరింగ్ వల్ల ఆందోళన, భయం తగ్గుతాయి. భరోసా వస్తుంది. అంతేకాదు ఆ చర్చల వల్ల సమాజంలోనూ దీనిపట్ల అవగాహన పెరుగుతుంది. ఇది జీవితంలో మళ్లీ పుంజుకోవడానికి సాయపడుతుంది.

– డాక్టర్ అల్లం భావన,
సైకియాట్రిస్ట్

ఫిట్‌నెస్ పెంచుకుందాం...



మెనోపాజ్ అనగానే జీవితం అయిపోయిందని భావించడమో, ఇక ఉపయోగం లేదని అనిపించుకోవడమో, తమ అవసరాన్ని ఎవరూ గుర్తించరనే భయమో కలుగుతుంది. నిజానికి ఇప్పుడే జీవితానికి కొత్త అర్థం మొదలవుతుంది. ఈ దశలో ఫిట్‌నెస్ చాలా కీలకం. ఫిట్‌నెస్ పెంచుకోవాలి. బ్రిస్క్ వాకింగ్, యోగా (భుజంగాసనం, చైల్డ్ పోజ్, శవాసనం లాంటివి), ప్రాణాయామం శరీరకంగా, మానసికంగా ఉపశమనాన్నిస్తాయి. సమతుల (కాల్షియం, విటమిన్ డి, ఒమేగా 3, ఫైబర్, ప్రొటీన్, నట్స్, ఫ్లాక్స్ సీడ్స్‌తో కూడిన) ఆహారం, తగినంత వ్యాయామంగల ఆరోగ్యకర జీవనశైలి మెనోపాజ్ సమస్యలకు చెక్ పెడుతుంది. ఒంటరితనం, దిగులుకు లోనవకుండా కొత్త యాక్టివిటీ మొదలుపెట్టాలి. ఫ్రెండ్స్‌తో గ్రూప్ ఏర్పాటు చేసుకుని మాట్లాడుతూండాలి. మహిళ ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యమే కాదు ఆమె మనసు, భావోద్వేగాలు కూడా! ఈ కోణంలో కుటుంబం మెనోపాజ్ దశలోని మహిళను అర్థం చేసుకోవాలి. సపోర్ట్ ఇవ్వాలి. అప్పుడే ఆమె ఆ దశను ఆనందంగా మలచుకుంటుంది.. ఆత్మవిశ్వాసంతో సాగుతుంది.

– రజిత మైనంపల్లి, లైఫ్ కోచ్,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, యోగా అండ్ డైట్ ఎక్స్‌పర్ట్

సిద్ధమైపోవాలంతే!

అప్పటిదాకా బాధ్యతల్లో మునిగిపోయిన మహిళకు తన జీవితాన్ని తనకు నచ్చినట్టు మలచుకునే ఒక వెసులుబాటు మెనోపాజ్! పీరియడ్స్ ఆగిపోవడం వలన శారీరకంగా కొంత అసౌకర్యం ఉండొచ్చు. కానీ పీరియడ్స్ వల్ల అప్పటిదాకా ఉన్న కొన్ని అసౌకర్యాల నుంచి రిలీఫ్ దొరుకుతుంది. ప్రయాణాలకు, కొత్త ప్రయత్నాలకు పీరియడ్స్ ఆటంకం ఉండదు. ఫ్యామిలీ ప్లానింగ్ బాధ్యతను మోసే బెడదా తప్పుతుంది. ఒక స్వేచ్ఛ దొరుకుతుంది. ఈ సానుకూలతల పట్ల దృష్టి నిలిపి.. మనసుకు ఉత్సాహాన్ని పట్టించి.. వయసుకు రెక్కలు తొడిగి రీస్టార్ట్‌కు సిద్ధమైపోవాలంతే!

– శిరీష చల్లపల్లి

సాగుబడి
అశ్విని కార్తె: ఏప్రిల్ 14 నుంచి

గాలి కుంటు వ్యాధి

వైరస్ సోకకుండా ముందు జాగ్రత్తలే మేలు!

వేసవిలో పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మొదలయిన చీలుగిట్టలుండే జంతువులకు సంక్రమించే వైరస్ వ్యాధుల్లో గాలికుంటు ముఖ్యమైనది. నోటికి, గిట్టలకు పుళ్లవుతాయి కాబట్టి ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (ఎఫ్ఎండి) అంటారు. ఆఫ్తో వైరస్ ఈ వ్యాధిని కలిగిస్తుంది. ఇది సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం. గాలి, ఇతర మార్గాల్లో ద్వారా వ్యాపిస్తుంది. మరణాల శాతం తక్కువైనప్పటికీ, పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుంది.



గాలికుంటు వ్యాధి లక్షణాలు

- గాలికుంటు వ్యాధి లక్షణాలు గొర్రెలు, మేకల్లో కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 104- 106 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది.
- నోటిలో చర్మపు పొరలు, పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు పొక్కి, చితకటం వల్ల పశువులు మేత తినవు. నోటి నుంచి చొంగ, నురుగు విపరీతంగా కారుతుంది.
- గిట్టల మధ్య, గిట్టపైన బొబ్బలు ఏర్పడి, చితికి పుళ్లవుతాయి. నొప్పి వల్ల పశువులు నడవలేక కుంటుతాయి. చను మొనలపై కూడా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు కనిపిస్తుంది.
- వ్యాధి సోకిన పశువుల పాలు తాగి దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు పనులకు ఉపయోగపడవు. చూలి పశువులకు గర్భస్రావాలవుతాయి.
- పశువులు రక్తహీనతకు గురై శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండవేడికి తట్టుకోలేక నీరసించిపోతాయి. ఈ లక్షణాలన్నీ ఎక్కువగా సంకరజాతి పశువుల్లో కనిపిస్తాయి.

టీకాలతో నివారణ ఉత్తమం

- గాలికుంటు వ్యాధికి చికిత్సలేదు. నివారణ మార్గాలపై శ్రద్ధ వహించాలి. గాలికుంటు వ్యాధి టీకాలు మొదటిసారి 2 నెలల వయసులో, బూస్టర్ డోసు ఒక నెల తర్వాత వేయించాలి. ప్రతి సంవత్సరానికి ఒకసారి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.
- గాలికుంటు వ్యాధి నివారణకు 6 నెలలకోసారి కేంద్ర ప్రభుత్వ పశు సంవర్థక శాఖ ఉచితంగా టీకా వేస్తోంది. రైతులు సమీపంలోని ప్రభుత్వ పశు వైద్యుడ్ని సంప్రదించి పశువులకు టీకాలు వేయించుకొని ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి తోడ్పడాలి.
- వ్యాధిగ్రస్త పశువుల నోటి చొంగలో వైరస్ అధిక శాతం వుంటుంది. ఈ చొంగ పడిన మేత, దాణా, నీరు, మల మూత్రాదుల్లో సంవత్సరం వరకు వైరస్ దాగి వుంటుంది. అనుకూల పరిస్థితుల్లో తిరిగి వ్యాధిని కలిగిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన పశుశాలలను సోడియం హైడ్రాక్సైడ్, 2% ఫార్మాలిన్, 4% సోడియం కార్బోనేటు వంటి మందులతో శుభ్రం చేస్తే వైరస్ నశిస్తుంది.
- ఆబోతుల, దున్నల వీర్యం ద్వారా కూడా ఈ వైరస్ వ్యాపిస్తుంది. 3 నెలల వరకు సంపర్కానికి నియోగించకూడదు. వ్యాధి సోకిన పశువుల పాలు దూడలు తాగకుండా చూడాలి. సంత నుంచి తెచ్చిన పశువుల్ని మూడు వారాలు విడిగా వుంచి, పరిశీలించి, టీకాలు వేయించిన తర్వాత ఆరోగ్యంగా వున్న పశువులతో కలువనివ్వాలి.

లక్షణాలకు అనుగుణంగా చికిత్స

- వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరు చేసి, సత్వర చికిత్స చేయించాలి. వైరస్‌వ్యాధి కాబట్టి మందులు పనిచేయవు. వ్యాధి లక్షణాలకు అనుగుణంగా చికిత్స చేయాలి.
- నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేటు కలిపిన నీళ్లతో శుభ్రం చేసి, వాటికి బోరోగ్లిజరిన్, యాంటి సెంప్టిక్ ఆయింట్‌మెంటు పూయాలి. కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లొరాక్సిన్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్ పూయాలి.
- ఈగలు వాలకుండా వేపనూనె, లినమెంట్ వంటి వాటిని వాడాలి. అలాగే నోటిలోని చిగుర్లు, పుండ్ల పొరలు అభివృద్ధికి విటమిన్-సి కలిగివుండే పౌడర్ ఆప్తోకేర్ వంటి వాటిని వాడాలి.
- బాక్టీరియా సోకకుండా యాంటిబయోటిక్ మందులు 3-5 రోజులు వాడాలి. ఉపశమనం కోసం మెలోక్సికమ్ మందులు వాడాలి. అలాగే విటమిన్లు, బి-కాంప్లెక్స్‌లతో కూడిన టానిక్‌లను ఇచ్చి వ్యాధి నిరోధక శక్తిని పెంచాలి.
- జావ/జొన్న అన్నం, చిటికెడు ఉప్పు, బెల్లం కలిపి ప్రతి రోజు తాగించటం ద్వారా బలహీనపడకుండా జాగ్రత్త వహించాలి. పశువు బాగా నీరసిస్తే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి వుంటుంది.

గృహ వైద్యం

- పటిక లేదా వెలిగారమును కలిపిన నీటితో నోటి పుళ్ళు, కాలి పుండ్లను కడగాలి. పావు కిలో రాగులు, పావు కిలో పెసలు ఉడకబెట్టి, 250 గ్రాములు నువ్వుల నూనెలో బాగా పిసికి.. రోజుకు 2 సార్లు తినిపించాలి. కాళ్ళకు నువ్వుల నూనె కడియం వేయాలి.
- జ్వరం తగ్గటానికి సురేకారం 20 గ్రాములు, ఉప్పు 30 గ్రాములు, నేలవేము 30 గ్రాములు, బెల్లం 120 గ్రాములు, అర లీటరు వేడి నీళ్ళలో కలిపి రోజుకు 2 సార్లు తాగించాలి.



హోమియో చికిత్స

- వ్యాధి ప్రబలిన ప్రాంతంలో పశువులకు మెర్క్ సోల్ 200 గానీ, కాల్ బైక్రోమికమ్ 200 గానీ, సిఫిలినం 200 గానీ ఏదో ఒకదాన్ని వాడితే వ్యాధి సోకకుండా పశువులను కాపాడుకోవచ్చు. 10 మాత్రలు చొప్పున ప్రతి రోజూ ఒకసారి తినిపిస్తే వ్యాధినిరోధకంగా పనిచేస్తుంది.
- వ్యాధి సోకితే అది తగ్గటానికి.. మెర్క్ సోల్ 200 లేదా కాల్ బైక్రోమికమ్ 200 లేదా సిఫిలినం 200 లేదా ఎకినేసియా 200 లేదా బోరాక్స్ 200 లేదా కాలి క్లోరాటం 200.. వీటిలో ఏదైనా ఒక మందును 10 మాత్రలు చొప్పున రోజుకు 2 సార్లు దొన తినిపించాలి.
- నోరు పుళ్ళు పడినపుడు బోరాక్స్ లేదా హైడ్రాస్టిస్ లేదా హైడ్రాస్టినమ్ మ్యూరియటికం లేదా ఎకినేసియా 'క్యూ'.. వీటిలో ఏదైనా ఒక మందు మదర్ టింక్చర్‌ను 1 మి.లీ.ను 10 మి.లీ. నీటిలో కలిపి నోటి పుళ్ళు కడగాలి.
- డెక్కల మధ్య పుళ్ళకు ఎకినేసియా లేక కాలెండ్యుల మదర్ టింక్చర్‌ను సమపాళ్ళలో కొబ్బరి నూనెలో గాని వ్యాసలైన్లో గానీ కలిపి రాయాలి.
- జ్వర తీవ్రత వుంటే హెపార్ సల్ఫ్ 1ఎం లేదా రుస్‌టాక్స్ 1ఎం మందును 10 మాత్రలు చొప్పున రోజుకు 2 సార్లు తినిపించాలి.

– డాక్టర్ జి. రాంబాబు, పశువైద్యాధికారి, కడప.
మొబైల్: 94945 88885



ఎవరైనా పట్టుదలతో పనిచేస్తే, ప్రకృతి సేద్యం సహా, ఏ రంగంలోనైనా రాణించవచ్చని రుజువు చేస్తున్నారు కందాడి బాల్‌రెడ్డి. హైదరాబాద్ ఐడిపిఎల్‌లో ఉద్యోగం చేస్తూ కార్మిక నేతగా పనిచేసి రిటైరైన తర్వాత 'మలుపు ప్రచురణలు' ప్రారంభించి సాహిత్యాన్ని ప్రజలకు అందించే పుస్తక ప్రచురణ రంగంలోనూ విజయం సాధించారు. ఆయన స్వస్థలం భువనగిరి పట్టణానికి 2 కి.మీ. దూరంలోని బొమ్మాయిపల్లికి మకాం మార్చిన బాల్‌రెడ్డి, శోభారాణి దంపతులు.. నాలుగేళ్లుగా మక్కువతో సేంద్రియ పెరటి తోటలు సాగు చేస్తూ స్ఫూర్తిదాయకమైన సత్ఫలితాలు సాధిస్తున్నారు. పేడ ద్రావణం, హోమియో మందులు, బ్యాటరీతో నడిచే వీడర్/ స్ప్రేయర్లను వాడుతున్నారుజె 71 ఏళ్ల వయసులో సేంద్రియ సేద్యాన్ని సులభతరం చేసి సరికొత్త పుంతలు తొక్కిస్తున్న బాల్‌రెడ్డి అనుభవాలు ఆయన మాటల్లోనే..!

పెరటి పంటలు కొత్త పుంతలు

గ్రామంలో ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో సేంద్రియ పెరటి తోటల సాగు

పేడ ద్రావణంతో నేలకు సత్తువ, హోమియో మందులతో పురుగుల నివారణ

300 గజాల మా ఇంటి పెరట్లో అంతా సున్నం నేల. మొక్క బతికేది కాదు. రెండేళ్లలో సారవంతమైంది. ఇప్పుడు పండ్ల చెట్లతో అడవిలా మారింది. మా వూళ్లో ఖాళీగా ఉన్న 250 గజాల మరో రెండు ఇంటి స్థలాలను కూడా తీసుకొని కూరగాయలు సాగు చేస్తున్నాం. ఒక స్థలంలో కాలీఫ్లవర్, క్యాబేజీ, వంగ తదితర అనేక రకాల కూరగాయలు, ఆకుకూరలను పక్క పక్క సాళ్లలో సాగు చేస్తున్నాం. రెండో దాంట్లో అనేక రకాల 40 అరటి మొక్కలు నాటాం.



పేడ ద్రావణం

పశువుల/మేకల ఎరువు, పచ్చిరొట్టతో నేలను సిద్ధంచేసి విత్తనాలు/మొక్కలు నాటిన తర్వాత.. తరచుగా పేడ ద్రావణం, డీకంపోజర్ ద్రావణాలను ఇస్తున్నాం. 200 లీటర్ల డ్రమ్ములో 10 కిలోల ఆవు పేడ, 10 లీ. మూత్రం, 2 కిలోల బెల్లం, 5 కిలోల చెక్క (వేరుశనగ తదితర), లీటరు డీకంపోజర్ ద్రావణంతో పాటు డ్రమ్ము నిండుగా నీరు కలిపి.. రోజుకు రెండు సార్లు తిప్పుతాం. 5/6 రోజుల్లో పేడ ద్రావణం రెడీ. దీనిలో మళ్లీ నీరు కలపకుండానే మొక్కలకు మొదళ్లలో పోస్తాం, వడకట్టి వారం/పది రోజులకోసారి అన్ని పంటలకూ పిచికారీ చేస్తాం. మొక్కల పెరుగుదలకు కార్బోవెజ్ 30 పిచికారీ చేస్తున్నాం. వీటితోనే పంటలు బలంగా పెరుగుతున్నాయి. పోషక లోపం రావటం లేదు.



హోమియో పురుగుమందులు

పంటలను పురుగులు, తెగుళ్ల బెడద నుంచి కషాయాలతో కాకుండా కేవలం హోమియో మందులతోనే కాపాడుకుంటున్నాం. కాయతొలిచే పచ్చ పురుగు తీవ్రత ఎక్కువగా కనిపించే కాలీ ఫ్లవర్, క్యాబేజీ, వంగ తదితర కూరగాయ పంటలకు 'తుజ 30' హోమియో మందును 20 లీ. నీటికి 40 ఎం.ఎల్. చొప్పున కలిపి ప్రతి 5 రోజులకోసారి పిచికారీ చేస్తే అసలు పురుగే రాలేదు. బీర, ఆనప వంటి తీగజాతి పంటల్లో పిందె పండుబారి రాలుతుంటే 'బావిస్టా30' మందును వారానికోసారి పిచికారీ చేస్తే సమస్య తీరింది. జామ ఆకులపై తెల్లమచ్చలు, తెల్లదోమల కనిపిస్తే 'సోరినమ్30' మందును 5,6 సార్లు పిచికారీ చేస్తే పోయాయి. 20 లీ. నీటికి 100 గ్రాములు ఇంగువ కలిపి మొదళ్ల దగ్గరపోసి, పిచికారీ చేస్తే శిలీంధ్ర తెగుళ్లు, వేరుకుళ్లు నియంత్రణలోకి వచ్చాయి. నా కృషికి తగిన ఫలితం దక్కింది.

పట్టుదలతో మనసుపెట్టి మక్కువతో చేస్తే... ఎవరైనా సరే పెరట్లో సేంద్రియ కూరగాయలు సులువుగా పండించుకోవచ్చు. మా పెరటి తోట చూసి పక్కింటి సుగుణమ్మ (60) 125 గజాల్లో టొమాటోలు పండించి అమ్ముతున్నారు. **సందేహాలుంటే నాకు ఫోన్ చెయ్యండి. నా నంబర్: 98665 59868.**

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 23
మంగళవారం 15-4-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



చెన్నై గెలిచిందోచ్...
ఐపీఎల్ టోర్నీలో రెండో విజయం సాధించిన సూపర్ కింగ్స్ -12లో



ధీరజ్‌కు కాంస్య పతకం
ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో రాణించిన ఏపీ క్రీడాకారుడు -12లో



నీలా రాజేంద్రకు నాసా ఉద్వాసన
డీఈఐ వంటి ఫెడరల్ ఏజెన్సీలను ట్రంప్ రద్దు చేయడంతో నాసా డీఈఐ విభాగం చీఫ్ నీలా రాజేంద్ర ఉద్వాసనకు గురయ్యారు.
వివరాలు 6లో ▸




మెహుల్ చోక్సీ అరెస్టు
బ్యాంకు రుణ కుంభకోణం ఆరోపణలతో పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బెల్జియంలో అరెస్టయ్యాడు.
వివరాలు 6లో ▸



రూ.1,800 కోట్ల డ్రగ్స్ పట్టివేత
గుజరాత్ తీరంలో పాక్ స్మగ్లర్ల నుంచి రూ.1,800 కోట్ల విలువైన మెథాంఫెటమైన్ అనే సింథటిక్ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు.
వివరాలు 6లో ▸



ఖనిజాలు బంద్
సుంకాల పోరులో అమెరికాకు చైనా గట్టి షాకిచ్చింది. అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతిని నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది.
వివరాలు 6లో ▸


భూభారతి లోగోను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా, కోదండరెడ్డి, నవీన్ మిత్తల్

రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఓ ప్రత్యేకమైన నంబర్
- భూములకు సరిహద్దులు నిర్ణయించి పూర్తి కొలతలతో భూధార్ ఇస్తాం
- భూధార్ నంబర్‌తో రైతుల భూములకు పూర్తి భరోసా
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే కొత్త ఆర్‌ఓఆర్ చట్టం
- వివాద రహిత భూ విధానం తేవడమే మా ప్రభుత్వ లక్ష్యం
- అపోహలు తొలగిద్దాం..ఎవరి భూమి వారికి లెక్క కొద్దీ ఇద్దామన్న సీఎం
- రైతులకు ప్రభుత్వం, రెవెన్యూ విభాగం రెండు కళ్లలాంటివని వ్యాఖ్య

ఆధార్‌లా భూధార్

భూభారతి పోర్టల్ ఆవిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆధార్ తరహాలో భూధార్ పేరిట రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఓ ప్రత్యేకమైన నంబర్ కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతి వ్యవసాయ భూమికి పక్కా కొలతలతో సరిహద్దులు నిర్ణయించి భూధార్ నంబర్ ఇవ్వడం వల్ల రైతుల భూములకు పూర్తి భరోసా లభిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దులు నిర్ణయించి సొంత రాష్ట్రం సాధించుకున్న రెవెన్యూ ఉద్యోగులకు రైతుల భూములకు సరిహద్దులు నిర్ణయించి భూధార్ కార్డులు ఇవ్వడం కష్టమేమీ కాదని అన్నారు. 'ధరణి' స్థానంలో రూపొందించిన కొత్త ఆర్‌ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) చట్టం 'భూ భారతి' పోర్టల్‌ను సోమవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

భూ రికార్డులు 'రెవెన్యూ' ఘనతే..: 'తెలంగాణ ప్రాంతంలో పోరాటాలన్నీ భూమితోనే ముడిపడి ఉన్నాయి. కొమురం భీమ్ మిగతా 2వ పేజీలో ▶

తాగునీటి సమస్యపై తస్మాత్ జాగ్రత్త
- వేసవిలో ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకూడదు
- ప్రతి గ్రామంలో తాగు నీటి వనరులు, సరఫరా పర్యవేక్షించాలి
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భూ సమస్యలను ఇకపై రెవెన్యూ యంత్రాంగమే పరిష్కరిస్తుంది
- గతంలో రైతులను న్యాయ స్థానాల మెట్లు ఎక్కించారు
- భూభారతిపై ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలన్న సీఎం
- ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు కేటాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

2లో

బుల్డోజర్ల ప్రయోగంలో రేవంత్ సర్కారు బిజీ


ప్రధాని మోదీ ధ్వజం

తెలంగాణ ప్రభుత్వం అడవులపై బుల్డోజర్లు ప్రయోగిస్తోంది

జంతువులను ప్రమాదంలో పడేసేలా వ్యవహరిస్తోంది.. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్న పీఎం

'తెలంగాణ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేసేలా, జంతువులను ప్రమాదంలో పడేసేలా వ్యవహరిస్తోంది. అడవుల్ని ధ్వంసం చేస్తోంది. వాటిపై బుల్డోజర్లు ప్రయోగిస్తోంది..'
-ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. హామీలను పక్కన పెట్టి బుల్డోజర్లను ప్రయోగించడంలో రేవంత్ సర్కార్ నిమగ్నమైందని ధ్వజమెత్తారు. మేం పర్యావరణాన్ని కాపాడుతుంటే, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ సంపదను నాశనం చేస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు నమ్మక ద్రోహానికి గురవుతున్నారని విమర్శించారు. తాము అభివృద్ధి ఎజెండాతో ముందుకెళుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పారు. హరియాణాలోని హిసార్‌లో 'మహారాజ అగ్రసేన్ ఇంటర్నేషనల్ విమానాశ్రయాన్ని' ప్రధాని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తెలంగాణలో ఇటీవల వివాదం రేకెత్తిన కంచ గచ్చిబౌలి మిగతా 3వ పేజీలో ▶


హరియాణాలోని హిసార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూస్‌రీల్

అంబేడ్కర్ మేధస్సు, త్యాగాలతోనే మనకు హక్కులు



నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో మనకు లభించిన హక్కుల వెనుక రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మేధస్సు, త్యాగం, దూరదృష్టి ఉన్నాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.
- వివరాలు 3లో▶

'అభయహస్తం' ఏమైంది?



దళిత సమాజానికి అనేక హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని కె.తారక రామారావు డిమాండ్ చేశారు. దళితులకు అంబేడ్కర్ అభయహస్తం పథకం పేరుతో రూ. 12 లక్షల చొప్పున చేస్తామన్న సాయం ఏమైందని ప్రశ్నించారు.
- వివరాలు 3లో▶

ప్రజలకు మేలు జరిగేలా..



బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ధరణితో విసిగి వేసారిన ప్రజలకు భూభారతితో మోక్షం కలిగిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజలకు మేలు జరిగేలా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు.
- వివరాలు 2లో▶

సొరంగం జిందాబాద్..!



దేశవ్యాప్తంగా సొరంగాల నిర్మాణం ఊపందుకుంది. సాగునీటి ప్రాజెక్టులు, రైలు మార్గాలు, రహదారుల కోసం వీటిని నిర్మిస్తున్నారు. అయితే ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం నేపథ్యంలో ఇప్పుడు సొరంగాల నిర్మాణం చర్చనీయాంశమవుతోంది.
- వివరాలు 2లో▶


ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వుల ప్రతిని సీఎం రేవంత్‌రెడ్డికి అందిస్తున్న జస్టిస్ షమీమ్ అక్తర్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు

కొలువుల జాతర మొదలు పెడతాం

ఎస్సీ వర్గీకరణ అమల్లోకి రావడంతో ఉద్యోగాల భర్తీకి మార్గం సుగమం

శాఖల వారీగా ఖాళీల ఖరారుకు త్వరలో సమావేశం నిర్వహిస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి | ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ కొలువుల నియామకాల జాతర మొదలు పెడతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి, ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసి రాష్ట్రం చరిత్ర సృష్టించిందన్నారు. వర్గీకరణ అమల్లోకి రావడంతో ఉద్యోగాల భర్తీకి మార్గం సుగమమైందని, వర్గీకరణకు లోబడి త్వరలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులను.. ఎస్సీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం కోచైర్మన్, మంత్రి దామోదర రాజ నర్సింహ, సభ్యులు పొన్నం ప్రభాకర్, దీనిపై ఏర్పాటైన వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, ఇతర మిగతా 3వ పేజీలో ▶

అమ్మో.. ఇవేం ఫీజులు!

- ఇంజనీరింగ్ కాలేజీల ప్రతిపాదనలపై సర్కార్ బెంబేలు
- కన్వీనర్ కోటా ఫీజులు భారీగా పెంచాలని కోరుతున్న యాజమాన్యాలు
- ఒత్తిడికి తలొగ్గితే ఇబ్బందులు తప్పవని భావిస్తున్న ప్రభుత్వం
- వాస్తవ పరిస్థితులపై అధ్యయనానికి కమిటీ వేసే యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఈ ఏడాది ఫీజులు భారీగా పెంచాలంటూ కాలేజీలు ఒత్తిడి చేస్తున్నాయి. అయితే ఇందుకు ఆమోదం తెలిపితే సర్కారు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని సీఎం సలహాదారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నివేదించడంతో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జనలు పడుతున్నట్లు సమాచారం. ప్రైవేటు కాలేజీలు ప్రతిపాదించిన కన్వీనర్ కోటా ఫీజుల వివరాలను మిగతా 14వ పేజీలో

కారు డోర్లు లాక్.. ఊపిరాడక చిన్నారుల మృతి


తన్మయశ్రీ


అభినయశ్రీ

- మేనమామ పెళ్లి వేడుకలకోసం అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ మృత్యువాతపడ్డారు. కారు డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్దలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

5 లో

గిగ్ వర్కర్ల కోసం కొత్త చట్టం



- మేడే రోజున అమలులోకి వచ్చేలా ప్రభుత్వం కసరత్తు
- బిల్లు ముసాయిదాను ప్రజాభిప్రాయం కోసం ఆన్‌లైన్‌లో పెట్టాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- గిగ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం సమావేశం

14 లో

ఇదండీ జగత్



కొత్తగా వచ్చేదేముంది సార్! గత పదేళ్లుగా పోలీసు యూనిఫాం వేసుకుని మరీ 'పచ్చపార్టీ'కి పని చేశారు కదా!

రోడ్డు ప్రమాదాలపై ఏఐ నిఘా

మార్గదర్శకాలు రూపొందించాలని అన్ని రాష్ట్రాలు, యూటీలకు కేంద్రం ఆదేశం

- సీసీ కెమెరాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తప్పనిసరి
- 200 కి.మీ. వేగంతో వెళ్లే వాహనాలనూ రికార్డు చేసే సామర్థ్యం ఉండాలని స్పష్టీకరణ
- హైరిస్క్ ప్రాంతాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్దేశం

గతంలోనే ఈ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసిన హైదరాబాద్ పోలీసులు



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏటా లక్షల మందిని బలితీసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నిరోధించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అత్యంత ప్రమాదకర ట్రాఫిక్ ఉల్లంఘనలపై కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పనిచేసే సీసీ కెమెరాలను వినియోగించేలా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను రూపొందించాలని ఆదేశించింది.

తొలిదశలో ఆ నాలుగు రకాలపై...
కేంద్ర రోడ్డు రవాణా ఉపరితల మంత్రిత్వ శాఖ తొలిదశలో నాలుగు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలపై దృష్టి సారించింది. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపడం, వన్‌వే, రాంగ్ రూట్లలో దూసుకురావడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను కట్టడి చేయడానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ ఉల్లంఘనలకు పాల్పడే వారిని గుర్తించడానికి ఏఐతో కూడిన సీసీ కెమెరాలను వినియోగించాలని చెప్పింది.

హైరిస్క్ ఏరియాలు గుర్తించి, ఏర్పాటు
తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే హైరిస్క్ ప్రాంతాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. బ్లాక్ స్పాట్స్‌గా మిగతా 3వ పేజీలో ▶


కుప్పకూలిన పాసేజ్ పిల్లర్

'సీతారామ'కు సరికొత్త సవాళ్లు

ట్రయల్ రన్‌కే బయటపడిన నిర్మాణ లోపాలు
- ములకలపల్లి మండలంలో కూలిపోయిన సూపర్ పాసేజ్ పిల్లర్
- అంతకుముందు వానాకాలంలో ప్రధాన కాల్వకు రెండుచోట్ల గండ్లు
- ప్రాజెక్టు పనుల్లో నాణ్యతపై సందేహాలు
- వచ్చే ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరాపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా గోదావరి జలాలు పొలాలకు పారుతాయా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టు ప్రధాన కాల్వకు గతంలోనే గండ్లు పడగా, ఇటీవల నిర్వహించిన ట్రయల్ రన్ సందర్భంగా.. ప్రధాన కాల్వ నిర్మాణంలో భాగమైన ఓ సూపర్ పాసేజ్ (బ్రిడ్జి) పిల్లర్ కూలిపోవడం సమస్యగా పరిణమించింది.

9 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో..
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో చేపట్టిన సీతారామ మిగతా 5వ పేజీలో ▶

సొరంగం జిందాబాద్..!

దేశంలో వేగంగా పెరుగుతున్న సొరంగాల తవ్వకం

రూ.1.60 లక్షల కోట్లతో నిర్మాణాలు/ప్రణాళికలు

ఇరిగేషన్, రోడ్లు, రైలు రవాణాలో అనేక చోట్ల టన్నెళ్లు

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంతో భద్రతపై జోరుగా చర్చ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న సొరంగం కుప్పకూలి 50 రోజులు దాటుతోంది. మొత్తం 8 మంది కార్మికులు చిక్కుకుపోగా వందల మంది సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నా ఇప్పటికీ ఆరుగురు కార్మికుల జాడ బయటపడకపోవడం సొరంగాల నిర్మాణం ఎంత రిస్కుతో కూడుకున్న వ్యవహారమో స్పష్టం చేస్తుంది. సాగునీటి ప్రాజెక్టులతో పాటు రైలు మార్గాలు, రహదారుల కోసం ప్రపంచ వ్యాప్తంగా వీటిని నిర్మిస్తుంటారు. కొన్ని కొండ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయం లేనప్పుడు సొరంగాల నిర్మాణం అనివార్యమవుతోంది. ఈ క్రమంలోనే గత దశాబ్ద కాలంగా దేశంలో సొరంగాల నిర్మాణం ఊపందుకుంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో 60 కి.మీ. నిడివి గల 42 సొరంగ మార్గాల నిర్మాణం పూర్తి చేశారు. మరో 75 సొరంగ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. 146 కి.మీ. నిడివి గల వీటి నిర్మాణానికి ప్రభుత్వాలు రూ.49 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు కాగల మరో 78 ప్రాజెక్టులు ప్రణాళికల స్థాయిలో ఉన్నాయి. వీటి మొత్తం నిడివి 286 కి.మీ. కావటం విశేషం. 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రీసెర్చ్' నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశంలో సొరంగ మార్గాల మొత్తం నిడివి 3,400 కి.మీ.కు చేరుకుంది. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం నేపథ్యంలో ఇప్పుడు సొరంగాల నిర్మాణం చర్చనీయాంశమవుతోంది.



స్వీడన్‌లో వరల్డ్ టన్నెలింగ్ కాంగ్రెస్

మే 9 నుంచి 15 వరకు వరల్డ్ టన్నెల్ కాంగ్రెస్

స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో మే 9–15 మధ్య వరల్డ్ టన్నెల్ కాంగ్రెస్ జరగనుంది. సొరంగ మార్గాల సుస్థిర అభివృద్ధి.. అందుకు దోహదం చేసే పద్ధతులు, కొత్త సాంకేతికత ఇతివృత్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ప్రమాదం నుంచి కొత్త ఉపాయం

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో సహాయక చర్యల కోసం ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌హెచ్ఏఐ అధికారులకు కొత్త ఆలోచన తట్టింది. హైదరాబాద్–శ్రీశైలం హైవే విస్తరణలో భాగంగా అమ్రాబాద్ అభయారణ్యం మీదుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని తొలుత భావించారు. అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి నుంచి ఇది ప్రారంభం కావాల్సి ఉంది. దాదాపు 42 కి.మీ. నిడివి ఉండే దీనికి రూ.8 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని తాత్కాలిక అంచనా. అయితే, ఎలివేటెడ్‌కు బదులు, సొరంగ మార్గం నిర్మిస్తే నిడివి కేవలం 22 కి.మీ.లకే పరిమితమై రూ.6 వేల కోట్ల ఖర్చుతో పూర్తవుతుందని అంచనా వేశారు. ఇదే కొత్త ఐడియా. ఎలివేటెడ్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనగా నివేదిక సిద్ధం చేశారు. కేంద్రం ఆమోదం తెలిపితే తెలంగాణలో తొలి సొరంగ మార్గం అవుతుంది.

దేశంలోని ప్రధాన సొరంగాలు

- అస్సాంలో బ్రహ్మపుత్ర నదీ గర్భంలో నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 34 కి.మీ. భారీ సొరంగమార్గాన్ని రూ.6,000 కోట్ల వ్యయంతో నిర్మించబోతోంది. ఇందులో నాలుగు వరుసల రహదారితోపాటు ప్రత్యేకంగా రైల్వే లైన్ కూడా ఉండనుంది. దేశంలో ఇదే భారీ సొరంగ మార్గం కాబోతోంది. ఇది పూర్తయితే గోహపూర్–నుమాలిగర్ పట్టణాల మధ్య ప్రయాణానికి ప్రస్తుతం పడుతున్న 6.30 గంటల సమయం అరగంటకు తగ్గుతుంది.
- రూ.4,965 కోట్లతో హుగ్లీ నదీ గర్భంలో నిర్మించిన కోల్‌కతా ఈస్ట్–వెస్ట్ మెట్రో కారిడార్ ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.
- జమ్మూకశ్మీర్‌లో ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఉదంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్‌లింక్ ప్రాజెక్టు (యూఎస్‌బీఆర్ఎల్) ప్రపంచంలో సొరంగాలతో కూడిన కీలక మార్గాల్లో ఒకటిగా నిలుస్తోంది. 324 కి.మీ. నిడివి ఉండే ఈ మార్గంలో ఏకంగా 38 సొరంగాలు ఉండటం విశేషం. మొత్తం 324 కి.మీ. నిడివి గల ఈ మార్గంలో సొరంగాల నిడివి ఏకంగా 119 కి.మీ. కావటం గమనార్హం. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.28 వేల కోట్లు. 359 మీటర్లతో ప్రపంచంలోనే అతి ఎత్తయిన చీనాబ్ రైలు వంతెన ఇందులో భాగమే.
- ఈ మార్గంలో ఖరి–సంబర్ మధ్య 12.77 కి.మీ. పీర్‌పంజాల్ పర్వత శ్రేణిలో బనిహాల్–ఖాజీగుండ్ మధ్య 11.2 కి.మీ. ఖాద్–అంజిఖాద్ మధ్య 5.09 కి.మీ. పొడవైన సొరంగాలు నిర్మించారు. ఈ సొరంగాల్లో ప్రతి 375 మీటర్లకు ఒక ఎస్కేప్ మార్గం ఏర్పాటుచేస్తున్నారు.
- థానే – ముంబ్రా/దివా (ముంబై శివారు) మధ్య 1915లో నిర్మించిన 1.3 కి.మీ. పొడవైన పార్సిక్ సొరంగం మనదేశంలో అతి పురాతనమైనది. దీన్ని గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వే నిర్మించింది.
- ఇంటర్నేషనల్ టన్నెలింగ్ అండ్ అండర్‌గ్రౌండ్ స్పేస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా డిసెంబర్ 4వ తేదీన ప్రపంచ సొరంగమార్గ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

మనదేశంలో పలు సొరంగ ప్రమాదాలు

2025 ఫిబ్రవరి: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కుప్పకూలి ఎనిమిది మంది చిక్కుకుపోయారు. ఇప్పటివరకు ఇద్దరి శవాలు మాత్రమే వెలికితీయగలిగారు.

2025 జనవరి: అస్సాంలోని బొగ్గుగని సొరంగం కుప్పకూలి నలుగురు చనిపోయారు.

2024 డిసెంబర్: ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వే సొరంగం కూలి ఒకరు మృతి చెందగా, 10 మందికి గాయాలయ్యాయి.

2023 నవంబర్: ఉత్తరాఖండ్‌లోని సిల్క్‌యారా రోడ్డు ప్రాజెక్టు సొరంగం కూలిపోయి 41 మంది శిథిలాల్లో చిక్కుకున్నారు. 17 రోజుల తర్వాత వీరిని కాపాడగలిగారు.

2019 సెప్టెంబర్: కోల్‌కతా మెట్రో రైల్ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టమేమీ జరగలేదు.

2004 ఆగస్టు: ఉత్తరాంచల్‌లో తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు సొరంగం నిర్మాణ సమయంలో కుప్పకూలి 29 మంది దుర్మరణం చెందారు.

సన్నబియ్యం లబ్ధిదారులే

ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు: సీఎం

సహపంక్తి భోజనాలు పెట్టిన లక్ష్మికి రేవంత్ అభినందనలు



Revanth Reddy
@revanth_anumula
సిద్దిపేట జిల్లా,
అక్బర్ పేట గ్రామానికి చెందిన
కూతురి లక్ష్మికి నా ప్రత్యేక అభినందనలు.

తనకు వచ్చిన 24 కిలోల సన్నబియ్యంతో
ఆమె ఊరందరికీ ...
సహపంక్తి భోజనం పెట్టి...
ఈ పథకం పేదల జీవితాల్లో...
ఎంతటి ఆనందాన్ని నింపిందో...
చెప్పే ప్రయత్నం చేసింది.

సన్నబియ్యం లబ్ధిదారులే...
మా ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు.

లక్ష్మికి అభినందనలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

మిరుదొడ్డి (దుబ్బాక): సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ కూతురు లక్ష్మి నిర్వహించిన సన్న బువ్వ సంబురానికి సీఎం అభినందనలు తెలిపారు. రేషన్ దుకాణం ద్వారా తను లబ్ధి పొందిన 24 కిలోల సన్నబియ్యంతో చాలా మందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసిన లక్ష్మిని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం 'ఎక్స్' వేదికగా అభినందించారు. 'అక్బర్‌పేట గ్రామానికి చెందిన కూతురు లక్ష్మికి నా ప్రత్యేక అభినందనలు. తనకు వచ్చిన 24 కిలోల సన్న బియ్యంతో ఆమె ఊరందరికీ సహపంక్తి భోజనాలు పెట్టి ఈ పథకం పేదల జీవితాల్లో ఎంతటి ఆనందాన్ని నింపిందో చెప్పే ప్రయత్నం చేసింది. సన్న బియ్యం లబ్ధిదారులే మా ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేశారు.

ఇక ప్రతిరోజూ పండుగే..



సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి అభినందించడంతో లక్ష్మి ఉబ్బితబ్బిబ్బవుతోంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' ఆమెను పలకరించింది. ఆమె ఆనందం ఆమె మాటల్లోనే..

'నేను రోజువారీ సంతలో చేపలు శుభ్రం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇది వరకు దొడ్డు బియ్యంతోనే కాలం గడిచిపోయేది. పండుగకో లేదంటే దావత్‌లకో సన్న బియ్యం కొనుక్కొని వండుకునే వాళ్లం. ఇప్పుడు గవర్నమెంటోళ్లు రేషన్ దుకాండ్ల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నరు. ఇక రోజూ సన్న బియ్యంతోనే పండుగ చేసుకుంటున్నట్లు అనిపిస్తుంది. మాలాంటి పేదోళ్లు ఇక నుంచి రోజూ సన్న బియ్యం తినడం చాలా ఆనందాన్నిస్తుంది. ఇదే ఆనందాన్ని అందరితో పంచుకోవాలన్న ఉద్దేశంతో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశాను. ఈ విషయం సీఎం రేవంతన్న దృష్టికి పోయిందంట. నన్ను అభినందిస్తూ మెసేజు పెట్టిండంట. నాకు చాలా సంతోషంగా ఉంది. సీఎం సారుకు శెనార్తులు చెప్పుకుంటున్న'.

– కూతురు లక్ష్మి, అక్బర్‌పేట

రెవెన్యూ ఉద్యోగుల మనోధైర్యం పెరిగింది: ట్రెసా



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రెసా ప్రతినిధులు రవీందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కొత్త రెవెన్యూ చట్టం, భూభారతి పోర్టల్ ఆవిష్కరణ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రెవెన్యూ అధికారులు, సిబ్బందిలో మనోధైర్యం పెంచాయని ట్రెసా ప్రతినిధులు వ్యాఖ్యానించారు. రెవెన్యూ సిబ్బందిని గత ప్రభుత్వం దోపిడీదారులుగా భావించిందని పేర్కొన్నారు. శిల్పకళావేదికలో సోమవారం జరిగిన కార్యక్రమం తరువాత ట్రెసా ప్రతినిధులు సీఎంను కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై తస్మాత్ జాగ్రత్త

వేసవిలో ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకూడదు

- ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు, సరఫరా పర్యవేక్షించాలి
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క, కొండా సురేఖ, జూపల్లి, పొంగులేటి, శాంతికుమారి, ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, వేం నరేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి కోరారు. తాగునీటి సరఫరా విషయంలో నీటి పారుదల శాఖ, తాగునీటి సరఫరా శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్ఆర్‌డీ)లో సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో వేసవి తాగునీటి ప్రణాళిక, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు డ్యాష్ బోర్డు ద్వారా ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు, సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉండాలని చెప్పారు. పలు గ్రామాలకు తాగు నీటి సరఫరా పైపులైను వ్యవస్థ లేదని, పలు ఇళ్లకు నల్లాలు లేవని.. ఆయా ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. కోయగూడేలు, చెంచు పెంటలు, ఇతర గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

భూభారతిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను న్యాయస్థానాల మెట్లు ఎక్కించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా విస్తృత అధ్యయనం తర్వాత తీసుకువచ్చిన భూభారతి చట్టం అమల్లోకి రావడంతో రెవెన్యూ యంత్రాంగమే ఇకపై ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. దీనిపై అప్పీల్ వ్యవస్థ ఉన్న విషయాన్ని రైతులు, ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలని, ప్రతి జిల్లా కలెక్టర్ మండల స్థాయి సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్థమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపాలని చెప్పారు. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, ఈ రెండింటినీ క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. భూభారతి చట్టాన్ని కలెక్టర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణపేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని, ఆయా మండల కేంద్రాల్లో సదస్సులకు కలెక్టర్లు కచ్చితంగా హాజరుకావాలని, ఆ మండలాల్లోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. వీటికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరవుతారని తెలిపారు.

ఇళ్ల మంజూరులో ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

గ్రామ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఆమోదం పొందిన జాబితాను మండల స్థాయి కమిటీలు పరిశీలించాలని సీఎం సూచించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపాలని.. ఇన్‌చార్జి మంత్రి ఆమోదించాకే ఇళ్ల జాబితా ఖరారవుతుందని చెప్పారు. సరైన పర్యవేక్షణకు వీలుగా ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. ఈ ప్రత్యేకాధికారి ఇందిరమ్మ కమిటీలు, మండల కమిటీలు, కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రి మధ్య సమన్వయకర్తగా ఉంటారని రేవంత్ వివరించారు. గతంలో ఉమ్మడి జిల్లాకు నియమించిన సీనియర్ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని, ఆయా జిల్లాల కలెక్టర్లతో కలిసి పర్యవేక్షించాలని సూచించారు. ఇళ్ల మంజూరులో ఏ దశలోనూ ఎవరూ ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గ వద్దని, ఎక్కడైనా అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే మండల స్థాయి కమిటీ, ప్రత్యేకాధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినందున జనాభా ప్రాతిపదికన, ఆయా గ్రామాలకు ఇళ్ల కేటాయింపు ఉండాలని, ఈ విషయంలో హేతుబద్ధత పాటించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, షబ్బీర్ అలీ, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆధార్‌లా భూధార్

▶ మొదటి పేజీ తరువాయి

జల్ జమీన్ జంగిల్ పోరాటం నుంచి చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య వరకు సాగించిన పోరాటాలు, సాయుధ రైతాంగ పోరాటం, కమ్యూనిస్టు సోదరుల పోరాటాలన్నీ భూమి కోసమే జరిగాయి. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత బూర్గుల రామకృష్ణారావు నుంచి పీవీ నరసింహారావు వరకు ఎందరో భూసంస్కరణలు తెచ్చారు. ఇందిరాగాంధీ నేతృత్వంలో దేశంలో వచ్చిన భూ సంస్కరణల ద్వారా వివిధ మార్గాల్లో ప్రజలు సొంతం చేసుకున్న భూములకు సంబంధించిన రికార్డులన్నింటినీ రెవెన్యూ శాఖనే రూపొందించింది. పట్వారీ వ్యవస్థ పోయిన తర్వాత వీఆర్‌ఓ, వీఆర్ఏలే రైతుల భూముల వివరాలు సేకరించి భద్రపరిచారు. 95 శాతం భూముల వివరాలను ప్రక్షాళన చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు..' అని సీఎం తెలిపారు.

ధరణి ప్రజల పాలిట భూతంగా మారింది

'తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఉన్న ఫళంగా అప్పటి ప్రభుత్వం చట్టాలను మార్చింది. గత పాలకులు రెవెన్యూ చట్టాలను మార్చి తెచ్చిన ధరణి పోర్టల్ ప్రజల పాలిట భూతంగా మారింది. ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ పైనే పెట్రోల్ పోసి తగలబెడితే, సిరిసిల్లలో ఓ మహిళ తన భూమి కోసం తహసీల్దార్‌కు తన తాళిబొట్టును లంచంగా ఇవ్వజూపింది. ఈ విధంగా ప్రజల బాధలకు కారణమైన ధరణిని బంగాళాఖాతంలో విసిరేసి, కొత్త ఆర్ఓఆర్ చట్టం తెస్తామని ఎన్నికలకు ముందు పాదయాత్రల్లో నేను, భట్టి విక్రమార్క ప్రజలకు హామీ ఇచ్చాం. కొత్త చట్టం పేదలకు చుట్టంగా ఉండాలని ఎంతో శ్రమించి 'భూ భారతి'ని తీసుకొచ్చాం. తెలంగాణలో వివాద రహిత భూ విధానం తేవాలన్న మా లక్ష్యానికి అనుగుణంగా ఈ చట్టం తెచ్చాం. ప్రజలకు అనుకూలమైనదిగా దీన్ని తీర్చిదిద్దాం. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే భూ భారతిని ప్రారంభిస్తున్నాం. ఈ చట్టాన్ని ఖమ్మంలో లక్ష మంది ప్రజల సమక్షంలో ప్రజలకు అంకితం చేద్దామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెబితే, నేను రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమక్షంలోనే చట్టం అమలు ప్రక్రియను ప్రారంభిద్దామని చెప్పా. ఈ ప్రభుత్వం రెవెన్యూ అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని గౌరవిస్తుంది..' అని రేవంత్ చెప్పారు.

గత ప్రభుత్వం తమ స్వార్థం కోసం చట్టాన్ని మార్చింది

'గతంలో ధరణిని తీసుకువచ్చిన పాలకులు రెవెన్యూ సిబ్బందిని దోషులుగా, దోపిడీదారులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. 70 ఏళ్లుగా ప్రజల భూములను కాపాడిన రెవెన్యూ సిబ్బంది ధరణి వచ్చిన తర్వాత మీకు దోపిడీదారులుగా కనిపించారా? మీరు వేలాది ఎకరాలు కొల్లగొట్టిన మాట వాస్తవం కాదా? సమాజంలోని ప్రతి వ్యవస్థలో రెవెన్యూ నుంచి రాజకీయ నాయకుల వరకు 5 నుంచి 10 శాతం వరకు చెడ్డవారు ఉంటారు. చెడ్డవాళ్లను శిక్షించుకుంటూ ప్రక్షాళన చేసుకుంటూ సాగాలి. కానీ గత ప్రభుత్వం రెవెన్యూ సిబ్బందిని దోషులుగా చూపించి తమ స్వార్థం కోసం చట్టాన్ని మార్చింది. ఆనాటి ముఖ్యమంత్రి రెవెన్యూ అధికారులపై అసెంబ్లీ సాక్షిగా ఏం మాట్లాడారో మీకు తెలుసు. గత పాలకుల్లా..మేం చేసే తప్పులకు మిమ్మల్ని దోషులుగా నిలబెట్టే విధానానికి నేను వ్యతిరేకం..' అని సీఎం అన్నారు.

కలెక్టర్లు గ్రామ గ్రామానికి వెళ్లాలి

'రెవెన్యూ అధికారులపై దురుద్దేశంతో కొందరు కల్పించిన అపోహలను తొలగిద్దాం. మేం తెచ్చిన చట్టాలను మీరు అమలు చేస్తారు. 69 లక్షల మంది రైతులకు ప్రభుత్వం, రెవెన్యూ విభాగం రెండు కళ్లు లాంటివి. కలెక్టర్ల నుంచి సిబ్బంది వరకు గ్రామ గ్రామానికి వెళ్లండి. కలెక్టర్లు ప్రతి మండలంలో పర్యటించాలని ఈ వేదిక నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా. అందరి సహకారంతో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయండి. భూభారతిని పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో చేపడుతున్నాం. నాలుగు మండలాల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్ తీసుకుని లోపాలు ఏమైనా ఉంటే సవరించుకున్న తర్వాత అన్ని జిల్లాల్లోని అన్ని మండలాల్లో భూ సమస్యలు పరిష్కరించుకుందాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

రేవంత్, పొంగులేటి ఇలాకాల్లో భూభారతి పైలెట్

- మద్దూరు, నేలకొండపల్లి, వెంకటాపూర్, లింగంపేట మండలాలను ఎంపిక చేసిన ప్రభుత్వం
- ఈ మండలాల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పోర్టల్ మరింత బలోపేతం
- మార్గదర్శకాల తయారీలో భూ చట్టాల నిపుణుడు సునీల్ కీలక పాత్ర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టాన్ని పైలెట్ పద్ధతిన రాష్ట్రంలోని 4 మండలాల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి, ములుగు నియోజకవర్గంలోని వెంకటాపూర్, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలాలను ఇందుకోసం ఎంపిక చేసింది. తొలుత ఈ మండలాల్లో భూభారతి చట్టం అమలు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తారు. ఆయా మండలాల రైతులతో సదస్సులు ఏర్పాటు చేసి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఈ మండలాల్లో చట్టం అమలవుతున్న తీరు, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రానున్న రోజుల్లో భూభారతి పోర్టల్‌ను మరింత బలోపేతం చేయనున్నారు. అయితే ఈ మండలాల్లో పైలెట్ పద్ధతిన చట్టం అమలు చేసినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ చట్టం అమల్లో ఉంటుందని, కేవలం అనుభవాల ఆధారంగా పోర్టల్‌ను బలోపేతం చేసేందుకు మాత్రమే పైలెట్ పద్ధతిని నిర్వహిస్తామని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

ధరణి లోపాలకు చెక్..సాదా బైనామాలకు మోక్షం

ధరణి పోర్టల్‌లో ఉన్న దాదాపు అన్ని రకాల లోపాలకు చెక్ పెట్టే విధంగా భూభారతి మార్గదర్శకాలు రూపొందించారు. మొత్తం 22 సెక్షన్లు, 19 నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించారు. ముఖ్యంగా ఈ చట్టం అమలు ద్వారా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తొమ్మిది లక్షలకు పైగా సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది.

భూభారత్‌లోని కీలక అంశాలు ఇలా ఉన్నాయి

- ధరణి స్థానంలో కొత్త భూహక్కుల రికార్డు వస్తుంది. ఈ రికార్డుల్లో నమోదైన తప్పొప్పులను సవరించుకునే అవకాశం ఉంది.
- నిర్ణీత కాల వ్యవధి అనంతరం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే సమయంలో ఆ భూమికి సంబంధించిన సర్వే మ్యాప్ కూడా జత చేస్తారు. తద్వారా సరిహద్దు వివాదాలకు ఆస్కారం ఉండదు.
- వారసత్వంగా వచ్చిన భూములను మ్యుటేషన్ చేయడానికి ముందు 30 రోజుల్లో విచారణ జరుపుతారు.
- పాసు పుస్తకాల్లో భూమి పటం ప్రచురిస్తారు.
- కొంతకాలం తర్వాత ప్రతి భూమికీ భూధార్ నంబర్ జారీ చేస్తారు.
- ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు కూడా హక్కుల రికార్డు నమోదు చేస్తారు.
- రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారు.
- గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డును నిర్వహిస్తారు.
- భూ సమస్యల పరిష్కారానికి రెండు దశల్లో అప్పీలు వ్యవస్థ ఉంటుంది.
- మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చుకుంటే దాన్ని రివిజన్ చేయాలని ఎవరైనా కోరవచ్చు. ప్రభుత్వం దానిపై విచారణ జరిపి రికార్డుల కనుగుణంగా తగు నిర్ణయం తీసుకునే అవకాశం ఈ చట్టం ద్వారా కలగనుంది. భూభారతి చట్టం మార్గదర్శకాల రూపకల్పనలో భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ కీలకంగా వ్యవహరించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి భూ చట్టాలపై అవగాహన, పలు రాష్ట్రాల్లో అమలవుతున్న భూ చట్టాలపై అధ్యయనం చేసిన సునీల్ భూభారతి చట్టం రూపకల్పనలో తనదైన పాత్ర పోషించారు.

సామాన్యుడికీ

అర్థమయ్యేలా భూభారతి

ఎలాంటి మతలబు, ఇబ్బంది లేకుండా తయారీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జూన్ 2 నాటికి సమగ్ర చట్టం: మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: సామాన్యుడికి సైతం అర్థమయ్యే విధంగా ఎలాంటి మతలబు, ఇబ్బంది లేకుండా తయారు చేసిందే భూ భారతి 2025 చట్టం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శిల్ప కళావేదికలో జరిగిన భూభారతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో భూమితో పెన వేసుకున్న ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తూ గత పాలకులు ధరణి చట్టం తెచ్చారని భట్టి విమర్శించారు. ధరణి రైతుల పాలిట శాపంగా మారిందని, కొంతమంది పెత్తందారుల కాళ్ల వద్ద రైతుల హక్కులను తాకట్టు పెట్టే విధంగా ఉందని.. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో ఎంత మొత్తుకున్నా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు గతంలో పేదలకు పంపిణీ చేసిన 24 లక్షల ఎకరాలకు సంబంధించిన హక్కులను గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి కాలరాసిందని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని పాదయాత్రలో రైతులకు భరోసా ఇచ్చామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.

జన్మ ధన్యమైంది: పొంగులేటి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే భూభారతి చట్టాన్ని ప్రజలకు అందించడంతో తన జన్మ ధన్యమైందని అన్నారు. అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఫిర్యాదులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తారని వివరించారు. ఈనెల 17 నుంచి కలెక్టర్లు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. మే మొదటి వారంలో రాష్ట్రంలో మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి ఫిర్యాదులు స్వీకరించి భూభారతి చట్టాన్ని పటిష్టపరుస్తామన్నారు. జూన్ 2వ తేదీ నాటికి సమగ్ర చట్టాన్ని ఉపయోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ గత చట్టంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది భూ భారతి పోర్టల్‌ను రూపొందించినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత గొప్ప రెవెన్యూ చట్టంగా భూభారతిని రూపొందించినట్లు చెప్పారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగే

విధంగా భూభారతి

విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ధరణితో విసిగి వేసారిన ప్రజలకు భూభారతితో మోక్షం కలిగిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రజలకు మేలు జరిగేలా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని చెప్పారు. సోమవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, కైలాశ్ కుమార్, రాచమళ్ల సిద్దేశ్వర్, శ్రీనివాస్‌తో కలిసి మహేశ్‌గౌడ్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో పాలనలో మార్పును ప్రజలకు చూపించగలిగామన్నారు. మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణకు మోక్షం కలిగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సామాజిక న్యాయానికి చాంపియన్ రాహుల్‌గాంధీ అని కాంగ్రెస్ ప్రభుత్వం రుజువు చేసిందని పేర్కొన్నారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్, కేటీఆర్ పగటి కలలు కనడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి పదవి ఇచ్చే విషయంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అభిప్రాయం ఆయన వ్యక్తిగతమని చెప్పారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మాజీమంత్రి కేటీఆర్ అరెస్టు కావాల్సిందేనని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణపై మోదీ మొసలి కన్నీరు కారుస్తున్నారని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

సీఎంకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కృతజ్ఞతలు



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న ఉద్యోగ జేఏసీ నేతలు. చిత్రంలో భట్టి, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం–2025 అమల్లోకి తీసుకొచ్చి రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి.. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపాయి. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలో ఎక్కడా లేని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టించి, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులకు బాటలు వేసిన ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగులందరం రుణపడి ఉంటామని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, రమేశ్ పాక, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రామ్‌రెడ్డి, భిక్షం తెలిపారు.

పెగాసస్ నిఘా నిజమే!

2018-19 మధ్య భారత్‌లో వందమంది ప్రముఖులపై నిఘా • అప్పటి పాలక పక్షాలతో ఒప్పందం.. స్పై వేర్‌తో ట్యాపింగ్

- వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా వెల్లడి
- 2018–19లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై టీడీపీ ప్రభుత్వం నిఘా
- అదే విషయాన్ని వెల్లడించిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- తాజాగా నిర్ధారించిన మెటా



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ చెప్పిందే నిజమైంది. 2018–19లో అప్పటి ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తమ పార్టీ అగ్ర నాయకుల ఫోన్లపై చంద్రబాబు ప్రభుత్వం నిఘా పెట్టిందన్న ఆరోపణలు నిజమేనని నిర్ధారణ అయింది. భారత్‌లో ఎంపిక చేసిన రాజకీయ నేతలు, సామాజికవేత్తల వాట్సాప్ నంబర్లపై ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ పెగాసస్ స్పైవేర్‌తో నిఘా పెట్టిందని వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా వెల్లడించింది. ఈ మేరకు న్యాయస్థానంలో కొంత కాలం క్రితం అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దాంతో చంద్రబాబు ప్రభుత్వ బాగోతం మళ్లీ తీవ్ర చర్చనీయాంశమైంది.

స్పైవేర్ నిఘాలో రెండో స్థానంలో భారత్

నిఘా సాఫ్ట్‌వేర్ స్పైవేర్‌ను రూపొందించిన ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్‌తో ప్రపంచంలోని పలు దేశాల ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ జాబితాలో, పెగాసస్‌ను ఉపయోగించిన దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండడం గమనార్హం.

- 2018–19లో భారత్‌లో వందమంది రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు తదితరుల వాట్సాప్ నంబర్లపై ఎన్ఎస్ఓ గ్రూప్ పెగాసస్ స్పైవేర్‌తో నిఘా పెట్టింది. ఇందుకోసం వివిధ ప్రభుత్వాలు ఏకంగా రూ.58 కోట్లు ఎన్ఎస్ఓ గ్రూప్‌నకు చెల్లించాయి.
- ఎన్ఎస్ఓ గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో 1,223 మందిపై నిఘా పెట్టింది. వారిలో వందమంది భారత్‌కు చెందినవారే కావడం గమనార్హం. అత్యధికంగా మెక్సికోలో 456 మంది ప్రముఖుల నంబర్లపై నిఘా ఉంచింది.

పెగాసస్ నిఘా పెట్టిన వివిధ దేశాల్లోని ప్రముఖుల సంఖ్య భారత్: 100, బ్రిటన్: 82, మొరాకో: 69, పాకిస్థాన్: 58, ఇండోనేసియా: 54, ఇజ్రాయెల్: 51, స్పెయిన్: 12, నెదర్లాండ్స్: 11, హంగేరీ: 8, ఫ్రాన్స్: 7, యూకే: 2.

అప్పట్లోనే వెల్లడించిన వైఎస్సార్‌సీపీ

2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ కీలక నాయకుల ఫోన్లపై చంద్రబాబు ప్రభుత్వం నిఘా పెట్టడం తీవ్ర కలకలం రేపింది. పెగాసస్ ద్వారా అప్పటి టీడీపీ ప్రభుత్వం డేటా చౌర్యానికి కూడా పాల్పడింది. దీనిపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నికల కమిషన్, పోలీసులకు ఫిర్యాదు చేసింది కూడా. ఆరోపణ లను చంద్రబాబు ప్రభుత్వం తోసి పుచ్చింది. అయితే, నాడు వైఎస్సా ర్‌సీపీ చెప్పింది నిజమేనని.. మెటా సంస్థ అఫిడవిట్ ద్వారా స్పష్టమైంది.

అసెంబ్లీలోనే బయటపెట్టిన మమత

2018–19లో ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం తమ రాజకీయ ప్రత్యర్థులపై నిఘా కోసం పెగాసస్‌ను ఉపయోగించిందని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ కొంతకాలం క్రితం వెల్లడించారు. సాక్షాత్తు అసెంబ్లీలోనే ఆమె మాట్లాడుతూ.. 2019 ఎన్నికలకు ముందు ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ ప్రతినిధులు తనను సంప్రదించారని తెలిపారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం తమతో ఒప్పందం చేసుకుందని ఆ ప్రతినిధులు చెప్పినట్టు కూడా మమతా తెలిపారు. బెంగాల్‌లోనూ ఒప్పందం చేసుకోవాలని ఎన్ఎస్ఓ గ్రూప్ ప్రతినిధులు కోరారని చెప్పారు. కానీ, తాను తిరస్కరించినట్లు ఆమె వెల్లడించారు. కాగా, మమతా బెనర్జీ వ్యాఖ్యలతో.. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై నిఘా కోసం పెగాసస్ ను ఉపయోగించినట్లు స్పష్టమైంది.

అమల్లోకి వర్గీకరణ రిజర్వేషన్లు

నాలుగు ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ రిజర్వేషన్లు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా ప్రభుత్వం వర్గీకరించింది. గ్రూప్‌–1లో 15 కులాలు, గ్రూప్‌–2లో 18 కులాలు, గ్రూప్‌–3లో 26 కులాలను చేర్చారు. రాష్ట్రంలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఇందులో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకబడిన, నిర్లక్ష్యానికి గురైన షెడ్యూల్డ్ కులాలను గ్రూప్‌–1 కేటగిరీలోకి చేర్చుతూ వీరికి 1 శాతం రిజర్వేషన్లు నిర్దేశించారు. ఎస్సీల్లో మధ్యస్తంగా లబ్ధి పొందిన షెడ్యూల్డ్ కులాలను గ్రూప్‌–2 కేటగిరీలో చేర్చుతూ 9 శాతం రిజర్వేషన్లు, మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్డ్ కులాలను గ్రూప్‌–3లోకి చేర్చుతూ వీరికి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. మహిళలకు 33 1/3 శాతం కోటా కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ది తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్‌–2025 గెజిట్ విడుదల చేసింది. వర్గీకరణ అమలుకు సంబంధించి నాలుగు రకాల జీఓలను సోమవారం విడుదల చేసింది.

- రాష్ట్ర న్యాయ వ్యవహారాలు, శాసనసభ వ్యవహారాల కార్యదర్శి ఆర్.తిరుపతి జీఓ 33 జారీ చేశారు. ఈ జీఓ ప్రకారం గవర్నర్ ఆమోదించిన బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించిన చట్టాన్ని ప్రభుత్వం గెజిట్ రూపంలో ప్రచురించింది.
- ఎస్సీ వర్గీకరణ చట్టం ఈనెల 14వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంటూ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ జీఓ 9 జారీ చేశారు.
- తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ యాక్ట్ -2025 నిబంధనల నోటిఫికేషన్ విడుదల చేస్తూ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ మరో జీఓ (10) విడుదల చేశారు.
- ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సబార్డినేట్ సర్వీసు నిబంధనల్లో మార్పులు చేసిన ప్రభుత్వం.. ఎస్సీల్లో నిర్దేశించిన గ్రూపులకు రోస్టర్ పాయింట్లను ఖరారు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ మేరకు జీఓ 99 జారీ చేశారు.

ఎస్సీ వర్గీకరణ విప్లవాత్మక నిర్ణయం

'ఎక్స్'లో ముఖ్యమంత్రి పోస్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ప్రక్రియ విప్లవాత్మక నిర్ణయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వుల కాపీని అందుకున్న తర్వాత సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిజమైన నివాళి అర్పించినట్లైందని పేర్కొన్నారు. దళితుల్లోని అన్ని వర్గాలకు సాధికారత, అవకాశాలను కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది, దీని మొదటి కాపీని ఈ చరిత్రాత్మక పనిని చేపట్టిన కమిటీ ఈరోజు నాకు అందజేయడం ఆనందంగా ఉందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

కొలువుల జాతర మొదలు పెడతాం

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులతో కలిసి ఉత్తమ్ విడుదల చేశారు. ఉత్తర్వుల తొలి ప్రతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చారిత్రక అంశమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక, దేశంలోనే వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. వర్గీకరణకు సంబంధించిన గెజిట్ విడుదలతో పాటు నాలుగు జీఓలు జారీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్గీకరణ అమల్లోకి రావడంతో అతి త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సమీక్షలో శాఖల వారీగా ఉద్యోగ ఖాళీలు ఖరారు చేస్తామని, ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తామని అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వర్గీకరణకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కులాల్లోని అన్ని వర్గాల నుంచి దాదాపు 8 వేలకు పైబడి వినతులు స్వీకరించినట్లు చెప్పారు. వాటిని కూలంకషంగా పరిశీలన చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసిన వన్‌మ్యాన్ కమిషన్.. అభిప్రాయాలు స్వీకరించి వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించిందని చెప్పారు. మూడు దశాబ్దాలుగా ఉన్న ఎస్సీ ప్రజల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించి అమల్లోకి తీసుకువచ్చిందని అన్నారు.

కాంగ్రెస్ తీరు.. చంపినోడే సంతాప సభ పెట్టినట్టుంది : బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తీరు చూస్తుంటే చంపినోడే సంతాప సభ పెట్టినట్టుగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన కాంగ్రెస్ పార్టీనే ఆయన జయంత్యుత్సవాలను పండుగలా నిర్వహించాలంటూ ఆదేశించడం హాస్యాస్పదమన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా సంజయ్ మాట్లాడారు. అంబేడ్కర్‌పై కుట్ర పన్ని రెండు సార్లు డూప్లికేట్ గాంధీ కుటుంబం ఓడించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా అవమానించడమే కాకుండా ఆయన్ను ఓడించిన వ్యక్తికి పద్మ భూషణ్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. గతంలో అంబేడ్కర్ పట్ల వ్యవహరించిన తీరుకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జీవితమే తమకు స్ఫూర్తి అని, ఆయన ఆశయాలను మోదీ సర్కార్ కొనసాగిస్తోందని చెప్పారు.

'అభయహస్తం' ఏమైంది?

- దళితులకు రూ. 12 లక్షలు కాదు.. 12 రూపాయలూ కాంగ్రెస్ ఇవ్వదు
- బీఆర్ఎస్ నేత కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దళిత సమాజానికి అనేక హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు డిమాండ్ చేశారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నేతలతో కలిసి కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు అంబేడ్కర్ అభయహస్తం పథకం పేరుతో రూ. 12 లక్షల చొప్పున చేస్తామన్న సాయం ఏమైందని ప్రశ్నించారు. రూ. 12 లక్షలు కాదు కదా.. 12 రూపాయలు కూడా కాంగ్రెస్ ఇవ్వదని ఎద్దేవా చేశారు. దళితుల సొంతింటి నిర్మాణానికి రూ. 6 లక్షలు ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. కాంట్రాక్టుల్లో గిరిజనులతోపాటు దళితులకు ఇస్తామన్న 28 శాతం వాటా, విద్యాజ్యోతి పథకం కింద దళితులకు ఇస్తామన్న ఆర్థిక ప్రోత్సాహకాల హామీలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. చేవెళ్లలో ఇచ్చిన డిక్లరేషన్‌లో ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే ప్రజాసునామీలో కాంగ్రెస్ కొట్టుకుపోతుందని చెప్పారు.

స్పీకర్ నిర్ణయాలపైనా సుప్రీం తీర్పు ఇవ్వాలి

తమిళనాడు గవర్నర్ అంశంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని.. అదే తరహాలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాలపైనా సుప్రీంకోర్టు తగిన తీర్పు ఇస్తే బాగుంటుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు రేవంత్ పక్కన కూర్చున్న విషయం స్పీకర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వాన్ని చూస్తే రాజ్యాంగ నిర్మాతలు రీకాల్ వ్యవస్థ ప్రవేశ పెట్టేవారని వ్యాఖ్యానించారు. సమావేశంలో మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తుల ఉమ తదితరులు ప్రసంగించారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణకు ఆటో డ్రైవర్ల యూనియన్ రూ. 26 వేల చెక్కును కేటీఆర్‌కు అందజేసింది. అయితే ఆర్థిక సమస్యలతో మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాల సంక్షేమానికి ఈ మొత్తాన్ని ఉపయోగించాలని కోరుతూ ఆ చెక్కును కేటీఆర్ వెనక్కి ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాలపై ఏఐ నిఘా

▶ మొదటి పేజీ తరువాయి

పిలిచే ఆ ప్రాంతాల గుర్తింపు కోసం సైతం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలు, రాష్ట్ర రహదారుల్లో ఒక కిలోమీటర్ పరిధిలో మూడేళ్లలో మూడు కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే అది హైరిస్క్ కారిడార్ కిందికు వస్తుంది. పట్టణ, నగరాల్లోని రహదారుల్లో 100 మీటర్ల పరిధిలో మూడేళ్లలో రెండు ప్రమాదాలు జరిగినా, ఇతర ప్రధాన రహదారులు, జిల్లా రోడ్లపై 500 మీటర్ల పరిధిలో మూడేళ్ల వ్యవధిలో రెండు యాక్సిడెంట్లు జరిగినా, విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో 100 మీటర్ల పరిధిలో మూడేళ్లలో రెండు ప్రమాదాలు జరిగినా వాటిని హైరిస్క్ జాబితాలో చేర్చాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ప్రాంతాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

నామమాత్రంగా కాకుండా...

హైదరాబాద్‌తోపాటు ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో సీసీ కెమెరాల వినియోగం విస్తృతమైంది. కానీ వాటిలో అత్యధికం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఏదైనా ఉదంతం జరిగినప్పుడో లేదా పోలీసు కేసుల దర్యాప్తులో అవసరమైనప్పుడో మాత్రమే వాటిలోని లోపాలు బయటపడుతున్నాయి. కావాల్సిన కోణంలో వీడియోలు రికార్డు కాకపోవడమో లేదా రికార్డు అయినప్పటికీ విశ్లేషణకు అవసరమైన స్పష్టత లోపించడం పరిపాటిగా మారింది. చాలాచోట్ల కనీసం 50 శాతం సీసీ కెమెరాలు కూడా పనిచేయట్లేదు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న కేంద్రం ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రమాణాలు నిర్దేశించింది. ఆయా కెమెరాలు ఎల్లవేళలా వీడియోలు రికార్డు చేసేలా, ఏదైనా వాహనం గంటకు 200 కి.మీ. వేగంతో దూసుకెళ్లినా స్పష్టంగా ఆయా చిత్రాలను నమోదు చేసే సామర్థ్యం కలిగి ఉండాలని స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద మరణాలు ఇలా..

ఉల్లంఘన	2021	2022	2023
సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ వల్ల	16,397	16,715	16,025
హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ వల్ల	46,549	50,029	54,568
రాంగ్‌సైడ్ డ్రైవింగ్ వల్ల	8,122	9,094	9,432
సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల	2,982	3,395	2,884

అంతా ఆటోమేటిక్‌గా పనిచేసేలా...

ఏఐ ఆధారిత సీసీ కెమెరాలతోపాటు వాటి సర్వర్‌లలో మరికొన్ని హంగులు కూడా ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. హైరిస్క్ ఏరియాలపై నిత్యం నిఘా ఉంచేలా సాంకేతిక పరిజ్ఞానం సీసీ కెమెరాల్లో పొందుపరచాలని సూచించింది. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులను గుర్తించి ఈ–చలాన్లు జారీ చేయడంతోపాటు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు దాన్ని గుర్తించి సంబంధిత విభాగాలను అప్రమత్తం చేస్తూ సందేశం పంపాలని పేర్కొంది. ఆయా కారిడార్లలో ఉల్లంఘనల తీరుతెన్నుల్ని సాంకేతికంగా అధ్యయనం చేయాలని చెప్పింది. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసిన లేదా వాటిని సస్పెండ్ చేసిన వాహనదారుల వివరాలు కలిగి ఉండటంతోపాటు బీమా వివరాలు సర్వర్‌లో నిక్షిప్తమై ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. 2014 తర్వాత ఈ దిశగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొన్ని చర్యలు చేపట్టారు. ఐటీఎంఎస్, హెచ్–ట్రిమ్స్ తదితర పేర్లతో కొన్ని ప్రాజెక్టులు చేపట్టారు. వాటిలో సీసీ కెమెరాల ఏర్పాటు వరకు సమర్థంగా పూర్తయినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానం నిక్షిప్తం చేయడం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో మూడు కమిషనరేట్లలోని సీసీ కెమెరాలు ఆశించిన ఫలితాలు ఇవ్వట్లేదు.

చిరునామా, ఫోన్ నంబర్లు మారితే..

కేంద్ర మార్గదర్శకాల్లో మరో కీలకాంశమూ ఉంది. ఓ ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించి జారీ చేసే ఈ–చలాన్ వాహనదారుడికి చేరాల్సిన అవసరం ఉంది. ఆర్టీఏ రికార్డుల్లో ఉన్న వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులతో అనుసంధానించిన చిరునామా, ఫోన్ నంబర్లే దీనికి ఆధారం. అయితే చాలా మంది వాహనచోదకులు ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా, వినియోగిస్తున్న సెల్‌ఫోన్ నంబర్‌కు రికార్డుల్లో ఉన్న వాటికి సంబంధం ఉండట్లేదు. ఈ కారణంగానే సగానికి సగం ఈ–చలాన్లు వాహనదారులకు చేరట్లేదు. ఈ నేపథ్యంలో ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేలా వారికి అవకాశం ఇవ్వాలని సూచించింది. అలాగే ట్రాఫిక్ సిబ్బంది సైతం తనిఖీలప్పుడు వాహనదారుల చిరునామా, ఫోన్ నంబర్ల మార్పును పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

క్లుప్తంగా...



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న హరీశ్‌రావు

భారతరత్న ఇవ్వకుండా అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది: హరీశ్

సిద్దిపేట జోన్: భారతరత్న బిరుదుకు అంబేడ్కర్ అసలైన అర్హుడని, కాంగ్రెస్ హయాంలో కనీసం ఆయనకు భారతరత్న ఇవ్వలేదు కదా .. ఎన్నికల్లో ఆయనపై పోటీ పెట్టి అవమానించిన నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని గాడిచర్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ వీపీ సింగ్ ప్రధానిగా వచ్చిన తర్వాత అంబేడ్కర్‌కు అవార్డుఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. ఇప్పుడు అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, వారివి మాటలు తప్ప చేతలు లేవని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో ఒక్క దళితుడికి రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

గ్రూప్‌–1 ఫలితాలు దేశంలోనే పెద్ద కుంభకోణం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇటీవల వెలువడిన గ్రూప్‌–1 పరీక్ష ఫలితాలు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గ్రూప్‌–1 పరీక్షలో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నారు. 21,093 మంది పరీక్ష రాయగా 21,103 మంది ఫలితాలిచ్చారని, అదనంగా పది మంది అభ్యర్థులు ఎక్కడ నుంచి వచ్చారో తెలంగాణ యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 654 మందికి ఒకే మార్కులొచ్చాయని, పేపర్లను కేవలం రెండు నెలల్లోనే దిద్దారంటూ సందేహాలు వ్యక్తం చేశారు. రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష రాసిన 74 మందికి ఉద్యోగాలొచ్చాయని, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలికి 206వ ర్యాంకు, ఎస్టీల్లో మొదటి ర్యాంకు వచ్చిందన్నారు. ఉర్దూ మీడియంలో పరీక్ష రాసిన 9 మందిలో ఏడుగురికి ఉద్యోగాలు రావడాన్ని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. గ్రూప్‌–1 పరీక్ష అవకతవకలపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గ్రూప్‌–1 అవకతవకలపై హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు.

ఒక పార్టీ నాయకుడు నన్ను హత్య చేయాలని చూశాడు

తన సినిమా గురించి మీడియా ఇష్టాగోష్టిలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తాను తీయబోయే సినిమా కథను డైరెక్టర్ రామానుజం సిద్ధం చేస్తున్నారని, ఆయన ఆ పనిలో నిమగ్నమై ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి చెప్పారు. ఆ సినిమాలో తన ప్రేమ కథ ఉండదని, ప్రేమికులకు అండగా తన పాత్ర ఉంటుందని వెల్లడించారు. 'జగ్గారెడ్డి'సినిమా గురించి సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు అప్పట్లో తనపై హత్యా ప్రయత్నం చేశారని, ఆ ప్రయత్నానికి బలికాకుండా తాను ఎలాంటి వ్యూహ ప్రతివ్యూహాలు రచించానో ఈ సినిమాలో చూపించబోతున్నట్టు జగ్గారెడ్డి తెలిపారు. సినిమాలో ప్రేమకథకు తోడు తన జీవితంలో జరిగిన మూడు ముఖ్య సన్నివేశాలుంటాయని చెప్పారు. స్టూడెంట్ లీడర్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా తాను పనిచేసిన సమయంలో జరిగిన ముఖ్య ఘట్టాలుంటాయని వివరించారు. పోలీసులు తనపై చేసిన ఒత్తిళ్లు, నిర్బంధాలు, జిల్లా ఎస్పీతో గొడవలు ప్రధానం గా ఈ కథలో ఉంటాయని వెల్లడించారు.

నువ్వు ఎంఆర్‌పీఎస్ నాయకునివి కాదు

మంద కృష్ణపై మేరీ మాదిగ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ తొత్తుగా వ్యవహరిస్తూ, మాదిగల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన నాయకుడు మంద కృష్ణ అని ఎంఆర్‌పీఎస్ నాయకురాలు మేరీ మాదిగ ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన సందర్భంగా వివిధ ఎస్సీ వర్గాల నాయకులు సోమవారం సాయంత్రం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేరీ మాదిగ మీడియాతో మాట్లాడుతూ, మాదిగ జాతి మొత్తాన్ని బీజేపీకి అమ్మకానికి పెట్టిన నాయకుడు మంద కృష్ణ అని విమర్శించారు. మాదిగల పేరు మీద మంద కృష్ణ వందల కోట్లు సంపాదించడమే గాక, అమరుల పేరు మీద కూడా డబ్బులు వసూలు చేసుకున్నాడని ఆక్షేపించారు. దశాబ్దాల వర్గీకరణ ఆకాంక్ష నెరవేర్చిన మంత్రి దామోదర రాజనర్సింహను అకారణంగా దూషిస్తున్న మంద కృష్ణను మాదిగ జాతి క్షమించదని అన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో భట్టి విక్రమార్క, దామోదర, అంజన్‌కుమార్, పొన్నం

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

నివాళులర్పించిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాసంఘాల నాయకులు

కవాడిగూడ (హైదరాబాద్): బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సోమవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబు జగ్జీవన్‌రాం, బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజనీకుమార్ యాదవ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీజీ నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ పలు దళిత యువజన సంఘాల నేతలు బ్యాండ్ మేళాలతో పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ దేశంలో భారత రాజ్యాంగం లేకుండా చేయాలని, రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బైక్ ర్యాలీగా వచ్చి నివాళులర్పించారు.

అంబేడ్కర్ మేధస్సు, త్యాగాలతోనే మనకు హక్కులు

ఆయనను నిత్యం స్మరించుకోవాలి: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్/లాలాపేట: నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో మనకు లభించిన హక్కుల వెనుక రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మేధస్సు, త్యాగం, దూరదృష్టి ఉన్నాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్య ఫలాలను అనుభవిస్తున్నామంటే ఆయన వల్లేనని, అందువల్ల నిత్యం అంబేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగాన్ని కాలరాసిన కాంగ్రెస్ సర్కార్.. దేశంలో ఎమర్జెన్సీని విధించి ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరించిందని మండిపడ్డారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కిషన్‌రెడ్డి, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చేలా గత పదకొండేళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పని చేయడమే తమ ధ్యేయమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతోందని, ఆయన ఈ దేశానికి అందించిన రాజ్యాంగం ద్వారానే చాయ్ అమ్ముకునే కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రధాన మంత్రి కాగలిగారని అన్నారు. అప్పట్లో ఏ ఎన్నికల్లోనూ అంబేడ్కర్ గెలవకుండా కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ లాంటి ప్రముఖులు ఆయనకు వ్యతిరేక ప్రచారం చేసి అవమాన పరిచారని విమర్శించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను లోతుగా అధ్యయనం చేసి, వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగంలో పెద్దపీట వేసి అంబేడ్కర్ వారికి అనేక హక్కులు కల్పించారన్నారు.

బుల్డోజర్ల ప్రయోగంలో రేవంత్ సర్కారు బిజీ

▶ మొదటి పేజీ తరువాయి

భూముల వ్యవహారాన్ని ప్రస్తావించారు.

కాంగ్రెస్ ప్రభుత్వాల విశ్వాస ఘాతుకం

హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తాము పూర్తిగా అమలు చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో అక్కడి ప్రభుత్వాలు విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేసేలా, జంతువులను ప్రమాదంలో పడేసేలా వ్యవహరిస్తోంది. అడవుల్ని ధ్వంసం చేస్తోంది. వాటిపై బుల్డోజర్లు ప్రయోగిస్తోంది..'అని మోదీ ధ్వజమెత్తారు.

అవినీతిలో కర్ణాటకను నంబర్ వన్‌గా నిలిపారు

కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌లోనూ అభివృద్ధి, సంక్షేమం అటకెక్కిందన్నారు. కర్ణాటకలో కరెంట్ నుంచి పాల దాకా, బస్సు చార్జీల నుంచి విత్తనాల వరకు ప్రతిదాని రేట్లు పెరిగాయని ప్రధాని మండిపడ్డారు. అక్కడి సీఎం అవినీతిలో దేశంలోనే నంబర్ వన్‌గా ఆ రాష్ట్రాన్ని నిలిపారని ఆరోపించారు. బీజేపీది అభివృద్ధి మోడల్ అయితే, కాంగ్రెస్‌ది అబద్ధాల మోడల్ అని విమర్శించారు.



ప్రతి మనిషీ తన దృక్కోణపు పరిమితులనే ప్రపంచ పరిమితులుగా పొరబడతాడు.
– ఆర్థర్ షోపెన్‌హార్

సాక్షి

మంగళవారం, 15 ఏప్రిల్ 2025

పారదర్శకతే ప్రాణం!

మన ఎన్నికల సంఘం(ఈసీ)కి ఇష్టమున్నా లేకున్నా ఈవీఎంలపై సంశయాలు తరచు తలెత్తుతూనే ఉన్నాయి. ఇక్కడే కాదు... వేరే దేశాల్లో సైతం సందేహాలు వినబడుతూనే వున్నాయి. ఆ మధ్య టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఈవీఎంలను హ్యాక్ చేయటం సులభమని, దీన్ని తాను నిరూపించగలనని సవాలు విసిరారు. ఇప్పుడు ఆ వరసలో అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసి గబ్బార్డ్ సైతం నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో కేబినెట్ భేటీలో ఆమె ఈవీఎంల భద్రతా లోపాలపై పలు ఆధారాలు సమర్పించారు. యథావిధిగా దీనిపైనా మన ఈసీ స్పందించింది. ఆమె వ్యాఖ్యలు మన ఈవీఎంలకు వర్తించబోవని మాట్లాడింది. సమస్యంతా అక్కడేవుంది. మన దేశంలో పార్టీలు చేసే ఆరోపణలకు ఆ సంఘం నోరు మెదపదు. ఒక జాతీయ పార్టీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విషయంలో చేసిన ఆరోపణలకు వెనువెంటనే జవాబివ్వడానికి ఈసీకి తీరిక లేకపోయింది. పార్లమెంటులో ఈవీఎంలపై తీవ్ర దుమారం రేగాక మాత్రమే స్పందించింది. గత ఏడాది నవంబర్ 4న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఆ నెల 23న ఫలితాలు ప్రకటించారు. ఆ తర్వాతనుంచి కాంగ్రెస్, ఎన్సీపీ ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తూనే వచ్చాయి. 95 నియోజక వర్గాల్లో ఈవీఎంలూ, వీవీప్యాట్ స్లిప్‌లూ తనిఖీ చేసి అవి సరిపోలాయో లేదో చెప్పాలని 104 అభ్యర్థనలు వచ్చాయి. వాటిని అంగీకరిస్తే దాదాపు 755 ఈవీఎంల తనిఖీ తప్పనిసరవుతుంది. ఇందులో ఎన్సీపీనుంచి దాఖలైనవే ఎక్కువ. ఇవిగాక న్యాయస్థానాల్లో దాఖలైన ఎన్నికల పిటిషన్లు సరేసరి. హరియాణాలో సైతం ఈవీఎంలపై ఆరుచోట్ల అభ్యర్థనలొచ్చాయి. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానం నుంచి ఈ మాదిరి వినతి వచ్చింది.

ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈసీ ఇచ్చే జవాబు ఒకే విధంగా ఉంటున్నది. మన ఈవీఎంలు సురక్షితమైనవి, జొరబడటానికి అసాధ్యమైనవి అన్నదే దాని వాదన. అలాగే అవి ఇంటర్నెట్‌తోసహా దేనికీ అనుసంధానించి వుండవు కనుక వైఫై, బ్లూటూత్‌ల ద్వారా ఏమార్చటం ఏమాత్రం కుదరదని కూడా చెబుతోంది. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన సాంకేతిక సదస్సులో కంప్యూటర్ శాస్త్రవేత్త అలెక్స్ హాల్డర్‌మాన్ ఆనవాలు మిగల్చకుండా ఈవీఎంను హ్యాక్ చేయటం, ఫలితాన్ని తారుమారు చేయటం ఎంత సులభమో నిరూపించారు. వీవీ ప్యాట్ యంత్రాలతో అనుసంధానించివున్నా ఈవీఎంల పనితీరు ఎన్ని సంశయాలకు తావిస్తున్నదో వివరించే గణాంకాలు సదస్సులో సమర్పించారు. కార్నెగీ మెలాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ ఎకార్ట్ ఈవీఎంలో వోటేసిన వెంటనే స్క్రీన్‌పై ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరే కనబడుతున్నా వేరేవారికి వోటు పడటంవంటి ఉదంతాలను వివరించారు. ఇంటర్నెట్‌తో ఈవీఎంలను అనుసంధానించకపోయినా హ్యాక్ చేయటం సాధ్యమేనన్నారు. ఈవీఎంలలో గుట్టుచప్పుడు కాకుండా రిమోట్ యాక్సెస్ సాఫ్ట్‌వేర్‌ను నిక్షిప్తం చేయటంద్వారా ఇది చేయొచ్చన్నది ఆయన వాదన. అసలు ఈవీఎంల రవాణా, పంపిణీ విధానం లోపభూయిష్టంగా ఉన్నదని సమాచార హక్కు చట్టంకింద అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు వెల్లడించాయి.

తన నిర్వహణలో సమర్థవంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో సందేహాలకు తావు లేదని ఎన్నికల సంఘం నమ్మటం తప్పేమీకాదు. ఆమాత్రం ఆత్మవిశ్వాసం ఉండటాన్ని ఎత్తిచూపించాల్సిన అవసరం లేదు. కానీ అదే విశ్వాసం అందరిలో కలగటానికి అది చేస్తున్నదేమిటన్నదే ప్రశ్న. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే, ఆ రోజు రాత్రి, ఆ తర్వాత విడుదల చేసే పోలింగ్ శాతం వివరాలు ఆశ్చర్యం కలిగిస్తున్నా, వాటిల్లో ఎందువల్ల వ్యత్యాసం చోటుచేసుకుంటున్నదో సందేహాతీతంగా అది వివరించలేకపోతున్నది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు కావొచ్చు... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కావొచ్చు పోలింగ్ శాతం పెరుగుదలలో తీవ్ర వ్యత్యాసం కనబడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏపీలో పోలింగ్ జరిగిన రాత్రి 8 గంటలకు 68.12 శాతం పోలింగ్ నమోదైందని చెప్పిన ఈసీ మరో నాలుగు రోజులకల్లా దాన్ని 80.66 శాతంగా ప్రకటించింది. నాలుగురోజుల వ్యవధిలో ఈ పెరుగుదల ఏకంగా 12.5 శాతం! సంఖ్యాపరంగా 49 లక్షల వోట్లు పెరిగినట్టు లెక్క! మొదటగా అనుకున్న శాతానికీ, చివరిగా ప్రకటించిన శాతానికీ మధ్య తేడాకు కారణాలేమిటో వివరించే ప్రయత్నం ఈనాటికీ ఈసీ చేయలేదు. మహారాష్ట్రలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ముగిశాక 58.2 శాతం పోలింగ్ అని చెప్పి, ఆ తర్వాత దాన్ని 65.02కు పెంచి తీరా కౌంటింగ్ ముందు అది 66.05 శాతం అన్నారు. బ్యాలెట్ విధానంలో ఇలాంటి వ్యత్యాసాలు కనబడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు. లెక్కించేది మనుషులే గనుక పొరబడ్డారని సరిపెట్టుకోవచ్చు. కానీ ఈవీఎంల విధానంలో అలా కాదు. ఎప్పటి కప్పుడు పోలైన వోట్ల సంఖ్య తెలిసిపోతుంది. మరి ఈ తేడాల వెనకున్న మతలబేమిటో ఎందుకు చెప్పరు? ఈవీఎంల చార్జింగ్ అమాంతం పెరిగిపోవటంపైనా అనేక సందేహాలున్నాయి.

ప్రశ్నించినప్పుడు మౌనం వహించటమే పెద్దరికమవుతుందని ఈసీ భావిస్తున్నట్టుంది. ప్రజాస్వామ్యానికి కీలకమని భావించే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కరువైతే అది చివరకు ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాలు చేస్తుంది. అది ఇప్పటికే ఎంతో కొంత మొదలైంది. అందుకనే బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలన్న డిమాండ్ క్రమేపీ పుంజుకుంటున్నది. ఈవీఎంలు నమ్మదగ్గవి కాదని ప్రపంచంలో ఏమూల ఎవరు చెప్పినా ఇక్కడ భుజాలు తడుముకోవటంవల్ల ప్రయోజనం లేదు. అలాగే పారదర్శకతకు ప్రత్యామ్నాయం కూడా ఉండదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** బ.విదియ ఉ.8.29 వరకు, తదుపరి తదియ,
నక్షత్రం: విశాఖ రా.12.53 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** తె.5.16 నుండి 7.00 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.36 వరకు,
అమృత ఘడియలు: ప.3.04 నుండి 4.50 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వన్ వే రూటు

విశ్లేషణ



సంజయ బారు

రుణపత్రాల విపణిలో ఉత్పన్నమైన అనూహ్య పరిణామాలు అమెరికా అధ్యక్షుడికి గుబులు పుట్టించాయి. అమెరికా బాండ్స్‌కు గిరాకీ పెరిగినట్లే పెరిగి వెంటనే తగ్గిపోయింది. డాలర్ ఇండెక్స్ విలువ కూడా క్షీణిస్తోంది. దీంతో కొత్త సుంకాల విధింపు అమలును 90 రోజుల పాటు నిలిపివేశారు. ఇతర ప్రపంచ దేశాల విషయంలో తాత్కాలికంగానే అయినా ఒక మెట్టు దిగిన ట్రంప్ చైనా విషయంలో మాత్రం చాలావరకు బెట్టుగానే ఉన్నారు. ఏమైనా, అమెరికా సృష్టించిన ఈ అల్లకల్లోలం రోడ్డు మ్యాపు లేని వన్ వే రూటు!

ట్రంప్ సుంకాల సంక్షోభం మధ్యకాలిక అనిశ్చితిని పెంచుతుంది. ఆర్థిక కార్యకలాపాలు అంచనాల మీద ఆధారపడి ఉంటాయి. అనిశ్చితి అనేది అంచనాలను మార్చేస్తుంది. వ్యాపార సంస్థలు, కుటుంబాలు నిర్ణయాలు తీసుకోవడంలో అప్రమత్తంగా వ్యవహరిస్తాయి. ట్రంప్ 90 రోజుల ఊరట నిజానికి ఈ అనిశ్చితి వ్యవధిని పెంచుతుందే తప్ప, అనిశ్చితికి ముగింపు పలకదు. ఆర్థిక కార్యకాలపాల్లో తెగింపు, నిర్ణయ శక్తి కొరవడతాయి. ప్రభుత్వాలు ఎన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టినప్పటికీ, ప్రపంచ వ్యాప్త ఆర్థిక మందగమనం తప్పదు.

సుంకాల వెనుక రెండు లక్ష్యాలు

విచ్ఛిన్నకర సుంకాల ద్వారా రెండు లక్ష్యాలు సాధించాలని ట్రంప్ అనుకుంటున్నారు. అమెరికా వస్తూత్పత్తుల తయారీ వ్యవస్థ ఏనాడో కుప్పకూలింది. దీన్ని పునరుద్ధరించడం మొదటిది. తద్వారా దిగువ స్థాయి ఫ్యాక్టరీ ఉద్యోగాలు విశేషంగా సృష్టి అవుతాయి. ఇక రెండోది, చైనాను శిక్షించడం. ప్రపంచ వాణిజ్య విధానాన్ని అడ్డు పెట్టుకుని అది అనుచిత ప్రయోజనం పొందుతోంది. పాతికేళ్ల క్రితమే అమెరికాలో పాగా వేయగలిగింది. ఈ రెండో లక్ష్యం కంటే, మొదటిదే ట్రంప్ రాజకీయ మద్దతుదారులకు మరింత ముఖ్య విషయం.



దేశీయంగా పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగాలు కల్పించలేనప్పుడు, ధరలు పెరిగిపోతున్నప్పుడు, చైనాను శిక్షించడం వల్ల అమెరికన్లకు ప్రయోజనం ఏముంటుంది? ఇక్కడ ఒక సమస్య ఉంది. దేశీయ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించి మొదటి లక్ష్యాన్ని సాధించడమే... చైనాను దెబ్బ తీయడమనే రెండో లక్ష్యం కంటే కష్టమైన విషయం. చైనా భౌగోళిక ఆర్థిక విస్తరణను అదుపు చేసే వ్యూహాలు ఇప్పటికిప్పుడు రూపొందినవి కాదు. గడచిన రెండు దశాబ్దాలుగా అమెరికాలో వీటి గురించి పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు, పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఇవి ఎలా ఉండబోతున్నాయో, వీటిని ఎదుర్కోవడానికి ఎలా సన్నద్ధం కావాలో చైనా ప్రభుత్వానికి మంచి అవగాహనే ఉంది.

దేశీయంగా పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగాలు కల్పించలేనప్పుడు, ధరలు పెరిగిపోతున్నప్పుడు, చైనాను శిక్షించడం వల్ల అమెరికన్లకు ప్రయోజనం ఏముంటుంది?

మరి, ట్రేడ్ వార్ పర్యవసానాలు ఎదుర్కొనేందుకు అమెరికా ఎంతవరకు సన్నద్ధంగా ఉందనేది ప్రశ్న. కర్మాగారాల స్థాపనకు కనీసం రెండేళ్లు పడుతుంది. ట్రంప్ నిరుద్యోగ మద్దతుదారులు అందాకా ఓర్పుతో ఉండగలరా? స్వల్పకాలంలో కష్టాలు, దీర్ఘకాలంలో లాభాలు అనే సూత్రం రాజకీయంగా కుదిరేది కాదు. ట్రంప్ స్వదేశంలోనే మద్దతు కోల్పోతే ఆయన విధానాలకు అంతర్జాతీయంగా స్పందన ఎలా ఉంటుంది?

దేశాల స్పందన

ట్యారిఫ్ సంక్షోభం అనంతర కాలంలో ప్రపంచ దేశాలు అమెరికా మీద విశ్వాసం కోల్పోతాయి. ఒకవేళ అమెరికా అధ్యక్షుడు తన విధానాలు, (వివాదాస్పద) మాటలు వెనక్కు తీసుకున్నా, ఆయన ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాధిపతులు విశ్వాసంలోకి తీసుకోరు! కెనడా, మెక్సికో, డెన్మార్క్, దక్షిణాఫ్రికాలను ట్రంప్ బాహాటంగానే టార్గెట్ చేసి మాట్లాడారు. బ్రెజిల్, కొలంబియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, నమీబియా, ఆస్ట్రేలియా వంటి దేశాల అధినేతలు యూఎస్ అధ్యక్షుడిపై బహిరంగ విమర్శలకు వెనుకాడటం లేదు. యూరోపియన్ యూనియన్ ఈ విషయంలో ఒక్కతాటి మీద లేకున్నా, మెజారిటీ సభ్యదేశాలు అమెరికాను నమ్మే స్థితిలో లేవు. ఈయూ అటు చైనాతోనూ, ఇటు ఇండియాతోనూ వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తుంది. బలహీన ప్రధాని నేతృత్వంలోని జపాన్ మాత్రం అమెరికాను ప్రాధేయపడుతున్నట్లు వ్యవహరిస్తోంది. ఏమైనా, అది కూడా చైనాతో వాణిజ్య సంబంధాలు స్థిరీకరించుకునే ప్రయత్నాలు చేస్తుంది.

ఇండియా మౌనం వెనుక...


ఇక ఇండియా నాయకత్వం అమెరికా ట్రేడ్ పాలసీ పట్ల ఆచితూచి వ్యవహరిస్తోంది. చైనాతో అమీతుమీకి ట్రంప్ సిద్ధపడటం ఇండియాకు ఆనందంగా ఉంది. మరోవంక, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందానికి చర్చలు జరుపుతోంది. అమెరికా నుంచి రక్షణ సామగ్రి, ఇతరత్రా దిగుమతులు పెంచుకునేందుకు సిద్ధపడుతోంది. అయినా కూడా, ట్రంప్ మొదటి విడత పదవీకాలంలో ఆయనతో వ్యవహరించినంత సంతోషంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ దఫా ఉన్నారా? ట్రంప్ ఆయనకు చురకలు వేస్తూ మాట్లాడుతున్నారు. అంతగా స్నేహపూర్వకం కాని ధోరణిలో ఇండియా పేరు పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఎంతో సెల్ఫ్ ఇమేజ్, ఇగో ఉన్న మోదీ ఈ అవమానాలకు లోలోపల కుమిలిపోయే ఉంటారు!

ఉభయ దేశాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరపరచుకోవాలని ఇండియా భావిస్తోంది. అయినా సరే, ఏ భారతీయ నాయకుడూ జపాన్, ఇటలీ మాదిరిగా ట్రంప్ ముందు సాగిలపడేందుకు సిద్ధంగా లేరు. బహుశా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్న నేపథ్యంలో మోదీ మౌనం పాటిస్తూ ఉండొచ్చు. దీంతో, గ్లోబల్ సౌత్ (పేద దేశాలు) తరఫున మాట్లాడేందుకు ఇతరులకు అవకాశం లభించింది. ట్రేడ్ ట్యారిఫ్‌లను వ్యతిరేకిస్తూ వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు చైనా సంఘీభావం ప్రకటిస్తోంది. ఇండియా కూడా కలిసి రావాలని ఆహ్వానిస్తోంది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా నాయకులు కూడా ఇతర వర్ధమాన దేశాలకు సంఘీభావం ప్రకటించాయి. 'గ్లోబల్ సౌత్' ఇండియా 'వాయిస్' కోసం ఎదురు చూస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, విధాన విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నమ్మకానికి చేటు

విశ్లేషణ



టంకశాల అశోక్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలవల్ల ఆ దేశానికి జరుగుతున్న అతి పెద్ద నష్టం ఏమిటి? స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోవటమా? బాండ్స్ మార్కెట్ దెబ్బ తినటమా? డాలర్ విలువ తగ్గుతుండటమా? ఇవేవీ కావు. అన్నింటికన్న ముఖ్య మైనది విశ్వసనీయతకు కలుగుతున్న నష్టం. స్టాక్సును, బాండ్లను, కరెన్సీ విలువను దిద్దుబాటు చర్యలతో పునరుద్ధరించుకోవచ్చు. కానీ విశ్వసనీయత మౌలికమైనది. అది ఒకసారి దెబ్బతినటం మొదలైతే కోలుకునేందుకు చాలా సమయం తీసుకుంటుంది. అమెరికాకు ఇది అన్నింటికి మించిన నష్టమవుతున్నది. మరొకవైపు బహుళ ధ్రువ ప్రపంచ బలోపేతానికి దోహదపడుతున్నది. ఇది అమెరికా కోరుకోని ఫలితం.

డాలర్ బాండ్ల సంక్షోభం

దీనంతటికీ ఆరంభం దిగుమతి సుంకాలను ఒకేసారి 184 దేశాలపై హెచ్చించటమన్నది తెలిసిందే. సుంకాల చెల్లింపులు గతంలోనూ ఉన్నవే. అమెరికాయే గాక ఇతరులూ అప్పుడప్పుడు చేస్తుండినవే. ట్రంప్ ఒక కొత్త పద్ధతిని అనుసరిస్తూ ఒకేసారి అందరిపై ఒకే విధంగా అన్ని సరకులపై 10 శాతం పెంచి, కొద్ది రోజుల తర్వాత ఆ యా దేశాలతో వాణిజ్య లోటు అనే మొత్తాలపై 50 శాతం పెంచారు. కానీ బాండ్ల మార్కెట్‌కు, డాలర్ విలువకు నష్టాలు మొదలు కావటం జరిగింది. ఆ మాట ఆయన బహిరంగంగానే అంగీకరిస్తూ, 50 శాతం సుంకాల హెచ్చింపును అమలుకు తెచ్చిన కొద్ది గంటలలోనే ఆ చర్యను 90 రోజులపాటు వాయిదా వేయవలసి వచ్చింది.

ఇందులో బాండ్ల మార్కెట్ నష్టాలు అతి తీవ్రమైనవి కావటం ఎందుకంటే, అమెరికన్ డాలర్ విలువ అతి సుస్థిరమైనదనీ, డాలర్ బాండ్లు కొన్నట్లయితే తమ డబ్బుకు లభించే వడ్డీ ఆదాయం, దీర్ఘకాలిక భద్రత సురక్షితమనీ నమ్మేవారు ప్రపంచం అంతటి నుంచీ డాలర్ బాండ్లలో మదుపు చేస్తారు. ఆ విధంగా చైనా సైతం ఒక ట్రిలియన్ డాలర్లకుపైగా బాండ్లు ఖరీదు చేసిందంటే పరిస్థితిని ఊహించవచ్చు. ఎన్నడూ లేని విధంగా ఇపుడు ట్రంప్ ధోరణితో డాలర్ పట్ల, అమెరికా పట్ల విశ్వాసం దెబ్బతింటుండటంతో సామాన్య ప్రజల నుంచి ఆ యా దేశాల వరకు ఆ బాండ్లను అమ్మడం మొదలైంది. అమెరికాకు అతి సన్నిహితమైన జపాన్ ప్రభుత్వం సైతం వందలాది బిలియన్ల బాండ్లు సత్వరంగా విక్రయించిందంటే సమస్య తీవ్రతను గమనించవచ్చు. మరొకవైపు కొత్త బాండ్ల అమ్మకాలు ఆగిపోయాయి. ఈ ధోరణి కొనసాగితే, అమెరికా ఆర్థిక వ్యవస్థ అనేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంటుంది. దీనికితోడు డాలర్ విలువ తగ్గుదల సరేసరి. ఈ పరిణామాల కారణంగానే సుంకాలను 90 రోజులు వాయిదా వేయక తప్పలేదు. అంత చేసినా విశ్వసనీయతకు నష్టం జరగనే జరిగింది.

అమెరికా పట్ల విశ్వాసం దెబ్బతింటుండటంతో, గతంలో సురక్షితం అనుకున్న డాలర్ బాండ్లను ప్రజల నుంచి ఆ యా దేశాల వరకు అమ్మడం మొదలైంది.

లొంగని చైనా

సుంకాలకు బెదిరి అమెరికాతో చర్చలకు కొన్ని దేశాలు సిద్ధపడటం నిజమే అయినా – కెనడా, యూరప్, చైనా వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు అందుకు నిరాకరిస్తూ ఎదురు సుంకాలు విధించటం, అమెరికాకు అవసరమైన కీలకమైన ముడిసరకుల రవాణాను నిలిపివేయటం మొదలుపెట్టాయి. ఇది కూడా అమెరికన్ స్టాక్సును, బాండ్ల మార్కెట్‌ను, డాలర్ విలువను, ప్రజల నిత్యావసర సరకుల ధరలను ప్రభావితం చేయటం మొదలైంది.

తమకు అన్నివిధాలా సవాలుగా మారిన చైనాను ఆర్థికంగా, ఇతరత్రా కూడా కట్టడి చేసేందుకు రిపబ్లికన్, డెమొక్రటిక్ ప్రభుత్వాలు రెండూ ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాయి. ఆ విధానాలు ఇప్పుడు ట్రంప్ రెండవ హయాంలో పరాకాష్ఠకు చేరుతున్నాయి. దీనంతటి నిజమైన ఉద్దేశం అమెరికా ఆర్థిక ప్రయోజనాల కన్నా తమను దీర్ఘకాలం పాటు దెబ్బతీయటమే అని భావిస్తున్న చైనా, ఎన్ని నష్టాలనైనా భరిస్తాముగానీ ఎటువంటి ఒత్తిడికైనా లొంగబోమని, చివరికంటా పోరాడుతామని ఒకటికి నాలుగు సార్లు స్పష్టం చేసింది.

పేరు మోసిన ఆర్థిక నిపుణులంతా ట్రంప్ బృందానికి ఆర్థిక విషయాలపై అవగాహన లేదని వ్యాఖ్యానిస్తుండటం కూడా అమెరికా విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితుల మధ్య ఆసక్తికరమైన దౌత్యనీతి ఛాయలు కనిపించటం మొదలైంది. అమెరికన్ మీడియా వెల్లడించిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి: ట్రంప్ అధికారులు చైనా అధికారులకు ఫోన్ చేసి, తాము పెంచిన సుంకాలకు పోటీగా చైనా ఇక పెంచవద్దనీ, అది చైనాకే నష్టదాయకమనీ కోరారు. కానీ చైనా ఆ మాటను లెక్క చేయక మరిన్ని సుంకాలు పెంచింది. ఆ వెనుక ట్రంప్ అధికారులు మరొకసారి చైనా అధికారులకు ఫోన్ చేసి, ఒకసారి జిన్‌పింగ్ చేత ట్రంప్‌తో మాట్లాడించమని కోరారు. అందుకు చైనా అధ్యక్షుడు నిరాకరించారు. మరొకవైపు అమెరికా నష్టాలు కొనసాగటం, సుంకాలను 90 రోజులు వాయిదా వేసినా మార్కెట్లకు నమ్మకం ఏర్పడక ఒక రోజు విరామం తర్వాత తిరిగి పతనమవుతుండటం, బాండ్ల సమస్య, ఉత్పత్తులకు కొరతలు, ధరల పెరుగుదలలు కొనసాగటంతో పరిస్థితి అర్థమైంది. దానితో, సుంకాలు పెంచిన ఈ నెల 2వ తేదీ నుంచి సరిగా 10 రోజులు గడిచి 12వ తేదీ వచ్చేసరికి, చైనా నుంచి దిగుమతి అయ్యే సెల్‌ఫోన్లు, పలు ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సామగ్రిపై సుంకాల పెరుగుదలను ట్రంప్ నిలిపి వేశారు.

ఇదిట్లుండగా, తన కొత్త విధానాల వల్ల అమెరికన్, తదితర పరిశ్రమలు అమెరికాకు తరలి రాగలవనే ట్రంప్ ఆశాభావానికి ఎవరి నుంచీ సుముఖత కనిపించటం లేదు. చట్టబద్ధత లేని వలస కార్మికులను పారదోలటంతో వ్యవసాయం, హోటళ్ల వంటి రంగాలు దెబ్బ తింటుండటంతో, వారి కొనసాగుదలకు యజమానులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నది ఇదే 12వ తేదీ నాటి మరో ఉత్తర్వు. పోతే, విద్యా వైద్య రంగాలలో కుదింపులు, విదేశీ సహాయాల (యూఎస్ ఎయిడ్ ద్వారా) రద్దు పేద దేశాలల్లో కలిగిస్తున్న హాని, ఆగని గాజా మారణకాండ వంటి ఇతర అనేక చర్యలు కూడా ట్రంప్ పట్ల, అమెరికా పట్ల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఇది వారికి ఆర్థికానికి మించిన దీర్ఘకాలిక నష్టం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఇన్ బాక్స్

అజేయశక్తి

పత్రికల పతాక శీర్షికల్లో
'ఎన్‌కౌంటర్ల' సంఖ్య పెరిగినప్పుడల్లా
శవాలను మోసుకెడుతున్న
సాయుధ బలగాల దృశ్యాలన్నీ
రాజ్యహింసకు అద్దం పడుతున్నాయ్!

ఎదురు తిరుగుతున్న కాలాన్ని
ఎదుర్కొనే ఈ కాలానా
దోసిట రక్తం గడ్డ కడుతున్నది.
శోక వ్యాకులమైన –
నిట్టూర్పులే తప్ప
ప్రజాబలం వెంట రానపుడు
ప్రభుత్వ బలమే వెంటాడుతుంది.
దారితప్పిన సందిగ్ధ దశలో
గుణపాఠాలను మరచిన కాలానా
అనామకమవుతున్న త్యాగాల చరిత్ర!

అవినీతిమయ రాజ్య వ్యవస్థలో
వేలంపాటలో ఓటు హక్కు
మత కుల రాజకీయాల హోరులో
సంక్షేమ భ్రమల విచ్ఛిత్తి.
సమాంతరంగా –
పడి లేచే కెరటాల్లా
సంఘటిత ప్రజా పోరాటాలన్నీ
కాలాన్ని నడిపించే అజేయ శక్తిగా!!

– నిఖిలేశ్వర్ | 91778 81201

తాత్కాలిక అధ్యాపకులకు భరోసా ఏది?

అభిప్రాయం



డా॥ తిరుణహరి శేషు

వివిధ కారణాలతో ఒక దశాబ్దానికి పైగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో బోధనా సిబ్బంది నియామకాలు చేపట్టకపోవటం వలన ఆ యా విశ్వవిద్యాలయాలు తమ పరిధిలోనే యూజీసీ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన వారిని కాంట్రాక్ట్, అకడమిక్ కన్సల్టెంట్, పార్ట్ టైం ప్రాతిపదికన బోధనా సిబ్బందిగా నియమించుకుంటున్నాయి. రాష్ట్రంలోని 12 రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో బడ్జెట్ ఆమోదం పొంది ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో దరిదాపు 900 మందికి పైగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన, 600 మందికి పైగా పార్ట్ టైం ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని వివిధ వర్గాల నుండి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో 15 నుండి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి హామీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వివిధ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయటానికి జీవో నెంబర్ 21 ద్వారా నియామకపు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో తాత్కాలిక అధ్యాపకులు ఆందోళన చెందుతూ ఉద్యమ బాట పట్టారు.

దాదాపు 15 ఏళ్లుగా కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులు తక్కువ వేతనాలతో విశ్వవిద్యాలయాలలోని పని భారాన్ని మోస్తున్నారు. యూజీసీ మార్గదర్శకాల మేరకు రోస్టర్ పాయింట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ అర్హతగల వారిని కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులుగా ఎంపిక చేసి ఆ యా విశ్వవిద్యాలయాలు వారి సేవలను వినియోగించుకుంటున్నాయి.

ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మూడు విభాగాలలో... ముఖ్యంగా మొదటి విభాగంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎంపిక కోసం వారి సామర్థ్యాన్ని పరిశీలించటానికి మార్గదర్శకాలు రూపొందించినట్లుగా కనపడుతుంది. కానీ విశ్వవిద్యాలయం లాంటి ఒక అత్యున్నత విద్యాసంస్థ తరగతి గదిలో పాఠాలు బోధించటానికి అర్హత ప్రమాణాలు రూపొందించినట్లుగా కనిపించటం లేదు. అధ్యాపక నియామకాలకు కొత్తగా అర్హత ప్రమాణాలు రూపొందించటాన్ని తప్పు పట్టలేము కానీ ఆ అర్హత ప్రమాణాలు యూజీసీ మార్గదర్శకాల మేరకు సమర్థంగా పాఠాలు బోధించే సామర్థ్యం కలవారిని, అనుభవం కలవారిని ఎంపిక చేసే విధంగా ఉండాలి. పీహెచ్‌డీ లాంటి అత్యున్నత విద్యార్హతకు జాతీయ క్వాలిఫయింగ్ టెస్ట్ జేఆర్ఎఫ్‌కి సమానంగా మార్కులు కేటాయించటం ఏమిటి? అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామ కానికి ప్రధాన అర్హత పోస్టు గ్రాడ్యుయేషన్ కానీ డిగ్రీ మార్కులకు వెయిటేజ్ ఇవ్వటం ఏమిటి? పార్ట్ టైం అధ్యాపకుల సర్వీసెస్‌ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు అనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి పాఠాలు బోధించటానికి అత్యంత సమర్థత కలవారిని ఎంపిక చేయటానికి జీవో నెం. 21 మార్గదర్శకాలలో మార్పులు చేయవలసిన అవసరం కూడా ఉంది.



తెలంగాణ రాష్ట్రంలోని 12 రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా, నియామకాలలో ప్రాధాన్యం ఇవ్వకుండా నియామకాలు చేపట్టటం అంటే దశాబ్దాలుగా విశ్వవిద్యాలయాలలో శ్రమ దోపిడీకి గురవుతూ తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారికి అన్యాయం చేసినట్లుగానే భావించాలి. 'పనికి మాత్రమే పనికొస్తామా! అవకాశాల కోసం పనికిరామా! మాకు ఉద్యోగ భద్రత కల్పించకుండా, మా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో నియామకాలకు సిద్ధపడటం ఎంతవరకు సమంజసం' అనే ప్రశ్నలు అధ్యాపక వర్గాల నుండి వస్తున్నాయి. 2022లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలలో; పాలిటెక్నిక్ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న 8,000 మందికి పైగా అధ్యాపకుల క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకుల సేవలను క్రమబద్ధీకరించే అవకాశాలు లేవు కాబట్టి తమకు టైం స్కేల్‌తో ఉద్యోగ భద్రత కల్పించి నియామకాలలో ప్రాధాన్యమిచ్చి, తదనంతర చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వ్యాసకర్త రాష్ట్ర పార్ట్ టైం అధ్యాపకుల సంఘం సలహాదారు | 98854 65877

ఆ కిరణ రజం నుండే...

విశ్వకర్మ కూతురైన సంజ్ఞను సూర్యుడు పెండ్లాడాడు. వైవస్వత మనువు, యముడు, యమున వారి సంతానం. సూర్యుడి ప్రచండ కిరణాల ఉష్ణాన్ని భరించలేని సంజ్ఞ, కొంత కాలం సూర్యుడికి దూరంగా ఉండాలనుకుంది. అది సూర్యుడికి తెలియకుండా జరగాలని, తన ఛాయకు రూపాన్ని కల్పించి, తాను అశ్వరూపం ధరించి అరణ్యంలోకి వెళ్ళిపోయింది. అత్యంత భక్తి శ్రద్ధలతో ఛాయ సూర్యుడిని ఆరాధించింది. వారికి సూర్యసావర్ణి మనువు, శని, తపతి సంతానమయ్యారు. ఛాయకు సొంత సంతానం కలిగిన తరువాత, తమ పట్ల ఆమె చూపించే అనురాగంలో క్షీణతను గమనించిన యముడు 'తల్లివైయుండి అందరి పట్ల సమానమైన ప్రేమను చూపకపోవడం ఏమిటి? ఇలాంటి బుద్ధి నీకు ఎందుకు కలిగింది?' అని ప్రశ్నించాడు. అది సహించని ఛాయ, యముడిని దుర్భాషలాడింది. తల్లి నుండి దుర్భాషను ఊహించని యముడికి పట్టరాని కోపం వచ్చింది. ఆ కోపంలో ఏమి చేస్తున్నాడో గ్రహించకుండా, ఛాయను కాలితో తన్నాడు. ఆ విపరీత ప్రవర్తనను భరించలేని ఛాయ, యముడికి కాళ్ళు విరగాలని శపించిది. కాళ్ళు పోగొట్టుకున్న యముడిని చూసి సూర్యుడు 'ఎందుకిలా జరిగింది?' అని అడిగాడు. శాపం గురించి చెప్పి 'ఆమె నిజంగా నా తల్లి అయుంటే ఆమెను నేను ఎలా తన్నగలిగేవాడను? ఆమెకు నేను కొడుకునైతే ఆమె నన్ను ఎలా శపించగలిగేది? ఆమె మాకు తల్లి కాదు, నేను ఆమెకు కొడుకునూ కాదు!' అన్నాడు. యముడి మాటలు విన్న సూర్యుడు, ఛాయను నిజం చెప్పమని, లేకుంటే శపిస్తానని గద్దించి అడిగాడు.

జ్యోతిర్మయం

భయపడిన ఛాయ జరిగినదంతా చెప్పింది. విన్న సూర్యుడు యముడి కాళ్ళు పూర్వంలా అయేట్లుగా అనుగ్రహించి, వెంటనే వెళ్ళి అడవిలో అశ్వరూపంలో సంచరిస్తున్న సంజ్ఞను కలుసుకున్నాడు. వారికి రేవంతుడు, అశ్వినీదేవతలు సంతానంగా కలిగారు. త్వష్ట వచ్చి, సంజ్ఞ పడుతున్న బాధను గురించి సూర్యుడికి చెప్పి, సూర్యుడి కిరణాలలో ఎనిమిదవ పాలు సానపట్టి తగ్గించాడు. అలా తగ్గించే క్రమంలో రాలిన సూర్యుడి రజ రజం నుండి శంకరుడి త్రిశూలము, విష్ణుమూర్తి చక్రము, కుబేరుడి ఖడ్గము, కమారస్వామి శక్తి ... ఇలా నానాదేవతల ఆయుధాలు తయారుచేయబడ్డాయని వెన్నెలకంటి సూరన రచించిన శ్రీవిష్ణుపురాణం, చతుర్థాశ్వాసంలో చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

కేసీఆర్ ఇంటికి వెళ్లే రోడ్డు పనుల నిలిపివేత

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్ళే సీసీ రోడ్డును అర్ధాంతరంగా ఆపేసిన దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి వెళ్లే రోడ్డు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. రెండు నెలలుగా ఈ రోడ్డు పనులు సాగుతుండగా సగం వరకు పనులు చేసి మిగతా సగాన్ని గత నెల రోజులనుంచి ఆపేశారు. రోడ్డు పనులను ఇలా అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీ రోడ్డు వేసేందుకు తవ్విన రోడ్డుతో దుమ్ము ధూళి స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. దుమ్ము కారణంగా తమ ఇళ్లు మట్టి కొట్టుకుపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి టౌన్: బీఎంఎస్ అనుబంధ టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ మైదానంలో ఏర్పాటు చేసిన నాలుగో రాష్ట్ర మహాసభలో ఈ ప్రక్రియ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటాచారి, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా బసంత్, ఉపాధ్యక్షుడిగా శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర స్వామి, కోశాధికారిగా రమేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నోముల ప్రసాద్, సెక్రటరీలుగా వెంకట్ యాదవ్, మాణిక్యం, ఎల్లం, రమేశ్, నర్సింహులు, శివకుమార్, అనసూయ, రవీందర్ గౌడ్, మనోహర్‌రావు, కులకర్ణి, సలహాదారులుగా వెంకట్‌రెడ్డి, తిరుపతి గౌడ్, రాఘవులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఇన్‌చార్జిగా పి.శ్రీపతి, హైదరాబాద్ జోన్ ఇన్‌చార్జిగా టి.పోషాద్రి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, రాష్ట్ర సంఘటన మంత్రి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- మరికొన్ని గంటల్లో పెళ్లి.. విద్యుదాఘాతంతో వరుడి తండ్రి మృతి


వెంకటి

రాజంపేట: మరికొన్ని గంటల్లో పెళ్లి జరగాల్సి ఉండగా, పెళ్లి కుమారుడి తండ్రి విద్యుదాఘాతానికి గురై మరణించిన విషాద ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన గజ్జల వెంకటి (58) కుమారుడు నరేశ్ పెళ్లి సోమవారం స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్లో జరగాల్సి ఉంది. ఆదివారం రాత్రి ఫంక్షన్ హాల్‌లో వెంకటి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల ప్రాంతంలో ఫంక్షన్ హాల్‌లో మేకలు కోయడానికి సపోర్టు కోసం గజ్జల వెంకటితో పాటు మరో ముగ్గురు కలిసి మూవింగ్ స్టాండ్‌ను ప్రహరీ వైపు తరలిస్తుండగా పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. గజ్జల వెంకటి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే పడిపోగా, మిగతా ముగ్గురు స్వల్ప గాయాలకు గురయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంకటిని కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పెళ్లి తంతు నిలిచిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఘటన


ప్రశాంత్‌రెడ్డి

కొత్తూరు: చేసిన అప్పులు తీర్చే దారి లేక ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మురళీగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. పెంజర్ల రోడ్డులోని కృష్ణవేణి పాఠశాల వెనకాల ఓ మృతదేహం పడిఉందని అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం పక్కన కూల్‌డ్రింక్ సీసాతో పాటు క్రిమిసంహారక మందు బాటిళ్లు పడి ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించారు. అప్పటికే ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో రావడంతో, గుర్తించిన బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఫరూఖ్‌నగర్ మండలం షేరిగూడ గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి (34)గా తేలింది. వ్యవసాయం, పాడి పరిశ్రమ నిర్వహణ కోసం చేసిన అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో ప్రశాంత్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆవులు మృత్యువాత పడటం, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఈనెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త వక్ఫ్ చట్టంపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం

- వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాంగ విరుద్ధం
- మత ఆధారంగా వివక్ష తగదు
- వక్ఫ్ నిర్వహణ సరిగా లేకుంటే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి తప్ప మత విశ్వాసాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరించకూడదు
- వక్ఫ్ చట్ట 'సవరణ'లను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలి
- కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్



సాక్షి, అమరావతి : వక్ఫ్ చట్టం–1995కు సవరణలతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సవరణల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ.. మతం ఆధారంగా వివక్ష చూపేలా కొత్త చట్టం ఉందని పేర్కొంది. ఆర్టికల్ 14, 15లను ఉల్లంఘిస్తున్న సవరణలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వక్ఫ్ నిర్వహణ సక్రమంగా లేకుంటే జోక్యం చేసుకోవచ్చే తప్ప, మత విశ్వాసాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. వక్ఫ్ బోర్డు సీఈవోగా ముస్లిం వ్యక్తే ఉండాలన్న నిబంధనను కొత్త చట్టంలో తొలగించారని తెలిపింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం మౌలిక సూత్రాలకు విరుద్ధమని.. ఇది తరాలుగా వస్తున్న హక్కులకు విఘాతం కలిగించడమేనని పేర్కొంది. కీలక వ్యక్తులను తొలగించేందుకు కూడా కొత్త సవరణలు అవకాశం కల్పిస్తున్నాయంది.

- ముస్లిం ధార్మిక సంస్థల వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఇస్తూ, పాత వక్ఫ్ చట్ట ఉద్దేశాలను కాలరాసేలా ఉన్న సవరణలతో వక్ఫ్‌ల పాలన బలహీనం అవుతుందని పేర్కొంది.
- వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పునర్విభజన విషయంలో జోక్యం చేసుకునేందుకు అధికారులకు అపరిమిత అధికారాలు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ పిటిషన్ లో తెలిపింది. కానీ, ఒకసారి వక్ఫ్ అయితే అది ఎప్పటికీ వక్ఫ్ అవుతుందన్న సూత్రాన్ని న్యాయస్థానాలు కూడా గుర్తించాయని తెలిపింది. మైనారిటీ ఆస్తులకు రాజ్యాంగ రక్షణ ఉందని, కొత్త చట్టంతో అన్ని రక్షణలు పోతున్నాయని పేర్కొంది. ఇది అత్యంత ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. రక్షిత స్మారక చిహ్నాలు, రక్షణ ప్రాంతాల ప్రకటనను చెల్లనివిగా తేల్చే ప్రమాదం ఉందని తెలిపింది.
- ఏ చట్టమైనా దాని మాతృ చట్ట స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు ఎన్నో తీర్పుల్లో చెప్పిందని తెలిపింది. కానీ, కొత్త చట్టంతో పురాతన వక్ఫ్‌ల స్వరూపాన్ని సవాలు చేసే పరిస్థితి వచ్చిందని వైఎస్సార్‌సీపీ తన పిటిషన్‌లో వివరించింది.
- ఏ వక్ఫ్ ఆస్తినైనా ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించే అధికారాన్ని అధికారులకు కొత్త చట్టం కట్టబెట్టిందని తెలిపింది. గతంలో ఉన్న రక్షణలేవీ లేకుండా చేస్తోందని, అందువల్ల ఈ సవరణ చట్టం విషయంలో జోక్యం చేసుకోవాలని కోరింది.
- ఇస్లామిక్ చట్టాలు, కట్టుబాట్లకు అనుగుణంగా వక్ఫ్‌ల నిర్వహణ ఉంటుందని, కానీ, సవరణలు అందుకు విరుద్ధంగా ఉన్నాయంది. ముస్లిం సంస్థల్లో ముస్లింల ప్రాబల్యాన్ని తగ్గించడానికి తీసుకొచ్చిన ఈ సవరణలను కొట్టేయాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థించింది.
- వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం దశాబ్దాలుగా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటూ వస్తున్నాయంది. అందులో భాగంగానే ట్రిబ్యునళ్ల ఏర్పాటు జరిగిందని తెలిపింది. తద్వారా వక్ఫ్ ఆస్తుల రక్షణకు ఆస్కారం లభించిందని తెలిపింది.
- కొత్త సవరణ చట్టం ముస్లిం ధార్మిక సంస్థలు, వక్ఫ్‌ల స్వతంత్రలను సవాలు చేసేలా సవరణ చట్టం ఉందని స్పష్టం చేసింది. వక్ఫ్‌లతో ముడిపడి ఉన్న విద్యా, సాంస్కృతిక సంస్థల మనుగడ ప్రమాదంలో పడిందని పిటిషన్‌లో తేల్చి చెప్పింది.
- వక్ఫ్ బోర్డు సభ్యుల కోసం ఎన్నికల స్థానంలో నామినేషన్ విధానాన్ని తేవడం ద్వారా ప్రజాస్వామ్య ఎన్నిక విధానాన్ని కాలరాసినట్టైందని తెలిపింది.
- ఆస్తి యజమానికి తెలిసి.. ఆ ఆస్తిని సుదీర్ఘ కాలంగా ధార్మిక కార్యకలాపాలకు వాడుతుంటే ఆ ఆస్తి వక్ఫ్‌ది అవుతుందని–1995 చట్టంలో స్పష్టంగా ఉందని, దానికి తూట్లు పొడిచేలా సవరణలు ఉన్నాయంది. ఈ పరిస్థితుల్లో కొత్త సవరణ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించడంతో పాటు చెల్లనిదిగా కూడా ప్రకటించాలని సుప్రీంకోర్టును వైఎస్సార్‌సీపీ అభ్యర్థించింది.

కారులో ఆడుకుంటుండగా డోర్లు లాక్

- ఊపిరాడక ఇద్దరు చిన్నారుల దుర్మరణం
- రంగారెడ్డి జిల్లా దామరగిద్దలో ఘటన


చిన్నారుల మృతికి కారణమైన కారు ఇదే

చేవెళ్ల: మేనమామ పెళ్లి వేడుకలకోసం అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ మృత్యువాతపడ్డారు. కారు డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్దలో సోమవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దామరగిద్దకు చెందిన తెలుగు జంగయ్య, అనసూయల కుమారుడు రాంబాబు వివాహం ఈనెల 30న జరగనుంది. పెళ్లి ఏర్పాట్లలో భాగంగా రాంబాబు అక్కాచెల్లెళ్లైన సీతారాంపూర్‌కు చెందిన ఉమారాణి, పామెన గ్రామానికి చెందిన జ్యోతి తమ పిల్లలను తీసుకుని రెండు రోజుల క్రితం దామరగిద్దకు వచ్చారు. ఇంటికి రంగులు వేసే పనులు కొనసాగుతుండటంతో పిల్లలంతా కలసి బయట ఆడుకుంటున్నారు. వీరిలో ఉమారాణి చిన్న కూతురు అభినయశ్రీ (4), జ్యోతి చిన్న కూతురు తన్మయశ్రీ(5) ఇంటి ఎదుట పార్క్ చేసి ఉన్న కారులోకి ఎక్కారు. కొద్దిసేపటి తర్వాత పిల్లలు డోర్లు వేసుకోవడంతో అవి లాక్ అయ్యాయి. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. పిల్లలందరూ ఒకే చోట ఆడుకుంటున్నారని భావించిన కుటుంబ సభ్యులు వారివారి పనుల్లో మునిగిపోయారు. సుమారు రెండు గంటలు గడిచిన తర్వాత అభినయశ్రీ, తన్మయశ్రీ కనిపించకపోవడంతో అంతా వారికోసం వెతుకుతుండగా కారు డోర్లు తీసి చూశారు. ఇద్దరు చిన్నారులు ఊపిరి ఆడక అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు పిల్లలు మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల మృతి ఘటన దామరగిద్దతోపాటు సీతారాంపూర్, పామెన గ్రామాల్లో విషాదం నింపింది. పిల్లల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు అందరినీ కలచి వేశాయి.

సంపద సృష్టించి పేదలకు పంచుతాం

- 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' సభలో డిప్యూటీ సీఎం భట్టి
- మంచిర్యాలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


జై బాపు జై భీమ్ జై సంవిదాన్ బహిరంగ సభకు వెళ్తున్న భట్టి, పీఎస్సార్, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సంపద సృష్టించి పేదలకు పంచడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అలాగే రూ. 765 కోట్లతో గోదావరిపై ముంపు నివారణ కోసం నిర్మించే రాళ్లవాగుకు రక్షణ గోడ, ఆరు లేన్ల రహదారి, పంచాయతీరాజ్, ఎన్సీడీసీఎల్, సింగరేణి పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్'లో భాగంగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అధ్యక్షతన బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో భట్టి మాట్లాడారు. దేశ చరిత్రలో తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కులగణన చేసి అందరికీ న్యాయం చేయాలని ముందుకెళ్తుంటే ప్రభుత్వంపై రాజకీయ అరాచకం సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

జూన్ 2న మంజూరు లేఖలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల స్థానంలో గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతలను రూ. లక్ష కోట్లతో కడితే కుంగిపోయి పనికి రాకుండా పోయిందని భట్టి విమర్శించారు. తాము ప్రాణహిత ప్రాజెక్టును కడతామని మాటిస్తున్నామని చెప్పారు. జూన్ 2న రూ. 9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాస అర్హులకు మంజూరు లేఖలు ఇస్తామన్నారు.

నా గొంతు నొక్కద్దు: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

అంతకుముందు సభలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ 76 ఏళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయమే జరుగుతోందన్నారు. తాను 25 ఏళ్లుగా ఆదివాసీ, గిరిజన, మైనార్టీ, బీసీల గొంతుగా ఉన్నానని చెప్పారు. నిన్నమొన్న వచ్చిన వాళ్లు.. పార్టీలు మారిన వాళ్లు మంత్రి పదవి అడుగుతున్నారని పరోక్షంగా వివేక్ వెంకటస్వామి కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తన గొంతు నొక్కొద్దని.. ఇది ఉద్యమాల పురిటిగడ్డ అని అన్నారు. తాను ఏం చేయడానికైనా సిద్ధమేనని వ్యాఖ్యానించారు.

రేవంత్ ఆహ్వానిస్తేనే కాంగ్రెస్‌లో చేరా: వివేక్

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యలపై చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాకా కుటుంబం ద్వారానే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటికి వచ్చి కాంగ్రెస్‌లో చేరాలని కోరినందునే పార్టీలో చేరానని చెప్పారు. పార్టీలు మారడం కాదు.. ప్రజలకు ఎంత మంచి చేశామన్నదే ముఖ్యమన్నారు. బీజేపీలో కేంద్ర మంత్రి అయ్యే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీలో చేరానని పేర్కొన్నారు.

'సీతారామ'కు సరికొత్త సవాళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టులో భాగంగా రూ.6,714 కోట్ల వ్యయంతో 104.4 కి.మీ. పొడవైన ప్రధాన కాలువ నిర్మించారు. దీని నీటి ప్రవాహ సామర్థ్యం 9,000 క్యూసెక్కులు. ఈ కాలువ దారిలో కిన్నెరసాని, ముర్రేడు వంటి నదులు, వాగులతో పాటు చిన్న చిన్న ఒర్రెల వంటి నీటి ప్రవాహాలు ఎదురైన చోట అక్విడెక్టులు, సూపర్ పాసేజ్‌లు నిర్మించారు. 2018లో ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తే 2022 చివరి నాటికి మూడు పంప్‌హౌస్‌లు, ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయింది. గతేడాది ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంప్‌హౌస్‌లు ప్రారంభించారు. తాజాగా 2025 మార్చి 3న ట్రయల్ రన్ నిర్వహించి గోదావరి నుంచి 405 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు అందించారు. అప్పటికే గోదావరిలో నీరు అడుగంటి పోవడంతో రెండు రోజులకు మించి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాలేదు.

405 క్యూసెక్కులకే కూలిన సూపర్ పాసేజ్

గత నెలలో విడుదల చేసిన నీటి ప్రవాహానికి ములకలపల్లి మండలం వీకే రామవరం గ్రామానికి సమీపంలో ప్రధాన కాలువ వెంట 48.30 కి.మీ. దగ్గర సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన సూపర్ పాసేజ్‌కి సంబంధించిన పిల్లర్ కూలిపోయింది. మొత్తం నాలుగు పిల్లర్లలో ఒకటి కూలిపోగా.. కాలువ రివిట్‌మెంట్ కూడా దెబ్బతింది. 9 వేల క్యూసెక్కుల ప్రవాహం వెళ్లేలా డిజైన్ చేసిన ప్రధాన కాలువలో కేవలం 405 క్యూసెక్కుల ప్రవాహానికే పాసేజ్ పిల్లర్ కూలిపోవడం చర్చనీయాంశమయ్యింది. నీటి ప్రవాహం కారణంగా పిల్లర్ల కింద మట్టి కొట్టుకుపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుందని, నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో 15 రోజుల్లోగా రిపేర్లు చేయిస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు.

తెరపైకి ఎస్కేప్ చానల్..

గతేడాది నిర్వహించిన ట్రయల్ రన్‌కు ముందు ప్రధాన కాలువను ఆసాంతం పరిశీలించగా మొదటి, రెండో పంప్‌హౌస్‌ల మధ్య రెండు, మూడు చోట్ల గండి పడిన విషయం వెలుగు చూసింది. అయితే వర్షపు నీరు నిలవడం వల్ల కాలువకు తామే గండ్లు కొట్టామంటూ ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. అయితే గత ఆగస్టు 15న పంప్‌హౌస్‌లు ప్రారంభించే సమయానికి ఆ గండ్లను పూడ్చేశారు. అయితే సెప్టెంబర్ 1న భారీ వర్షాలు కురవడంతో పాల్వంచ మండలం బంద్రుగొండ వద్ద గండి పడగా రెండురోజుల తర్వాత చంద్రుగొండ మండలంలో మరో గండి పడి పొలాలు నీట మునిగాయి. దీంతో కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాల కారణంగానే గండ్లు పడుతున్నాయనే విమర్శలు వచ్చాయి. కాగా ప్రధాన కాలువలోకి వచ్చే అదనపు నీటి ప్రవాహాలను బయటకు పంపేందుకు కొత్తగా రూ.60 కోట్ల వ్యయంతో ఎస్కేప్ చానల్ నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం.

ఖరీఫ్‌లో నీరు పారేనా ?

గత ఖరీఫ్‌లో గోదావరి నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు ఇవ్వాలని భావించినా..వర్షాల కారణంగా ఆ అవసరం పడలేదు. ఈ రబీ సీజన్‌కు ఎత్తిపోతలు మొదలెట్టినా గోదావరిలో సరిపడా నీరు లేక మధ్యలోనే ఆగిపోయింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కచ్చితంగా గోదావరి జలాలు పొలాలకు పారుతాయనే అంచనాలు నెలకొనగా కీలకమైన ప్రధాన కాలువలో లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో వాటిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పూర్తి స్థాయిలో నీటిని వదిలే ముందు ప్రధాన కాలువ పటిష్టతను పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అది అడవి కాదు.. ప్రభుత్వ భూమే

- కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకు సమర్పించిన అఫడవిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం
- 20 ఏళ్లుగా ఆ స్థలం ఖాళీగా ఉన్నందునే చెట్లు పెరిగి, అడవిలా మారిందని వెల్లడి
- ఈ అంశంపై రేపు విచారణ చేపట్టనున్న సర్వోన్నత న్యాయస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫడవిట్ దాఖలు చేసింది. 'అది అడవి కాదు. ప్రభుత్వానికి చెందిన భూమే. ఒకవేళ అది అడవి అయి ఉంటే అటవీ శాఖ పరిధిలో ఉండేది. కానీ రికార్డుల ప్రకారం ఏనాడూ అది అటవీ శాఖకు చెందిన భూమిగా నమోదై లేదు. కావాలనే కొందరు దాన్ని అటవీ భూమిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ స్థలం అంతా సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్నందున అడవిలా మారింది' అని రాష్ట్ర ప్రభుత్వం అఫడవిట్‌లో పేర్కొంది. ఈ నెల 16న ఈ కేసును సుప్రీంకోర్టు విచారించనున్న నేపథ్యంలో ఈ మేరకు అఫడవిట్ సమర్పించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీతోపాటు మరి కొందరు సీనియర్ న్యాయవాదులతో భేటీ కావడం తెలిసిందే. గత విచారణ సందర్భంగా అమికస్ క్యూరీ పరమేశ్వర్ సుప్రీంకోర్టు ఎదుట ఐదు ప్రశ్నలను లేవనెత్తారు. ఈ ఐదు ప్రశ్నలకు ప్రభుత్వం అఫిడవిట్‌లో సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

చెట్లు పెరగడం వల్లే..

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం సుమారు 20 ఏళ్లుగా న్యాయస్థానాల్లో ఉందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపినట్లు తెలిసింది. అందుకే ఆ ప్రాంతమంతా చెట్లు పెరిగి అడవిలా మారిందని వివరించింది. అలా ఉన్న ఆ ప్రాంతంలో నెమళ్లు, ఇతర చిన్నపాటి జంతువులు వచ్చి సేదతీరుతున్నట్లు ప్రభుత్వం వివరించింది.

నేడు సీఎల్పీ భేటీ

- రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేయనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) మంగళవారం సమావేశం కానుంది. సీఎల్పీ నేత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఈ భేటీ జరగనుంది. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక పథకాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంపీలకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, భూభారతి చట్టం అమలు, ఎస్సీల వర్గీకరణ ఉత్తర్వుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల గురించి ఈ సమావేశంలో చర్చ జరగనుంది. పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తున్న నేపథ్యంలో పథకం అమలు తీరు, ఈ పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశంపై సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించనున్నట్లు తెలిసింది. సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేసే కార్యక్రమాన్ని మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లే విధంగా ఈ సమావేశం ప్రజా ప్రతినిధులతో పాటు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఎస్సీల వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిన నేపథ్యంలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులకు మెరుగైన సేవలందిస్తున్న విషయాలను ప్రజలకు వివరించే అంశంపై ఈ సమావేశంలో దిశానిర్దేశం జరగనుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల జపాన్ పర్యటన నేపథ్యంలో ఈ నాలుగు పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించే అంశంపై సీఎం దిశా నిర్దేశం చేసేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారని తెలిపాయి.

కట్టడం.. కూల్చడమేనా పని?

- 'సీతారామ' బ్రిడ్జి పిల్లర్ కూలిన ఘటనపై సీఎం అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: 'కట్టడం..కూల్చడం తప్పితే మీకు మరేం పనిలేదా?' అని నీటిపారుదల శాఖ అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సీతారామ–సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టులో భాగంగా ఓ కాలువపై నిర్మించిన బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్ ఎలా కూలింది?' అని సోమవారం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ఆరా తీశారు. ఈ ఘటన జరిగి రెండు వారాలవుతున్నా ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. ఈ ఘటన గురించి తమకు నిన్ననే తెలిసిందని, దీనిపై నివేదిక కోరామని నీటిపారుదల శాఖ అధికారులు సీఎంకు వివరణ ఇచ్చారు. నివేదిక అందితే ఘటనకు కారణాలు తెలుస్తాయని చెప్పారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు

- ముగ్గురు దుర్మరణం, ముగ్గురికి తీవ్ర గాయాలు
- జనగామ జిల్లా రాఘవాపూర్ శివారులో ఘటన
- మృతుల స్వస్థలం ఏపీలోని అమలాపురం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

స్టేషన్‌ఘన్‌పూర్: ముందు వెళ్తున్న లారీని వేగంగా వచ్చిన కారు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ శివారులో సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఏపీలోని అమలాపురానికి చెందిన సత్తి అనంతలక్ష్మి, రాజేశ్వరరావు కుటుంబం గత పదేళ్లుగా హైదరాబాద్‌లోని గాజులరామారంలో నివసిస్తోంది. అనంతలక్ష్మి, రాజేశ్వరరావు, వారి కుమారుడు శ్రీను (48), కోడలు రమణకుమారి (40), మనుమడు, మనవరాలు సత్యఅరవింద్, అనూష (22) కలసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో దైవ దర్శనం కోసం హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం కారులో బయలుదేరివెళ్లారు. దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న కారు రాఘవాపూర్ శివారులో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీను, అతని భార్య రమణకుమారి, వారి కుమార్తె అనూష అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో తీవ్ర గాయాలతో ఉన్న అనంతలక్ష్మి, రాజేశ్వరరావు, సత్యఅరవింద్‌లను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తర్వాత వారిని హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు దాదాపు రెండుగంటల పాటు కష్టపడి గడ్డపార, క్రేన్ సహాయంతో కారు డోర్లు తొలగించి మృతదేహాలను వెలికి తీశారు.

అదుపుతప్పి.. బ్రిడ్జి కింద పడిన ఆటో

- 8 మంది మహిళా కూలీలు, డ్రైవర్‌కు తీవ్రగాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

శంకరపట్నం (మానకొండూర్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామంలో మహిళా కూలీలు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బ్రిడ్జి కింద పడింది. వీణవంక మండలం కాపులపల్లిలో మొక్కజొన్న కంకి తీయడానికి సోమవారం వేకువజామున శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన కనకం అంజయ్య ఆటోలో 8 మంది మహిళా కూలీలు వెళ్లారు. మధ్యాహ్నం వరకు పనులు చేసిన కూలీలు ఆటోలో తిరిగి రాజాపూర్ వస్తున్నారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి ఆముదాలపల్లి బ్రిడ్జి కింద పడింది. డ్రైవర్‌తో పాటు కూలీలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో 9 మందికి తీవ్రగాయాలు కాగా, ఆటో డ్రైవర్ అంజయ్యతో పాటు భార్య సారమ్మ, కోడళ్లు నందిని, సంగీత ఒకే కుటుంబానికి చెందిన వారు. మాతంగి శంకరమ్మ, మధునమ్మ, కుక్కముడి వీరయ్య, ఎల్లమ్మ, మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108లో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ అంజయ్య, శంకరమ్మ, మధునమ్మను హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

క్వారీ గుంతలో ఇద్దరు యువకుల గల్లంతు

- రక్షించడానికి వెళ్లిన మరో యువకుడు నీట మునిగి మృతి




మృతుడు విజయ్ — గల్లంతైన మహిమూద్, సుశాంత్

మహబూబ్‌నగర్ క్రైం: సరదాగా ఈత కొట్టేందుకు క్వారీ గుంతలోకి దిగిన ఇద్దరు మిత్రులు నీట మునగడంతో.. కాపాడేందుకు వెళ్లిన మరో యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ముందుగా గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ లభించకపోవడంతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని దివిటిపల్లిలో నివాసం ఉండే విజయ్‌కుమార్ (27), అయ్యప్ప అలియాస్ సుశాంత్ (17), మహిమూద్ (24), సాయిచరణ్, హరిచరణ్ ఐదుగురు కలిసి సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల వెనుక భాగంలో ఉన్న క్వారీ దగ్గరకు వెళ్లారు. క్వారీలో దాదాపు 20 అడుగుల వరకు నీళ్లు ఉండటంతో దాంట్లో ఈత కొట్టాలని మొదట మహిమూద్, సుశాంత్ ఇద్దరూ నీటిలోకి దిగారు. వారితోపాటు వచ్చిన మిగిలిన ముగ్గురు ఒడ్డుపై ఉన్నారు. నీటిలోకి దిగిన కాసేపటికి ఇద్దరికి ఈత రాకపోవడంతో మునిగిపోతున్నారని తెలుసుకున్న విజయ్‌కుమార్ ఆ ఇద్దరిని రక్షించే ప్రయత్నంలో అతను కూడా నీట మునిగి మృతిచెందాడు. నీటిలో మునిగిన మహిమూద్, సుశాంత్‌ల ఆచూకీ ఇంకా దొరకలేదు. కాపాడటానికి దిగిన విజయ్‌కుమార్ మృతదేహం మాత్రం లభించింది. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సందర్శించాయి. చీకటి పడటంతో లైట్లు ఏర్పాటుచేసి గాలిస్తున్నా ఇద్దరు యువకుల ఆచూకీ లభించలేదు.

కామారెడ్డి జిల్లాలో అంబేడ్కర్ ఫ్లెక్సీల రగడ

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై కాంగ్రెస్ నేతల అభ్యంతరం.. పోలీసులకు ఫిర్యాదు.. రోడ్డుపై బైఠాయించిన దళిత సంఘాల నేతలు
- అరెస్టు క్రమంలో జారిన ఓ నేత ప్యాంటు.. అర్ధనగ్నంగానే లాక్కెళ్లిన పోలీసులు

లింగంపేట (ఎల్లారెడ్డి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై వివాదం చోటుచేసుకుంది. ఫ్లెక్సీల్లో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎమ్మెల్సీ కవిత ఫొటోలు మాత్రమే ఉండటం, ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో లేకపోవడంతో అభ్యంతరం తెలుపుతూ కాంగ్రెస్ నేతలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు ఫ్లెక్సీలు తొలగించాలని దళిత సంఘాల నాయకులకు సూచించారు. అయితే అందుకు వారు ససేమిరా అన్నారు. ఒకవేళ తమ ఫ్లెక్సీలను తొలగిస్తే కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలనూ తొలగించాలని డిమాండ్ చేశారు. అందుకు పోలీసులు ఒప్పుకోకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. వారికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ ధర్నాలో పాల్గొన్నారు. సుమారు ఐదు గంటలపాటు ఆందోళన కొనసాగింది. చివరకు పోలీసులు మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మోతె భూపతి, నెల్లూరి గంగారం, పర్శక్ల రాజు, ముస్తాపూర్ వివేకానందలను అరెస్టు చేశారు. ఈ క్రమంలో ముదాం సాయిలు చొక్కా చిరిగిపోయి, ప్యాంటు జారిపోయింది. అయినప్పటికీ పోలీసులు ఆయన్ను అర్ధనగ్నంగా ఈడ్చుకెళ్లి పోలీసు వాహనంలో పడేశారు.

రాహుల్.. ఇదేనా మొహబ్బత్ కా దుకాణ్?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లాలో ఓ దళితుడిని పోలీసులు అర్ధనగ్నంగా ఈడ్చుకెళ్లడం దారుణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అరాచక పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దాష్టీకాలపై ఇప్పటికైనా రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. రాహుల్ కోరుకుంటున్న మొహబ్బత్‌కా దుకాణ్‌లో దళితుల పరిస్థితి ఇలానే ఉంటుందా? అని ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు ఈ అంశంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైతం స్పందించారు. ఈ ఘటనకు పాల్పడిన పోలీసులను వెంటనే అరెస్టు చేయాలని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు.

వేలానికి గోల్కొండ బ్లూ వజ్రం

రూ.430 కోట్లు పలకవచ్చని అంచనా

న్యూఢిల్లీ: ఇండోర్, బరోడా మహారాజులు గతంలో ఎంతో మక్కువతో సొంతం చేసుకున్న అత్యంత అరుదైన గోల్కొండ బ్లూ వజ్రం వేలానికి రాబోతోంది. క్రిస్టీస్ వేలం సంస్థ స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో మే 14వ తేదీన ఈ నీలిరంగు వజ్రాన్ని వేలం వేయనుంది. ఈ వజ్రం బరువు 23.24 క్యారెట్లు. వేలంలో 35 మిలియన్ డాలర్ల నుంచి 50 మిలియన్ డాలర్లు (రూ.300 కోట్ల నుంచి రూ.430 కోట్లు పలకవచ్చని అంచనా వేస్తున్నారు. అరుదైన గోల్కొండ వజ్రాన్ని తాము వేలం వేస్తుండడం క్రిస్టీస్ సంస్థ గొప్ప గౌరవంగా భావిస్తోంది. ఇలాంటి అవకాశం జీవితకాలంలో ఒక్కసారే లభిస్తుంది ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారు. రంగు, పరిమాణంలో గోల్కొండ నీలి వజ్రాన్ని మించింది మరొకటి లేదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ హెడ్ ఆఫ్ జువెల్లరీ రాహుల్ కడాకియా వెల్లడించారు. ఈ వజ్రం మూలాలు హైదరాబాద్ శివార్లలోని గోల్కొండ ప్రాంతంలో ఉన్నట్లు చెబుతున్నారు.



అభిమానికి పాదరక్షలు

ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు రాంగోపాల్ కశ్యప్. హరియాణాలోని యమునానగర్ వాసి. మోదీకి వీరాభిమాని. ఆయన ప్రధాని అయ్యేదాకా చెప్పులు వేసుకోబోనని 14 ఏళ్ల క్రితం భీషణ ప్రతిజ్ఞ చేశారు. సోమవారం యమునానగర్‌లో బహిరంగ సభ సందర్భంగా మోదీ ఆయన్ను కలిశారు. బూట్లు కానుకగా ఇవ్వడమే గాక వాటిని ధరించడంలో సాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందులో కశ్యప్ చెప్పుల్లేకుండా మోదీ వద్దకు వెళ్లి కరచాలనం చేయడం కన్పిస్తోంది. తర్వాత ఆయన్ను మోదీ తనతో పాటు కూచుండబెట్టుకున్నారు. ''ఇలాంటి ప్రతిజ్ఞ ఎందుకు చేయాల్సి వచ్చింది? నీకు పాదరక్షలు తొడుగుతున్నా. ఇంకెప్పుడూ ఇలా చేయొద్దు సుమా!''అంటూ ప్రేమగా మందలించారు. కొత్త బూట్లు సౌకర్యంగా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ''నాపై కశ్యప్ అభిమానానికి చలించిపోయాను. ఆయనకు బూట్లు ధరింపజేసే అవకాశం లభించినందుకు నిజంగా ఆనందంగా ఉంది''అంటూ ఎక్స్‌లో మోదీ పోస్ట్ చేశారు. ''ఇలాంటి కోట్లాదిమంది అభిమానులే నా బలం. వారి ఆదరణను వినమ్రంగా స్వీకరిస్తున్నా. వారంతా సంఘసేవ ద్వారా జాతి నిర్మాణానికి కృషి చేయాల్సిందిగా కోరుతున్నా''అన్నారు.



ఖనిజాలు బంద్

చైనా కీలక నిర్ణయం
- అమెరికాకు కోలుకోలేని షాక్
- రక్షణ నుంచి సాఫ్ట్‌వేర్ దాకా ప్రభావం
- మూడొంతులు చైనా దిగుమతులే
- ఇతర దేశాలపైనా తీవ్ర ప్రభావం

బీజింగ్/బ్యాంకాక్: సుంకాల పోరులో అస్సలు తగ్గేది లేదన్న చైనా, అనుకున్నట్టుగానే అమెరికాకు గట్టి షాకిచ్చింది. పలు అరుదైన కీలక ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతిని మొత్తంగా నిలిపేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. న్యూయార్క్ టైమ్స్ తాజా కథనంలో ఈ మేరకు పేర్కొంది. గాలిడోనియం, సమారియం, స్కాండియం, టెర్బియం, ఇత్రియం, డైస్ప్రోరియం, లుటేటియం వంటివి నిలిపివేత జాబితాలో ఉన్నాయి. అమెరికా ఈ ఖనిజాలను 72 శాతానికి పైగా చైనా నుంచే దిగుమతి చేసుకుంటోంది. దాంతో అమెరికా రక్షణ, ఏరోస్పేస్, కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ తదితర పరిశ్రమలన్నీ తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. రక్షణ రంగ దిగ్గజం లాక్‌హీడ్ మార్టిన్‌తో పాటు కార్ల తయారీ కంపెనీ టెస్లా, టెక్ దిగ్గజం యాపిల్ వంటి ఎన్నో సంస్థలు చాలా రకాలైన కీలక ముడి పదార్థాల కోసం ప్రధానంగా చైనా ఎగుమతులపైనే ఆధారపడుతున్నాయి. ఆయా ఖనిజ నిల్వలు అమెరికాలోనూ ఉన్నా అక్కడి పరిశ్రమల అవసరాలను అవి ఏమాత్రమూ తీర్చలేవు. దాంతో వాటి లోటును భర్తీ చేసుకోవడం అగ్ర రాజ్యానికి చాలా కష్టతరం కానుంది. ప్రపంచవ్యాప్తంగా అరుదైన ఖనిజాల ఎగుమతుల్లో ఏకంగా 90 శాతం వాటా చైనాదే. చైనా నిర్ణయంతో అమెరికాతో పాటు చాలా దేశాలు ప్రభావితం కానున్నాయి.

ఢీ అంటే ఢీ

అమెరికా, చైనా మధ్య సుంకాల పోరు కొద్ది రోజులుగా తారస్థాయికి చేరుకోవడం తెలిసిందే. చైనాపై సుంకాలను ఏకంగా 145 శాతానికి పెంచుతున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకారంగా అమెరికాపై చైనా 125 శాతం సుంకాలు విధించింది. అంతేగాక ఖనిజ ఎగుమతులపై ఆంక్షలు విధిస్తామని కూడా ఏప్రిల్ 2వ తేదీనే ప్రకటించింది. చైనా తమతో చర్చలకు వచ్చి సుంకాలను తగ్గిస్తుందని ఆశిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగా, ఆ ప్రసక్తే లేదని చైనా కుండబద్దలు కొట్టడం తెలిసిందే. అంతేగాక ఆయనవి మతిలేని చర్యలంటూ గట్టిగా నలుగు పెట్టింది. ''ఈ ప్రతీకార సుంకాలతో ఎవరికీ మేలు జరగదు. వాణిజ్య యుద్ధంలో విజేతలంటూ ఉండరు. అమెరికా బెదిరింపులకు లొంగే సమస్యే లేదు'' అని స్పష్టం చేసింది. అమెరికా ముందుకొస్తేనే చర్చలకు సిద్ధపడతామని కూడా తేల్చేసింది.

చైనాయే దిక్కు

అమెరికా కొన్నేళ్లుగా చైనా దిగుమతులపై విపరీతంగా ఆధారపడుతున్న కీలక విభాగాల సంఖ్య గత పాతికేళ్లలో అనూహ్యంగా పెరిగిపోయింది. ప్రస్తుతం 532 రకాల కీలక ఉత్పత్తి విభాగాల విషయంలో అగ్ర రాజ్యానికి చైనా దిగుమతులే దిక్కు. ఇదే సమయంలో చైనా ప్రధానంగా అమెరికా ఉత్పత్తులపై ఆధారపడ్డ విభాగాల సంఖ్య మాత్రం సగానికి సగం తగ్గిపోయింది. అంతేగాక అమెరికా నుంచి పలు కీలక వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై చైనా ఆంక్షలు విధించనుంది. అగ్ర రాజ్యానికి ఇది కూడా కోలుకోలేని దెబ్బే. అమెరికా సోయాబీన్ ఎగుమతులు తదితరాల్లో 10 శాతానికి పైగా వాటా చైనాదే.

రాజ్యాంగ విధ్వంసకారి కాంగ్రెస్

ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
- ఆ పార్టీ ఓటు బ్యాంకు అనే వైరస్‌ను వ్యాప్తి చేసింది
- కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలతో సామాన్య ముస్లింలు నష్టపోయారు
- ముస్లింలపై అభిమానం ఉంటే కాంగ్రెస్ అధ్యక్ష పదవి ముస్లింకు ఇవ్వాలి



హిసార్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. రాజ్యాంగ విధ్వంసకారిగా కాంగ్రెస్ మారిపోయిందంటూ ధ్వజమెత్తారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను రెండో తరగతి పౌరులుగా మార్చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్ల సాధారణ ముస్లింలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఘోరంగా అవమానించిందని మండిపడ్డారు. సోమవారం హరియాణా రాష్ట్రం హిసార్‌లోని మహారాజా అగ్రసేన్ ఎయిర్‌పోర్టులో నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం హిసార్–అయోధ్య మధ్య తొలి కమర్షియల్ విమానాన్ని ప్రారంభించారు. అలాగే యమునానగర్ జిల్లాలోని దీనబంధు చోటూ రామ్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల అల్ట్రా–క్రిటికల్ మోడ్రన్ థర్మల్ పవర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. రెండుచోట్లా సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రమాదంలో పడ్డప్పుడల్లా రాజ్యాంగాన్ని అణచివేశారని చెప్పారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే...

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను విస్మరించిన కాంగ్రెస్

''దేశంలో నేడు దురదృష్టం ఏమిటో చూడండి. రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వ్యక్తులే నేడు అదే రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని రాజ్యాంగం చెబుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆయా వర్గాలను విస్మరించాయి. సమాజంలో సమానత్వం రావాలని అంబేడ్కర్ ఆశించారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు అనే వైరస్‌ను వ్యాప్తి చేసింది. పవిత్రమైన రాజ్యాంగాన్ని కేవలం అధికారం కోసం ఆయుధంగా వాడుకుంది. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో మంచినీరు ఆ పార్టీ నాయకుల స్విమ్మింగ్ పూల్స్‌కు చేరింది కానీ గ్రామాలకు చేరుకోలేదు. స్వాతంత్య్రం వచ్చి70 ఏళ్లు గడిచినా గ్రామాల్లో 16% ఇళ్లకు కూడా కుళాయి నీరు రాలేదు. కాంగ్రెస్ విధానాల వల్ల నష్టపోయింది ఎవరు? ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు కాదా? మా ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలకు తాగునీరు అందించడంపై దృష్టి పెట్టాం. గత ఏడేళ్లలో 12 కోట్ల కుళాయి నీటి కనెక్షన్లు ఇచ్చాం. దేశంలో ప్రస్తుతం 80% ఇళ్లకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. మిగతా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడం తథ్యం. కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నాం.

హవాయి చెప్పులు ధరించేవారు కూడా విమానాల్లో ప్రయాణించేలా చేయాలన్నదే మా లక్ష్యం. అది ఇప్పుడిప్పుడే సాకారం అవుతోంది. గత పదేళ్లలో కోట్లాది మంది ప్రజలు తొలిసారిగా విమాన ప్రయాణం చేశారు. గతంలో సరైన రైల్వేస్టేషన్లు లేనిచోట కూడా ఇప్పుడు ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నాం. 2014 కంటే ముందు దేశంలో 74 ఎయిర్‌పోర్టులు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 150కు చేరింది. మన ఎయిర్‌లైన్ సంస్థలు 2,000 కొత్త విమానాల కోసం ఆర్డర్ ఇచ్చాయి. కొత్త విమానాలతో ఎన్నో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. పరుగు ఆపని అభివృద్ధి, వేగవంతమైన అభివృద్ధి.. ఇదే బీజేపీ ప్రభుత్వాల మంత్రం. పేదలు, గిరిజనులు, మహిళల జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నదే మా ధ్యేయం. మా ప్రతి నిర్ణయం, ప్రతి విధానం అంబేడ్కర్‌కే అంకితం. సామాజిక న్యాయంపై కాంగ్రెస్ పెద్దపెద్ద మాటలు చెబుతోంది. కానీ, అంబేడ్కర్‌కు, చౌదరి చరణ్‌సింగ్‌కు కాంగ్రెస్ భారతరత్న పురస్కారాలు ఇవ్వలేదన్న సంగతి మనం మర్చిపోవద్దు. అంబేడ్కర్‌కు మరణానంతరం భారతరత్న దక్కిందంటే అందుకు కారణం బీజేపీ. చౌదరి చరణ్‌సింగ్‌కు బీజేపీ ప్రభుత్వమే భారతరత్న ఇచ్చింది. అంబేడ్కర్ జయంతి చాలా ముఖ్యమైన రోజు. ఇది మనందరికీ రెండో దీపావళి.

మతం ఆధారంగా రిజర్వేషన్లా?

2013 చివర్లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి హడావుడిగా సవరణలు తీసుకొచ్చింది. ఎన్నికల్లో ఓట్ల కోసమే కుతంత్రాలకు పాల్పడింది. రాజ్యాంగాన్ని ధిక్కరించి మరీ వక్ఫ్ చట్టంలో సవరణలు చేశారు. ఇది అంబేడ్కర్‌ను అవమానించడం కాదా? ఓటు బ్యాంకు కోసం ఆరాటపడింది ఎవరు? ముస్లింలపై కాంగ్రెస్‌కు నిజంగా అభిమానం ఉంటే ఆ పార్టీ అధినేతగా ముస్లింను నియమించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి 50 శాతం టికెట్లు ముస్లింలకే ఇవ్వాలి. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయదు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొద్దని అంబేడ్కర్ చెప్పారు. రాజ్యాంగం సైతం ఇలాంటి రిజర్వేషన్లపై నిషేధం విధించింది. కానీ, కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రభుత్వ టెండర్లలో మతం ఆధారంగా రిజర్వేషన్లు తీసుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కొల్లగొడుతున్నారు.

లూటీని ఆపడానికే వక్ఫ్‌చట్టం

దేశంలో వక్ఫ్ బోర్డులకు లక్షల ఎకరాల భూమి ఉన్నాయి. అవి పేద ముస్లింలకు, మహిళలకు, చిన్నారుల అభివృద్ధి కోసం ఉపయోగపడాలి. ఆ భూములను సక్రమంగా ఉపయోగించుకొని ఉంటే నేడు ముస్లిం యువత టైర్ల పంక్చర్ దుకాణాల్లో పనిచేయాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. వక్ఫ్ భూములు కేవలం భూమాఫియాకే ఉపయోగపడుతున్నాయి. పేద ముస్లింలకు ఒరిగిందేమీ లేదు. దళితులు, వెనుకబడివర్గాలు, ఆదివాసీలు, వితంతువులను భూ మాఫియా లూటీ చేసింది. ఈ లూటీని ఆపడానికే వక్ఫ్(సవరణ) చట్టం తీసుకొచ్చాం. ఆదివాసీల భూములు, ఆస్తులను ఇకపై వక్ఫ్ బోర్డు తాకను కూడా తాకలేదు. వక్ఫ్ స్ఫూర్తిని మేము గౌరవిస్తున్నాం. ముస్లిం మహిళలు, పేదలు, చిన్నారుల హక్కులకు ఎప్పటికీ రక్షణ లభించే ఏర్పాటు చేశాం. ఇదే అసలైన సామాజిక న్యాయం''' అని మోదీ ఉద్ఘాటించారు.

చైనా స్మార్ట్‌ఫోన్లపై సుంకాలు

ఎలక్ట్రానిక్స్‌పై కూడా: ట్రంప్ • మినహాయింపు లేదని వెల్లడి

వాషింగ్టన్: ప్రతీకార సుంకాలు విధించినా, నేరుగా బెదిరించినా చైనా దారికి రాకపోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడుతున్నారు. ఆ దేశంపై మరింతగా కత్తులు నూరుతున్నారు. చైనా స్మార్ట్ ఫోన్లతో పాటు ఆ దేశ ఎలక్ట్రానిక్ వస్తువులపై సుంకాలు విధించనున్నట్టు ఆయన తాజాగా ప్రకటించారు. అవి ఎంత శాతమన్నది సోమవారం వెల్లడిస్తానని తెలిపారు. ''ఎలక్ట్రానిక్ వస్తువులకు నేను ప్రకటించిన సుంకాలమినహాయింపు చైనాకు వర్తించబోదు. వాటిపై కేవలం సుంకాల శాతం మార్పుచేర్పులు చేయబోతున్నామంతే'' అని ఆదివారం ట్రంప్ వెల్లడించారు. ''చైనా ఎలక్ట్రానిక్ వస్తువులకు సెమీ కండక్టర్ టారిఫ్‌లు వర్తించవచ్చని వాణిజ్య మంత్రి హొవార్డ్ లెట్నిక్ చెప్పుకొచ్చారు. అమెరికాకు అవసరమైన ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఔషధాలు.. ఇలా అన్ని వస్తువులూ దేశీయంగానే తయారు కావాలన్నది అధ్యక్షుని ఆలోచన అన్నారు. స్మార్ట్‌ఫోన్లతో పాటు చైనా నుంచి దిగుమతయ్యే అన్నిరకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులనూ ఆ దేశంపై విధించిన 145 శాతం టారిఫ్ నుంచి మినహాయిస్తున్నట్టు అమెరికా కస్టమ్స్ విభాగం శనివారం నోటీసులో వెల్లడించడం తెలిసిందే. ఈ అంశంపై రెండు రోజుల్లోనే ట్రంప్ పిల్లిమొగ్గ వేశారు. ఆ నోటీసు వాస్తవం కాదంటూ సొంత సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌సోషల్‌లో పోస్టు పెట్టారు. అమెరికాకు ఎలక్ట్రానిక్స్ వస్తువుల సరఫరాపై త్వరలో నేషనల్ సెక్యూరిటీ టారిఫ్స్ ఇన్వెస్టిగేషన్స్ భేటీలో కూలంకషంగా చర్చిస్తామని చెప్పుకొచ్చారు.

డీఐఈ చీఫ్ నీలా రాజేంద్రకు
నాసా ఉద్వాసన

- కాపాడేందుకు చివరిదాకా ప్రయత్నం
- ట్రంప్ నిబంధనలతో విధి లేక వేటు
- ఆమె సేవలు ఎనలేనివంటూ ప్రశంస

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా డీఈఐ విభాగం చీఫ్ నీలా రాజేంద్ర ఉద్వాసనకు గురయ్యారు. డీఈఐ వంటి ఫెడరల్ ఏజెన్సీలను రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఇందుకు కారణమైంది. భారత మూలాలున్న నీలా రాజేంద్రకు అత్యంత ప్రతిభావంతురాలిగా పేరుంది. ఆమెను ఎలాగైనా అట్టిపెట్టుకునేందుకు నాసా చివరిదాకా విఫలయత్నం చేసింది. అందులో భాగంగా నీలను జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ విభాగం డీఈఐ పదవి నుంచి తప్పించడమే గాక ఆమె హోదాను 'టీమ్ ఎక్సలెన్స్ అండ్ ఎంప్లాయీ సక్సెస్ (టీఈఈఎస్)'విభాగం చీఫ్‌గా మార్చేసింది. నీల కెరీర్ ప్రొఫైల్ నుంచి డీఈఐ బాధ్యతల నిర్వహణ తాలూకు రికార్డులను పూర్తిగా తొలగించింది. అయినా లాభం లేకపోయింది. ''నీల ఇకపై మనతో పాటు పనిచేయబోరు. ఎంతో ఆవేదన నడుమ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది''అని జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ విభాగం డైరెక్టర్ లారీ లేసిన్ వెల్లడించారు. ''నాసాకు నీల ఎనలేని సేవలందించారు. తన పనితీరుతో చెరగని ముద్ర వేశారు. అందుకు సంస్థ ఆమెకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది. తనకు అంతా మంచే జరగాలని ఆశిస్తున్నాం''అని సంస్థ సిబ్బందికి రాసిన ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. టీఈఈఎస్‌ను మానవ వనరుల విభాగంలో విలీనం చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో మరికొందరు ఉద్యోగులకు ఉద్వాసన తప్పదనేందుకు ఇది సంకేతమని భావిస్తున్నారు.



ఏమిటీ డీఈఐ

డీఈఐ అంటే డైవర్సిటీ, ఈక్విటీ, ఇంక్లూజన్. అమెరికాలోని జాతి, భాషాపరమైన మైనారిటీలు తదితరులకు ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించడం దీని ఉద్దేశం. ఈ పథకం అమెరికన్లలో జాతి ఆధారంగా విభజనకు, వివక్షకు కారణమవుతోందని ట్రంప్ చాలాకాలంగా ఆరోపిస్తూ వచ్చారు. రెండోసారి అధ్యక్షుడు కాగానే ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలన్నింట్లోనూ డీఈఐ విభాగాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు 2024లోనే బడ్జెట్ పరిమితులు, డీఈఐ నిబంధనల కారణంగా పలు విభాగాలకు చెందిన 900 మంది ఉద్యోగులను నాసా తొలగించాల్సి వచ్చింది. ఆ నిర్ణయంపై తీవ్ర దుమారం రేగింది కూడా. అయినా నీలను మాత్రం అప్పట్లో సంస్థ అట్టిపెట్టుకుంది. ట్రంప్ సర్కారు తాజా ఉత్తర్వులతో ఇప్పుడామెను తొలగించక తప్పలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అంబేడ్కర్‌కు బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ శత్రువులు: ఖర్గే

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై ఎటువంటి అభిమానం లేదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మోదీ ప్రభుత్వం అంబేడ్కర్ కృషిని ప్రశంసించడం కేవలం మాటలకే పరిమితమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రభుత్వం చేసిందేమీ లేదని విరుచుకుపడ్డారు. వాస్తవానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు అంబేడ్కర్‌కు శత్రువులని ధ్వజమెత్తారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందంటూ ప్రధాని మోదీ చేస్తున్న ఆరోపణలపై ఆయన ఈ మేరకు స్పందించారు. 1952 ఎన్నికల్లో తన ఓటమికి కమ్యూనిస్ట్ నేత ఎస్ఏ డాంగే, హిందుత్వ వాది వీడీ సావర్కర్‌లే కారణమంటూ బీఆర్ అంబేడ్కర్ రాసిన ఒక లేఖను ఈ సందర్భంగా ఖర్గే మీడియాకు చూపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం దక్కేలా డాక్టర్ అంబేడ్కర్ పౌరులకు రాజ్యాంగాన్ని కానుకగా ఇచ్చారని కొనియాడారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా ఎస్సీ,ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కులగణనను వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వం పథకాలను అమలు చేసేందుకు ఇప్పటికీ 2011 జనగణనే ఆధారంగా చేసుకుంటోందని తెలిపారు. 2021లో చేపట్టాల్సిన జనగణన ప్రస్తావనను ప్రభుత్వం తేవడం లేదన్నారు. జనగణన, కులగణనను చేపట్టి సమాజంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేయాలన్నారు.

మెహుల్ చోక్సీ అరెస్టు

- బెల్జియంలో అదుపులోకి తీసుకున్న అక్కడి పోలీసులు
- స్వదేశానికి తీసుకురావడానికి త్వరలో బెల్జియం వెళ్లనున్న సీబీఐ, ఈడీ అధికారులు
- రూ.13,850 కోట్ల రుణ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న చోక్సీ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు రుణ కుంభకోణం కేసులో పరారీలో ఉన్న ప్రముఖ వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బెల్జియంలో అరెస్టయ్యాడు. భారత దర్యాప్తు అధికారుల విజ్ఞప్తి మేరకు బెల్జియం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.13,850 కోట్ల రుణాలు తీసుకొని, తిరిగి చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టినట్లు మెహుల్ చోక్సీపై అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. ఈ నెల 12వ తేదీన చోక్సీ అరెస్టయినట్లు బెల్జియన్ ఫెడరల్ పబ్లిక్ సర్వీసు ఆఫ్ జస్టిస్ నిర్ధారించింది. అతడికి న్యాయ సహాయం అందిస్తామని వెల్లడించింది. చోక్సీ విషయంలో చట్టప్రకారం వ్యవహరించనున్నట్లు స్పష్టంచేసింది. రుణ కుంభకోణం కేసులో విచారణ కోసం అతడిని తమకు అప్పగించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కోరుతున్నాయి. బెల్జియం ప్రభుత్వ అనుమతితో చోక్సీని స్వదేశానికి తీసుకురావడానికి సీబీఐ, ఈడీ అధికారులు త్వరలో బెల్జియం వెళ్లనున్నట్లు తెలిసింది.

స్విట్జర్లాండ్‌కు పారిపోయే యత్నం

65 ఏళ్ల మెహుల్ చోక్సీ 2018లో ఇండియా నుంచి పరారయ్యాడు. తొలుత కరీబియన్ దేశమైన ఆంటిగ్వాకు చేరుకున్నాడు. ఆంటిగ్వా పౌరసత్వం సంపాదించాడు. భారత పౌరసత్వం రద్దు కాలేదు. వైద్య చికిత్స కోసం 2023 నవంబర్‌లో బెల్జియం వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. రెసిడెన్సీ కార్డు సైతం పొందాడు. భారత దర్యాప్తు అధికారులు తనకోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలుసుకొని బెల్జియం నుంచి స్విట్జర్లాండ్‌కు పారిపోయే ప్రయత్నంలో పోలీసులకు దొరికిపోయినట్లు సమాచారం. చోక్సీపై ఇంటర్‌పోల్ గతంలో రెడ్ నోటీసు జారీ చేసింది. ప్రపంచంలో అతడు ఎక్కడున్నా అరెస్టు చేయాలని ఆదేశించింది. తర్వాత ఆ నోటీసును రద్దుచేసింది. ఇదిలా ఉండగా, భారత్, బెల్జియం మధ్య నేరగాళ్ల అప్పగింత ఒప్పందం చాలా ఏళ్లుగా అమల్లో ఉంది. కాబట్టి చోక్సీని వెనక్కి తీసుకురావడం సులభమేనని అధికారులు చెబుతున్నారు. బ్యాంకును మోసగించి విదేశాలకు పరారైన చోక్సీపై ముంబై ప్రత్యేక కోర్టు 2018, 2021లో అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ విషయం భారత అధికారులు బెల్జియం అధికారులకు చేరవేశారు. క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతున్న చోక్సీ కోర్టు నుంచి బెయిల్ కోరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఏమిటీ కేసు?

పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.13,850 కోట్ల మేర మోసగించిన ఘటనలో మెహుల్ చోక్సీతో ఆయన మేనల్లుడు నీరవ్ మోదీ, ఇతర కుటుంబ సభ్యులు, వారి కంపెనీల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులపై 2018లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌస్ బ్రాంచ్ నుంచి రుణాలు తీసుకొని, తిరిగి చెల్లించకుండా ఎగవేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో సీబీఐ రెండు చార్జిషీట్లు, ఈడీ మూడు చార్జిషీట్లు కోర్టులో దాఖలు చేశాయి. పీఎన్‌బీ సిబ్బంది సాయంతో ఎల్ఓయూ(లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్), ఎఫ్ఎల్‌సీ(ఫారిన్ లెటర్ ఆఫ్ క్రెడిట్) మోసపూరితంగా సొంతం చేసుకొని, వాటిని హామీగా చూపించి విదేశాల్లోని భారతీయ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఈ కేసులో చోక్సీకి సంబంధించిన రూ.2,565.90 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. చోక్సీని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా గుర్తించింది.

రూ.1,800 కోట్ల డ్రగ్స్ పట్టివేత

- సముద్రంలో విసిరేసి పరారైన పాక్ స్మగ్లర్లు
- స్వాధీనం చేసుకున్న గుజరాత్ కోస్ట్‌గార్డ్

అహ్మదాబాద్: గుజరాత్ తీరంలో మాదకద్రవ్యాలను అక్రమంగా తీసుకువచ్చే పాకిస్తాన్ స్మగ్లర్ల ఆటకట్టింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ బృందం(ఏటీఎస్), తీర రక్షక దళం(ఐసీజీ) సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రూ.1,800 కోట్ల విలువైన 300 కిలోల మెథాంఫెటమైన్ అనే సింథటిక్ డ్రగ్ పట్టుబడింది. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి దాటాక అరేబియా సముద్రంలో ఘటన చోటుచేసుకుంది. ఫిదా అనే పేరున్న మాఫియా ముఠా చేపల పడవలో భారత జలాల్లోకి ప్రవేశించనుందంటూ ఏటీఎస్ అందించిన నిఘా సమాచారం మేరకు ఐసీజీ గస్తీని ముమ్మరం చేసింది. అంతర్జాతీయ సముద్ర జలాలకు అత్యంత సమీపంలో అర్ధరాత్రి సమయంలో ఐసీజీ గస్తీ ఓడను దూరం నుంచే గమనించిన స్మగ్లర్లు తమ బోటులో ఉన్న డ్రగ్స్ డ్రమ్ములను సముద్రంలో విసిరేశారు. వేగంగా అంతర్జాతీయ సముద్ర జలాల సరిహద్దుల వైపు వెళ్లిపోయారు. ఇదంతా వెంటవెంటనే జరిగిపోయింది. వారిని పట్టుకునేందుకు ఐసీజీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. కటిక చీకటిలోనే వారు విసిరేసిన డ్రగ్ పార్శిళ్లను ఐసీజీ, ఏటీఎస్ సిబ్బంది గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న 311 ప్యాకెట్లలో 311 కిలోల మెథాంఫెటమైన్‌ను పోర్బందర్ తీరానికి తరలించి, దర్యాప్తు చేపట్టామని ఐసీజీ తెలిపింది. ఈ ప్యాకెట్లను ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సీల్ వేసి ఉంచారని, సముద్ర జలాల్లో వేసినా అందులోని సరుకు పాడవదని ఏటీఎస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సునీల్ జోషి చెప్పారు. ఈ డ్రగ్స్ గమ్యస్థానం తమిళనాడని ఆయన వివరించారు. పాక్‌లోని పస్ని పోర్టు నుంచి బయలుదేరిన మాఫియా సభ్యులు సముద్ర జలాల్లోనే డ్రగ్స్‌ను మరో బోటులోకి మార్చి, ఆపైన తమిళనాడుకు చేరవేయాల్సి ఉందని ఆయన వెల్లడించారు. ఇటీవలి కాలంలో ఇటువంటి 13 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేసి, అక్రమార్కుల ఆటకట్టించామని వివరించారు. కాగా, ఐస్, క్రిస్టల్ మెథ్ అని కూడా పిలిచే మెథాంఫెటమైన్ చాలా శక్తివంతమైన డ్రగ్.

పొట్టలో రూ.7.85 కోట్ల కొకైన్

ముంబై: ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఉగాండా దేశస్తుడి పొట్టలో రూ.7.85 కోట్ల విలువుండే 785 గ్రాముల కొకైన్‌ను గుర్తించారు. ఈ నెల 9వ తేదీన రాత్రి ఓ విమానంలో వచ్చిన అతడిని అధికారులు అడ్డుకున్నారు. విచారణ సమయంలో అతడు ఆందోళనతో కనిపించడంతో కనిపించాడు. దీంతో, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేయించగా పొట్టలో టాబ్లెట్లు ఉన్నట్లు తేలింది.

అమెరికా–ఇరాన్ తదుపరి చర్చా వేదిక రోమ్

రోమ్: ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా–ఇరాన్ మధ్య తదుపరి చర్చలు శనివారం రోమ్‌లో జరగనున్నాయి. ఇరాన్, ఇటలీ అధికారులు ఈ విషయాన్ని సోమవారం ధ్రువీకరించాయి. చర్చలకు మధ్యవర్తిగా ఉన్న ఒమన్ నుంచి అందిన వినతి మేరకు అంగీకరించినట్లు ఇటలీ ప్రధాని ఆంటోనియో టజనీ తెలిపారు. ఒమన్ రాజధాని మస్కట్‌లో శనివారం రెండు దేశాల మధ్య మొదటి రౌండ్ చర్చలు జరగడం తెల్సిందే. కాగా, అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రఫేల్ మరియానో గ్రాస్సీ సోమవారం ఈ విషయమై ఒక ప్రకటన చేశారు. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చించేందుకు బుధవారం టెహ్రాన్ వెళ్తున్నట్లు ప్రకటించారు. తమ పరిశీలకుల బృందాన్ని అణు మౌలిక వసతులను సందర్శించేందుకు వీలు కల్పించాలని ఇరాన్ ప్రభుత్వాన్ని కోరే అవకాశముందని సమాచారం.

మనోళ్లపై మరో పిడుగు

ఈబీ–5 కటాఫ్ ఆర్నెల్లు తగ్గింపు

ట్రంప్ సర్కారు భారతీయులను నానాటికీ మరింతగా లక్ష్యం చేసుకుంటోంది. వారిని వేధించేలా రోజుకో తరహా నిబంధనలు తీసుకొస్తోంది. హెచ్–1బీ వీసాలు, గ్రీన్‌కార్డులు ఆశావహుల కలలపై నీళ్లు చల్లేలా తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ ఫిఫ్త్ ప్రిఫరెన్స్ (ఈబీ–5) అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ కింద వాటికోసం దరఖాస్తు చేసుకునేందుకు కటాఫ్‌ను ఆర్నెల్ల పాటు తగ్గించింది. దాన్ని 2019 నవంబర్ 1 నుంచి 2019 మే 1కి మార్చింది. ఈబీ–5 కేటగిరీలో భారతీయుల నుంచి డిమాండ్ అధికంగా ఉందన్న సాకుతో ఈ నిర్ణయం తీసుకుంది. మే నెలకు సంబంధించి విడుదల చేసిన వీసా బులెటిన్‌లో అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ఈ మేరకు పేర్కొంది. దాంతో చాలామంది భారతీయులు ఈబీ–5 కేటగిరీ కింద దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులుగా మారారు! నెలవారీ బులెటిన్‌లో విదేశాంగ శాఖ పేర్కొనే 'తుది కార్యాచరణ తేదీ'లు చాలా కీలకం. వీసా/గ్రీన్‌కార్డు దరఖాస్తును ప్రాసెసింగ్ నిమిత్తం యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) పరిగణనలోకి తీసుకోవాలంటే అవి బులెటిన్‌లో పేర్కొన్న తేదీ కంటే ముందువి అయ్యుండాలి. చైనాకు మాత్రం ఈబీ–5 కటాఫ్‌ను మార్చకపోవడం విశేషం.

ఏమిటీ ఈబీ–5 కేటగిరీ?

అర్హులైన వలస ఇన్వెస్టర్లకు అమెరికాలోని గ్రామీణ, హెచ్చు నిరుద్యోగ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పించేందుకు ఈబీ–5 కేటగిరీని అమెరికా తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా అన్ రిజర్వ్‌డ్ విభాగం కింద దరఖాస్తు చేస్తున్న భారతీయుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. దాంతో అందుబాటులో ఉండే వీసాల తగ్గిపోతోంది. భారతీయులకు ఈబీ–5 కటాఫ్ తగ్గింపు వల్ల అర్హుల జాబితా నుంచి చాలామంది గల్లంతవుతారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



వ్యక్తిగత ఖాతాల పైనా..
కేవలం కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ-ప్రైవేట్ సంస్థలకు మాత్రమే పరిమితమైన ర్యాన్సమ్ వేర్ ఎటాక్స్ ప్రస్తుతం వ్యక్తిగత ఖాతాల పైనా జరుగుతున్నాయి. -8లో



కొత్త శిఖరాలకు.. కో-వర్కింగ్..
వేర్వేరు కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు ఒకే చోట ఆఫీసులు ఏర్పాటు చేసుకోవడమనే కో- వర్కింగ్ స్పేస్ కాన్సెప్ట్ నగరంలో విజృంభిస్తోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.0/25.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ముందుకు సాగుదాం: కమిషనర్



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఇలంబర్తి

లక్డీకాపూల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, వేణుగోపాల్, యాదగిరి రావు, సీఈ రత్నాకర్, ఏఎంసీ జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపై కేసు

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. మూడు రోజుల క్రితమే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు కాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విజన్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్ ద్వారా అరుంధతి ఆసుపత్రికి 40 మంది సిబ్బందిని ఒప్పందం ద్వారా నియమించారు. అందుకు రూ. 50 లక్షల అగ్రిమెంటు చేసుకున్నారు. కొన్ని కారణాల వల్ల భేదాభిప్రాయాలు రావడంతో వివిధ దఫాలుగా రూ. 30 లక్షలు చెల్లించి మిగిలిన రూ.20 లక్షలు ఇవ్వడం లేదని ఈ నెల 11న ఏసుబాబు అనే వ్యక్తి పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేసి అనంతరం చర్యలు చేపట్టనున్నట్లు సీఐ విజయవర్ధన్ తెలిపారు. కాగా.. తమ ఆస్పత్రి మ్యాన్‌పవర్ సప్లయ్‌కి సంబంధించిన కేసులో మైనంపల్లి హన్మంతరావు హస్తం ఉందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. తప్పుడు కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటానని ఆయన తెలిపారు.

విమానంలో వృద్ధుడికి అత్యవసర పరిస్థితి.. ఆదుకున్న సిటీ డాక్టర్



డా. ప్రీతిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: విమాన ప్రయాణంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడిని నగరానికి చెందిన వైద్యురాలు అత్యవసర వైద్య సేవలతో కోలుకునేలా చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకోగా.. సోమవారం వెలుగు చూసింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న 74 ఏళ్ల ఒంటరి వృద్ధుడికి అకస్మాత్తుగా మగతలోకి జారుకుని, నోటి నుంచి నురగ వచ్చింది. అదే విమానంలో ప్రయాణిస్తున్న నగరంలోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠం జనరల్ ఫిజీషియన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతి రెడ్డి వెంటనే స్పందించారు. ఆయన పల్స్ బలహీనంగా ఉందని, బీపీ తక్కువగా ఉందని గుర్తించారు. అత్యవసరంగా సీపీఆర్ చేయడంతో సదరు ప్రయాణికుడు కొన్ని నిమిషాల్లో స్పృహలోకి వచ్చారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ సిబ్బంది సహకారంతో ఆ వృద్ధుడిని క్షేమంగా గమ్యానికి చేర్చారు. సకాలంలో స్పందించి వృత్తి పరమైన నిబద్ధతను ప్రదర్శించిన డా.ప్రీతిరెడ్డిని ప్రయాణికులు అభినందించారు.





జోహార్.. అంబేడ్కర్!

భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం నగరంలో వైభవంగా జరిగాయి. హుస్సేన్ సాగర్ తీరంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉత్సవ కోలాహలం నెలకొంది. ఇక్కడే తలపెట్టిన అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంది.

ఆర్టీఏపై విజి‘లెన్స్’

పౌర సేవలు, రవాణా కార్యకలాపాల అమలుపై నిఘా

- డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్‌లు, రిజిస్ట్రేషన్లలో ఏజెంట్ల ప్రమేయం
- ఫీజులు, వాహనదారులపై అదనపు భారం వంటి అంశాలపై దృష్టి
- సమగ్ర దర్యాప్తు అనంతరం ప్రభుత్వానికి నివేదిక



సాక్షి, సిటీబ్యూరో:

ఆర్టీఏపై నిఘా విభాగం దృష్టి సారించింది. పౌరసేవల్లో ఏజెంట్ల ప్రమేయం, రవాణా కార్యకలాపాల్లో అవినీతి, వాహనాల అమ్మకాల్లో ఆటోమొబైల్ డీలర్ల మాయాజాలం తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ పరీక్షలు, వాహనాల యాజమాన్య బదిలీలు వంటి వివిధ రకాల కార్యకలాపాల్లో దళారుల జోక్యం పెరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో పౌర సేవలు అమలు తీరుతెన్నులను పరిశీలించి నివేదికను రూపొందించనున్నారు.

సేవల్లో కొరవడిన పారదర్శకత..

రవాణాశాఖ అందజేసే వివిధ రకాల సేవల్లో సుమారు 20 పౌరసేవలను వినియోగదారులు ఆన్‌లైన్‌లో నేరుగా పొందవచ్చు. వాహనదారులు నేరుగా కార్యాలయాలకు వెళితే మాత్రమే లభించే పౌరసేవల్లోనూ ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకోవడంతో పాటు ఫీజుల చెల్లింపును కూడా ఆన్‌లైన్‌కు పరిమితం చేశారు. అయినప్పటికీ చాలా చోట్ల వాహనదారులకు పారదర్శకమైన సేవలు లభించడం లేదు. దళారుల ద్వారా వచ్చే వారికి మాత్రమే అన్ని సేవలు అందుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని కార్యాలయాల్లో మాత్రం స్వయంగా సంప్రదించే వాహనదారులకు ప్రాధాన్యతనిచ్చి సేవలను అందజేస్తున్నారు. కానీ మెజారిటీ కార్యాలయాల్లో మాత్రం ప్రభుత్వానికి చెల్లించే ఫీజుల కంటే రెట్టింపు మొత్తంలో సమర్పించుకొంటే తప్ప పనులు కావడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే విజిలెన్స్ విచారణ అనివార్యంగా మారినట్లు ఓ అధికారి వివరించారు.

అసిస్టెంట్లదే రాజ్యం..

మరోవైపు కొన్ని ఆర్టీఓ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు ప్రైవేట్ వ్యక్తులను అసిస్టెంట్లుగా ఏర్పాటు చేసుకొని తాము చేయాల్సిన పనులను అసిస్టెంట్లకు అప్పగిస్తున్నారు. ఉదయం 11 గంటల తర్వాత తాపీగా విధులకు హాజరవుతారు.ఈ క్రమంలో అసిస్టెంట్‌లే సదరు ఉద్యోగి నిర్వర్తించాల్సిన విధులను నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్లు అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మొదలుకొని సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు కొందరు అసిస్టెంట్ల సేవలను వినియోగించుకుంటున్నట్లు సమాచారం. ఈ ప్రైవేట్ సిబ్బంది వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందజేయడం గమనార్హం.

ఫిట్‘లెస్’...

రవాణా వాహనాల ఫిట్‌నెస్‌లలోనూ చేతివాటం షరామామూలే. లారీలు, బస్సులు, వ్యాన్‌లు, తదితర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు వాహనదారులు పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సి వస్తోంది. అధికారులు అడిగినంత అప్పగిస్తే ఎలాంటి వాహనాలకైనా ఫిట్‌నెస్‌లు లభిస్తాయి. స్కూల్ బస్సులు మొదలుకొని అన్ని రకాల వాహనాల్లో వాటి కేటరిగిరీ అనుగుణంగా ధరలు నిర్ణయిస్తారు. కొన్ని శివారు ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతిరోజు వందలాది వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తారు.ఈ క్రమంలో కొందరు ఎంవీఐలు డొక్కు బండ్లకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నట్లు ఫిర్యాదులు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డెక్కితే బాదుడే..

సాధారణంగా ఎంవీఐలు తమకు విధించిన రెవెన్యూ టార్గెట్‌లను భర్తీ చేసేందుకు విస్తృతంగా వాహన తనిఖీలను నిర్వహిస్తారు. నిబంధనలు పాటించకుండా తిరిగే వాటిపైన కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తారు. ఫీజు చెల్లించని వాహనాలపై కేసులు నమోదు చేసి జప్తు చేస్తారు. ఈ క్రమంలో కొందరు ఎంవీఐలు స్వామికార్యాన్ని, స్వకార్యాన్ని చక్కబెట్టుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. నిబంధనల మేరకు ఫీజులు చెల్లించని వాహనాలపై కేసులు నమోదు చేసే నెపంతో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఎల్‌బీనగర్, ఉప్పల్, హయత్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన వాహనదారులు పేర్కొంటున్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి నగరానికి ప్రయాణికులను చేరవేసే టాటాఏస్‌లు, తుఫాన్, మినీబస్సులు, మ్యాక్సీక్యాబ్‌లు, తదతర వాహనాలను లక్ష్యంగా చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఒక తుఫాన్ వాహన డ్రైవర్ విస్మయం వ్యక్తం చేశారు.సదరు ఎంవీఐ అడిగినంత సమర్పించుకుంటే తప్పుడు కేసులు పెట్టి వాహనాలను జప్తు చేస్తాడనే భయంతో అడిగినంత ముట్టజెప్పాల్సి వస్తోందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు ఔటర్ పరిధిలో ఎక్కడైనా తనిఖీలు చేయవచ్చు. ఈ మేరకు కొన్ని చోట్ల వాహన తనిఖీలు అధికారులకు ఇష్టారాజ్యంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

డీలర్ల మాయాజాలం..

ఆటోమొబైల్ షోరూమ్‌లలో వాహన డీలర్లు సైతం నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. కొత్త వాహనాలపై హ్యాండ్లింగ్ చార్జీల పేరిట రూ.వేలల్లో అక్రమ వసూళ్లకు దిగుతున్నారు.దీంతో ఆన్‌రోడ్డు ధరల కంటే ఎక్కువ మొత్తంలో చెల్లించుకోవాల్సివస్తోంది. ద్విచక్ర వాహనాలకు రూ.5000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తుండగా, కార్లపైన హ్యాండ్లింగ్ చార్జీల రూపంలో రూ.25000 వరకు వసూలు చేయడం గమనార్హం, ఇలాంటి డీలర్‌లపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే కొనుగోలుదారులు దారుణంగా మోసపోతున్నారు.



రాంగ్.. రైడ్!

మూడు కమిషనరేట్ల పరిధిలో రాంగ్ సైడ్ డ్రైవింగ్

తొలి మూడు నెలల్లో కేసులు ఇలా..

కమిషనరేట్	కేసులు
సైబరాబాద్	2,17,000
హైదరాబాద్	1,62,000
రాచకొండ	53,824

- ఈ ఏడాది మార్చి వరకు 4,32,824 కేసులు నమోదు
- సైబరాబాద్‌లో ఫలితాలిచ్చిన కొన్ని ప్రయోగాలు
- సిటీలోనూ అమలు చేసే దిశగా అధికారుల అడుగులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిరోజూ 4,809.. వారానికి 33,664.. నెలకు 1,44,270.. మూడు నెలల్లో 4,32,824.. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో నమోదైన రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసుల సంఖ్య ఇది. అత్యంత ప్రమాదకర ఉల్లంఘనల్లో ఒకటైన రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఏటా అనేక మంది ప్రాణాలు తీస్తోంది. మరెందరినో క్షతగాత్రులుగా మారుస్తోంది. అయినప్పటికీ వాహన చోదకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావట్లేదు. ఈ సమస్య తీవ్రంగా ఉన్న సైబరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న కీలక చర్యలు ఫలితాలు ఇచ్చాయి. దీంతో నగరంలోనూ అలాంటి పంథా అనుసరించడానికి ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ అధ్యయనం చేస్తున్నారు. నగరంలో ఈ ఏడాది మార్చి వరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల 37 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

ఉల్లంఘనల్లో మూడు రకాలు..

రహదారి భద్రతకు సంబంధించిన నిబంధనల్ని అమలు చేస్తూ, మోటారు వాహనాల చట్టాన్ని అమలు చేసే ట్రాఫిక్ విభాగం అధికారులు ఉల్లంఘనులకు చెక్ చెబుతుంటారు. క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు వాహన చోదకులు పాల్పడే 39 రకాలైన ఉల్లంఘనలపై దృష్టి పెట్టి ఈ- చలాన్లు జారీ చేస్తుంటారు. ఈ ఉల్లంఘనల్ని అధికారులు ముఖ్యంగా మూడు రకాలుగా విభజిస్తుంటారు. వాహనం నడిపే వ్యక్తికి ప్రమాదహేతువైనవి మొదటి కేటగిరీలో, ఎదుటి వ్యక్తిని ప్రమాద హేతువైనవి రెండో కేటగిరీలో ఉంటాయి. వాహనం నడిపే వ్యక్తితో పాటు ఎదుటి వారికీ ముప్పు తెచ్చే వాటిని అత్యంత ప్రమాకరమైనవిగా మూడో కేటగిరీలో చేరుస్తారు. ఈ కేటగిరీలోకే వచ్చే రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను కట్టడి చేయడానికి కీలక ప్రాధాన్యమిస్తుంటారు.

ఈ కారణాలతోనే అత్యధిక ఉల్లంఘనలు..

రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఉల్లంఘనలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. చౌరస్తాలు కేంద్రంగా జరుగుతున్న భారీ ట్రాఫిక్ జామ్స్‌కు చెక్ చెప్పడానికి ట్రాఫిక్ విభాగం అధికారులు రాజధానిలోని అనేక ప్రాంతాల్లో జంక్షన్లను మూసేశారు. వీటికి కాస్త దూరంలో ‘యూటర్న్’ ఇచ్చారు. అక్కడి వరకు వెళ్లి వాహనాలను తిప్పుకొని రావడానికి నిర్లక్ష్యం వహిస్తున్న వాహనచోదకులు కొద్దిదూరం రాంగ్ రూట్‌లో వెళ్లడానికే ఆసక్తి చూపిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ఎక్కువగా ఉన్న చోట్ల, ప్రధాన రహదారులకు అటు-ఇటు కాలనీలు ఉండి, వాటి మధ్య ఎక్కడపడితే అక్కడి డివైడర్లలో గ్యాప్ లేని చోట్ల కూడా ఈ ఉల్లంఘనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.



కీలక చర్యలు తీసుకున్న జోయల్..



హైదరాబాద్ ట్రాఫిక్ విభాగానికి సంయుక్త పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న జోయల్ డెవిస్ కొన్ని రోజుల క్రితం వరకు సైబరాబాద్ ట్రాఫిక్ వింగ్‌కు నేతృత్వం వహించారు. అక్కడ రాంగ్ సైడ్ డ్రైవింగ్ నిరోధించడానికి కీలక చర్యలు తీసుకున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా అధ్యయనం చేయించిన జోయల్.. 270 పాయింట్లలో ఈ ఉల్లంఘనలు ఎక్కువగా జరుగుతున్నట్లు తేల్చారు. ఈ ఉల్లంఘనకు పాల్పడే వారిలో అత్యధికులు రిపీటెడ్ అఫెండర్లు ఉంటారు. దీంతో ఆ పాయింట్లలో మరుసటి రోజు సిబ్బందిని మోహరించి, ఈ-చలాన్ జరిమానా వసూలు చేయించారు. ఈ విధానం చాలా వరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను నిరోధించింది. ప్రస్తుతం సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా ఉన్న జోయల్ నగరంలోనూ ఇదే విధానం అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

ఏం జరిగేనో?

బీజేపీకి మద్దతు లభించేనా..

- పోలింగ్‌కు బీఆర్‌ఎస్ హాజరయ్యేనా?
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై ఊహాగానాలు



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఎన్నికకు సంబంధించి గతంలో ఎన్నడూ లేని విధంగా చర్చలు జరుగుతున్నాయి. అందుకు కారణం గెలిచేందుకు అవసరమైన ఓటర్ల సంఖ్యాబలం లేకపోయినప్పటికీ బీజేపీ బరిలో దిగడమే. ఎమ్మెల్సీని ఎన్నుకునేందుకు హైదరాబాద్ ‘స్థానిక’ కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఓటర్లుగా ఉన్నారు. ఆ లెక్కన మొత్తం ఓటర్లలో అత్యధికంగా 49 ఓట్లు ఎంఐఎంకు ఉన్నాయి. దాంతోపాటు కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధంతో ఆ పార్టీకి, దానికి మిత్రపక్షంగా ఉన్న టీజేఎస్‌కు చెందిన 14 ఓట్లు ఎంఐఎంకు లభించే అవకాశాలున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకొని పోటీ లేకుండా ఎన్నిక ఏకగ్రీవంగా జరగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావించినప్పటికీ, కమలం పార్టీ తమ అభ్యర్థిని బరిలో దింపింది. దీంతో బీజేపీ ఏ ధీమాతో, ఏ నమ్మకంతో పోటీలో నిలిచిందనేది ఇప్పుడు అందరి మదిలో ప్రశ్న తలెత్తుతోంది.

ఎవరికి ఎవరో..

మరో వైపు కాంగ్రెస్.. బీఆర్‌ఎస్.. బీజేపీ ఈ మూడూ దేనికవిగా మిగతా రెండూ కలిసి పని చేస్తున్నాయని ఎంతో కాలంగా ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నాయి. మిగతా రెండూ ఒకటేనని, తమ పార్టీ మాత్రమే వాటికి వ్యతిరేకంగా ప్రజల కోసం పని చేస్తోందని మూడు పార్టీల నేతలూ అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలో ఎవరికి ఎవరు మద్దతుగా నిలుస్తారో, ఎవరిని వ్యతిరేకిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అంత నమ్మకం లేనిదే బీజేపీ ఎందుకు పోటీలో ఉంటుందని, మిగతా పార్టీల నుంచి తగిన హామీ లభించి ఉండవచ్చని భావిస్తున్న వారూ ఉన్నారు. ఈ ఎన్నికను సైతం ఆయా పార్టీలు, ప్రజలు పార్టీలపరంగా చూస్తున్నప్పటికీ, పోటీలో ఉన్న అభ్యర్థులను కానీ.. ఓటర్ల జాబితాలో కానీ వారి పేర్లు, చిరునామాలు తప్ప ఏ పార్టీయో వెల్లడించరు. కనీసం ఏ డివిజన్ కార్పొరేటరో కూడా జాబితాలో ఉండదు. విప్ వంటివి వర్తించవు.

ఆత్మ ప్రబోధానుసారంగా?

- జీహెచ్‌ఎంసీ పాలకమండలిలో సైతం పార్టీ మారిన వారు ఒకే చోట కూర్చుంటారు తప్ప అధికారికంగా ఎలాంటి ఏర్పాట్లు చేయరు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు మాత్రమే పార్టీల వారీగా అభ్యర్థులను పేర్కొంటారు తప్ప.. తర్వాత పార్టీ మారినా అధికారికంగా దాన్ని ప్రకటించరు. పట్టించుకోరు. ఈ నేపథ్యంలో తమ పార్టీ అభ్యర్థికి కానీ, తమ పార్టీ అధిష్ఠానం సూచించిన వారికి కానీ కచ్చితంగా ఓటేయాల్సిన పరిస్థితి ఓటర్లకు లేదు. అందువల్లే బీజేపీ ధీమాగా ఉందని చెబుతున్నారు.
- అంతేకాదు.. ఇటీవల బీజేపీకి చెందిన కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎంను ఓడించాల్సిందిగా పిలుపునిచ్చారు. దీంతో అసలీ ఎన్నికలో ఏం జరగనుందో అంతుచిక్కడం లేదని కొందరు కార్పొరేటర్లు అంటున్నారు. క్రాస్ ఓటింగ్ జరిగినా గుర్తించలేరు. పార్టీలు సైతం ఫలానా వారికే ఓటేయాలని ఇంతవరకు చెప్పలేదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ వైఖరి ఏమిటో అంతుపట్టడం లేదు.
- బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదేపదే అంటున్నారు. కాంగ్రెస్ మద్దతు ఎంఐఎంకు ఉంది. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌కమిటీ ఎన్నికలోనూ అది వెల్లడైంది. కాబట్టి కాంగ్రెస్ మద్దతిచ్చే ఎంఐఎంకు బీఆర్‌ఎస్ సైతం మద్దతిస్తుందా, లేక పోలింగ్‌కు దూరంగా ఉంటుందా అన్నది తెలియడానికి ఇంకా సమయం పట్టనుంది. మరోవైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రలోభాల పర్వం కూడా ప్రారంభం కావచ్చని ఆశిస్తున్నవారూ ఉన్నారు. ప్రలోభాలను సైతం ఆత్మప్రబోధంగా చెబుతారని కార్పొరేటరొకరు వ్యాఖ్యానించారు. పార్టీల పరంగా చూస్తే బీఆర్‌ఎస్‌కు 24 ఓట్లు, బీజేపీకి 25 ఓట్ల బలం ఉంది.

ఎఫ్‌టీసీసీఐ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: దేశంలోనే అత్యంత డైనమిక్ ప్రాంతీయ చాంబర్‌లలో ఒకటైన తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) 108 ఏళ్ల ఫెడరేషన్ ప్రతిష్ఠాత్మక వార్షిక ఎక్సలెన్స్ అవార్డ్స్-2025కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 21 విభాగాల్లో నామినేషన్లను కోరుతోంది. పూర్తి చేసిన దరఖాస్తులను మే 10వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. జూన్ ఐదో తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్ సింఘాల్ ఎక్సలెన్సీ అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమ రంగంలో నాణ్యమైన ఉత్పత్తి, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధి, రాష్ట్ర జీడీపీకి గణనీయమైన సహకారం అందించిన సంస్థలకు ఈ అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ మాజీ అధ్యక్షుడు, ఎక్సలెన్స్ అవార్డ్స్ కమిటీ చైర్మన్ రమాకాంత్ ఇనానీ, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ఈ అవార్డులు అత్యంత విశ్వసనీయమైనవి, సంస్థాగత ధైర్యాన్ని పెంచుతాయని, నాణ్యత మెరుగుదలను ప్రోత్సహించడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. ఎక్సలెన్స్ అవార్డు కమిటీ సభ్యుడు, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ల మాట్లాడుతూ.. దరఖాస్తులను www.ftcciawards.in ద్వారా అవార్డులను ఆన్‌లైన్ పోర్టల్‌లో సమర్పించవచ్చని వివరించారు. ఎక్సలెన్స్ అవార్డు కమిటీ బ్యాంకింగ్ చైర్మన్ ప్రేమ్ చంద్ కంకారియా వందన సమర్పణ చేయగా ఎఫ్‌టీసీసీఐ డైరెక్టర్ పి.సంగీత స్వాగతోపన్యాసం చేశారు. మరిన్ని వివరాల కోసం విశాల-9121000199, సాయి అంకిత-8008700257 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.



ఎక్సలెన్స్ అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్ సింఘాల్ తదితరులు

ములాఖాత్‌లో ఖైదీ వీడియో చిత్రీకరణ

చంచల్‌గూడ: చంచల్‌గూడ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీ గన్‌తో కాలుస్తున్నట్లు సైగలు చేస్తూ ఫోజులిచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే అహ్మద్ బిన్ హస్సన్ అల్ జాబ్రీ అనే వ్యక్తి చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవల అతడిని ములాఖత్‌లో కలిసేందుకు వచ్చిన అతని మిత్రులు ఫోన్ సంభాషణను వీడియో తీశారు. ఖైదీ వీడియోకు ఫోజులిచ్చాడు. ఇది గత ఆదివారం వైరల్‌గా మారింది. ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ శివకు మార్‌గాడ్‌ను వివరణ కోరగా ములాఖత్‌కు వచ్చిన యువకుడు లోదుస్తుల్లో మొబైల్ ఫోన్ దాచి ఉండవచ్చని తెలిపారు. ఇకపై మరింత పటిష్టంగా భద్రత చర్యలు చేపడతామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సునీల్, సంధ్యారాణి దంపతులు వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉంటున్నారు. సంధ్యారాణికి ఇటీవల ఖమ్మంకు బదిలీ కావడంతో ఆమె ఈ నెల 4న పిల్లలను తీసుకుని అక్కడికి వెళ్లింది. సునీల్ ఆన్‌లైన్ వ్యాపారం చేసేవాడు. ఈ నెల 12న సంధ్యారాణికి ఆమె మామ సుబ్బరాయుడు ఫోన్ చేసి సునీల్ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని, రూ. 30 లక్షలు కావాలని కోరినట్లుగా చెప్పాడు. దీంతో ఆమె అదేరోజు సాయంత్రం తన భర్తకు ఫోన్ చేయగా, అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మర్నాడు అతడి స్నేహితుడు సురేష్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. సురేష్ అక్కడికి వెళ్లి చూడగా బెడ్‌రూంలో సునీల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సురేష్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రషర్ మెషీన్‌లో పడి కార్మికుడి మృతి

మేడ్చల్‌రూరల్: క్రషర్ మెషీన్‌లో పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనీష్ సింగ్(27) గిర్మాపూర్‌లోని రోబో సిలికాన్ క్రషర్ మెషీన్‌లో ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున విధుల్లో ఉన్న అతను ప్రమాదవశాత్తు క్రషర్ మెషీన్‌లో పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత ఖాతాల పైనా

ర్యాన్సమ్ వేర్ ఎటాక్



- ఐటీ ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు
- ట్రేడింగ్ ఖాతాలు బ్లాక్ చేసిన వైనం
- తమ ఆధీనంలోకి తీసుకుని రూ.42 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: కేవలం కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ-ప్రైవేట్ సంస్థలకు మాత్రమే పరిమితమైన ర్యాన్సమ్ వేర్ ఎటాక్స్ ప్రస్తుతం వ్యక్తిగత ఖాతాల పైనా జరుగుతున్నాయి. ఈ తరహా నేరం బారి పడిన ఓ ఐటీ ఉద్యోగి రూ.42 లక్షలు కోల్పోయాడు. ఇటీవల సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ ర్యాన్సమ్ వేర్ ఎటాక్స్ ఎక్కువగా నైజీరియన్లే చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో ద్వారానే ట్రేడింగ్ కార్యకలాపాలు సాగించే వ్యక్తుల ఖాతాలను గుర్తిస్తున్నారు. వీరికి డార్క్‌వెబ్ ద్వారానూ ఈ కస్టమర్ల వివరాలు అందుతున్నాయి. వారి అధికారిక మెయిల్ ఐడీలకే ఈ-మెయిల్ ద్వారా మాల్‌వేర్ పంపిస్తున్నారు. ఈ ఫిషింగ్ మెయిల్స్‌ను టార్గెట్ చేసిన వ్యక్తులు ఓపెన్ చేయగానే వారి డేటా మొత్తం ఎన్‌క్రిప్ట్ అవుతుంది. ఐటీ ఉద్యోగి విషయంలో మాత్రం ఆయన దేశవిదేశాల్లోని స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ చేయడానికి వినియోగిస్తున్న బ్యాంకు ఖాతాలపై మాల్‌వేర్ ప్రభావం చూపింది. ఆయన ల్యాప్‌టాప్‌లోకి చొరబడి మాల్‌వేర్ డేటాను ఎన్‌క్రిప్ట్ చేయడం ద్వారా ఆ ఖాతాలను బాధితుడి ఆధీనంలో లేకుండా చేసింది. దీంతో పాటు వాట్సాప్ వెబ్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి పూర్తిగా డిలీట్ చేసింది. ఎన్‌క్రిప్ట్ అయిన డేటాను డీక్రిప్ట్ చేయాలంటే భారీ మొత్తం చెల్లించాలంటూ ఈ-మెయిల్ ద్వారా బాధితుడికి సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపారు. బాధితుడి ప్రమేయం లేకుండా, ఆయనకు ఎలాంటి ఓటీపీ రాకుండానే రూ.42 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. ట్రేడింగ్ ఖాతా నుంచి రూ.36 లక్షలు, బ్యాంకు ఖాతాల్లోంచి రూ.6 లక్షలు కొల్లగొట్టారు. గత నెలల్లో కేవలం పది రోజుల వ్యవధిలోనే ఈ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బాధితుడి ఖాతాల నుంచి నగదు బదిలీ అయిన ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇలా ర్యాన్సమ్‌వేర్ వైరస్‌తో లాక్ అయిన కంప్యూటర్ల స్క్రీన్‌పై నిర్ణీత కాలానికి కౌంట్‌డౌన్ టైమింగ్ కూడా డిస్‌ప్లే అవుతుంది. తాము డీ క్రిప్షన్ పాస్‌వర్డ్‌ను ఆ సమయం తర్వాత నిర్వీర్యం చేస్తామని, ఇక మీ కంప్యూటర్‌లోని డేటా శాశ్వతంగా కోల్పోవాల్సి వస్తుందని సైబర్ నేరగాళ్లు బెదిరిస్తుంటారు. ఎవరైనా ఆ టైమర్‌ను, వైరస్ ప్రోగ్రామ్‌ను మార్పు చేయాలని ప్రయత్నించినా, నగదు డిపాజిట్ చేసినట్లు తప్పుడు వివరాలు పొందుపరిచినా డెడ్‌లైన్ సమయం తగ్గిపోతూ... కౌంట్‌డౌన్ టైమర్‌లో మార్పులు రావడం ఈ వైరస్‌కు ఉన్న మరో లక్షణమని పోలీసులు చెబుతున్నారు. ఐటీ ఉద్యోగి సైతం ఈ ముప్పును ఎదుర్కొన్నట్లు తెలిపారు. వ్యక్తిగత కంప్యూటర్ల విషయం అటుంచితే.. ఏటా ర్యాన్సమ్ వేర్ ఎటాక్స్ కారణంగా అనేక సంస్థలు తమ డేటాను కోల్పోతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఫిషింగ్ మెయిల్స్ ద్వారా మాత్రమే ఈ ఎటాక్స్ జరుగుతాయని.. ప్రతి ఒక్కరూ ఈ ఎటాక్స్, మెయిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కోరుతున్నారు. పటిష్టమైన ఫైర్‌వాల్స్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు వైఫైకు బదులుగా వీపీఎన్‌లు వాడాలని సూచిస్తున్నారు. సర్వర్‌ను నిర్వహించే ప్రతి సంస్థా కచ్చితంగా తమ డేటాపై సురక్షితమైన బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. పెన్‌డ్రైవ్స్/యూఎస్‌బీ పోర్టులను డిజేబుల్ చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ, సీడీఎఫ్‌డీ మధ్య చారిత్రక ఒప్పందం

ఉప్పల్: జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) గాంధీనగర్, సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)ల మధ్య చారిత్రాత్మకమైన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఎంవోయూపై సంతకాలు చేసినట్లు ఇరు సంస్థల ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆధునిక టెక్నాలజీలకు అనుగుణంగా ఫోరెన్సిక్ బయో టెక్నాలజీని ప్రత్యేకంగా డీఎన్‌ఏ బేస్‌డ్ టెక్నాలజీస్ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

- ఫోరెన్సిక్, జెనోమిక్స్ ప్రోటోమిక్స్, టాక్సీకాలజీ, డయాగ్నోస్టిక్స్ రంగాల్లో సహకార పరిశోధనలు చేయనున్నట్లు ప్రకటించారు. జ్ఞాన మార్పిడి, ప్రామాణీకరణను ప్రోత్సహించేందుకు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ (ఐఎస్‌ఎఫ్‌బీ) ని స్థాపించనున్నట్లు తెలిపారు.
- ఫోరెన్సిక్ నిపుణులు, చట్టం అమలు చేసే సంస్థలు, న్యాయ వ్యవస్థ సభ్యుల కోసం సర్టిఫికెట్ కోర్సులు, వర్క్‌షాప్‌లు, ఇంటర్న్‌షిప్‌లతో సహా ప్రొఫెషనల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు.
- భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇండియాలో భాగంగా స్వదేశీ ఫోరెన్సిక్ ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు టెక్నాలజీ ఇంక్యుబేషన్, బదిలీని సులభతరం చేయడం, ప్రఖ్యాత పీర్-రివ్యూడ్ ప్లాట్ ఫాంలలో ఉమ్మడి విధానం, శాస్త్రీయ పరిశోధనలు ప్రచురణలు చేసేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది.
- ఫోరెన్సిక్ టెక్నాలజీలో నూతన ధోరణులపై విద్యా మార్పిడి, సంభాషణను ప్రోత్సహించేందుకు ద్వివార్షిక అంతర్జాతీయ సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు.

'ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకున్న సీఎం'

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ జీఓ జారీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నెలబెట్టుకున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వోద్యోగాల్లో నియామకాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు జీవో 9 ఎంతో దోహదపడుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఎస్సీ వర్గీకరణపై రాజకీయాలు చేశాయే తప్ప వారికి న్యాయం చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి డి.వెంకటేశ్, నగర కార్యదర్శి రాజ్‌దీప్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు చారి, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్ ఆర్.కల్పనయాదవ్, సీనియర్ నాయకులు జెనిగె శ్రీనివాస్‌యాదవ్, రామకృష్ణముదిరాజ్, మారిశెట్టి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

నాగోలు: డిప్రెషన్‌తో బాధపడుతున్న ఓ యువకుడు భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్‌లో నివాసముండే సంజయ్ కుమార్ గుప్తా కుమారుడు తన్మై విజయరాజ్ (18) కొన్నాళ్లుగా డిప్రెషన్‌తో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అతను అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విజయరాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. తమ కుమారుడికి మానసిక పరిస్థితి సరిగా లేదని అతని మరణానికి ఎలాంటి ఇతర కారాణాలు లేవని మృతుడి తండ్రి సంజయ్‌కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వొద్దు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వేసవి దృష్ట్యా తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రతిపాదనలు పంపితే.. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట మరమ్మతులు చేయించాలన్నారు. భవిష్యత్తులో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సంతానం కలగడం లేదని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మియాపూర్: సంతానం కలగడం లేదని మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, మొద్దులగూడెం గ్రామానికి చెందిన సింధు (28) విక్రమ్‌రెడ్డి దంపతులు మియాపూర్ వైశాలినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు.గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసిన సింధు ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. వివాహం జరిగి చాలా ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో తరచూ బాధపడుతోండేది. ఈ క్రమంలో విక్రమ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఈ నెల 7న స్వగ్రామానికి వెళ్లగా సింధు ఒక్కతే ఇంట్లో ఉంది. ప్రతిరోజు తల్లిదండ్రులు, సోదరి ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతుండేవారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా ఆమె స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె సోదరి మౌనిక సింధు ఇంటికి వచ్చి చూడగా తలుపులు లోపలి నుండి గడియ పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా పలకకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా సింధు డైనింగ్ హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంతానం లేదనే బాధతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి సోదరి మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు స్థలాల డిజిటలైజేషన్..!

- పైలెట్ ప్రాజెక్ట్‌గా తిరుమలగిరి
- ప్రత్యేక యాప్ ద్వారా వివరాల నమోదు
- హైదరాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సర్కారు స్థలాలు హారతి కర్పూరంలా కరిగిపోతుండటంతో రెవెన్యూ యంత్రాంగం సమగ్ర వివరాలతో డిజిటలైజేషన్ చేసేందుకు సిద్ధమైంది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్రమార్కులు పాగా వేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ స్థలం అంటూ సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నా వాటిని సైతం తొలగించి దర్జాగా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ యంత్రాంగం వద్ద స్థలాలకు సంబంధించి సమగ్ర అధారాలు లేని కారణంగా క్రమంగా అక్రమ కట్టడాలు సైతం సక్రమ కట్టడాల జాబితాలో చేరిపోతున్నాయి. అయితే ఆదిలోనే వాటిని కట్టడి చేసేందుకు ప్రభుత్వ స్థలాలన్నింటినీ సమగ్ర వివరాలతో డిజటలీకరణ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సర్కారు ఖాళీ స్థలాలతో పాటు ఇతర శాఖలకు కేటాయించిన భూములు వినియోగంపైనా దృష్టి సారించింది.

పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి

హైదరాబాద్ జిల్లా పరిధిలో సుమారు 16 మండలాలు ఉండగా అందులో పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి మండలాన్ని ఎంపిక చేశారు. మండల పరిధిలోని సర్కారు స్థలాలన్నింటినీ కంప్యూటరీకరణ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 22 నుంచి ప్రత్యేక యాప్ ద్వారా స్థలాల సమగ్ర వివరాలు నమోదు చేయనుంది. అనంతరం మిగతా మండలాల్లో కూడా డిజిటలైజేషన్‌కు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ సారైనా అమలయ్యేనా..?

గతంలో రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పలు చర్యలు చేపట్టినా.. క్షేత్ర స్థాయిలో అమలు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ఆన్‌లైన్ మానిటరింగ్, ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో భద్రపర్చడం తదితర చర్యలతోపాటు పర్యవేక్షణ బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందికి అప్పగించినా..ఫలితం లేకుండా పోయింది. స్థలాల ఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూన్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలపై నిర్మాణాలు వెలిసిన తర్వాత ఫిర్యాదులు, వత్తిడికి వస్తే కానీ స్పందించక పోవడం నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.

ల్యాండ్ పార్శిళ్లు ఇలా..

16 మండలాల్లో 1075 ల్యాండ్ పార్శిల్స్‌లు ఉన్నాయి. 890 ల్యాండ్ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 4066914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉండగా, మరో 1145334.95 చదరపు గజాల విసీర్ణం గల ఖాళీ స్థలం కబ్జాకు గురైనట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కోర్టు కేసుల్లో సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 1193595.12 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలంతో పాటు 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

చక్రస్నానం.. తరించిన భక్త జనం

- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- చివరిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు సోమవారం చక్రస్నానంతో ముగిశాయి. చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమగుండాల గదిలో పూర్ణహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్ట దిక్పాలకులకు నైవేద్యంగా సమర్పించి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకీలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవుళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం నిర్వహించారు. చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టు, కన్నయ్య, మురళి పాల్గొన్నారు.

దర్శించుకున్న పట్నం మహేందర్‌రెడ్డి

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు రంగరాజన్ ఆయనకు పూలమాల వేసి స్వామివారి ఆశీర్వాదం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్, నాయకులు భిక్షపతి, బాల్‌రాజ్, శంకర్ తదితరులు ఉన్నారు.

తరలివచ్చిన భక్తజనం

బ్రహ్మోత్సవాల చివరిరోజు పరిసర ప్రాంతాలతోపాటు నగరం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చక్రతీర్థం సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అధికంగా విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్వజావరోహణంతో ముగింపు

బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా వస్త్రంపై గరుడ పటాన్ని చిత్రించి ధ్వజస్తంభానికి ఆరోహణం చేసిన వస్త్రాన్ని ముగింపు సూచికగా అవరోహణం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

స్నేహితుడు మోసం చేశాడని..

మనస్తాపంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

అమీర్‌పేట: స్నేహితుడు డబ్బులు తీసుకుని మోసం చేయడంతో మనస్తాపానికి లోనైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగపూర్‌కు చెందిన శివాని, రుడాల్ఫ్ ఆంటోని (30) దంపతులు అమీర్‌పేట ధరమ్‌కరం రోడ్డులో నివాసముంటున్నారు. గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో భార్య కూడా ఉద్యోగం చేయాలని ఆంటోని భావించాడు. ఈ నేపథ్యంలో అతడి స్నేహితుడు విశాల్ శివానికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో అతడికి రూ.4.50 లక్షలు ఇచ్చాడు. అయితే అతను ఉద్యోగంఇప్పించకపోవడంతో ఆదివారం రాత్రి అల్వాల్‌లోని విశాల్ ఇంటికిరి వెళ్లి గొడవ పడ్డాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన ఆంటోని కష్టపడి కూడబెట్టిన డబ్బు స్నేహితుడే కాజేశాడని భార్యకు చెప్పి బాధపడ్డాడు. ఆ తర్వాత తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతను గదిలో నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన శివాని స్నేహితుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఆంటోనీ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శోభాయాత్రలో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలంరాయి దండుమారమ్మ దేవాలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమైంది. అయితే యాత్ర కొనసాగాల్సిన రూట్‌లో నరేష్‌యాదవ్ అనే వ్యక్తి తన అనుచరులను రోడ్డుకు అడ్డుగా ఉంచడంతో అన్నానగర్ నుంచి ఇందిరమ్మనగర్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొరన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న బేగంపేట ఎస్ఐ శ్రీధర్ తన సిబ్బందితో కలిసి వారిని వారించినా నరేష్ యాదవ్ పట్టించుకోకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు కారణమైన నరేష్‌యాదవ్‌పై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్ దారుణ హత్య


డబీర్‌పురా: ఓ రౌడీషీటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మసీదుద్దీన్ (26)పై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న దక్షిణ మండలం ఇన్‌చార్జి డీసీపీ ఎస్.శ్వేత, పోలీసు అధికారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాత కక్షల కారణంగానే ఈ హత్య జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మసీదుద్దీన్‌కు మూడు రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది.

బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి..

రూ. 4 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీ

మేడిపల్లి: బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యాశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీరాం శివానంద్ కుటుంబ సభ్యులతో కలిసి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజలింగం కాలనీ ఫేజ్-2లో ఉంటున్నాడు. ఈనెల 12న కుటుంబ సభ్యులతో కలిసి గచ్చిబౌలిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉన్నది. లోనికి వెళ్లి చూడగా కప్‌బోర్డులో ఉన్న సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలులు.. వడగళ్ల వాన



ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఫార్మా గ్రామాలతో పాటు యాచారంలో ఈదురు గాలులతో కూడిన వర్షం దానికి తోడు వడగండ్లు పడటంతో పంటచేలు దెబ్బ తిన్నాయి. అక్కడక్కడ మామిడి కాయలు రాలిపోయాయి.

లిబర్టీ వద్ద డీబీపీ భారీ ర్యాలీ



హిమాయత్‌నగర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం లిబర్టీ వద్ద 'అంబేడ్కర్ రాజ్యాంగ రక్షణ పోరాట దివస్'గా పాటించారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఆధ్వర్యంలో లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ వి.ఎల్.రాజు, సంకు శ్రీనివాసులు, జొన్నలగడ్డ భాస్కర్ రావు, ఎస్.అశోక్, అర్జల రాజు, ఇటికాల గణేష్, బండారి లావణ్య, వరదా జ్యోతి, పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జీవో కాపీని సీఎంకు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ జీవోను వర్గీకరణ సబ్ కమిటీ బృందం సీఎం రేవంత్ రెడ్డికి ఇవ్వడాన్ని మాదిగ సమాజం స్వాగతిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. జీవో కాపీని మందకృష్ణ మాదిగకు ఇవ్వొద్దన్నారు. సోమవారం పిడమర్తి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు చేపట్టిన సూటు బూటు, బ్లూ షర్ట్స్, జై భీమ్ ర్యాలీని మలక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే షేక్ అక్బర్ ప్రారంభించారు.

రేపు శ్రీపోచమ్మ ఆలయ వార్షిక వేడుకలు

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో కొలువుదీరిన శ్రీపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 16న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు మహా గణపతిపూజ, 10 గంటలకు హోమం, 11 గంటలకు అభిషేకం, 12.30 గంటలకు కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



సనత్‌నగర్: దళిత చైతన్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. బేగంపేటలో జరిగిన కార్యక్రమంలో దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నలుగురికి చక్రాల కుర్చీలను, పేదలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వింధ్య బులియన్ సంస్థ ప్రతినిధులతో పాటు దళిత చైతన్య సంఘం సభ్యులు వడ్ల రామాంజనేయులు, రవి పాల్గొన్నారు.

ఈరంగారి రాములుకు దళితరత్న అవార్డు



సనత్‌నగర్: బేగంపేటకు చెందిన ఈరంగారి రాములుకు దళితరత్న అవార్డు వరించింది. మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌తో పాటు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బేగంపేట డివిజన్ పాటిగడ్డకు చెందిన పలువురు నాయకులు, స్థానికులు రాములను అభినందించారు.

ప్రైవేటు స్కూల్ టీచర్ అదృశ్యం

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేటు పాఠశాల టీచర్ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట పాటిగడ్డకు చెందిన సాయిప్రియ (24) స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. ఈ నెల 12న ఉదయం స్కూల్‌కు వెళ్లిన సాయిప్రియ స్కూల్‌లో పనిచేసే ఓ యువతితో కలిసి స్కూల్ తరుపున కాన్వాసింగ్ కోసం వెళ్లింది. అయితే ఆ తరువాత సాయిప్రియ తిరిగిరాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు కూతురితో పాటు వెళ్లిన యువతిని అడిగారు. ఓ వ్యక్తిని పరిచయం చేసిందని..బాబాయి అని చెప్పిందని తెలిపింది. తాను వెళ్లిపోయి మూడు నెలల తర్వాత పెళ్లి చేసుకుని వస్తానని ఈ విషయం ఎవరితోనూ చెప్పవద్దని కోరిందన్నారు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంబేడ్కర్ ఆశయ సాధనతోనే ప్రగతి

- వాడవాడలా రాజ్యాంగ నిర్మాతకు నివాళి
- నివాళులర్పించిన ప్రముఖులు
- పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు

బంజారాహిల్స్: వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో కొనసాగుతున్నామని అన్నారు. ఆయన ఆశయ సాధనతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నాడు ఆయన రచించిన రాజ్యాంగం వల్లనే బడుగు, బలహీన వర్గాలు నేడు ఆ ఫలాలు అనుభవిస్తున్నారని అన్నారు. ఫిలింనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జీవీకే వన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ్‌నగర్‌లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బంజారాహిల్స్‌లో టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.



బంజారాహిల్స్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



జీవీకే వన్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత...



ఫిలింనగర్‌లో 18 బస్తీల నేత మామిడి నర్సింగ్‌రావు



పారిశుద్ధ్య కార్మికులు....



టీజీఎస్పీ పటాలంలో కమాండెంట్ మురళీకృష్ణ...



ప్రేమ్‌నగర్ బస్తీలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఫిలింనగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్...



బంజారాహిల్స్‌లో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి...



బంజారాహిల్స్ రోడ్ నెం. 5 లేబర్ అడ్డాలో బీఎస్పీ ఆధ్వర్యంలో...



హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామాయన్ గౌడ్



లిబర్టీ వద్ద బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి



వికాస్‌పురికాలనీలో మాజీ ఎంపీ అజహరుద్దీన్ కుమారుడు అసద్



ఎస్పీఆర్‌హిల్స్‌లో కాంగ్రెస్ నేత బండపల్లి భవానీశంకర్...



శ్రీరాంనగర్‌లో పీఎస్ కమిటీ ప్రతినిధులు...



షేక్‌పేట అంబేడ్కర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ప్రదీప్ కుమార్



నిమ్స్‌లో డైరెక్టర్ బీరప్ప తదితరులు



బషీర్‌బాగ్‌లో ర్యాలీ...



నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 40, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 40, క్యాబేజీ 9, క్యారెట్ 19, దొండకాయ 23, గుండు బీన్స్ 60, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 65, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడి కాయ 30, ముల్లంగి 4-5, ఉల్లిపొరక రూ. 28 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వనజీవి రామయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్: వనజీవి రామయ్య కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్ మీద ఏర్పాటు చేయాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.భద్ర డిమాండ్ చేశారు. కోటి మొక్కలు నాటిన రామయ్యకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రామయ్యకు భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. జీవితం మొత్తం నిస్వార్థంగా ప్రకృతి పరిరక్షణ కోసం అంకితం చేసిన ధన్యజీవి రామయ్య అని కొనియాడారు. భవిష్యత్ తరాలకు రామయ్య పేరు మీద యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన జీవిత చరిత్రను పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు అన్ని భాషలలో బోధించాలన్నారు.

అర్ధరాత్రి దంపతులపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా భార్యభర్తలపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రాజీవ్‌నగర్‌గాంధీనగర్‌లో నివాసం ఉండే సయ్యద్ రఫీక్, తన భార్యతో కలిసి ఆదివారం రాత్రి తన మరదలి కుమార్తె పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. వేడుకల అనంతరం అర్ధరాత్రి రఫీక్ దంపతులు ఇంటికి బయలుదేరారు. తన ఆటో డ్రైవింగ్ చేయడానికి స్నేహితుడైన ఫైజల్‌ను పిలిచాడు. ఫైజల్ డ్రైవ్ చేస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వారిని వెంబడించి రఫీక్ భార్యను తీవ్రమైన అసభ్యకర వ్యాఖ్యలతో తిట్టారు. దాంతో రఫీక్ ఆటోదిగి ఎవరు మీరని ప్రశ్నించగా అతనిపై దాడి చేశారు. ఈ సంఘటనలో రఫీక్ భార్య దిగి అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఆమెను కూడా కొడుతూ, దుర్భాషలాడుతూ దాడి చేశారు. బాధితులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



స్టడీ మెటీరియల్ అందజేసిన తపస్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: పేద విద్యార్థులను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులందరూ ప్రయత్నించాలని అదే మనం అంబేడ్కర్‌కు ఇచ్చే గొప్ప నివాళి అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తపస్ యూత్ ఫర్ సేవ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో పాలిసెట్-25కు హాజరవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 96 మంది విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహించి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా జీవితంలో తొందరగా స్థిరపడవచ్చని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు అనిత, రజనీకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్, నేతలు కళావతి, ఉషారాణి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, కాశీరావు, పండరి, రజని, వీర కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహనీయులను అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటే: ఎమ్మెల్సీ కవిత



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత తదితరులు

ఖైరతాబాద్: మహనీయులను అవమానించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవిత పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాగర తీరంలో 125 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏ మాత్రం పట్టించుకోలేనది విమర్శించారు. మంత్రులు అంబేడ్కర్ జయంతి సందర్భంగా వచ్చారు కానీ ముఖ్యమంత్రి రాలేదన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రవతి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్, జూబ్లీహిల్, వెంకటేశ్వర కాలనీల కార్పొరేటర్లు మన్నె కవిత, వెల్దండ వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు గజ్జల ఆనంద్, జాగృతి నగర కో కన్వీనర్ తేజా చౌదరి, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కవితను అడ్డుకున్న పోలీసులు...

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించేందుకు వెళ్లిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. కవిత అక్కడే జై భీం అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

పేదల వైద్య సేవలకు సహకారం



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఐదుగురి శస్త్ర చికిత్సల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.8.55 లక్షల నిధుల ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ లబ్ధిదారులకు అందించారు. సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎల్‌ఓసీలను బాధితుల కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని అన్నారు.

ఫోన్ చేసుకుని ఇస్తామని మొబైల్‌తో జంప్

బంజారాహిల్స్: దారిన వెళ్లే ఓ వ్యక్తిని ఆపి ఫోన్ చేసుకుని ఇస్తామని మొబైల్ తీసుకుని ఇద్దరు వ్యక్తులు ఉడాయించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే...జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌కు చెందిన నరేష్ రసైలి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-9లోని నెట్‌వర్కింగ్ బిల్డింగ్‌లో గత నాలుగు సంవత్సరాలుగా వాచ్‌మెన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 12న రాత్రి 9 గంటల సమయంలో డ్యూటీకి వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు 13వ తేదీన తెల్లవారుజామున 5.20 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటిబాట పట్టాడు. వెంకటగిరి నుంచి వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై అతని వద్దకు వచ్చి తమ మొబైల్ ఫోన్ రీఛార్జ్ గడువు ముగిసిందని, ఒక్కసారి నీ ఫోన్ ఇస్తే చేసుకుని ఇస్తామని నమ్మబలికారు. దీంతో నరేష్ తన ఫోన్‌ను వారికి ఇచ్చాడు. ఫోన్ తీసుకున్న ఆగంతకులు ఫోన్ చేసినట్లుగా నటించి బైక్‌పై ఉడాయించారు. ఈ సమయంలోనే బైక్‌పై వెనుక కూర్చొన్న ఆగంతకుడు నరేష్ జుట్టు పట్టుకొని 5 మీటర్ల మేర లాక్కెళ్లాడు. ఈ ఘటనలో కిందపడిపోయిన నరేష్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బీదర్‌కు చెందిన ప్రకాశ్, రేష్మ దంపతులు ఎస్పీఆర్‌హిల్స్‌లో ఉంటారు. రేష్మ దుర్గంచెరువు ప్రాంతంలో హౌస్‌కీపింగ్ పనులు చేస్తుంది. ఈ నెల 10న ప్రకాశ్ కొబ్బరికాయల వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లగా భార్య విధులకు వెళ్తున్నట్టుగా చెప్పి బట్టలు సర్దుకుని వెళ్లింది. దాంతో ప్రకాశ్‌కు తన పెద్ద కుమార్తె ఫోన్ చేసి తన తల్లి దుస్తులు సర్దుకుని వెళ్లినట్టు తెలియజేసింది. అతను వచ్చి చూడగా కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేదు. ఇదిలా ఉండగా తన భార్య తరచూ భాస్కర్ అనే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేదని అనుమానం వ్యక్తం చేస్తూ ప్రకాశ్ సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ మార్గంతోనే సమ సమాజ స్థాపన



అంబేడ్కర్ యూనివర్సిటీలో వీసీ ఘంటా చక్రపాణి తదితరులు

సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ కత్తి పద్మారావు

బంజారాహిల్స్: సమ సమాజ స్థాపనకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చూపిన మార్గాన్ని అందరూ ఆచరించాల్సిందేనని ప్రఖ్యాత కవి, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ కత్తి పద్మారావు పేర్కొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'సామాజిక సాధికారత' ఉత్సవాల్లో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జ్ఞానవనంలోని అంబేడ్కర్ విగ్రహం, పరిపాలనా భవనం వద్ద ఘనంగా పుష్పాంజలితో నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారకోపన్యాసంలో కత్తి పద్మారావు ముఖ్యఅతిథిగా హాజరై 'అంబేడ్కర్ సమకాలీన దర్శనం' అంశంపై ఆన్‌లైన్ ద్వారా ఉపన్యాసం చేశారు. అంబేడ్కర్ కుల వ్యవస్థను చాలా దగ్గర నుంచి చూశారని, కుల వివక్షతకు గురయ్యారన్నారు. నేటికీ విద్య, ఉద్యోగాల్లో కులం పేరుతో వివక్షతను చూస్తున్నామన్నారు. అంబేడ్కర్ చెప్పిన కుల రహిత, కులాల రద్దు సిద్ధాంతం ఇంకా పూర్తి కాలేదన్నారు. సమానత్వం కోసం పోరాటం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యాప్తికి, పేదల అభ్యున్నతికి అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ చేస్తున్న కృషిని వివరించారు. యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయ కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, బోజు శ్రీనివాస్, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు సుధారాణి, ఆనంద్ పవర్, వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాబ్డే, రవీంద్రనాథ్ సోలోమన్, వెంకటరమణ, రజనీ, బానోత్ ధర్మా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీలో గోరటి వెంకన్న పాట



సంగీత సంధ్య కార్యక్రమంలో గోరటి వెంకన్న

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన 'సామాజిక సాధికారత' వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం, పూర్వ విద్యార్థుల సంఘం, యారో అడ్వర్టయిజింగ్ సంస్థ సంయుక్తంగా సోమవారం సాయంత్రం ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆధ్వర్యంలో 'గోరటి పాట' సంగీత సంధ్య కార్యక్రమాన్ని యూనివర్సిటీలోని భవనం వెంకట్రాం ఆడిటోరియంలో నిర్వహించారు. యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు శ్రీనివాస్, కవులు, సాహిత్యవేత్తలు అపర్ణతోట, మొర్తాల విమల, తెలుగు సాహిత్యవేత్త యాకుబ్, యారో అడ్వర్టయిజింగ్ సంస్థ ఎండీ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ 72వ జయంతి వార్షిక వేడుకలు మూడవ రోజైన సోమవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మేళతాళాలు, బాజాభజంత్రీలు, రుత్వికుల మంత్రోచ్చారణ మధ్య పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారు పుష్ప, ఫల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకరణలో 36 రకాల పండ్లు, పుష్పాలను వినియోగించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

స్ఫూర్తిదాతలకు 'వైశ్య అచీవర్స్ అవార్డ్స్-2025'



సాక్షి, సిటీబ్యూరో: నిజజీవితహీరోలు, స్ఫూర్తిదాయక వ్యక్తులు, భవిష్యత్ తరానికి మార్గదర్శకులైన వారిని 'వైశ్య అచీవర్స్ అవార్డ్స్–2025'తో సత్కరించనున్నట్లు సంస్థ యాజమాన్యం ప్రకటించింది. గచ్చిబౌలి వేదికగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యం, సినిమా, క్రీడలు, వ్యాపారం, టెక్నాలజీ, ఇన్నోవేషన్, సామాజిక సేవ వంటి 18 విభిన్న అంశాల్లో విశేష కృషి చేసిన వారికి, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వాలను వైశ్య అచీవర్స్ అవార్డ్స్‌తో గౌరవించనున్నట్లు వైశ్య అచీవర్స్ అవార్డ్స్–2025 చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త మాదిపడిగే రాజు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైశ్య కమ్యూనిటీ సభ్యులు కమిటీ సూచించిన విభాగాల్లో అవార్డ్స్ కోసం నామినేషన్లను దాఖలు చేయవచ్చు. ఈ అవార్డులను మే 27న ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

వర్సిటీలు విద్యా విలువలను పెంపొందించాలి

– ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు



బంజారాహిల్స్: విద్యా విలువలను పెంపొందిస్తూ అందరికీ ఉన్నత విద్యను ఉత్తమ ప్రమాణాలతో అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన 'సామాజిక సాధికార'వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 43 సంవత్సరాల క్రితం సార్వత్రిక విద్యను అంకురార్పణ చేసే క్రమంలో భాగస్వామినైన తాను, నేడు అంబేడ్కర్ వర్సిటీ ఎదిగిన క్రమం చూసి చాలా గర్వపడుతున్నానని అన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ విశ్వవిద్యాలయాన్ని మరో మూడు దశాబ్దాలకు సరిపడే విధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించామని, వాటికి ప్రభుత్వం ఆమోదం వేసిందని అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు. కాగా, అంబేడ్కర్ వర్సిటీ ఒప్పంద అధ్యాపకులు కేకేను కలిసి తమను శాశ్వత ఉద్యోగులుగా నియమించేలా ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పించాలని కోరారు. సాయంత్రం ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆధ్వర్యంలో గోరటి పాట సంగీత సంధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యాపార రంగంపై యువత దృష్టి సారించాలి



గన్‌ఫౌండ్రీ: రాజీవ్ యువ వికాస పథకంతో యువత వ్యాపార రంగం వైపు సాగాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. కుటీర పరిశ్రమలు, పాల ఉత్పత్తి కోసం డైరీ, కూరగాయల పెంపకం, ఫ్లోరీ కల్చర్ వంటి వ్యాపారాలు చేయడం వల్ల యువతకు ఆర్థికంగా ఎంతో ఉపయోగమని తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అగ్రి హార్టికల్చర్ సొసైటీ, ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ రైతు మహోత్సవం – రైతు మేళా సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు రోజూ లక్ష లీటర్ల పాల కొరత ఉన్నందున పాల డైరీలు ఏర్పాటు చేసి లాభాలు ఆర్జించవచ్చని సూచించారు. కూరగాయలు, పూల కొరత కూడా ఉందని, వాటి సరఫరాపై యువత దృష్టిని సారించాలన్నారు. రైతులు మొక్కజొన్న, గోధుమ, చిరుధాన్యాల సాగు, పౌల్ట్రీ ఏర్పాటు వల్ల లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్టికల్చరల్, వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి, అగ్రి హార్టీ సొసైటీ చైర్మన్ సీహెచ్ సుధాకర్‌రావు, కార్యదర్శి ఎ.వీరభద్రారావు, ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీ కార్యదర్శి జీవీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జీఓ రావడం గర్వకారణం



కవాడిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి రోజున ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జీఓ నెంబర్ 33 రావడం గర్వకారణంగా ఉందని ఎమ్మార్పీస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం డాక్టర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఆయన విగ్రహం వద్ద మందకృష్ణ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దేశంలోని 11 దళిత కులాలకు జనాభా దామాషా పద్ధతిన రావాల్సిన రిజర్వేషన్ల ఫలాలు దక్కలేదన్నారు. అతి త్వరలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని లక్ష డప్పులతో నిర్వహిస్తామని, పర్మిషన్ ఇవ్వడం, ఇవ్వకపోవడంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే తేల్చుకోవాలన్నారు.

సర్టిఫికెట్లు అమ్ముకుంటున్నారు!

ఒక వైద్యుడు.. ఎన్నో ఆసుపత్రులు

- నగరంలో ప్రైవేట్ ఆసుపత్రుల ఇష్టారాజ్యం
- కాగితాల్లో పేర్లతోనే సరిపెట్టేస్తున్నారు
- అనుమతులు వచ్చిన తరువాత ఎవరిదారి వారిదే...
- మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో వెలుగు చూస్తున్న దారుణాలు



సాక్షి, సిటీబ్యూరో: నకిలీ డాక్టర్.. మకిలీ వైద్యం అన్నట్లుగా నగరంలో వైద్యులు, వైద్యం పరిస్థితి ఉంది. ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల ఏర్పాటు నిమిత్తం శాఖాపరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసే సమయంలో కొందరు నిపుణులైన వైద్యుల నుంచి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. అందుకోసం వారికి ఎంతో కొంత ముట్టజెబుతున్నారు. అనుమతులు వచ్చిన అనంతరం ఎవరిదారి వారిదే. ఫలితంగా అర్హత లేని వ్యక్తులు రోగులకు వైద్యమందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి రోగానికి వైద్య సేవలందించే వ్యక్తి చదువుకు ఏ మాత్రం సంబంధం ఉండటంలేదు.

పొంతనలేని లెక్కలు..

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కలిపి మొత్తం 3,919 ఉన్నాయి. 30 వేలకుపైగా పడకల సామర్థ్యం ఉన్నట్లు అంచనా. అయితే వైద్యారోగ్య శాఖాధికారుల అధికారిక లెక్కలకు, క్షేత్ర స్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. ఇటీవలి కాలంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చేస్తున్న తనిఖీల్లో దారుణాలు వెలుగు చూస్తున్నాయి. ఆసుపత్రి అనుమతి కోసం వైద్యారోగ్య శాఖకు సమర్పించిన దరఖాస్తులో నిపుణులైన వైద్యులు ఉంటున్నారు. అయితే వీరు కాగితాలకే పరిమితమవుతున్నారు. వీరు ఆయా ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించడంలేదు. అక్కడ అనర్హులే వైద్యులుగా అవతారమెత్తుతున్నారు. పేరున్న ఆసుపత్రుల్లో కొంతమంది నిపుణులైన వైద్యుల పేర్లు కేవలం నేమ్ బోర్డులో మాత్రమే కనిపిస్తున్నాయి. వైద్యసేవలు అందించే విషయంలో వారి స్థానంలో వేరే వ్యక్తి ఉంటున్నారు. కొన్నిచోట్ల డెంటల్ వైద్యులు కూడా స్కిన్ కేర్ సేవలందిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆసుపత్రులు/క్లినిక్‌లను నడిపించడం ఒక ఎత్తయితే.. అధికారికంగా అనుమతులు తీసుకున్న తరువాత నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లు వందల సంఖ్యలోనే నగరంలో ఉన్నాయి. గడిచిన ఏడాది కాలంలో నగర పరిధిలో 200లకుపైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూకట్‌పల్లి, మియాపూర్, కొండాపూర్, బోరబండ, మేడ్చల్, అల్వాల్, తదితర ప్రాంతాల్లో నకిలీ వైద్యులు వెలుగు చూశారు.

కొరవడిన నిఘా..

గ్రేటర్ పరిధిలో రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు క్లినిక్, ఆసుపత్రులకు అనుమతులు ఇస్తున్నారు. అయితే వీటిపై పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. తనిఖీలు నిర్వహించినప్పుడు పై నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని కొందరు అధికారులు వాపోతున్నారు. దీంతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం, ఆనక మిన్నకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వైద్యులకు నోటీసులు జారీ చేస్తున్నాం



ఆసుపత్రి, క్లినిక్‌ల అనుమతుల కోసం సర్టిఫికెట్ ఇచ్చిన క్వాలిఫైడ్ వైద్యుడు అక్కడ తప్పనిసరిగా పనిచేయాలి. అయితే నగరంలోని చాలా ఆసుపత్రుల్లో అలాంటి పరిస్థితి లేదని గుర్తించాం. ఇటువంటి వైద్యులకు మెడికల్ నెగ్లిజెన్సీ కింద ఎథిక్స్ కమిటీ నుంచి నోటీసులు జారీ చేస్తున్నాం. వారిచ్చే వివరణ ఆధారంగా చర్యలు తీసుకుంటాం. అర్హత లేనివారు వైద్యం చేయడం చట్టపరంగా నేరం. ఆసుపత్రులపైనా కేసులు నమోదు చేసి సీజ్ చేస్తున్నాం.

– డా.శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

పవన్ బాబుమోహన్ ట్రస్ట్ ప్రారంభం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న బాబుమోహన్

హిమాయత్‌నగర్: ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, వైద్యం నిమిత్తం చేయూతనందించేందుకు తన కుమారుడి పేరుమీద 'పవన్ బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్'ను ప్రారంభించినట్లు మాజీ మంత్రి, సినీనటుడు బాబుమోహన్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు 2003లో రోడ్డు ప్రమాదంలో మరణించాడని, ఆ సమయంలోనే ట్రస్ట్ పెట్టాలని అనుకున్నానని, కానీ రాజకీయాల్లో ఉండటం వల్ల సాధ్యం కాలేదన్నారు. ఇప్పుడు రాజకీయాలకు దూరంగా ఉన్నానని, పూర్తిస్థాయిలో ట్రస్ట్ కోసం పని చేస్తానని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన సమీప అనే యువతి చదువు బాధ్యతలను తీసుకున్నానని బాబుమోహన్ తెలిపారు. బాబుమోహన్ లాంటి వారు కోయ సామాజిక వర్గానికి చెందిన తనకు సహాయం చేస్తారని అనుకోలేదని సమీప తెలిపింది. చిన్ననాటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ బీటెక్ పూర్తి చేశానని, ట్రస్ట్ సహకారంతో ఎంటెక్ పూర్తి చేసి ఫారెస్ట్ రేంజ్ అధికారిణి అవుతానని ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. త్వరలోనే అన్ని జిల్లాల్లో ట్రస్ట్ కో–ఆర్డినేటర్లను ప్రకటిస్తామని బాబుమోహన్ తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 8919511215 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జలమండలిలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జలమండలి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ– ఆపరేషన్స్–2 డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్–1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎంలు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రభు, నాగేందర్, నారాయణ, పద్మజ, జీఎంలు, జలమండలి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పన్నీటి జల్లులా.. పద్యాల వెల్లువలా..!

– ముగిసిన సంపూర్ణ శతావధానం



శతావధాన దృశ్యం

నాంపల్లి: మండు వేసవిలో పన్నీటి జల్లులా పద్యాల వెల్లువలా సాగింది డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం. మూడు రోజులపాటు నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో జరిగిన శతావధానంలో 108 పృచ్ఛకులు సంధించిన సమస్య, దత్తపది, వర్ణ, న్యస్తాక్షరి, నిషిద్ధాక్షరి, ఆశువు అంశాల ప్రశ్నలకు అవధాని దీటుగా, హృద్యంగా పద్యాలను అప్పజెప్పి శతావధానాన్ని అద్వితీయంగా నిర్వహించారు. సోమవారం ఉదయం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం మిలిగిన వర్ణన, న్యస్తాక్షరి, ఆశువు అంశాల పూరణలను అవధాని పూర్తి చేశారు. అవధాని 75 పద్యాలను ధారణ చేసి సాహితీ రసజ్ఞులను అలరించారు. ఈ ధారణా సభకు సాహితీవేత్త డాక్టర్ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అధ్యక్షత వహించారు.

శతావధాన విజయోత్సవం...

శతావధాని డాక్టర్ వెంకటరమణ పట్వర్ధన్ ఐదవ శతావధానం ధారణ అద్భుతంగా పూర్తికాగానే విజయోత్సవ సభ నేత్రపర్వంగా సాగింది. ఎంతో రసరమ్యంగా పద్యాలు చెప్పి అద్భుతంగా శతావధానం పూర్తి చేసిన పట్వర్ధన్‌ను కవులు, పండితులు, అతిథులు ప్రశంసించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గా ప్రసాదరావు, సభాధ్యక్షులుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, బీజేపీ నాయకురాలు కొత్తూరు గీతామూర్తి, ఆచార్య కోట్ల హనుమంతరావు, వనం జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు. ఆహుతుల హర్షధ్వానాల మధ్య శతావధాన ద్యుమణి బిరుదు పత్రంతో సన్మానించారు. అవధాన నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ కేవీ రమణాచారి, అధ్యక్షులు నారుమంచి వేంకట అనంత కృష్ణ, కార్యదర్శి మరుమాముల దత్తాత్రేయ శర్మ, ఉపాధ్యక్షులు ఆముదాల మురళి, ప్రచార కార్యదర్శి మరుమాముల వెంకటరమణ శర్మ, కోశాధికారి కేవీఎస్ ఆచార్య, సభ్యులు భీమ్‌సేన్ మూర్తి, అవుసుల భానుప్రకాష్, దుగ్గిరాల వాసుదేవరావు, ఓం ప్రకాష్, లక్ష్మీ మానస, మంచినీళ్ళ సరస్వతి రామశరమ్మ, స్వాతి ప్రసాదం, అరవల్లి శ్రీదేవి శతావధానం అద్భుత నిర్వహణకు కృషి చేశారు.

గౌలిదొడ్డిలో 'ప్రాజెక్ట్ మిత్ర' ప్రారంభం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'ప్రాజెక్ట్ మిత్ర'కార్యక్రమాన్ని శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బాలికల కళాశాల/పాఠశాలలో సోమవారం 'ప్రాజెక్ట్ మిత్ర'ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిణి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి రోజు ప్రతి సంక్షేమ వసతిగృహంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన 'ప్రాజెక్ట్ మిత్ర'కార్యక్రమం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. వసతి గృహంలో ఫోన్‌ను ఏర్పాటు చేసి తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు పిల్లలకు తెలిస్తే మానసికంగా మరింత అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు శుచి శుభ్రతతో కూడిన చక్కటి రుచికరమైన భోజనం అందించాల ని అధికారులకు సూచించారు. సంక్షేమ గురుకులాల విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డాక్టర్ అలుగు వర్షిణి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు, వారి సమస్యలను పంచుకోవడానికి కాల్ సెంటర్‌ను సంప్రదించడానికి వీలుగా క్యాంపస్‌లో పది ఫోన్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొంతమంది తల్లిదండ్రుల పరిచయాలను కార్డులలో పోస్ట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం పలువురు విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో సంభాషించారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినందుకు తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీలు సక్రునాయక్, భీమయ్య, రాష్ట్ర స్థాయి అధికారి వివేకానంద, ఓఎస్‌డీ కిషోర్, అకడమిక్ కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ కల్పన, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్ఫూర్తితో ఆర్టీసీ ప్రయాణం



ఆర్టీసీ కళ్యాణ మండపంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సజ్జనార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆర్టీసీలో మూడేళ్లుగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ అన్నారు. సోమవారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీలో 3,038 పోస్టుల భర్తీకి అనుమతించిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యక్తి వర్గీకరణను ఈ నియమకాలలో సంస్థ అమలు చేసిందన్నారు. పెండింగ్ అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. కార్యక్రమంలో ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషఖాన్, రాజశేఖర్, వెంకన్న, జాయింట్ డైరెక్టర్ నర్మద, ఉషా బేబి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వాక్ వే.. డార్క్ వే..!



లైట్లు వెలగకపోవడంతో చీకట్లో కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వే...

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వే లో వీధిలైట్లు అలంకారప్రాయంగా మిగిలాయి. అవి వెలగకపోవడంతో రాత్రిపూట ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంటోంది. కొన్నిరోజుల క్రితమే ఈ వాక్‌వేలో జీహెచ్‌ఎంసీ అధికారులు పలు అభివృద్ధి పనులు చేసి చూడముచ్చటైన గార్డెన్లు, ఫౌంటెయిన్లు, రంగురంగుల మొక్కలు, లాన్లు, పర్గోలాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ, సాయంత్రం దాటిన తర్వాత వీధిదీపాలు వెలగకపోవడంతో వాకర్లు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు మెయిన్ గేటు నుంచి బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వైపు ఒక్కలైటు కూడా వెలగడంలేదు. దీంతో ఈ వాక్‌వేలో నడవటానికి వాకర్లు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయాలని వాకర్లు కోరుతున్నారు.

రెండేళ్ల బాలుడికి అరుదైన కేన్సర్

సంక్లిష్టమైన శస్త్ర చికిత్సతో నయం చేసిన కిమ్స్ వైద్యులు



రాంగోపాల్‌పేట్: అరుదైన కేన్సర్‌తో బాధపడుతున్న ఓ బాలుడికి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. ఇది పదిలక్షల మంది పిల్లల్లో 8 మందికి మాత్రమే వచ్చే అరుదైన న్యూరో బ్లాస్టోమా. కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మధు దేవరశెట్టి ఈ వివరాలు వెల్లడించారు. లాలాపేట్‌కు చెందిన రక్షిత్ అనే రెండేళ్ల బాలుడికి న్యూరోబ్లాస్టోమా ముదిరిన దశలో ఉంది. ఇది నాడీ కణజాలం నుంచి అభివృద్ధి చెందే అరుదైన కేన్సర్. ఇది 5 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి మూత్రపిండాలపైన నరాల కణజాలం, మెడ, చాతి, పెల్విక్ నరాల కణజాలాల్లో ప్రారంభమవుతుంది. బాలుడిలో శరీరం దిగువ భాగాల నుంచి గుండెకు చెడు రక్తాన్ని తీసుకుని వెళ్లే ప్రధాన రక్తనాళంతోపాటు కుడి మూత్రపిండాన్ని కూడా ఆనుకుని ఉంది. దీంతో శస్త్ర చికిత్స చేయడం సంక్లిష్టంగా మారింది. కిమోథెరపీతో కొంత నయం చేయవచ్చని భావించినా కణితి మాత్రం స్పందించలేదు. దీంతో తప్పని పరిస్థితిలో సంక్లిష్టమైన శస్త్రచికిత్సను కిడ్నీకి ఎలాంటి దెబ్బతగలకుండా విజయవంతంగా పూర్తి చేశారు. కేన్సర్ ప్రభావితమైన రక్తనాళాలను జాగ్రత్తగా తొలగించి మళ్లీ వాటిని అనుసంధానించి రక్త సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు. అనుభవజ్ఞులైన వైద్యులు, అత్యాధునిక సదుపాయాలు, క్రిటికల్ కేర్ నిపుణులు ఉండటంతో చికిత్స విజయవంతమైందని డాక్టర్ దేవరశెట్టి మధు అన్నారు.

తెలంగాణ రెజ్లర్లు జాతీయస్థాయిలో రాణించొచ్చు

ఒలింపిక్ పతక విజేత రవికుమార్ దహియా



గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించిన వజ్రాభరణాన్ని పరిశీలిస్తున్న రవికుమార్ దహియా

బంజారాహిల్స్: మరింత సాధన, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తా తెలంగాణ రెజ్లర్లలో ఉందని ప్రముఖ భారత రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత రవికుమార్ దహియా అన్నారు. నగరంలో జరుగుతున్న తెలంగాణ కేసరి కుస్తీ పోటీలను తిలకించేందుకు వచ్చిన ఆయన సోమవారం జూబ్లీహిల్స్‌లోని డైమండ్ స్టోర్‌లో సందడి చేశారు. ఇటీవల గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన వజ్రాభరణాన్ని రవి కుమార్ దహియా తిలకించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో భారత తరపున అత్యధికంగా పతకాలు సాధిస్తున్న క్రీడాకారులు హరియాణా రాష్ట్రంలోంచే వస్తున్నారనీ, తెలంగాణ, మహారాష్ట్రలో కూడా ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలనే కసి తక్కువగా ఉంటోందన్నారు. ఇక్కడి నుంచి కూడా అంతర్జాతీయ పోటీల్లో రాణించేవిధంగా సాధన చేస్తే త్వరలోనే తెలంగాణ నుంచి కూడా కుస్తీలో ఒలింపిక్ పతక విజేత వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా కూడా కుస్తీకి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రవి కుమార్ దహియాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ కొట్టి, చంద్ర శేఖర్ కొట్టి, సాయి చందర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చదువే సమస్యలకు పరిష్కార మార్గం



జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

కవాడిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీలో వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రాం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలను దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ జి. రచన శ్రీ, వీబీ ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయ లక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పావని, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, నేతలు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, రమేష్‌రాం, జి.వెంకటేష్, పరిమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బస్తీ వాసులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు దక్కాలి



– గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ

సుందరయ్య విజ్ఞానకేంద్రం: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు దక్కాలని, అప్పుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయకుమార్ గౌడ్ అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిక్కడపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపిందని అన్నారు. తక్షణమే పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో ఎం.వి.రమణ, అంబాల నారాయణ గౌడ్, మేకపోతుల నరేందర్ గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, సింగం నాగేశ్వర్ గౌడ్, పోతగాని ఐలయ్య, వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు ఒకే చోట ఆఫీసులు ఏర్పాటు చేసుకోవడమనే కో-వర్కింగ్ స్పేస్ కాన్సెప్ట్ నగరంలో విజృంభిస్తోంది. చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఊతమిచ్చేలా కో-వర్కింగ్ స్పేస్ అందించే సంస్థలు ఇప్పుడు నగరంలో వందల సంఖ్యకు చేరుకోవడం విశేషం.

- సాక్షి, సిటీబ్యూరో





- ఒకే చూరు కింద అనేక రకాల సంస్థల కాన్సెప్ట్‌కు ఊపు
- స్టార్టప్స్‌కు ఊతంగా, చిన్న సంస్థలకు ఉపయుక్తంగా
- స్పేస్ ఆఫర్ చేస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు
- నగరంలోని షాపింగ్ మాల్స్, హోటల్స్‌కు కూడా విస్తరణ

కొత్త శిఖరాలకు.. కో-వర్కింగ్..

అత్యంత అధునాతన ఆఫీసులను డిజైన్ చేసి, సంస్థ అవసరాలను బట్టి కనీసం ఐదుగురి నుంచి 500 మంది ఉద్యోగుల వరకూ అవసరమైన స్పేస్‌ను కో-వర్కింగ్ స్పేస్ ఆఫర్ చేసే సంస్థలు అందిస్తున్నాయి. వర్క్ స్టేషన్‌కి ఇంత చొప్పున స్థలాన్ని కేటాయించి, దానికి అనుగుణంగా వీరు చార్జ్ చేస్తారు. ఇక ఆ తర్వాత ఆఫీస్‌కు సంబంధించి ఏ బాదర బందీ సదరు కంపెనీకి ఉండదు. సెక్యూరిటీ మొదలు పెడితే.. క్యాబిన్స్, సర్వర్ రూమ్స్, సర్వర్ ర్యాక్స్, ఇంటర్నెట్, కెఫెటేరియా, లాబీస్పేస్, కాన్ఫరెన్స్ రూమ్స్ ఇలా.. ప్రతిదీ అందుబాటులో ఉంటాయి. సేవలు అందించడానికి అవసరమైన మ్యాన్ పవర్ సైతం సిద్ధంగా ఉంటుంది. సంస్థ ఉద్యోగుల సంఖ్య పెరిగినా కేవలం 15 రోజుల వ్యవధిలో పెరిగిన ఉద్యోగులకు సరిపడా స్పేస్ విస్తరింపజేస్తారు.

రెడీమేడ్ ఆఫీసులకు ఊతం..

'ఈ రోజు బిజినెస్ ఐడియా వస్తే.. రేపు కంపెనీ అనౌన్స్ చేసేయడానికి ఈ రెడీమేడ్ ఆఫీసులు సహకరిస్తాయి. కొన్నేళ్ల క్రితం కొండాపూర్‌లో 12,500 చదరపు అడుగుల్లో 200 సీటింగ్ కెపాసిటీతో కో-వర్కింగ్ స్పేస్ స్టార్ట్ చేస్తే అది కేవలం రెండు నెలల్లో ఫిలప్ అయిపోయింది. ఆ తర్వాత బంజారాహిల్స్‌లో 95వేల చదరపు అడుగుల్లో 1800 సీటింగ్ కెపాసిటీ ఉన్నది ఏర్పాటు చేశాం. స్టార్టప్స్‌కి అకౌంటింగ్, జీఎస్టీ రిటర్న్స్ తదితర అన్ని విషయాల్లోనూ హెల్ప్ చేస్తున్నాం. ప్రస్తుతం మేం అందిస్తున్న స్పేస్‌లో వందలాది కంపెనీలు ఆఫీసులు నిర్వహిస్తున్నాయి' అంటూ వివరించారు ఐ స్ప్రౌట్స్ నిర్వాహకులు సుందరి.



ఆదరణకు కారణాలెన్నో..

ఓ 100 మంది ఉద్యోగులుండే కంపెనీ నగరంలో సొంతంగా ఆఫీస్ ఏర్పాటు చేసుకోవాలంటే.. మౌలిక వసతుల కల్పనకే కనీసం రూ.కోటిన్నర వరకూ ఖర్చు అవుతుందని అంచనా. అడ్వాన్సులు, అద్దెలు, నిర్వహణ, మ్యాన్ పవర్ సమకూర్చుకోవడం, దాని తాలూకు బాదర బందీలు, వ్యయ ప్రయాసలూ అదనం. ఇంత పెట్టుబడితో తగిన లాభాలు రావాలంటే కనీసం ఐదేళ్లు కొనసాగితేనే వర్కవుట్ అవుతుంది. కాబట్టే ఈ కో-వర్కింగ్ స్పేస్‌కి ఆదరణ పెరిగింది. అలాగే చాలా కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు ఏడాది, ఏడాదిన్నర వ్యవధికి మాత్రమే పరిమితం అవుతాయి. కొత్త ప్రాజెక్టులు రాకపోతే కంపెనీ నిర్వహణ అసాధ్యం. అటువంటి పరిస్థితుల్లో.. ఈ తరహా స్పేస్ షేరింగ్ ఉపయుక్తంగా మారుతోంది. వీటికి డిపాజిట్లు, ఒప్పందాల వంటి ముందస్తు చెల్లింపులూ పెద్దగా ఉండవు. చట్టబద్ధత, ఆర్థిక లావాదేవీల పరంగా సరళత ఎక్కువ. దీంతో స్టార్టప్‌లు, ఎస్ఎమ్ఇల వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లకు ప్రీతిపాత్రంగా మారాయి. పైగా కో-వర్కింగ్ స్పేస్ కనీసం 10వేల చదరపు అడుగుల నుంచి దాదాపు లక్షకు పైగా చదరపు అడుగుల్లో ఏర్పాటవుతూ అతి పెద్ద ఆఫీస్ స్పేస్ అనుభూతిని ఇస్తున్నాయి.



ఇంతింతై..స్పేస్ కొండంతై..

ప్రారంభంలో ఈ కాన్సెప్ట్ సృజనాత్మక రచయితలు, ఆర్టిస్టులు, ఫ్రీలాన్సర్‌లకే పరిమితమైంది. అయితే ఐటీ, ఎంఎన్‌సీలు, స్టార్టప్‌లు కో-వర్కింగ్‌లోకి రంగప్రవేశం చేయడంతో ఈ ఫ్లెక్సిబుల్ వర్క్ స్పేస్ కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత కంపెనీలు స్టార్టప్‌లలో ఫ్లెక్సీ వర్క్‌స్పేస్ కాన్సెప్ట్‌కు ఆదరణ పెరిగింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ ప్రకారం, దేశంలోని టాప్-7 నగరాల్లో మొత్తం 20.8 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌లో, కో-వర్కింగ్ స్పేస్ వాటా దాదాపు 25%గా ఉంది.

పోటాపోటీగా వసతులు..

ఈ కో-వర్కింగ్ స్పేస్‌లోకి కంపెనీలు ఆకర్షించడానికి పేరొందిన జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్స్ పోటీ పడుతున్నాయి. 'మా కో-వర్కింగ్ స్పేస్‌లో కనీసం 300 మందికి సరిపడా సీటింగ్ కెపాసిటీ, ప్రైవేట్ క్యాబిన్‌లు, డెడికేటెడ్ డెస్కులు, హాట్ డెస్కులు, మీటింగ్ రూమ్‌లు, కాన్ఫరెన్స్ రూములు ఉన్నాయి. మా టీమ్ ప్రతిరోజూ నిర్వహణా బాధ్యతల్ని పర్యవేక్షిస్తూ సహాయ సహకారాలను అందిస్తుంది' అని నగరంలో కో-వర్కింగ్ స్పేస్ నిర్వహిస్తున్న స్ప్రింట్ ఇండియా ప్రతినిధులు చెబుతున్నారు.

కేఫ్స్, హోటల్స్, మాల్స్‌లోనూ..

కో-వర్కింగ్ ప్లేస్‌లు ఇప్పుడు నగరాల్లోని మాల్స్, హోటల్స్, కేఫ్స్‌కు కూడా విస్తరించడం గమనార్హం. ఇటీవలే వియ్ వర్క్ అనే గ్లోబల్ కంపెనీ, అమీర్‌పేటలోని ఎంపీఎమ్ మాల్‌లో తమ కో-వర్కింగ్ స్పేస్‌ను ప్రారంభించింది. అలాగే నగరంలో 25 సెంటర్స్‌ను నిర్వహిస్తున్న బ్రాండ్. 'ఆఫీస్(ఏడబ్ల్యూఎఫ్ఐఎస్)' ఈ ఏడాది చివరి నాటికి కొత్తగా 40,000 సీటింగ్‌ను జోడించడం ద్వారా తన పోర్ట్‌ఫోలియోను విస్తరించాలని యోచిస్తోంది. గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ సైబర్ సిటీలో 2.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆఫీస్ స్పేస్‌ను స్మార్ట్‌వర్క్స్ కో-వర్కింగ్ స్పేసెస్ ఇటీవలే లీజుకు తీసుకుంది.



దేశంలో మనమే ముందు..

నగరంలోని ఆఫీస్ మార్కెట్ గతేడాది ప్రథమార్ధలోనే 50 లక్షల చదరపు అడుగుల లీజును దాటేసింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు వర్క్‌స్పేస్‌ల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అద్దం పడుతున్నాయి. దేశంలో ఫ్లెక్సిబుల్ కో-వర్కింగ్ స్పేస్‌లను అందించడంలో హైదరాబాద్ ముందుందని ఇటీవల ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇతర నగరాలతో పోలిస్తే, తెలంగాణ రాష్ట్ర రాజధానిలో స్థలాలకు వ్యయం చాలా తక్కువని ఆయన అంటున్న మాట. పాశ్చాత్య దేశాల్లోని పలు నగరాల్లో దాదాపు 50 శాతం కో-వర్కింగ్ స్పేస్‌లే ఆక్రమించాయి. ప్రస్తుతం నగరంలో వీటి విజృంభణ చూస్తుంటే భవిష్యత్తులో వాటి సరసన మన నగరమూ నిలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



జింఖానాలో రగ్బీ సీనియర్ చాంపియన్ షిప్

13 జిల్లాల నుంచి పాల్గొన్న 300 మంది క్రీడాకారులు

సాక్షి, సిటీ బ్యూరో: నగరంలోని సికింద్రాబాద్ జింఖానా మైదానం వేదికగా మేడ్చల్ జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ రగ్బీ 7ఎస్ టోర్నమెంట్‌కు రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. పురుషులు, మహిళల విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో సంజయ్ జూపూడి ఖేలో స్పోర్ట్స్, ఎల్‌సీహెచ్ లయన్స్ ఎథీనా టీమ్స్‌తో పాటు 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం గెలిచిన జట్లకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ రగ్బీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.నరేంద్రరామ్, ప్రధాన కార్యదర్శి ఉత్పల ఆదిత్య అవార్డులను ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతి రంగారెడ్డి జిల్లా, 2వ బహుమతి నల్గొండ, 3వ బహుమతి మేడ్చల్ జిల్లా మహిళల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ జిల్లా, 2వ బహుమతి రంగారెడ్డి, 3వ బహుమతి నల్గొండ జిల్లాలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల రగ్బీ అసోసియేషన్ కార్యదర్శులు, కోచ్, మేనేజర్లు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లిని దర్శించుకున్న నితీష్ కుమార్‌రెడ్డి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ దేవాలయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి పెద్దమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. సోమవారం ఉదయం అమ్మవారి ఆలయానికి విచ్చేసి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

18న అలెన్ వాకర్ షో..



సాక్షి, సిటీబ్యూరో: నార్వే దేశానికి చెందిన అంతర్జాతీయ డీజే అలెన్ వాకర్ తన వాకర్‌వరల్డ్ ఇండియా టూర్‌లో భాగంగా నగరానికి వస్తున్నారు. 'ఫేడెడ్', 'ఆన్ మై వే' వంటి హిట్ ట్రాక్‌లతో ఎలక్ట్రానిక్ సంగీత రంగంలో సంచలనంగా నిలిచిన వాకర్-2025 భారత పర్యటన ఏప్రిల్ 17న గౌహతిలో ప్రారంభమైంది. ఆయన ఈ నెల 18న నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న బౌల్డర్ హిల్స్‌లో తన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రదర్శన అనంతరం 19న భువనేశ్వర్‌లో, 20న జైపూర్‌లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలెన్ వాకర్: వాకర్ వరల్డ్ ఇండియా టూర్‌ను స్పేస్ బౌండ్ సంస్థ నిర్వహిస్తోంది.



ఆకట్టుకున్న 'సృజన-2025'

సాక్షి, సిటీబ్యూరో: వైవిధ్యభరిత ఆలోచనలతో విద్యార్థులు సమర్పించిన అత్యాధునిక ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కొండాపూర్‌లోని కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కేఎల్‌హెచ్‌జీబీఎస్) తమ క్యాంపస్‌లో సృజన-2025 పేరిట టెక్నో ఆర్ట్ ఫెస్ట్ సోమవారం నిర్వహించింది. దీనిలో భాగంగా విద్యార్థులు తాము రూపొందించిన పిక్సెల్ గేమ్‌లు, డిజిటల్ కొల్లెజ్‌లు, డిజిటల్ ఆర్ట్ వర్క్‌లను ప్రదర్శించారు. అదే విధంగా కొందరు షార్ట్ ఫిల్మ్‌లు, క్యారెక్టర్ యానిమేషన్, గ్రాఫిక్ డిజైన్ వర్క్‌లను కూడా రూపొందించగా.. గేమ్‌లు అధునాతన స్టోరీ టెల్లింగ్ యానిమేషన్‌లతో సహా పలు ప్రాజెక్ట్‌లతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక సంస్కృతిని పెంపొందించడం లక్ష్యంగా వారికి వాస్తవ-ప్రపంచ అవగాహన అందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని స్కూల్ నిర్వాహకులు తెలిపారు.

ఖండాంతరాలు దాటిన నృత్యం

దేశంలోనే కాదు పాశ్చాత్య దేశాల్లోనూ ప్రదర్శనలు చేస్తూ భారత దేశ ప్రాచీన నాట్య కళలను విశ్వవ్యాప్తం చేస్తున్నారు సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని భరత, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు. ప్రముఖ నాట్యాచారిణి నల్లా రమాదేవి శిక్షణలో తర్ఫీదు పొందుతున్న శ్రీవారి పాదాలు భరత నాట్య, కూచిపూడి అకాడమీ విద్యార్థినులు దేశవ్యాప్తంగా ఉన్న శక్తిపీఠాలు, జ్యోతిర్లింగాలే వేదికగా పలు ప్రదర్శనలు చేసి గుర్తింపు పొందారు. రెండేళ్లుగా వివిధ దేశాల్లోనూ నృత్య ప్రదర్శనలు చేసి భారతీయ కళలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నారు. కొద్ది నెలల్లో అమెరికాలోని చికాగో, డల్లాస్ రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నారు.

- సికింద్రాబాద్



- జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలే వేదికలు
- 15 దేశాల్లో 30 నృత్యప్రదర్శనలు
- ప్రాచీన నృత్య పరిరక్షణకు ప్రయత్నం
- శ్రీవారి పాదాలు డ్యాన్స్ అకాడమీ కృషి

సరిగ్గా పదేళ్ల క్రితం 2015లో వెస్ట్ మారేడుపల్లిలో నల్లా రమాదేవి ప్రారంభించిన శ్రీవారి పాదాలు భరతనాట్యం, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఎందరో ప్రతిభావంతులైన నృత్య కళాకారులను అందించింది. ఇక్కడ శిక్షణ పొందిన వందలాది మందిలో 120 మంది సుశిక్షితులైన నృత్య కళాకారులుగా రాణిస్తున్నారు. ఇందులో 25 మంది కళాకారులు దేశ విదేశాల్లో నృత్య కళాశాలలు ఏర్పాటు చేసుకుని శిక్షణ ఇస్తుండడం ఈ డ్యాన్స్ అకాడమీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నాలుగేళ్ల కోర్సు అనంతరం, డిప్లొమా, పీజీ వరకూ సర్టిఫికెట్ కోర్సులు పొందే విధంగా ఇక్కడ శిక్షణ కొనసాగుతోంది. ప్రస్తుతం 200 మంది బాలికలు కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ పొందుతున్నారు. నాలుగేళ్ల బాల్యం నుంచి పీజీ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసేంత వరకూ ఈ అకాడమీలో శిక్షణ ఇస్తున్నారు.

జ్యోతిర్లింగాల నుంచి తొలి అడుగు..

ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు నృత్య గురువు నల్లా రమాదేవి నేతృత్వంలో నగరంలో పలు ప్రదర్శనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన సందర్భాల్లో నాట్య ప్రదర్శనలు చేయడం మామూలైన నేటి తరుణంలో ఏదైనా ప్రత్యేకతను సొంతం చేసుకోవాలన్న తపన మేరకు ప్రత్యేక ప్రదర్శనల కోసం జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలను వేదికలుగా శ్రీవారి పాదాలు నృత్య అకాడమీని ఎంచుకున్నారు.



అంతర్జాతీయ ప్రదర్శనలు..

ఇస్కాన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కృష్ణభగవాన్ దేవాలయాల్లో దేశవ్యాప్తంగా పలు ప్రదర్శనలు చేసిన అకాడమీకి చెందిన కళాకారులు అనేక పురస్కారాలు అందుకున్నారు. నృత్య కళకు సార్థకం చేకూర్చాలన్న తపనతో ఇప్పటి వరకూ 15 అష్టాదశ శక్తి పీఠాలు, జ్యోతిర్లింగాల ముందు ప్రదర్శనలు చేశారు. మలేషియా, ఇండోనేషియా, నేపాల్, బ్యాంకాగ్, దుబాయ్, శ్రీలంక, వియత్నాం వంటి దేశాల్లో బతుకమ్మ, శివతాండవం వంటి నృత్య రూపకాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ ఏడాది మే నెల్లో అమెరికాలో నృత్యరూపకాల ప్రదర్శనలు ఇచ్చేందుకు సమాయత్తం అవుతున్నారు.



బాల్యం నుంచే మక్కువ..

నాట్యం అంటే చిన్ననాటి నుంచే ప్రాణం. భద్రాచలంలో పెరిగిన నేను అక్కడే నాట్యగురువు గిరిజాదేవి వద్ద నాట్యం నేర్చుకుని, భద్రాద్రి రాముడి సన్నిధిలోనే అరంగేట్రం చేశాను. భరతనాట్యం, కూచిపూడి నేర్చుకుని కళాశాల విద్య వరకూ భద్రాద్రి పరిసర ప్రాంతాల్లో పలు ప్రదర్శనలు ఇచ్చా. అయితే పదిహేనేళ్ల క్రితం భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు మా కుటుంబంతో షిఫ్ట్ అయ్యాం. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరినా సంతృప్తి కలగలేదు. నాట్యంపై మమకారంతో ఉద్యోగం వదిలి పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో డ్యాన్స్ సర్టిఫికేషన్ కోర్సులో చేరి మరింత తర్ఫీదు పొందాను. డాక్టర్ ఇందిరా హేమ సహకారంతో శ్రీవారి పాదాలు పేరుతో డ్యాన్స్ అకాడమీని ప్రారంభించాను.

- నల్లా రమాదేవి, శ్రీవారి పాదాలు డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు

లింక్డ్ఇన్ టాప్ 25 కంపెనీల జాబితా విడుదల

సాక్షి, సిటీబ్యూరో: ఉద్యోగార్థులకు సేవలు అందించే ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ఇన్ ఈ ఏడాది అత్యుత్తమ కెరీర్‌కు అవకాశాలు అందిస్తున్న కంపెనీల జాబితాను రూపొందించింది. ఈ విషయాన్ని లింక్డ్ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్, సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నీరజిత బెనర్జీ వెల్లడించారు. అధ్యయనం అనంతరం రూపొందించిన ఈ జాబితాలో ఫైనాన్స్, ఐటీ సాఫ్ట్‌వేర్ రంగాలకు చెందిన కంపెనీలు 25 స్థానాల్లో 19 స్థానాలను దక్కించుకున్నాయని, టీసీఎస్ తొలిస్థానంలో, యాక్సెంచర్, ఇన్ఫోసిస్‌లు వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచాయని వెల్లడించారు.



అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షలు జరిమానా

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్‌పై రూ. 12 లక్షలు జరిమానా విధించారు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. దాంతో నిబంధనల ప్రకారం అక్షర్‌పై జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంతో ఈ సీజన్‌లో కెప్టెన్‌లు హార్దిక్ పాండ్యా (ముంబై), రిషభ్ పంత్ (లక్నో), రియాన్ పరాగ్, సామ్సన్ (రాజస్తాన్), రజత్ పాటీదార్ (ఆర్‌సీబీ) కూడా జరిమానాకు గురయ్యారు.

రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ఆయుశ్ మాత్రే

గాయం కారణంగా ఐపీఎల్ 18వ సీజన్ నుంచి వైదొలిగిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ముంబైకు చెందిన 17 ఏళ్ల ఆయుశ్ మాత్రేను చెన్నై ఎంపిక చేసుకుంది. ఆయుశ్‌కు రూ. 30 లక్షలు చెల్లిస్తారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకు ఆడే ఆయుశ్ ఇప్పటి వరకు తొమ్మిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఏడు లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడి 962 పరుగులు చేశాడు. మరోవైపు ఆడమ్ జంపా స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కర్ణాటకకు చెందిన స్మరణ్ రవిచంద్రన్‌ను రూ. 30 లక్షలకు జట్టులోకి తీసుకుంది.



చెన్నై గెలిచిందోచ్...

సూపర్ కింగ్స్‌కు కీలక విజయం

5 వికెట్లతో లక్నో ఓటమి ● రాణించిన జడేజా, నూర్, దూబే

మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్‌కు కాస్త ఊరట... వరుసగా ఐదు పరాజయాల తర్వాత పూర్తిగా ఆట మరచినట్లు కనిపించిన జట్టు ఎట్టకేలకు విజయాన్ని నమోదు చేసింది. ప్రత్యర్థి లక్నోను ఆ జట్టు వేదికపైనే స్పిన్‌తో కట్టడి చేసిన సీఎస్‌కే ఆ తర్వాత మరో మూడు బంతులు మిగిలి ఉండగా లక్ష్యం చేరింది. బౌలింగ్‌లో నూర్ అహ్మద్, రవీంద్ర జడేజా కీలకపాత్ర పోషించగా, బ్యాటింగ్‌లో శివమ్ దూబే రాణించాడు. అన్నింటికి మించి మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగా క్రీజ్‌లోకి వచ్చిన ధోని తడబాటు లేకుండా, దూకుడుగా ఆడి జట్టుకు అవసరమైన 'విలువైన' పరుగులు సాధించడం మరో సానుకూలాంశం. మరోవైపు 'హ్యాట్రిక్' విజయాలతో జోరు మీద కనిపించిన లక్నో సమష్టి వైఫల్యంతో ఓటమిని ఆహ్వానించింది.


శివమ్ దూబే ధోని

లక్నో: ఐపీఎల్‌లో ఎట్టకేలకు మూడు వారాల విరామం తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) గెలుపు రుచి చూసింది. సోమవారం జరిగిన పోరులో సీఎస్‌కే 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. కెప్టెన్ రిషభ్ పంత్ (49 బంతుల్లో 63; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, మిచెల్ మార్ష్ (25 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం చెన్నై 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసింది. శివమ్ దూబే (37 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) గెలుపు దిశగా నడిపించగా, ఎమ్మెస్ ధోని (11 బంతుల్లో 26 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 28 బంతుల్లో అభేద్యంగా 57 పరుగులు జోడించారు.

పంత్ హాఫ్ సెంచరీ...

తొలి ఓవర్లోనే మార్క్‌రమ్ (6) అవుట్ కాగా, టోర్నీ ప్రస్తుత టాప్ స్కోరర్ నికోలస్ పూరన్ (8) కూడా విఫలం కావడంతో లక్నోకు సరైన ఆరంభం లభించలేదు. ఖలీల్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి మార్ష్ జోరు ప్రదర్శించగా, పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 42 పరుగులకు చేరింది. సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 80 స్ట్రయిక్ రేట్‌తో 40 పరుగులే చేసిన పంత్ ఈ మ్యాచ్‌లో పట్టుదలగా ఆడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. మరో ఎండ్‌లో మార్ష్‌ను జడేజా వెనక్కి పంపగా... ఓవర్టన్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టిన ఆయుశ్ బదోని (17 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా జడేజా బౌలింగ్‌లోనే అవుటయ్యాడు. అప్పటి వరకు మెరుగ్గానే ఆడిన పంత్‌ను చెన్నై స్పిన్నర్లు పూర్తిగా కట్టిపడేశారు. ముఖ్యంగా నూర్ బౌలింగ్‌లో 15 బంతులు ఆడిన పంత్ 10 బంతుల్లో సింగిల్ కూడా తీయలేకపోయాడు! అయితే ఆ తర్వాత పతిరణ ఓవర్లో 2 సిక్స్‌లు బాదడంతో 42 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. చివరి 3 ఓవర్లలో లక్నో 45 పరుగులు సాధించింది.


పంత్

కీలక భాగస్వామ్యం...

2023 సీజన్ నుంచి చెన్నై జట్టుతో ఉన్న ఆంధ్ర ఆటగాడు షేక్ రషీద్ (19 బంతుల్లో 27; 6 ఫోర్లు)కు తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. కొన్ని చక్కటి షాట్లతో అతను ఆకట్టుకున్నాడు. ఆకాశ్‌దీప్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను, శార్దుల్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టడం విశేషం. అయితే అవేశ్ ఓవర్లో భారీ షాట్ ఆడే క్రమంలో అతని ఇన్నింగ్స్ ముగిసింది. మరో ఎండ్‌లో రచిన్ రవీంద్ర (22 బంతుల్లో 37; 5 ఫోర్లు) కూడా వేగంగా ఆడటంతో పవర్‌ప్లేలో చెన్నై 59 పరుగులు సాధించింది. అయితే ఆ తర్వాత తక్కువ వ్యవధిలో జట్టు రచిన్, త్రిపాఠి (9), జడేజా (7), విజయ్‌శంకర్ (9) వికెట్లు కోల్పోవడంతో పాటు పరుగులు రావడం కూడా కష్టంగా మారిపోయింది. విజయానికి 30 బంతుల్లో 56 పరుగులు కావాల్సిన స్థితిలో దూబే, ధోని జత కలిశారు. తాను ఆడిన తొలి బంతుల్లోనే 3 ఫోర్లు, ఒక సిక్స్ బాది ధోని దూకుడు ప్రదర్శించడంలో ఒత్తిడి కాస్త తగ్గింది. చివరి 2 ఓవర్లలో 24 పరుగులు అవసరమయ్యాయి. శార్దుల్ వేసిన 19వ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ సహా 19 పరుగులు రాబట్టి విజయాన్ని దాదాపు ఖాయం చేసుకున్న చెన్నై... మరో మూడు బంతుల్లో లాంఛనం పూర్తి చేసింది.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	6	4	2	8	1.081
ఢిల్లీ	5	4	1	8	0.899
బెంగళూరు	6	4	2	8	0.672
లక్నో	7	4	3	8	0.086
కోల్‌కతా	6	3	3	6	0.803
పంజాబ్	5	3	2	6	0.065
ముంబై	6	2	4	4	0.104
రాజస్తాన్	6	2	4	4	-0.838
హైదరాబాద్	6	2	4	4	-1.245
చెన్నై	7	2	5	4	-1.276

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) త్రిపాఠి (బి) అహ్మద్ 6; మార్ష్ (బి) జడేజా 30; పూరన్ (ఎల్బీ) (బి) కంబోజ్ 8; పంత్ (సి) ధోని (బి) పతిరణ 63; బదోని (స్టంప్డ్) ధోని (బి) జడేజా 22; సమద్ (రనౌట్) 20; మిల్లర్ (నాటౌట్) 0; శార్దుల్ (సి) రషీద్ (బి) పతిరణ 6; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 166. వికెట్ల పతనం: 1-6, 2-23, 3-73, 4-105, 5-158, 6-158, 7-166. బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-38-1, అన్షుల్ కంబోజ్ 3-0-20-1, ఓవర్టన్ 2-0-24-0, జడేజా 3-0-24-2, నూర్ అహ్మద్ 4-0-13-0, పతిరణ 4-0-45-2.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రషీద్ (సి) పూరన్ (బి) అవేశ్ 27; రచిన్ (ఎల్బీ) (బి) మార్క్‌రమ్ 37; రాహుల్ త్రిపాఠి (సి అండ్ బి) రవి బిష్ణోయ్ 9; జడేజా (సి) మార్క్‌రమ్ (బి) రవి బిష్ణోయ్ 7; శివమ్ దూబే (నాటౌట్) 43; విజయ్‌శంకర్ (సి) అవేశ్ (బి) దిగ్వేశ్ రాఠీ 9; ధోని (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (19.3 ఓవర్లలో 5 వికెట్లకు) 168. వికెట్ల పతనం: 1-52, 2-74, 3-76, 4-96, 5-111. బౌలింగ్: శార్దుల్ ఠాకూర్ 4-0-56-0, ఆకాశ్‌దీప్ 1-0-13-0, దిగ్వేశ్ రాఠీ 4-0-23-1, అవేశ్ ఖాన్ 3.3-0-32-1, రవి బిష్ణోయ్ 3-0-18-2, మార్క్‌రమ్ 4-0-25-1.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × కోల్‌కతా
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ధీరజ్‌కు కాంస్య పతకం

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీ



సెంట్రల్ ఫ్లోరిడా (అమెరికా): ఆర్చరీ-2025 సీజన్ తొలి టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటుకున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో భారత్ నాలుగు పతకాలు గెల్చుకుంది. చివరిరోజు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కాంస్య పతక మ్యాచ్‌లో 23 ఏళ్ల ధీరజ్ 6-4 (28-28, 28-29, 29-29, 29-28, 30-29) సెట్ పాయింట్లతో ఆండ్రెస్ టెమినో మెడీల్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. అంతకుముందు సెమీఫైనల్లో ధీరజ్ 1-7 (27-28, 28-30, 29-29, 26-30) సెట్ పాయింట్లతో ఫ్లోరియన్ ఉన్‌రా (జర్మనీ) చేతిలో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్‌లో 666 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచిన ధీరజ్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో 6-0తో కెమిరన్ పికెరింగ్ (బెర్ముడా)పై, రెండో రౌండ్‌లో 7-1తో కార్లోస్ రొజాస్ (మెక్సికో)పై, మూడో రౌండ్‌లో 7-3తో అతాను దాస్ (భారత్)పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో థామస్ చిరాల్ట్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 11వ స్థానంలో ఉన్న ధీరజ్ ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా పని చేస్తున్నాడు. ఇదే టోర్నీలో ధీరజ్ రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి భారత్‌కు రజత పతకాన్ని అందించాడు. ఇదే టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ సహచరుడు రిషభ్ యాదవ్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. అభిషేక్ వర్మ, రిషభ్ యాదవ్, ఓజస్ ప్రవీణ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాంపౌండ్ టీమ్ విభాగంలో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తదుపరి ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నమెంట్ చైనాలోని షాంఘై నగరంలో మే 6 నుంచి 11వ తేదీ వరకు జరుగుతుంది.

10 ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీలలో ధీరజ్ సాధించిన పతకాలు. ఇందులో వ్యక్తిగత విభాగంలో మూడు కాంస్యాలు ఉన్నాయి. టీమ్ విభాగంలో ఒక స్వర్ణం, నాలుగు కాంస్యాలు, రెండు రజతాలు ఉన్నాయి.


హంపి గేమ్ 'డ్రా'... హారిక పరాజయం


హారిక


హంపి

పుణే: 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో తొలి రోజు నలుగురు భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి రమేశ్‌బాబు తమ తొలి గేమ్‌లను 'డ్రా' చేసుకోగా... ద్రోణవల్లి హారిక పరాజయం చవిచూసింది. ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ విజయంతో శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి రౌండ్ గేముల్లో భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలితో నల్లపావులతో ఆడిన ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ హంపి 53 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినెర్ 53 ఎత్తుల్లో హారికపై గెలుపొందింది. నుర్గుల్ సలీమోవా (బల్గేరియా)తో జరిగిన గేమ్‌లో నల్లపావులతో పోటీపడ్డ దివ్య దేశ్‌ముఖ్ 53 ఎత్తుల్లో నెగ్గడం విశేషం. భారత ప్లేయర్ల గేమ్‌లన్నీ 53 ఎత్తుల్లోనే ముగియడం గమనార్హం. ఇతర తొలి రౌండ్ గేముల్లో బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ 85 ఎత్తుల్లో మెలియా సలోమీ (జార్జియా)పై, పొలీనా షువలోవా (రష్యా) 57 ఎత్తుల్లో అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్)పై గెలుపొందారు. మొత్తం 10 మంది ప్లేయర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరగనుంది.

సాక్షి సినిమా



రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'తు మేరా లవర్' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో పాడారు. అలాగే ఈ పాట కోసం దివంగత ప్రముఖ సంగీత దర్శకులు చక్రి స్వరాన్ని 'ఏఐ' (కృత్రిమ మేధస్సు) సాయంతో రీ క్రియేట్ చేయడం విశేషం.

పవర్‌ఫుల్ పోలీస్


● మేఘనా గుల్జార్, పృథ్వీరాజ్, కరీనా కపూర్

పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ వైపు దర్శకుడిగా, మరోవైపు హీరోగా వరుస చిత్రాలు చేస్తున్నారు. మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో రూపొందిన 'ఎల్2: ఎంపురాన్' చిత్రం మార్చి 27న విడుదలైన హిట్‌గా నిలిచింది. తాజాగా పృథ్వీరాజ్ హీరోగా నటించనున్న బాలీవుడ్ చిత్రం 'దైరా' ప్రకటన వచ్చింది. 'రాజీ, చపాక్, సామ్ బహదూర్' మూవీస్ ఫేమ్ మేఘనా గుల్జార్ 'దైరా'కి దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీలో కరీనా కపూర్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. పృథ్వీరాజ్, కరీనా, మేఘనా గుల్జార్ కలిసి ఉన్న ఫొటోని షేర్ చేసి, 'దైరా'ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. వాస్తవ ఘటనల నేపథ్యంలో పాన్ ఇండియన్ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు.

మదరాసి డేట్ ఫిక్స్

శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మదరాసి'. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్. శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో శివ కార్తికేయన్ ఇంటెన్స్ లుక్ ఆకట్టుకుంటోంది. ''హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మదరాసి'. ఈ మూవీలో సరికొత్త ఎగ్జయిటింగ్ యాక్షన్ ప్యాక్డ్ కథను చూపించబోతున్నారు మురుగదాస్'' అని యూనిట్ పేర్కొంది. విద్యుత్ జమాల్, బిజు మీనన్, షబ్బీర్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమేరా: సుదీప్ ఎలామోన్.


● శివ కార్తికేయన్

హిట్ 3 చూస్తున్నప్పుడు పూనకం వస్తుంది - నాని


● సాను జాన్ వర్గీస్, శైలేష్ కొలను, నాని, రాజేశ్, నాగేంద్ర

''ఓ సినిమాలో భావోద్వేగాలు బలంగా ఉన్నప్పుడు వైలెన్స్ పండుతుంది. 'హిట్ 3' చిత్రంలోని వైలెన్స్ చూస్తున్నప్పుడు పూనకం వస్తుంది. దానికి కారణం ఆ సన్నివేశాల్లోని భావోద్వేగం. ఈ మూవీలో యాక్షన్ సరికొత్తగా ఉంటుంది'' అని నాని తెలిపారు. శైలేష్ కొలను దర్శకత్వంలో నాని హీరోగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటించారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న విడుదలకానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సోమవారం ఉదయం వైజాగ్‌లో జరిగింది. అనంతరం హైదరాబాద్‌లో సాయంత్రం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో **నాని మాట్లాడుతూ–** ''ఈ మధ్యకాలంలో సినిమా రిలీజ్‌కి చివరి నిమిషంలో ట్రైలర్స్ రిలీజ్ చేస్తున్నారు. ఇంతకు ముందు 20 రోజుల ముందే ట్రైలర్ వచ్చేది. ఆ అనుభూతిని మళ్లీ ఇద్దామని మా సినిమా ట్రైలర్‌ని ముందుగానే రిలీజ్ చేశాం. ట్రైలర్‌కి వస్తున్న అద్భుతమైన స్పందనకి కారణం శైలేష్ అండ్ టీం.. వారందరికీ ధన్యవాదాలు. మా చిత్రం కొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. నేను చెప్పింది కరెక్ట్ కాదనిపిస్తే నెక్ట్స్ టైమ్ నన్ను నమ్మకండి(నవ్వుతూ). సినిమా అనేది బాధ్యత. మేము ఎంత బాధ్యతగా తీశామో సినిమా చూస్తే మీకే అర్థం అవుతుంది'' అన్నారు. **శైలేష్ కొలను మాట్లాడుతూ–** ''హిట్ 3'లో నాని చేసిన అర్జున్ సర్కార్ పాత్ర ఫిక్షనల్‌గానే క్రియేట్ చేశాం. ఇందులో సందేశం కూడా ఉంది. ధర్మం కోసం నిలబడ్డ మనిషి ఎంత దూరం వెళ్లాడనేది ఈ చిత్రంలో చూస్తారు'' అన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో కెమేరామేన్ సాను జాన్ వర్గీస్, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర మాట్లాడారు.

ప్రేక్షకుల అభినందనలే ముఖ్యం - సంపత్ నంది



''రచ్చ, బెంగాల్ టైగర్, గౌతమ్ నంద'.. ఈ తరహా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న నేను 'ఓదెల 2'లాంటి కథ రాస్తాననుకోలేదు. నా భార్య మా ఇంట్లో శివలింగాన్ని ప్రతిష్ఠించి ఎనిమిదేళ్లుగా పూజలు చేస్తోంది. మా నానమ్మ శివశక్తిగా ఉండేవారు. అప్పట్లో నేను కొన్ని సంఘటలను మా ఊర్లో గమనించాను. నా మనసులో ఉన్న అవన్నీ 'ఓదెల 2' రూపంలో బయటకు వచ్చాయి'' అని దర్శక- నిర్మాత, రచయిత సంపత్ నంది అన్నారు. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓదెల 2'. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సంపత్ నంది మాట్లాడుతూ–''అశోక్ తేజని డైరెక్టర్ చేయాలని 'ఓదెల రైల్వేస్టేషన్' మూవీ తీశాం. ఆహా ఓటీటీలో విడుదలైన ఆ మూవీ చాలా సక్సెస్ అయ్యింది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'ఓదెల 2' చేస్తే బాగుంటుందన్నట్లుగా అశోక్ తేజ చెప్పాడు. ఓ సారి భీమ్స్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్ చేస్తున్నప్పుడు సీక్వెల్ క్రియేట్ చేయవచ్చనిఅనిపించింది. తొలిపార్టులో రాధ క్యారెక్టర్ హైలైట్ అవుతుంది. సీక్వెల్‌లో మరో ఫీమేల్ క్యారెక్టర్ అయితే బలంగా ఉంటుందని శివశక్తి పాత్రకు తమన్నాగారిని తీసుకున్నాం. ఆత్మకు, పరమాత్మకు మధ్య జరిగే యుద్ధమే 'ఓదెల 2'. ఓ పంచాక్షరి మంత్రంతో నాగసాధువు శివశక్తి.. ఓ ప్రేతాత్మను ఎలా కంట్రోల్ చేసింది? అన్నదే కథాంశం. 'అరుంధతి' సినిమాతో మా చిత్రానికి పోలిక లేదు. నిర్మాత రాధామోహన్‌గారికి 'ఓదెల 2' కథ చెప్పాను. ఆ సమయంలో ఆయన హిందీ మూవీతో బిజీగా ఉండటంతో డి.మధుగారు నిర్మించారు. సాంకేతిక నిపుణులకు డబ్బు ముఖ్యం కాదు.. ప్రేక్షకుల అభినందనలే ముఖ్యం. 'ఓదెల 3' కి అవకాశం ఉంది. నా దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ పీరియాడికల్ ఫిల్మ్ రానుంది. దర్శకుడిగా నాకు కొంత గ్యాప్ వచ్చింది. కానీ.. మరో ముప్పై ఏళ్ల ఇండస్ట్రీలో ఉండేలా సినిమాలు చేసుకుంటూ వెళ్లాలనుకుంటున్నాను'' అని చెప్పారు.

భావోద్వేగాలే నా బలం - ప్రదీప్ చిలుకూరి



''చిన్నతనంలో మన బర్త్ డేని తల్లిదండ్రులు ఓ ఎమోషనల్‌లా ఫీలై సెలబ్రేట్ చేస్తారు. తల్లిదండ్రుల బర్త్ డేలను పిల్లలు గుర్తు పెట్టుకుని సెలబ్రేట్ చేయడం కూడా ఓ మంచి ఎమోషన్. ఇదే 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీ కథాంశం'' అని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి అన్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా, విజయశాంతి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–''దర్శకుడిగా నా తొలి చిత్రం 'రాజా చెయ్యి వేస్తే'(2016) సరిగ్గా ఆడలేదు. ఆ తర్వాత ఇద్దరు పెద్ద హీరోల కోసం రెండు కథలు సిద్ధం చేశాను. కానీ, ఆ సినిమాలు సెట్స్‌పైకి వెళ్లలేదు. అలా దర్శకుడిగా నాకు గ్యాప్ వచ్చింది. కల్యాణ్‌రామ్‌గారితో మాట్లాడినప్పుడు ఓ మాస్ ఫిల్మ్ చేద్దామన్నారు. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'లోని తల్లి పాత్రని విజయశాంతిగారు చేస్తేనే చేద్దామని ఆయన స్పష్టంగా చెప్పారు. విజయశాంతిగారికి కథ చెప్పగా కొన్ని మార్పులు సూచించారు. యూపీఎస్సీకి ప్రిపేర్ అయ్యే కొడుకు అర్జున్ పాత్రలో కల్యాణ్‌రామ్, ఐపీఎస్ వైజయంతి పాత్రలో విజయశాంతి నటించారు. ఈ మూవీలో ఆమె యాక్షన్ సీక్వెన్స్‌లు అద్భుతంగా చేశారు. ఎన్టీఆర్‌గారు సినిమా చూసి, బాగుందని చెప్పడం సంతోషం. అజనీష్ లోకనాథ్ అదిరిపోయే ఆర్ఆర్ ఇచ్చారు. ఓ దర్శకుడిగా భావోద్వేగాలను ప్రజెంట్ చేయడమే నా బలం'' అని తెలిపారు.

ఆలోచింపచేసే దండోరా


● బిందు మాధవి

నవదీప్, బిందు మాధవి, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బిందు మాధవి జాయిన్ అయినట్లు మేకర్స్ తెలిపారు. ''తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'దండోరా'. ఈ మూవీలో బిందు మాధవి వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ఎమోషనల్ టచ్‌తో ఉంటూ ఆలోచింప చేసేలా ఆమె పాత్ర ఉంటుంది. 25రోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: వెంకట్ ఆర్.శాఖమూరి, సంగీతం: మార్క్ కె.రాబిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎడ్వర్డ్ పేరజీ, సహ నిర్మాత: అనీష్ మరిశెట్టి.

ఏదో ఏదో జరిగెనే...


● రాహుల్, నేహాపాండే

రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటించిన హిలేరియస్ ఫన్ రైడ్ మూవీ 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో...' అంటూ సాగే లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు పూర్ణాచారి లిరిక్స్ అందించగా, కార్తీక్-హరిణి పాడారు. ''ఏదో ఏదో ఏదో జరిగెనే.. ఎద లోపల, ఏవో ఏవో కలలు విరిసెనే.. నిన్నా మొన్నా లేనే లేదిలా అరే ఏంటిలా..'' అంటూ ఈ పాట సాగుతుంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
15-4-2025

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,310	429
75,157	22,829

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	16,736	▲	14
డోజోన్స్	40,360	▲	147
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,134	▲	170
డాక్స్	20,955	▲	581
షాంఘై	3,263	▲	25
నికాయ్	33,982	▲	397

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.21	87.89
£	బ్రిటన్ పౌండ్	110.43	115.19
€	యూరో	95.56	9.93
¥	జపాన్ యెన్ (100)	49.00	71.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	51.40	56.22
S$	సింగపూర్ డాలర్	62.90	67.53
SAR	సౌదీ రియాల్	22.04	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	22.54	24.32
¥	చైనా యువాన్	10.91	12.74



ఎస్‌బీఐ వడ్డీ రేట్లూ తగ్గాయ్‌

- రెపో, ఈబీఎల్‌ఎల్ రుణ రేట్లు 0.25 శాతం తగ్గింపు
- డిపాజిట్లపై 0.1–0.25 శాతం కోత

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ డిపాజిట్లు, రుణ రేట్లను తగ్గిస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ నిర్ణయంతో డిపాజిట్లపై రాబడి తగ్గనుండగా.. రుణ గ్రహీతలకు వెసులుబాటు లభించనుంది. రెపో అనుసంధానిత లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 8.25 శాతానికి దిగొచ్చింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత రుణ రేటు (ఈబీఎల్‌ఆర్)ను సైతం 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.65 శాతం చేసింది. ఏప్రిల్ 15 నుంచి ఈ రేట్లు అమల్లోకి రానున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. ఆర్‌బీఐ గత వారం రెపో రేటును పావు శాతం తగ్గించడం తెలిసిందే. దీంతో ఈ మేరకు ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు ఎస్‌బీఐ బదిలీ చేయడం గమనార్హం. అదే సమయంలో వివిధ కాల వ్యవధి కలిగిన డిపాజిట్లపైనా 10–25 బేసిస్ పాయింట్లు (0.1–0.25 శాతం) మేర వడ్డీ రేట్లను ఎస్‌బీఐ తగ్గించింది. ఇవి కూడా ఈ నెల 15 నుంచే అమల్లోకి రానున్నాయి.

- రూ.3 కోట్ల వరకు ఎఫ్‌డీలపై 1–2 ఏళ్ల కాల వ్యవధికి ఇక మీదట వడ్డీ రేటు 6.70 శాతంగా ఉంటుంది. 10 బేసిస్ పాయింట్లు తగ్గింది.
- 2 ఏళ్ల నుంచి మూడేళ్లలోపు డిపాజిట్లపై 7 శాతం రేటు కాస్తా 6.90 శాతానికి దిగొచ్చింది.
- రూ.3 కోట్లకు మించిన 180–210 రోజుల కాల వ్యవధి డిపాజిట్లపై 20 బేసిస్ పాయింట్లు తగ్గి 6.40 శాతానికి పరిమితం అయింది. అదే 211 రోజుల నుంచి ఏడాదిలోపు డిపాజిట్లపై 25 బేసిస్ పాయింట్లు తగ్గడంతో 6.50 శాతంగా ఉంది.
- ఎస్‌బీఐ గ్రీన్ టర్మ్ డిపాజిట్లపైనా 10 బేసిస్ పాయింట్ల వరకు రేటు తగ్గింది.
- 444 రోజుల డిపాజిట్‌పై 7.05 శాతం రేటు అమలు కానుంది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం సేవింగ్స్ డిపాజిట్ల రేటును 0.25 శాతం తగ్గించి 2.75 శాతం చేయడం గమనార్హం. రూ.50 లక్షలకు మించిన మొత్తంపై రేటు 3.5 శాతం నుంచి 3.25 శాతానికి దిగొచ్చింది.

సరికొత్త ఫోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్‌-లైన్

ప్రారంభ ధర రూ. 49 లక్షలు

ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా కొత్తగా టిగువాన్ ఆర్‌-లైన్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాన్ని (ఎస్‌యూవీ) ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధ ర రూ. 49 లక్షలుగా ఉంటుంది. ఇందులో కొత్త తరం చాసిస్, 2.0 లీటర్ టీఎస్ఐ ఈవీవో ఇంజిన్, ఎయిర్‌-కేర్ క్లైమేట్రోనిక్ (3 జోన్ ఎయిర్ కండీషనింగ్), పార్క్ అసిస్ట్ ప్లస్, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టం, 21 లెవెల్ 2 ఏడీఏఎస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టం) వంటి ఫీచర్లు ఉన్నాయి. ఏప్రిల్ 23 నుంచి దేశవ్యాప్తంగా త మ డీలర్‌షిప్ నెట్‌వర్క్‌లో వీటి డెలివరీలు ప్రారంభమవుతాయని కంపెనీ ఎండీ పీయుష్ ఆరోరా తెలిపారు.



రిలయన్స్‌ జ్యువెల్స్‌ తిరుపతి కలెక్షన్‌



ముంబై: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని రిలయన్స్ జ్యువెల్స్ తన 'జ్యువెల్ ఆఫ్ ఇండియా' పదో ఎడిషన్‌లో భాగంగా 'తిరుపతి కలెక్షన్' పేరిట ప్రత్యేక ఆభరణాలు తీసుకొచ్చింది. తిరుమల సాంస్కృతిక వారసత్వం, దేవస్థానం వాస్తు నైపుణ్యం, వెంకటేశ్వర స్వామి దివ్యత్వం స్ఫూర్తితో ఈ కలెక్షన్ రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా బంగారు ఆభరణాల తయారీ చార్జీలపై 25% వరకు, వజ్రాభరణాలపై 30% వరకు డిస్కౌంట్ అందిస్తుంది. పాత బంగారంపై 100% మార్పిడి విలువ పొందవచ్చు. మే 5 వరకు అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ సీఈవో సునీల్ నాయక్ కోరారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

15-4-2025

విశాఖ	420–00
చిత్తూరు	460–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

దేశీ స్టాక్‌ ఇండెక్సులకు బూస్ట్‌

ప్రపంచ స్టాక్‌ మార్కెట్లు అప్‌

- టారిఫ్‌లపై యూఎస్ వెనకడుగు
- ఎలక్ట్రానిక్స్‌కు మినహాయింపు ఎఫెక్ట్
- బాండ్ల ఈల్డ్ డీలా, పసిడి మెరుపులు

నేడు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యే వీలుంది. ఆసియా, యూరప్, యూఎస్ మార్కెట్లు బలపడటంతో సెంటిమెంటు మెరుగుపడింది. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లను 90 రోజుల వరకూ నిలిపివేయడంతోపాటు.. ఎలక్ట్రానిక్స్‌కు మినహాయింపు ప్రకటించడంతో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లలో హుషారు నెలకొంది.

ముంబై: అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం దేశీ స్టాక్‌మార్కెట్లు పనిచేయనప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో ఆసియా మార్కెట్లు 0.5–1.5% బలపడ్డాయి. యూరోపియన్ మార్కెట్లు మరింత అధికంగా 1.5–2.5% ఎగశాయి. యూఎస్ మార్కెట్లు సైతం 1% పైగా లాభాలతో ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నేడు (మంగళవారం) దేశీ మార్కెట్లు సానుకూలంగా కదిలే వీలున్నట్లు నిపుణులు తెలిపారు. ఇప్పటికే యూఎస్ టారిఫ్‌ల అమలు 3 నెలలపాటు నిలిచిపోగా.. తాజాగా ఎలక్ట్రానిక్స్‌కు మినహాయింపు లభించింది. కంప్యూటర్ చిప్స్, మొబైల్స్, ల్యాప్‌టాప్‌సహా పలు ప్రొడక్టులపై కొత్త టారిఫ్‌లను ఎత్తివేశారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సానుకూలంగా ట్రేడయ్యే వీలున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అయితే టారిఫ్‌ల నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థలు కుదేలుకావచ్చన్న ఆందోళనలు అటు ముడిచమురు ధరలను.. ఇటు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరును దెబ్బతీస్తున్నట్లు వివరించారు. టోక్యో ఎలక్ట్రాన్, శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తదితర షేర్లు లాభపడ్డాయి. మార్చిలో చైనా ఎగుమతులు 12 శాతంపైగా పుంజుకున్నట్లు చైనా ప్రభుత్వం వెల్లడించింది.



బాండ్లు, కరెన్సీపై..

తాజాగా 10ఏళ్ల యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్ 4.47 శాతానికి బలపడింది. ఒక దశలో 4.58 శాతానికి ఎగసింది. వారంక్రితం 4.01 శాతంగా నమోదైంది. వెరసి ట్రేడ్ వార్ కారణంగా యూఎస్ వెలుపలి ఇన్వెస్టర్లు ట్రెజరీ బాండ్లను విక్రయిస్తున్నట్లు ఫారెక్స్ వర్గాలు చెబుతున్నాయి. ఇతర నష్టాలను కవర్ చేసుకునే బాటలో హెడ్జ్ ఫండ్స్ సైతం బాండ్లను విక్రయిస్తున్నట్లు తెలియజేశాయి. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లపై అటూఇటుగా వ్యవహరిస్తుండటంతో ప్రపంచ దేశాలలో రక్షణాత్మకంగా భావించే యూఎస్‌పై విశ్వాసం తగ్గే అవకాశమున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. ఇది మరోవైపు పసిడికి డిమాండును పెంచుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో న్యూ యార్క్ కామెక్స్‌లో ఔన్స్ బంగారం తాజాగా 3,261 డాలర్లను తాకింది.

ద్రవ్యోల్బణం..

ట్రంప్ టారిఫ్ ప్రణాళికలు రానున్న నెలల్లో ద్రవ్యోల్బణాన్ని పెంచనున్నట్లు ఆర్థికవేత్తలు అంచనా వేశారు. మార్చి గణాంకాలు అంచనాలకంటే మెరుగ్గా ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నట్లు భావిస్తున్నారు. ఫలితంగా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ పరపతి విధానాల్లో స్వేచ్ఛగా వ్యవహరించలేకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

> గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం(18న) స్టాక్ మార్కెట్లతోపాటు కమోడిటీ మార్కెట్లు సైతం పనిచేయవు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయలేదు. దీంతో ఈ వారం ట్రేడింగ్ 3 రోజులకే పరిమితంకానుంది. కాగా.. ఈ వారం
>
> **శుక్రవారం సెలవు**
>
> పలు దిగ్గజాలు జనవరి–మార్చి(క్యూ4) ఫలితాలు ప్రకటించనున్నాయి. 15న ఇరెడా, ఐసీఐసీఐ ప్రు, 16న స్వరాజ్ ఇంజిన్స్, విప్రో, 17న హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఏఎంసీ, ఇన్ఫోసిస్, టాటాఎలక్సీ, 18న మాస్టెక్, 19న హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యస్ బ్యాంకుల పనితీరు వెల్లడికానుంది.

డీజిల్‌కు డిమాండ్‌ డౌన్‌..

2024–25లో 2 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: పర్యావరణహిత ఇంధనాల వైపు మళ్లే ధోరణి పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది (2024–25) డీజిల్ డిమాండ్ నెమ్మదించింది. డీజిల్ వినియోగం 2 శాతమే పెరిగి 91.4 మిలియన్ టన్నులకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది ఏకంగా 12.1%. దేశీయంగా వినియోగించే ఇంధనాల్లో డీజిల్ వాటా దాదా పు 40% ఉంటుంది. డీజిల్ వినియోగం నెమ్మదించినప్పటికీ దేశీయంగా రవాణా రంగంలో నాలుగింట మూడొంతుల వాటా ఈ ఇంధనానిదే ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కమర్షియల్ ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లుతుండటంతో డీజిల్ డిమాండ్‌పై ప్రభావం పడుతోందని వివరించాయి.



సిబ్బంది తగ్గింపు వార్తలు అవాస్తవం: డాక్టర్‌ రెడ్డీస్‌

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెవ్‌లిమిడ్ ఔషధ ఆధారిత మార్జిన్లు తగ్గడంతో సిబ్బంది సంఖ్యను 25 శాతం తగ్గించుకుంటున్నట్లుగా వచ్చిన వార్తలను ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఖండించింది. ఇది అవాస్తవమని స్పష్టం చేసింది. అలాంటి చర్యలేమీ తీసుకోలేదని వివరించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఈఎస్‌ఐసీ, న్యూఢిల్లీలో 558 స్పెషలిస్ట్‌ గ్రేడ్‌2 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్‌ఐసీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ గ్రేడ్2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 558.
- » **పోస్టుల వివరాలు:** స్పెషలిస్ట్ గ్రేడ్2 (సీనియర్ స్కేల్)–155, స్పెషలిస్ట్ గ్రేడ్2 (జూనియర్ స్కేల్)–403.
- » **అర్హత:** ఎంఎస్, ఎండీ, ఎంసీహెచ్, డీఎం, డీఏ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ, డీపీఎం ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 26.05.2025 నాటికి 45 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** స్పెషలిస్ట్ గ్రేడ్2 సీనియర్ స్కేల్ పోస్టులకు రూ.78,800. స్పెషలిస్ట్ గ్రేడ్2 జూనియర్ స్కేల్ పోస్టులకు రూ.67,700.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.05.2025
- » **వెబ్‌సైట్:** https://www.esic.gov.in

కర్నూలు సిల్వర్‌ సెట్‌-2025

కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల (కో ఎడ్యుకేషన్, అటానమస్) 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి సిల్వర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా వివిధ యూజీ నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు(ఇంగ్లిష్ మీడియం)ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు-సీట్ల వివరాలు

- » బీకాం(జనరల్)–20 సీట్లు, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్)–20 సీట్లు, బీఏ(హిస్టరీ, ఎకనామిక్స్)–20 సీట్లు, బీఏ(ఎకనామిక్స్)–20 సీట్లు, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్)–45 సీట్లు, బీఎస్సీ(మ్యాథ్స్)–25 సీట్లు, బీఎస్సీ(ఫిజిక్స్)–25 సీట్లు, బీఎస్సీ(బోటనీ)–20 సీట్లు, బీఎస్సీ(జువాలజీ)–20 సీట్లు, బీఎస్సీ(మైక్రోబయాలజీ)–20 సీట్లు, బీఎస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ)–20 సీట్లు, బీఎస్సీ(కెమిస్ట్రీ)–25 సీట్లు.
- » **అర్హత:** మార్చి–2025లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025
- » **కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షతేది:** 18.05.2025.
- » **వెబ్‌సైట్:** www.sjgckurnool.edu.in

ఏరోనాటికల్‌ డెవలప్‌మెంట్‌ ఏజెన్సీలో 137 సైంటిస్ట్‌ పోస్టులు

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ) వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ సైంటిస్ట్ బి, ప్రాజెక్ట్ సైంటిస్ట్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 137.
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ బి–105, సైంటిస్ట్ సి–32.
- » **విభాగాలు:** ఏరోనాటికల్, మెటలర్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, మాస్టర్స్ డిగ్రీ, గేట్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 21.04.2025 నాటికి సైంటిస్ట్–సి పోస్టులకు 40 ఏళ్లు, సైంటిస్ట్–బి పోస్టులకు 35 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు సైంటిస్ట్–బి పోస్టులకు రూ.90,789, సైంటిస్ట్–సి పోస్టులకు రూ.1,08,073.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
- » **వెబ్‌సైట్:** https://www.ada.gov.in

కాప్‌తో ఐఐటీ, పీఎస్‌యూ ఆఫర్లు

» సీఓఏపీతో ఐఐటీ, పీఎస్‌యూల్లోని ఆఫర్ల వివరాలు

» 2025-26 విద్యాసంవత్సరానికి మొదలైన ప్రక్రియ

సీఓఏపీ.. కామన్ ఆఫర్ యాక్సెప్టెన్స్ పోర్టల్! ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా అభ్యర్థులు తమ గేట్ స్కోర్‌కు అనుగుణంగా సీటు కేటాయించిన ఐఐటీల వివరాలు.. జాబ్ ఆఫర్ ఇచ్చిన పీఎస్‌యూల సమాచారం తెలుసుకోవచ్చు! గేట్ ర్యాంకర్లకు ఎంటెక్ అడ్మిషన్లు, పీఎస్‌యూ ఆఫర్ల ప్రక్రియ సరళీకృతంగా ఉండాలనే ఉద్దేశంతో అమల్లోకి తెచ్చిన విధానమే.. సీఓఏపీ పోర్టల్. 2025-26 విద్యా సంవత్సరానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీఓఏపీ విధానం, ఐఐటీల్లో సీట్లు, పీఎస్‌యూ జాబ్ ఆఫర్లు తదితర వివరాలు..



గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్)లో ర్యాంకు సొంతం చేసుకొని ఐఐటీల్లో ఎంటెక్, అదేవిధంగా పీఎస్‌యూల్లో ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులు తమకు లభించిన ఆఫర్లను తెలుసుకునేందుకు అమల్లోకి తెచ్చిన ఆన్‌లైన్ విధానమే కామన్ యాక్సెప్టెన్స్ పోర్టల్(సీఓఏపీ). అంటే.. ఐఐటీల్లో ఎంటెక్ ప్రవేశాలు, పీఎస్‌యూ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు లభించిన పలు ఆఫర్లను వీక్షించే అవకాశం, తమకు నచ్చిన ఆఫర్‌కు సమ్మతి తెలిపేందుకు వీలు కల్పించే ఉమ్మడి వేదిక సీఓఏపీ.

2017 నుంచే అమలు

సీఓఏపీ విధానాన్ని 2017లోనే ప్రారంభించారు. మొదటి ఏడాదిలో కేవలం ఎనిమిది ఐఐటీలే ఈ ప్రక్రియలో పాల్గొనగా.. తర్వాత దాదాపు అన్ని ఐఐటీలు సీఓఏపీవైపు మొగ్గు చూపాయి. ఈ విధానం సరైన ఫలితాలు ఇవ్వడంతో గేట్ స్కోర్ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ)లు కూడా సీఓఏపీ పట్ల ఆసక్తి చూపాయి. 2025–26 విద్యా సంవత్సరానికి మొత్తం 24 ఐఐటీలు, ఐఐఎస్‌సీ–బెంగళూరు, ఎన్‌పీసీఐఎల్ తదితర ప్రముఖ పీఎస్‌యూలు సీఓఏపీ విధానంలో ఆఫర్లు ఇవ్వడానికి నిర్ణయించాయి. ఈ ఏడాది ఈ ప్రక్రియను ఐఐఎస్‌ఈ–బెంగళూరు నిర్వహిస్తోంది.

సీఓఏపీతో ప్రయోజనాలు

- సీఓఏపీ ద్వారా ఐఐటీల్లో ఎంటెక్ కోర్సులకు, పీఎస్‌యూ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న గేట్ ర్యాంకర్లకు ప్రయోజనం ఉంటుంది.
- తాము దరఖాస్తు చేసుకున్న ఐఐటీలు ఇచ్చిన ఎంటెక్ ఆఫర్లను, పీఎస్‌యూల జాబ్ ఆఫర్లను తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్‌లు, పీఎస్‌యూలు తాము ఇచ్చిన ఆఫర్లను సీఓఏపీ పోర్టల్‌లో పొందుపరుస్తాయి.
- అదేవిధంగా రౌండ్ల వారీగా ఉండే ఆఫర్లను కూడా అభ్యర్థులు తెలుసుకోవచ్చు. ఆయా ఆయా ఆఫర్లను సమ్మతించే అవకాశం లేదా తదుపరి రౌండ్లలో ఆఫర్ల కోసం వేచి చూసే అవకాశం కూడా కల్పించారు.
- అంటే ఒక రకంగా ఇది ఐఐటీల్లో సీట్ల కేటాయింపు పరంగా ఉమ్మడి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ వంటిదే. పలు రౌండ్లలో సీఓఏపీ ద్వారా ఆఫర్లను వీక్షించి.. నిర్ణయం తీసుకునే అవకాశం ఇందులో అందుబాటులో ఉంటుంది.

వేర్వేరుగా దరఖాస్తు తప్పనిసరి

కామన్ ఆఫర్ యాక్సెప్టెన్స్ పోర్టల్ ద్వారా ఐఐటీల్లో తమకు కేటాయించిన సీట్లను తెలుసుకునే అవకాశం ఉంటుంది. సీఓఏపీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ.. ఐఐటీల్లో ఎంటెక్ సీటు కోసం తమకు ఆసక్తి ఉన్న ఐఐటీలకు వేర్వేరుగా దరఖాస్తుగా చేసుకోవాల్సిందే. ఇదే విధానం పీఎస్‌యూ జాబ్ ఆఫర్ల విషయంలోనూ అమలవుతోంది. ఇలా వచ్చిన దరఖాస్తులను ఆయా ఐఐటీల వర్గాలు పరిశీలించి.. సీటు కేటాయింపు జాబితాను రూపొందిస్తాయి. ఆ జాబితాను సీఓఏపీ పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతాయి.

సీఓఏపీ రిజిస్ట్రేషన్ ఆధారంగా

ఎంటెక్‌లో ప్రవేశాలకు ఆయా ఐఐటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా సీఓఏపీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. అంటే ముందుగా సీఓఏపీలో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ నెంబర్ పొందిన విద్యార్థులే ఐఐటీల్లో ఎంటెక్ దరఖాస్తులకు అర్హులవుతారు. ఇలా రెండు రకాలుగా (సీఓఏపీ, ఐఐటీలకు వేర్వేరుగా) రిజిస్ట్రేషన్ ఎందుకు? అంటే.. ఐఐటీల్లో సీటు లభించిన విద్యార్థులు సీఓఏపీ ద్వారానే తమ సమ్మతి లేదా తిరస్కరణ విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుందని, సీఓఏపీలో పొందుపర్చిన వివరాలు, ఐఐటీ దరఖాస్తు వివరాలు ఒకే విధంగా ఉండేలా చూడడమే దీని ఉద్దేశమని పేర్కొంటున్నారు.

సీఓఏపీ అయిదు రౌండ్లలో

- సీఓఏపీ రిజిస్ట్రేషన్ ఆధారంగా అభ్యర్థులు తమకు లభించిన సీటు, ఇన్‌స్టిట్యూట్ వివరాలను అయిదు రౌండ్లలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇలా దశల వారీగా ఆఫర్లను తెలియజేసే క్రమంలో.. యాక్సెప్ట్ అండ్ ఫ్రీజ్; రిటైన్ అండ్ వెయిట్; రిజెక్ట్ అండ్ వెయిట్.. విధానంలో అభ్యర్థులు తమకు లభించిన ఆఫర్లను చూసుకునేందుకు, తగిన నిర్ణయం తీసుకునేందుకు అవకాశం కల్పించారు.
- **రౌండ్ 1:** మే 17 నుంచి 20 వరకు; **రౌండ్ 2:** మే 23 నుంచి 26 వరకు; **రౌండ్ 3:** మే 29 నుంచి జూన్ 2 వరకు; **రౌండ్ 4:** జూన్ 5 నుంచి జూన్ 08 వరకు; **రౌండ్ 5:** జూన్ 11 నుంచి జూన్ 14 వరకు ఉంటాయి.

మూడు ఆప్షన్ల వివరాలు

- **యాక్సెప్ట్ అండ్ ఫ్రీజ్:** అభ్యర్థులు మొదటి రౌండ్‌లో తమకు లభించిన సీటు లేదా ఇన్‌స్టిట్యూట్ విషయంలో సంతృప్తి చెందితే యాక్సెప్ట్ అండ్ ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. ఈ ఆప్షన్‌ను ఎంచుకున్న వారికి తదుపరి రౌండ్లలో ఆఫర్లు చూసుకుని, మార్పుచేర్పులు చేసుకునే అవకాశం ఉండదు. యాక్సెప్ట్ అండ్ ఫ్రీజ్ చేసిన ఇన్‌స్టిట్యూట్‌లోనే చేరాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక విద్యార్థికి ఐఐటీ–చెన్నైలో సీటు లభించి.. యాక్సెప్ట్ అండ్ ఫ్రీజ్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే తదుపరి రౌండ్లలో మరో ఐఐటీలో ఆఫర్‌ను ఎంచుకునే అవకాశం ఉండదు.
- **రిటెయిన్ అండ్ వెయిట్:** మొదటి రౌండ్‌లో లభించిన సీటు/ఇన్‌స్టిట్యూట్‌కు సమ్మతి తెలుపుతూనే.. మరింత మెరుగైన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు కావాలనుకునే విద్యార్థులు రిటెయిన్ అండ్ వెయిట్ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఆప్షన్‌ను ఎంచుకున్న విద్యార్థులు తదుపరి రౌండ్లలోని ఆఫర్లను చూసుకుని.. దానికి అనుగుణంగా తమ నిర్ణయంలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది.
- **రిజెక్ట్ అండ్ వెయిట్:** ఒక రౌండ్‌లో వచ్చిన అన్ని ఆఫర్లను (సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్స్) తిరస్కరించి.. తదుపరి రౌండ్లలో మరింత మెరుగైన ఆఫర్లు లభిస్తాయని భావించే విద్యార్థులు రిజెక్ట్ అండ్ వెయిట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. వీరికి తదుపరి రౌండ్లలో ఆఫర్లను వీక్షించే అవకాశం ఉంటుంది. ఒకవేళ తొలి రౌండ్‌లో లభించిన సీటు, ఇన్‌స్టిట్యూట్‌లోనే కొనసాగాలనుకుంటే.. కేవలం రెండు సార్లు మాత్రమే రిటెయిన్ అండ్ వెయిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది.
- ఇలా ప్రతి రౌండ్‌లోనూ పైన పేర్కొన్న ఆప్షన్లను ఎంచుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా సబ్మిట్ బటన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడే వారు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఐఐటీలో చేరేందుకు లేదా ఇతర రౌండ్లలో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుంది.
- ఇదే తీరుగా పీఎస్‌యూ జాబ్ ఆఫర్లు కూడా కనిపిస్తాయి. వాటి విషయంలోనూ పైన పేర్కొన్న విధంగా అందుబాటులో ఉన్న మూడు ఆప్షన్లను క్లిక్ చేసి సబ్మిట్ చేసే అవకాశం ఉంటుంది.

ఇన్‌స్టిట్యూట్‌ల మలిదశ ఎంపిక

సీఓఏపీలోని పలు రౌండ్ల ద్వారా తమకు లభించిన సీటు, ఇన్‌స్టిట్యూట్‌కు సమ్మతి తెలిపిన విద్యార్థులు.. తర్వాత సంబంధిత ఇన్‌స్టిట్యూట్ మలి దశలో నిర్వహించే ప్రక్రియ వివరాలు తెలుసుకుని.. వాటికి ప్రత్యేకంగా హాజరవ్వాల్సి ఉంటుంది. ఐఐటీలు, పీఎస్‌యూలు నిర్వహించే గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలకు సిద్ధం కావాలి. వాటిలో విజయం సాధించిన వారికే సీటు ఖరారు అవుతుంది.

సీఓఏపీ నమోదు(రిజిస్ట్రేషన్) ఇలా

- ముందుగా సీఓఏపీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం అభ్యర్థులు గేట్ రిజిస్ట్రేషన్ నెంబర్, గేట్ పేపర్ స్కోర్, గేట్ స్కోర్, పేరు, పుట్టిన తేదీ వివరాలు నింపి సబ్మిట్ టు రిజిస్టర్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత రీడ్ ప్రొసీజర్ అండ్ ఇన్‌స్ట్రక్షన్స్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత యాక్సెప్ట్ టర్మ్స్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్‌పై క్లిక్ చేయాలి.
- ఈ ప్రక్రియ పూర్తయ్యాక.. గేట్ రిజిస్ట్రేషన్ నెంబర్, గేట్ పేపర్ కోడ్, గేట్ స్కోర్, తమ పేరు, పుట్టిన తేదీ, ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్ కాలమ్స్‌ను పూర్తి చేసి సబ్మిట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- ఇలా సబ్మిట్ రిజిస్ట్రేషన్ బటన్‌పై క్లిక్ చేశాక.. అభ్యర్థులకు ఈ–మెయిల్ లేదా మొబైల్‌కు ఎస్ఎంఎస్ రూపంలో లాగిన్ సమాచారం వస్తుంది.
- ఈ–మెయిల్‌లో వెబ్‌సైట్ యూఆర్ఎల్, లాగిన్ వివరాలు, ఎస్ఎంఎస్‌లో పాస్‌వర్డ్ వివరాలు వస్తాయి.
- వీటి ఆధారంగా లాగిన్ అండ్ వెరిఫై రిజిస్ట్రేషన్ డిటెయిల్స్‌ను క్లిక్ చేయాలి. ఆ తర్వాత గేట్ స్కోర్లకు సంబంధించి ఇతర స్కోర్లు ఉంటే వాటిని తెలియజేసి సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి..అభ్యర్థులకు ఐఐటీల్లో అడ్మిషన్ లేదా పీఎస్‌యూ జాబ్ ఆఫర్ల వివరాలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

సీఓఏపీ-2025 సమాచారం

- **అర్హత:** బీటెక్ ఉత్తీర్ణతతోపాటు 2023, 2024, 2025లో ఏదో ఒక సంవత్సరంలో గేట్ ర్యాంకు సాధించి ఉండాలి.
- ఐఐటీల్లో బీటెక్ చదువుతూ సీజీపీఏ 8కి పైగా ఉన్న అభ్యర్థులకు సీఓఏపీ రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు ఉంటుంది. అలాంటి అభ్యర్థులు నేరుగా ఐఐటీల్లోని ఎంటెక్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- **సీఓఏపీ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్:** https://gate.iisc.ac.in/coap2025

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

‘లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ’ అవార్డు అందుకున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్‌కు అరుదైన గౌరవం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి జపాన్ నుంచి ‘లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ’అవార్డును అందుకున్నారు. భారత్ తరపున ఈ అరుదైన గౌరవాన్ని పొందిన వ్యక్తిగా మొదటి గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌గా ఆయన చరిత్ర సృష్టించారు. ఈ అవార్డును శోవా విశ్వవిద్యాలయ హాస్పిటల్, టోక్యోలో నిర్వహించిన టోక్యో లైవ్ గ్లోబల్ ఎండోస్కోపీ 2025 కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి క్లిష్టమైన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ (ఏఐ) వైద్య పద్ధతులను ప్రదర్శించారు. ఆయనకు ఎండోస్కోపీలో జీవితకాల సేవలు, పరిశోధనలు, ఆరోగ్య సంరక్షణలో గ్లోబల్ సహకారానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ అవార్డును శోవా విశ్వవిద్యాలయం కోటో టోయోసు హాస్పిటల్‌లోని ప్రొఫెసర్ హారుహిరో ఇనోయూ, జపాన్ గ్యాస్ట్రోఎంటరోలాజికల్ ఎండోస్కోపీ సొసైటీ అధ్యక్షుడు షిన్జి టనాకా సమక్షంలో ప్రదానం చేశారు. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జపాన్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ల నుంచి అందుకున్న ఈ గౌరవం తనకు గొప్ప సంతృప్తినిస్తుందన్నారు.

కొత్త విద్యా సంవత్సరంలో పాత పద్ధతిలోనే ప్రవేశాలు

ఎస్సీ వర్గీకరణ అమలు లేకుండానే అడ్మిషన్లు కల్పించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియలో రిజర్వేషన్ల అమలుపై గందరగోళం నెలకొంది. ఇప్పటికే ఎంసెట్, ఇతర వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేసి కొత్త చట్టాన్ని ఈనెల 14వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం గెజిట్ వెలువడిన నాటి నుంచే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల చట్టం అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పలు కోర్సుల ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్లు వెలువడగా.. క్షేత్రస్థాయిలో విద్యార్థులంతా దరఖాస్తు చేసుకున్నారు. అతి త్వరలో విద్యాశాఖ అధికారులు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాల విడుదల తర్వాత ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ గెజిట్ నాటికే నోటిఫికేషన్లు వెలువడటంతో ప్రవేశాల ప్రక్రియ పాతపద్ధతిలోనే నిర్వహిస్తారనే చర్చ ఇప్పుడు విద్యాశాఖ అధికారుల్లో కొనసాగుతోంది. ఒకవేళ వర్గీకరణ అనంతరం రిజర్వేషన్లు అమలు చేయాలంటే నోటిఫికేషన్లలో సవరణ చేయాలని, అలా చేస్తే న్యాయపరమైన చిక్కులు కూడా తలెత్తే ప్రమాదం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ

అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాలపై అవగాహన, అప్రమత్తతతోనే ప్రమాదాలు జరగకుండా నియంత్రించగలమని తెలంగాణ అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి అన్నారు. అగ్నిమాపక శాఖ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి వట్టినాగులపల్లిలోని తెలంగాణ అగ్నిమాపకశాఖ శిక్షణ సంస్థలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీజీ నాగిరెడ్డి పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా సోమవారం నుంచి ఈనెల 20 వరకు ‘అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అవగాహన పెంచుదాం.. సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం’అన్న ఇతివృత్తంతో నిర్వహిస్తున్న అగ్నిమాపక సేవా వారోత్సవాలను ఈ సందర్భంగా డీజీ ప్రారంభించారు. వారంరోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ ఫైటింగ్ కోసం అత్యాధునిక పరికరాలు తెలంగాణ అగ్నిమాపకశాఖ వద్ద అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. అగ్ని ప్రమాదాల నియంత్రణలో ప్రజలు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎస్సీ గురుకులంలో ఫోన్ మిత్ర

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని విద్యార్థులకు ఫోన్‌మిత్ర పేరిట సరికొత్త కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గురుకుల పాఠశాలలో గరిష్ఠంగా 10 టెలిఫోన్ బాక్సులను అందుబాటులో ఉంచుతుంది. విద్యార్థుల తల్లిదండ్రుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లు ఈ బాక్సులో నిక్షిప్తమై ఉంటాయి. తల్లిదండ్రులతో మాట్లాడాలనుకున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ఇచ్చిన యాక్సిస్ కార్డు ద్వారా ఉచితంగా మాట్లాడే అవకాశం ఉంటుంది. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శేరిలింగంపల్లి మండలం గౌలిదొడ్డిలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 268 ఎస్సీ గురుకులాల్లో ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు.

గిగ్ వర్కర్ల కోసం కొత్త చట్టం

మేడే రోజున అమలులోకి వచ్చేలా ప్రభుత్వం కసరత్తు.. ఆన్‌లైన్‌లో ముసాయిదా బిల్లు

ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలతో తుది బిల్లు రూపొందించాలి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

గిగ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: గిగ్ ప్లాట్‌ఫామ్ వర్కర్లకు భద్రత కల్పించే ముసాయిదా బిల్లుపై ప్రజాభిప్రాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలో గిగ్ ప్లాట్‌ఫామ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ముసాయిదా బిల్లును ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించాలని, వాటిని పరిశీలించి తుది బిల్లులో పొందుపరచాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం, ఇతర హక్కులను కల్పించేలా కార్మిక శాఖ ‘తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫామ్‌వర్కర్స్’బిల్లు ముసాయిదాను రూపొందించింది. అందులో పొందుపరిచిన అంశాలను అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆ ముసాయిదాకు పలు మార్పులు, చేర్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వటంతో పాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయం, సుహృద్భావం ఉండేలా కొత్త చట్టం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవర్లు, ప్యాకేజ్ డెలివరీ రంగాల్లో దాదాపు 4 లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని, అన్ని వర్గాల నుంచి సలహాలు స్వీకరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్మిక దినోత్సవమైన మేడే రోజున చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గిగ్ వర్కర్ల భద్రతకు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. దేశంలోనే మొదటి సారిగా గిగ్‌వర్కర్లకు ప్రమాద బీమాను అమలు చేశామని చెప్పారు. గిగ్ వర్కర్లు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమాను అందించేలా 2023 డిసెంబర్ 30న తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా అమలు చేసే చట్టం ద్వారా దేశానికి తెలంగాణ మార్గదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్‌రంజన్, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరింత పారదర్శకంగా ప్రజావాణి..

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి మరింత పారదర్శకమైన విధానాలను అమలు చేయలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో జరిగే ప్రజావాణిని, ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణితో అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్, లైవ్ యాక్సెస్‌ను తనకు కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో తాను ఎక్కడ ఉన్నా.. ప్రజావాణి అర్జీల పరిష్కారం తీరును, ప్రజల నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందని అన్నారు.

వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు

గిగ్ వర్కర్ల ముసాయిదా బిల్లు పత్రాలను రాష్ట్ర కార్మిక శాఖ సోమవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ బిల్లుకు సంబంధించి సలహాలు, సూచనలు, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు కార్మిక శాఖ అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఈనెల 28 సాయంత్రం 5 గంటల వరకు ఈమెయిల్ ద్వారా (టీజీ.గిగ్.లేబర్(ఎట్)జిమెయిల్.కామ్), లేదా ‘సజెషన్స్ ఆన్ గిగ్ వర్కర్స్ బిల్’అని కవర్ పేజీమీద రాసి హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని టీఏకేఎస్ భవన్‌లో ఉన్న రాష్ట్ర కార్మిక శాఖ కమిషన్ కార్యాలయానికి పోస్టు ద్వారా నిర్దేశించిన గడువులోగా సమర్పించాలని కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

హైదరాబాద్‌లో ‘భారత్ సమ్మిట్’

ఏప్రిల్ 25, 26 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహణ

ఖర్గే, రాహుల్, ప్రియాంకా గాంధీ తదితరుల రాక

సుమారు వంద దేశాల నుంచి 500 మంది ప్రతినిధులు

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



భారత్ సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రగతిశీల భావజాలం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పరితపించే వ్యక్తులను ఒకే వేదిక మీదకు తెస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో ‘డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్’ని నాదంతో ‘భారత్ సమ్మిట్’ను నిర్వహిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులతో కలిసి సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో భట్టివిక్రమార్క మీడియాతో మాట్లాడారు. అగ్రరాజ్యాల నడుమ ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతున్న సమయంలో నెహ్రూ ప్రారంభించిన అలీనోద్యమ స్ఫూర్తితో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు వంద దేశాల నుంచి రాజకీయవేత్తలు, మేధావులు, వివిధ సంస్థల అధిపతులు సుమారు 500 మంది సదస్సుకు హాజరవుతారన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు పాల్గొంటారని ప్రకటించారు.

ఏటా నిర్వహిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రగతిశీల విధానాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, భావప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వ వనరుల పరిరక్షణ, పంపిణీ వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చ జరుగుతుందని భట్టి తెలిపారు. భౌగోళిక, రాజకీయ, ప్రజాస్వామిక, ఆర్థిక, సామాజిక, యువతకు సంబంధించిన అంశాలపై చర్చాగోష్ఠి ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ‘తెలంగాణ రైజింగ్’ బ్యానర్ కింద రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సదస్సులో వివరిస్తామన్నారు. భారత్ సమ్మిట్‌ను ప్రతి ఏటా నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. సదస్సుకు ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఏఐసీసీ పరిశీలకులు మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ నాయకులు సల్మాన్ ఖుర్షీద్, శామ్ పిత్రోడా, గుర్దీప్ తదితరులు వర్చువల్‌గా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్ సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పర్యావరణ విధ్వంసంపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై భట్టి స్పందించారు. తెలంగాణపై మోదీ ఎందుకు అలా మాట్లాడారో తెలియదన్నారు.

కనీస వేతనాల గెజిట్ ఎందుకు ముద్రించలేదు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనీస వేతనాలకు సంబంధించి గెజిట్ ముద్రించాలని తాము ఆదేశించినా ఎందుకు పాటించలేదో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా, 2007 తర్వాత ఇప్పటివరకు మళ్లీ ఇవ్వలేదని పేర్కొంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 2023లో పిల్ దాఖలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాల పెంపుపై వివిధ ప్రభుత్వ శాఖలు జీవోలు చేసి చేతులు దులుపుకున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. కోటి మందికిపైగా కార్మికులు ప్రభుత్వ చర్యలతో నష్టపోతున్నారని చెప్పారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం.. వెంటనే గెజిట్ ప్రింట్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌ను ఆదేశిస్తూ 2023లోనే ఉత్తర్వులు జారీ చేసింది. 6 వారాలు సమయం ఇచ్చినా అమలు చేయలేదంటూ పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించి.. ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది.

రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్‌గా జస్టిస్ శివశంకర్‌రావు

రాష్ట్ర, హైదరాబాద్, వరంగల్ డిస్ట్రిక్ట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీలు ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్‌గా ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ శివశంకర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీలను ఏర్పాటు చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ..

జస్టిస్ శివశంకర్ రావు, రిటైర్డ్ జడ్జి, ఏపీ హైకోర్టు	చైర్మన్
పి.ప్రమోద్‌కుమార్, రిటైర్డ్ ఐపీఎస్	సభ్యుడు
వర్రే వెంకటేశ్వర్లు, అడ్వొకేట్	సభ్యుడు
అడిషనల్ డీజీ (శాంతిభద్రతలు)	సభ్యకార్యదర్శి

జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (హైదరాబాద్ రీజియన్)..

కె.సుదర్శన్, జిల్లా రిటైర్డ్ జడ్జి	చైర్‌పర్సన్
పి.రామ్మోహన్, మాజీ జర్నలిస్ట్	సభ్యుడు
రామనర్సింహారెడ్డి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ	సభ్యుడు
ఐజీ (మల్టీ జోన్–2)	సభ్య కార్యదర్శి

జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (వరంగల్ రీజియన్)..

వై.అరవింద్‌రెడ్డి, జిల్లా రిటైర్డ్ జడ్జి	చైర్‌పర్సన్
ఎం.నారాయణ, రిటైర్డ్ ఐపీఎస్	సభ్యుడు
సామల రాజేందర్	సభ్యుడు
ఐజీ (మల్టీ జోన్–1)	సభ్య కార్యదర్శి

‘టెట్’ ఫీజు తగ్గించాల్సిందే

ఎన్నికల ముందు తగ్గిస్తామన్న హామీ నిలబెట్టుకోవాలంటున్న నిరుద్యోగులు

ఆ ఫీజు అంతే... ఆన్‌లైన్ వల్లే పెంచాల్సి వచ్చిందన్న విద్యాశాఖ

దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజు తగ్గించాలని నిరుద్యోగుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఒక్కో పేపర్‌కు రూ. 750, రెండు పేపర్లకు కలిపి రూ. 1,000గా ఉన్న ఫీజు తగ్గించాలని ఇప్పటికే పలువురు విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. ఇంకొందరు నేతల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. అధికారంలోకి వస్తే పోటీ పరీక్షల ఫీజులు తగ్గిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేస్తున్నారు. కానీ ఇటీవల ఇచ్చిన టెట్ నోటిఫికేషన్‌లో అలాంటిదేమీ కనిపించలేదని వారు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టెట్‌ను దాదాపు 2.60 లక్షల మంది రాస్తున్నా రు. వారంతా చిన్నాచితక ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ పరీక్ష ఫీజు భారంగా ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజు తగ్గింపు సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం గత వారం విద్యాశాఖను నివేదిక కోరింది. దీంతో విద్యాశాఖ రెండు రోజుల క్రితం ఫీజుపై నివేదిక ఇచ్చింది. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష పెడుతున్నందున నిర్వహణ ఖర్చు ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. అందువల్ల ఫీజు తగ్గింపు సాధ్యంకాదని.. అందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడమూ కష్టమేనని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

రూ. 200 నుంచి రూ. వెయ్యికి...

టెట్ ఫీజు 2011 నుంచి 2017 వరకు రూ. 200గా ఉండేది. 2022లో దాన్ని రూ. 300కు, 2023లో రూ. 440కి పెంచారు. 2024 మార్చిలో టెట్‌ను తొలిసారి ఆన్‌లైన్‌లో నిర్వహించారు. దీంతో విద్యాశాఖ టెట్ ఫీజును ఒకేసారి పేపర్‌కు రూ. వెయ్యి చేసింది. రెండు పేపర్లు రాస్తే రూ. 2 వేలుగా నిర్ణయించింది. దీనిపై నిరుద్యోగుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో స్పందించిన ప్రభుత్వం మరోసారి రాసే టెట్‌కు ఫీజులో సడలింపు ఇస్తామని తెలిపింది. ఆ ప్రకారం 2024 నవంబర్ నోటిఫికేషన్‌లో సడలింపు ఇచ్చింది. 2024 మేలో జరిగిన టెట్ రాసిన అందరికీ నవంబర్ టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేయడానికి అవకాశం కల్పించారు. మిగతా వారికి మాత్రం ఒక పేపర్‌కు రూ. 750, రెండు పేపర్లు రాస్తే రూ. వెయ్యి ఫీజును నిర్ణయించారు. కానీ ఈసారి టెట్‌కు ప్రతి ఒక్కరూ ఫీజు చెల్లించాల్సి రానుంది.

అమ్మో ఇవేం ఫీజులు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇటీవల రాష్ట్ర ఫీజులు, నియంత్రణ మండలి (ఎఫ్ఆర్‌సీ) ప్రభుత్వానికి పంపింది. రెండురోజుల క్రితం ఉన్నతాధికారులు ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. సర్కార్ ఆమోదం తెలిపితే ఎఫ్ఆర్‌సీ ఫీజులను ఖరారు చేసే వీలుందని తెలిపారు. అయితే కాలేజీలు ప్రతిపాదించిన ఫీజులపై ప్రభుత్వం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైనట్టు తెలిసింది. ఫీజులు భారీగా ఉండటం గమనించిన ప్రభుత్వం ..కాలేజీలు కోరుతున్నట్టుగా ఫీజులు పెంచితే ప్రభుత్వం పెద్దయెత్తున విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఫీజుల విషయంలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలిపాయి.

ఎక్కువ వ్యయంతో ఆడిట్ రిపోర్టులు

ఇంజనీరింగ్ ఫీజులను ఎఫ్ఆర్‌సీ ప్రతి మూడేళ్ళకోసారి సమీక్షిస్తుంది. చివరిసారిగా 2022లో కొత్త ఫీజులను ఖరారు చేశారు. ఇవి 2022–23, 2023–24, 2024–25 విద్యా సంవత్సరానికి వర్తించాయి. 2025–26, 2026–27, 2027–28 విద్యా సంవత్సరం కోసం కొత్త ఫీజులను ఖరారు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 157 ఇంజనీరింగ్ కాలేజీలు కొత్త ఫీజులపై ప్రతిపాదనలు పంపాయి. గత మూడేళ్ళుగా కాలేజీల్లో ప్రవేశపెట్టిన కొత్త కోర్సులు, మౌలిక వసతుల కల్పన, ఇతర ఖర్చులతో కూడిన ఆడిట్ రిపోర్టులు సమర్పించాయి. వీటిని ఎఫ్ఆర్‌సీ సూచించిన ఆడిట్ బృందాలు కొన్ని నెలలుగా సమగ్రంగా అధ్యయనం చేశాయి. ఆ తర్వాత కాలేజీలతో విడివిడిగా ఎఫ్ఆర్‌సీ అధికారులు మాట్లాడారు. ఇందులో వెల్లడైన అంశాల ఆధారంగా ఫీజుల పెంపుపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. 2022 వరకూ అంతకు ముందు ఫీజులపై గరిష్ఠంగా 10% పెంచుకునే అవకాశం కల్పించే వాళ్ళు. కానీ ఇప్పుడు కాలేజీల ప్రతిపాదనలు ఊహించని స్థాయిలో ఉన్నాయి. కరోనా తర్వాత పెద్దగా ఫీజులు పెంచలేదని, 2022 తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ సహా పలు కోర్సులు తీసుకొచ్చామని, దీనికి ఫ్యాకల్టీతో పాటు, మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున ఖర్చు చేశామని, ఈ మేరకు ఫీజులు పెంచాలని కాలేజీలు అంటున్నాయి.

ఫీజులు పెంచాల్సిందే..

దాదాపు అన్ని కాలేజీలు పెద్ద ఎత్తున ఫీజుల పెంపు ప్రతిపాదనలు చేశాయి. 52 శాతం నుంచి 84 శాతం ఫీజుల పెంపును కోరుతున్నాయి. కన్వీనర్ కోటా ఫీజు పెరిగితే బీ కేటగిరీ ఫీజులు మరింత పెంచుకోవచ్చని కాలేజీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో రూ.1.50 లక్షల వార్షిక ఫీజు ఉన్న 73 కాలేజీలు ఏకంగా రూ. 2.25 లక్షల వరకూ ఫీజు పెంపును ప్రతిపాదించాయి. 33 కాలేజీల్లో ప్రస్తుతం రూ.లక్ష లోపు ఫీజు ఉంది. దీన్ని రెట్టింపు చేయాలని ఎఫ్ఆర్‌సీ ముందు ప్రతిపాదించాయి. టాప్ టెన్ కాలేజీలు తమ ఫీజులను రూ.2.50 లక్షలకు పెంచాలని కోరుతున్నాయి.

సీఎస్ నేతృత్వంలో కమిటీ!

కాలేజీల ఒత్తిడి నేపథ్యంలో ఫీజులపై వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేయడానికి కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బాధ్యతను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అప్పగించిననట్టు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే అన్ని విశ్వవిద్యాలయాల వీసీల నుంచి ప్రైవేటు కాలేజీల్లో కోర్సులు, మౌలిక వసతులు, ఫీజులపై వివరాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది. ఈ నివేదికలు వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే వీలుందని చెబుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి విధి

- హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్ పిలుపు
- బార్ కౌన్సిల్, హెచ్‌సీఏఏ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి
- పాల్గొన్న జస్టిస్ ఎస్.నంద, జస్టిస్ ఎన్.నర్సింగరావు



జస్టిస్ సుజోయ్ పాల్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడి విధి అని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. అందులో పొందుపర్చిన విలువలను పాటించాలని సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను తెలంగాణ బార్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సుజోయ్‌పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ అమలును పర్యవేక్షించడం, స్వచ్ఛతను కాపాడటం చట్టసభలు, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పని మాత్రమేనా అని ప్రశ్నించారు. రాజ్యాంగ రక్షణ రాజకీయ నేతలకు, న్యాయాధికారులకు వదిలివేయకుండా అందరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. ‘గంగా నది ప్రారంభ స్థానం గంగోత్రి వద్ద నీరు చాలా స్వచ్ఛంగా ఉంటుంది. కిందికి ప్రవహిస్తున్నప్పుడు కలుషితమై తాగడానికి పనికిరాకుండా మారుతుంది. అలాగే రాజ్యాంగం కూడా.. ఎప్పటికప్పుడు మలినాలను తొలగించాల్సిన అవసరం ఉంది. లేదంటే దేశానికే భవిష్యత్ లేకుండా పోయే ప్రమాదం ఉంది’అని వ్యాఖ్యానించారు.

సామాజిక సంక్షేమమే ఆయనకు నివాళి...

జస్టిస్ సూరేపల్లి నందా మాట్లాడుతూ.. అసమానతలపై పోరాటం చేసి, న్యాయమైన సమాజం కోసం మనకు గొప్ప రాజ్యాంగాన్ని అందించిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అభివర్ణించారు. సామాజిక సంక్షేమం అందించడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ నందికొండ నర్సింగరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ.జగన్, బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌సీఏఏ మాజీ అధ్యక్షుడు వి.రఘునాథ్, కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, విజారత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, పక్కన ఈఓ భాస్కర్‌రావు



భక్తులకు ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ వాహనాలు

ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

యాదగిరి క్షేత్రానికి రెండు బ్యాటరీ వాహనాలు అందజేత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి వచ్చే వృద్ధులు, వికలాంగులైన భక్తులకు ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశంతో తమ బ్యాంక్ నుంచి రెండు బ్యాటరీ వాహనాలను అందజేశామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. సోమవారం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి రెండు బ్యాటరీ వాహనాలను ఈఓ భాస్కర్‌రావుకు అందజేసిన అనంతరం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ శ్రీస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం సామాజిక బాధ్యత కింద రెండు బ్యాటరీ వాహనాలను అందజేశామన్నారు. ఒక్కో బ్యాటరీ వాహనం విలువ రూ.8 లక్షలు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విరాళం అందించడంలో దేవస్థానానికి ప్రాధాన్యమిస్తామన్నారు. హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ అనుకూలంగా నడిచే వాహనాలు ఆలయాన్ని సందర్శించే భక్తుల అనుభవాన్ని పెంచుతాయన్నా రు. ఈఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఆలోచనాత్మక సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు స్వామివారిని శ్రీనివాసులు శెట్టి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో భాస్కర్‌రావు ఆయనకు లడ్డూ ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

పార్క్ హయత్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



పార్క్ హయత్ హోటల్‌లో అగ్ని ప్రమాదం

ఎస్ఆర్‌హెచ్ ఆటగాళ్లందరూ క్షేమం

బంజారాహిల్స్ (హైదరాబాద్): సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు క్రికెటర్లు బస చేస్తున్న బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగలు కమ్ముకోవడంతో హోటల్‌లోని అతిథులంతా ఆందోళనకు గురయ్యారు. హోటల్‌లోని 5వ అంతస్తులో క్రికెటర్లు వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులోని స్పాలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా కుర్చీలకు మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా పొగలు కమ్ముకోవడంతో హోటల్ సిబ్బందితో పాటు మిగతావారు ఆందోళనకు గురయ్యారు. అప్పటికే అయిదో అంతస్తులో ఉన్న క్రికెటర్లను అప్రమత్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సన్‌రైజర్స్ ఆటగాళ్లందరూ క్షేమంగా ఉన్నారని హోటల్ యాజమాన్యం వెల్లడించింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు హోటల్ వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



గ్రామంలోని హనుమాన్ దేవాలయాలు

వెల్లుల్ల.. అంజన్న ఖిల్లా..!

ఊరిలో ఒకటి.. రెండు హనుమాన్ దేవాలయాలు ఉండటం మామూలే. ఒకటి రెండు కాదు.. ఏకంగా 45 హనుమాన్ దేవాలయాలు.. అక్కడితో ఆగకుండా వీధుల్లో అక్కడక్కడ గుడి నిర్మాణాలు జరగని అంజన్న విగ్రహాలు పది వరకు కొలువుదీరి ఉన్నాయి. ఈ వింత జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో మనకు కనిపిస్తుంది. గ్రామంలో ఏ మూలకు వెళ్లిన ఓ అంజన్న దేవాలయం దర్శనమిస్తుంది. అక్కడ నిత్యపూజలు, భక్తజన కోలాహలం ఉంటుంది. ఎందుకిలా ఇంత పెద్ద మొత్తంలో అంజన్న దేవాలయాలు ఉన్నాయో తెలుసుకోవాలంటే ఓ సారి ఆ ఊరి చరిత్రలోకి తొంగిచూడాల్సిందే.

కోరుట్ల/మెట్‌పల్లి రూరల్

ఊరంతా హనుమాన్ దేవాలయాలే..

ఎటూ చూసినా అంజన్న గుళ్లు..

వెల్లుల్ల గ్రామ చావడి వద్ద పెద్ద మర్రిచెట్టును ఆనుకుని మూడు దిక్కులా ఎటు చూసినా అంజన్న దేవాలయాలు కనిపిస్తాయి. అక్కడి నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లోకి వెళ్తే.. సందుకు ఓ అంజన్న గుడి కనిపిస్తుంది. ఈ గుళ్లు చిన్నవి.. పెద్దవి కావచ్చు. కానీ ఆయా గుళ్లలో హనుమంతునికి నిత్యపూజలు జరుగుతూనే ఉంటాయి. ఇలా వీధుల్లో ఉన్న అంజన్న దేవాలయాలు లెక్కిస్తే ఏతావాతా 45 వరకు ఉన్నాయి. దేవాలయాలే కాకుండా చెరువు కట్ట వద్ద రెండు హనుమాన్ విగ్రహాలు, గ్రామంలోని నాలుగైదు వీధుల్లో హనుమాన్ విగ్రహాలున్నాయి. వీటికి గుళ్ల నిర్మాణం జరగకున్నా భక్తులు ప్రతీ శనివారం పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సారి కొండగట్టు హనుమాన్ జయంతి సందర్భంగా దాదాపు అన్ని హనుమాన్ దేవాలయాలను కాషాయరంగుల్లో అందంగా తీర్చిదిద్దారు. ప్రతీ దేవాలయంలో అంజన్న దీక్షాపరులు దీక్షల కోసం ప్రత్యేక నిలయాలు ఏర్పాటు చేసుకున్నారు. ఊరి జనాభా సుమారు 2,200 వరకు ఉండగా ఈ సారి హనుమాన్ దీక్షలు తీసుకున్న యువ భక్తుల సంఖ్య ఎంత తక్కువ అనుకున్నా 300 దాకా ఉంటుందని గ్రామానికి చెందిన శ్రీనివాస్ చెప్పడం గమనార్హం. ఇక్కడ ఉన్న అంజన్న గుళ్లకు అభయాంజనేయ, భక్తాంజనేయ, వీరాంజనేయ.. ఇలా వెల్లుల్లలో అంజన్న గుడులు ఉన్న కారణంగా అంజన్న దీక్షా సమయంలో 41 రోజుల పాటు వెల్లుల్ల గ్రామం కాషాయ రంగు పులుముకుని హనుమాన్ భక్తుల సందడి, అంజన్న భజనలతో సందడిగా ఉంటుంది.

మొత్తం 45 గుళ్లు.. 10 విగ్రహాలు

ఎందుకీ ప్రత్యేకత?

జైన చాళుక్యుల పాలనా కాలంలో వెల్లుల్ల గ్రామంలో సుమారు 200 వరకు బ్రాహ్మణ కుటుంబాలు నివాసముండేవి. ఈ బ్రాహ్మణ కుటుంబాల్లో చాలా మంది అంజన్నను ఆరాధ్య దైవంగా భావించేవారు. వీరు తమ ఆరాధ్య దైవానికి నిత్యపూజలు అందించేందుకు వంశాల వారీగా ఎవరికి వారు తమ ఇళ్ల పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో వీలైన రీతిలో పెద్ద, చిన్న ఆంజనేయ గుళ్లు నిర్మించుకున్నారు. గ్రామంలోని గుట్ట గండి సమీపంలో మర్రిచెట్టు వద్ద ఉన్న ఆంజనేయ ఆలయం ఆ కాలంలో ఈ ప్రాంతంలో ఉన్న దొంగల బారి నుంచి తమను అంజన్న కాపాడతాడనే నమ్మకంతోనే నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతారు. ఇలా వంశానికి ఒక్కటి చొప్పున అంజనేయ ఆలయాలు నిర్మించడం గ్రామంలో ప్రతీ వీధిలో అంజన్న గుళ్లు కనిపించడానికి ప్రధాన కారణం. కాలక్రమేణా బ్రాహ్మణ కుటుంబాలు ఇక్కడి నుంచి వలస వెళ్లినప్పటికీ గ్రామస్తులు మాత్రం ఆ గుళ్లను తమ ఇంటి అంజన్నగా మార్చుకుని నిత్య పూజలు నిర్వహించడం ఆచారంగా మార్చుకున్నారు. దీనికి తోడు పురాతన కాలంలో నిర్మించిన అంజన్న దేవాలయాలతో పాటు కొత్తగా ఇంటి దగ్గర అంజన్న గుడి ఉంటే శుభప్రదమన్న నమ్మకంతో కొంత మంది తమ తమ ఇళ్ల వద్ద అంజన్న గుళ్లు నిర్మించడంతో పాత, కొత్త అంజన్న దేవాలయాలన్నీ కలిసి వెల్లుల్ల గ్రామాన్ని 'అంజన్న ఆలయాల ఖిల్లా'గా మార్చాయి.

వంశానికో వాయుపుత్రుడు

బ్రాహ్మణులు ఏర్పాటు చేసినవే



జైనుల కాలంలో వెల్లుల్ల గ్రామంలో సుమారు 200 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవని చెబుతారు. ఆ కుటుంబాలు ఎవరికి వారు అంజన్న గుడులు నిర్మించి నిత్య పూజలు చేసేవారని పెద్దలు చెప్తారు. బ్రాహ్మణులు ఇక్కడి నుంచి వెళ్లిపోయినా అవే గుళ్లు ఇప్పటికీ ప్రజలకు ఆరాధ్యదైవాలుగా మారి పూజలు అందుకుంటున్నాయి.

– మార మురళి, వెల్లుల్ల

అంజన్న అంటే నమ్మకం



మా ఊరిలో అన్ని కుటుంబాలకు ఆరాధ్యదైవం అంజన్న. అంజన్న గుళ్లు నిర్మించుకున్న అన్ని కుటుంబాల నుంచి ఏటా యువకులు అంజన్న దీక్షలు చేపడతారు. అంజన్న దీక్షా కాలంలో మా ఊరు కాషాయమయంగా మారుతుంది. అంజన్న భక్తులను భజనలతో ఊరు మార్మోగుతుంది.

– మహేశ్, వెల్లుల్ల, అంజన్న భక్తుడు

ఆ కాలంలో నిర్మించినవే



1920–30 దశాబ్దిలో వెల్లుల్ల గ్రామంలో ఉన్న 200 బ్రాహ్మణ కుటుంబాలు ఎవరి వంశానికి వారు నిర్మించుకున్న ఆంజన్న గుడులే ఇప్పుడు వెల్లుల్లలో మనకు కనిపిస్తున్నాయి. కాల క్రమేణా బ్రాహ్మణులు ఇక్కడి నుంచి వెళ్లిపోయినా అంజన్నపై నమ్మకంతో గ్రామస్తులు ఆ గుడులను మళ్లీ అభివృద్ధి చేసి పూజలు చేస్తున్నారు. అంతే కాక గ్రామంలో కొత్త ఆలయాలు నిర్మించి తమ భక్తిని చాటుకుంటున్నారు. ఇదే వెల్లుల్లకు ప్రత్యేకతను ఇచ్చింది.

– నంబి కిషన్ శర్మ, పూజారి వెల్లుల్ల



సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో హుసేన్‌సాగర్ తీరంలో వెలసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో ఆసక్తిగా తిలకిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు.



ఫొటో ఎగ్జిబిషన్‌లో సందర్శకులు

మోదీకి కాంగ్రెస్ ప్రభుత్వాల భయం పట్టుకుంది

- హెచ్‌సీయూ భూముల గురించి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారు: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: దేశంలోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలంటే ప్రధాని మోదీకి భయం పట్టుకుందని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ భూముల గురించి వాస్తవాలు తెలుసుకోకుండా ఆయన మాట్లాడుతున్నారని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ భూములపై జరుగుతున్న అసత్య ప్రచారం గురించి మోదీకి తెలియనట్టుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫొటోలను చూసి నిజమనుకున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్య హక్కును ఆ రాజ్యాంగాన్ని రాసిన బీఆర్ అంబేడ్కర్ పుట్టిన రోజునే మోదీ దుర్వినియోగం చేస్తున్నారని చామల అన్నారు. ప్రభుత్వ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో ప్రధాని కార్యాలయం అధికారులు వచ్చి తెలుసుకుని వెళ్లాలని సూచించారు. ఓబీసీని అని చెప్పుకునే మోదీ ఇప్పటివరకు కులగణన గురించి స్పందించకపోవడం దారుణమని ఎంపీ కిరణ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో మండలం పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులు, వడగండ్ల వాన దాటికి నేలకొరిగిన నిమ్మ చెట్లు



నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం టేకులగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు కూలిపోయిన నిమ్మ చెట్టును చూపిస్తున్న రైతు వెంకట్‌రెడ్డి

రాజీవ్ యువ వికాసానికి 16 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకానికి అనూహ్య స్పందన వచ్చింది. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రూ.6 వేల కోట్ల భారీ బడ్జెట్ కేటాయిస్తూ.. 4 లక్షల మందికి సాయం అందించేలా మార్చి 17వ తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఈనెల 14 రాత్రి 11.59 గంటలకు దరఖాస్తుకు గడువు విధించింది. దీంతో రాత్రి 10 గంటల వరకు 16 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. గడువు ముగిసే సమయానికి దరఖాస్తుల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. కాగా, యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలనే డిమాండ్ ఉంది. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వ సెలవు దినాలు ఎక్కువగా ఉండటంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి సమయం తక్కువగా ఉందని, ఈ కారణంగా పెద్ద సంఖ్యలో ఆశావహులు దరఖాస్తుకు దూరంగా ఉన్నట్లు నిరుద్యోగవర్గాలు చెబుతున్నాయి. కానీ గడువు పొడిగింపుపై సోమవారం రాత్రి వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు.





విహంగాల విహారం..

గుంపులుగా నీటిపై తేలియాడుతూ సందడి చేస్తున్న పక్షులను చూస్తూ ప్రకృతి మురిసిపోతోంది. మనమూ ఇలా ఆకాశంలో విహరిస్తే ఎంత బాగుంటుందోనని స్థానికులు మంత్రముగ్ధులయ్యారు. అలలుగా పైకీ కిందకీ తేలియాడుతూ నీటిని తాకుతూ ఆనందంగా పక్షులు విహరించసాగాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వంతెన వద్ద ఈ విహంగాల ఆనంద విహారం 'సాక్షి' కెమెరాకు అందంగా కనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి









ఎండలు బాబోయ్..

మాడు పగిలే ఎండలతో జనం అల్లాడుతున్నారు. బాబోయ్ ఇవేం ఎండలు అంటూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయట అడుగుపెట్టేందుకు జంకుతున్నారు. పెద్దపల్లి పట్టణంలో రాజీవ్ రహదారిపై వెళ్తున్న వాహనదారులు భానుడి ప్రతాపానికి చున్నీలు, చేతిరుమాలు కట్టుకొని ప్రయాణాలు సాగిస్తూ 'సాక్షి' కెమెరాకు కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి









ఇక విరామం



మత్స్య సంపద పెరిగే సమయం కావడంతో ప్రభుత్వం వేటవిరామాన్ని ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఇది అమల్లోకి వస్తుండటంతో మత్స్యకారులు తమబోట్లను ఇలా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో లంగరు వేసేశారు. జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు విరామం అమల్లో ఉంటుంది - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరంలో యుద్ధ నౌకలు



తీరానికి సుదూరంలో తిరిగే యుద్ధనౌకలు తీరం చెంతనే కనిపిస్తే పర్యాటకులు వాటిని చూసేందుకు ఆసక్తి కనబరుస్తారు. సోమవారం విశాఖ కోస్టల్ బ్యాటరీ ప్రాంతంలో యుద్ధనౌకలు తీరానికి దగ్గరగా కనిపించడంతో పర్యాటకులు వాటిని చూసేందుకు ఎగబడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మండుటెండలో జీవన పోరాటం



ఒకవైపు ఎండలు మండిపోతున్నాయి. అయినా జానెడు పొట్ట నింపుకొనేందుకు కొందరికి రోడ్డెక్కక తప్పని పరిస్థితి. ఈ గంగిరెద్దులు ఆడించి యాచిస్తూ పొట్టనింపుకునే వ్యక్తి మండుటెండలో అనంతపురం నగర రహదారులపై గంగిరెద్దుతో తిరుగుతుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

అంబేడ్కర్ స్ఫూర్తికి బీజేపీ తూట్లు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తికి బీజేపీ తూట్లు పొడుస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తిరుపతిలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పును బీజేపీ నేతలు బేఖాతరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభలపై కోర్టుల జోక్యం ఎక్కువైందని గవర్నర్లు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. గవర్నర్ తరహా పాలనను రద్దు చేసి చట్టసభలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగాన్ని మతోన్మాదుల నుంచి పరిరక్షించుకోవడానికి పౌరులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు రాజధాని పిచ్చి పట్టుకుంది

కాంగ్రెస్ నేత ఎస్.తులసిరెడ్డి విమర్శ



దుత్తలూరు: సీఎం చంద్రబాబుకు రాజధాని అమరావతి పిచ్చి పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్ ఎస్.తులసిరెడ్డి విమర్శించారు. ఆయన సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరులో విలేకరులతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి మళ్లీ ప్రధాని మోదీ చేత శంకుస్థాపన చేయించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని కోసం ఇప్పటికే సేకరించిన భూములు కాకుండా అదనంగా 40వేల ఎకరాలకు పైగా సేకరించాలనుకోవడం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేయడమేనని తెలిపారు. చంద్రబాబు అమరావతినే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల సమస్యలు కూడా పట్టించుకోవాలని హితవుపలికారు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ హామీలిచ్చి... అధికారంలోకి వచ్చాక వాటిని మరిచి ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. .

రాష్ట్రానికి 160 అగ్నిమాపక వాహనాలు

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీజీ మాదిరెడ్డి ప్రతాప్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 160 అగ్నిమాపక వాహనాలను మంజూరు చేసిందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) మాదిరెడ్డి ప్రతాప్ తెలిపారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది అగ్నిప్రమాదాల్లో ఇప్పటి వరకూ రూ.9.28 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని, రూ.38.28 కోట్ల ఆస్తులను కాపాడామని చెప్పారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న ఏడుగురిని రక్షించామన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్, దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీట్ రూల్స్ వెరీ టఫ్



మే 4న జాతీయస్థాయి వైద్య విద్య కోర్సుల ప్రవేశ పరీక్ష

మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆఫ్‌లైన్‌లో నిర్వహణ

- విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు వంటి వస్త్రాలను ధరించకుండా, సాధారణ దుస్తుల్లోనే రావాల్సి ఉంటుంది. తలకు టోపీ, కళ్లకు బ్లాక్ సన్‌గ్లాసెస్ ధరించకూడదు. విద్యార్థినులు ముక్కు పుడక, చెవులకు దుద్దులు, చేతులకు గాజులతో సహా ఎటువంటి ఆభరణాలను ధరించరాదు.

వస్త్రధారణపై ఆంక్షలు

- చేతికి స్మార్ట్‌వాచీతో పాటు సాధారణ వాచీలను సైతం ధరించకూడదు. సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల్లోని రూమ్‌లలో గడియారాలను ఏర్పాటు చేస్తున్నారు.
- బ్లూటూత్ వాచీలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌బ్యాండ్లు, పెన్నులు సహా ఇతర ఎటువంటి వస్తువులను విద్యార్థులు తమ వెంట తీసుకురాకూడదు. ఎన్‌టీఏ నిబంధనలను తూచా తప్పకుండా పాటించిన విద్యార్థులనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

నీట్ జరిగేది ఇలా..

- పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత ఒక్కొక్కరిగా లోపలికి పంపుతారు. మధ్యాహ్నం 1.30 వరకు అనుమతించిన తరువాత పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లను మూసివేస్తారు.
- పరీక్షా కేంద్రాల్లోకి వచ్చిన విద్యార్థులను మధ్యాహ్నం 1.15 గంటల నుంచి కేటాయించిన సీట్లలో కూర్చోబెడతారు.
- మధ్యాహ్నం 1.30 నుంచి ఇన్విజిలేటర్లు విద్యార్థుల అడ్మిట్‌కార్డులను తనిఖీ చేసి, పరీక్ష రాసేందుకు పాటించాల్సిన ముఖ్యమైన నిబంధనలను తెలియజేస్తారు. తదుపరి మధ్యాహ్నం 2.00 గంటలకు కచ్చితంగా పరీక్షను ప్రారంభిస్తారు. విద్యార్థులను పరీక్ష పూర్తయ్యే వరకు బయటకు పంపించరు.

- రెండు గంటల ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- మధ్యాహ్నం 1.30 వరకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి
- ఈనెల 26న సిటీ ఇంటిమేషన్ వివరాలు విడుదల
- మే ఒకటిన ఎన్‌టీఏ సైట్‌లో అడ్మిట్‌కార్డులు
- విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఆంక్షలు
- పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లతో విద్యార్థుల తనిఖీలకు ఏర్పాట్లు
- రాష్ట్ర వ్యాప్తంగా 65వేల మందికి పైగా విద్యార్థుల దరఖాస్తు

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మే 4న జరగనున్న జాతీయ స్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ 2025) నిబంధనలు ఎంతో కఠినంగా ఉన్నాయి. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్‌తోపాటు వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్‌లో జరుగుతుండగా, వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికై దేశ వ్యాప్తంగా రాత పరీక్ష (ఆఫ్‌లైన్) ద్వారా నిర్వహిస్తున్న ఒకే ఒక్క పరీక్ష నీట్ కావడం విశేషం.

మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. పరీక్ష రాసేందుకు వచ్చే ప్రతి ఒక్క విద్యార్థినీ మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం విద్యార్థులు పరీక్ష సమయానికి రెండు గంటల ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. కాగా మధ్యాహ్నం 1.30 తరువాత విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు నీట్ దరఖాస్తు సమయంలో అందజేసిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌తో పాటు అడ్మిట్‌కార్డులో పొందుపరచిన నియమావళిని విధిగా పాటించాల్సి ఉంది.

65 వేలమందికి పైగా దరఖాస్తు

నీట్ యూజీకి గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 64,929 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రస్తుత ఏడాది 65 వేల మందికి పైగా దరఖాస్తు చేశారు.

ఈనెల 26న సిటీ ఇంటిమేషన్ వివరాలు

నీట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఏ జిల్లాలో ఎక్కడ పరీక్షా కేంద్రాన్ని కేటాయించారనే సమాచారంతో ఈనెల 26న సిటీ ఇంటిమేషన్ వివరాలను ఎన్‌టీఏ అధికారిక సైట్‌లో పొందుపరచనుంది. విద్యార్థులు దరఖాస్తు సమయంలో పరీక్షా కేంద్రాలకు సంబంధించి నమోదు చేసుకున్న ఆప్షన్ల ఆధారంగా పరీక్షకు హాజరు కానున్న విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని పరీక్షా కేంద్రాలను కేటాయించనున్నారు. విద్యార్థులకు తమ సొంత ఊరు, జిల్లాలో పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేని పక్షంలో ఇతర జిల్లాల్లోనూ పరీక్షా కేంద్రాలను కేటాయించే అవకాశాలున్నాయి. మే ఒకటిన ఎన్‌టీఏ సైట్‌లో అడ్మిట్‌కార్డులు విడుదల చేయనున్నారు. విద్యార్థులు ఎన్‌టీఏ సైట్ నుంచి అడ్మిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకుని, ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌లో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షకు హాజరు కావాలి.

విద్యార్థులు వీటిని వెంట తెచ్చుకోవాలి



విద్యార్థులు అడ్మిట్ కార్డ్ ప్రింటవుట్‌తో పాటు నీట్ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తమ వెంట తెచ్చుకోవాలి. మరొక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను ఎగ్జామినేషన్ హాల్లో విద్యార్థుల హాజరు నమోదు చేసే సమయంలో అటెండెన్స్ షీట్‌పై అతికించాల్సి ఉంటుంది. దీంతో పాటు పోస్ట్‌కార్డ్ సైజు వైట్ బ్యాక్ గ్రౌండ్‌తో కూడిన కలర్ ఫొటోను అడ్మిట్‌కార్డుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై అతికించి ఇన్విజిలేటర్‌కు అందజేయాలని నియమావళిలో పొందుపరిచారు. ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, 12వ తరగతి అడ్మిషన్ కార్డులో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపుకార్డును వెంట తీసుకెళ్లాలి. శారీరక వైకల్యం గల విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకెళ్లాలి. పారదర్శకంగా ఉండే వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. పరీక్ష రాసేందుకు అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రాల్లోనే ఇస్తారు.

అప్పులు తీర్చలేక చనిపోతున్నా

సెల్ఫీ వీడియో పెట్టి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

బెట్టింగ్‌లకు అలవాటు పడి రూ.21 లక్షలు అప్పులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉద్యోగిని రక్షించిన పోలీసులు

కొమ్మాది: బెట్టింగులకు అలవాటు పడి అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తండ్రికి సెల్ఫీ వీడియో పంపించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో స్పందించిన పోలీసులు అతన్ని కాపాడారు. ఈ ఘటన సోమవారం భీమిలి బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. గాజువాక ప్రాంతానికి చెందిన కొండా సుందర్(30), భార్య, కుమార్తెతో కలిసి పీఎంపాలెంలో నివసిస్తున్నాడు. రెండున్నరేళ్లుగా రుషికొండ ఐటీ సెజ్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో బెట్టింగులకు పాల్పడటంతో అది కాస్తా వ్యసనంగా మారింది. బెట్టింగ్‌ల కారణంగా సుమారు రూ. 21 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చాల్సిందిగా ఒత్తిడి పెరగడంతో మానసిక క్షోభకు గురయ్యాడు. సోమవారం ఉదయం విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరాడు. కాసేపటి తర్వాత 'నాన్నా నన్ను క్షమించు, నీకు ముఖం చూపించలేకపోతున్నా. రూ. 21 లక్షలు అప్పు చేశాను. నేను ఎంత కష్టపడినా అప్పులు తీర్చలేని పరిస్థితి. నాభార్య, కుమార్తెను బాగా చూసుకోండి.. నేను చచ్చిపోతాను' అంటూ ఓ సెల్ఫీ వీడియో తీసి తన తండ్రికి పంపించాడు. అది చూసిన తండ్రి వెంటనే 112కు కాల్ చేసి విషయం చెప్పి, ఆ వీడియోను పోలీసులకు పంపించాడు. అతను పంపిన వీడియోలో.. తన కోసం వెతికితే బీచ్ రోడ్డులో ఫోన్ దొరుకుతుందని చెప్పడంతో వీడియోలో బ్యాక్ గ్రౌండ్ ఆధారంగా పోలీసులు వెంటనే స్పందించి భీమిలి బీచ్ రోడ్డు రామానాయుడు ఫిల్మ్‌స్టూడియో సమీపంలో ఉన్న బీచ్‌కు చేరుకున్నారు. సుందర్ ఓ చెట్టు క్రింద కూర్చుని ఏడుస్తూ ఉన్నాడు. పీఎం పాలెం బీచ్ మొబైల్ పోలీసులు ఆయనను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలుసుకుని సుందర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అంబేడ్కర్ కాలనీ నేమ్‌బోర్డు ఏర్పాటుపై ఉద్రిక్తత

కూటమి నేతలపై దళితుల ఫిర్యాదు



రాయదుర్గంటౌన్: అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం రాయంపల్లి ఎస్సీ కాలనీ ప్రవేశ మార్గంలో 'అంబేడ్కర్ కాలనీ' నేమ్ బోర్డు తొలగింపుపై అంబేడ్కర్ జయంతి రోజైన సోమవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకులు నేమ్‌బోర్డును దౌర్జన్యంగా పీకేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. జిల్లా కలెక్టర్‌గా గంధం చంద్రుడు పనిచేసిన సమయంలో దళిత, ఎస్సీ కాలనీలను ఆ పేర్లతో పిలవకూడదన్న ఉద్దేశంతో జాతీయ నాయకుల పేర్లతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలోనే రాయంపల్లి ఎస్సీ కాలనీకి 'అంబేడ్కర్ కాలనీ'గా నామకరణం చేసి నేమ్‌బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేమ్‌బోర్డు పడిపోగా కొందరు దళిత యువకులు మరమ్మతు చేయించి.. అంబేడ్కర్ జయంతి రోజు అదే స్థలంలో మళ్లీ ఏర్పాటు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకులు దళితులతో ఘర్షణకు దిగారు. బలవంతంగా బోర్డును తొలగించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. దళిత యువకులు 100కు డయల్ చేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు గొడవను సద్దుమణిగించారు. కాగా గ్రామంలో 'అంబేడ్కర్ కాలనీ' నేమ్‌బోర్డు ఏర్పాటు చేస్తే అంతుచూస్తామంటూ కులం పేరుతో దూషించి బెదిరిస్తున్న గ్రామానికి చెందిన శీనప్ప, మద్దానప్ప, హనుమంతప్ప, జయన్న, ఆంజనేయులు, బోయదొడ్డలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెయ్యి దాటుతున్న ఖర్చు

గుంటూరు నగరానికి చెందిన సాయి భరద్వాజ్ ఒక ప్రైవేట్ కంపెనీలో మెడికల్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. జీతం నెలకు రూ.60వేలు. ఈ మొత్తంతో ఇంట్లోని నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవిస్తున్నాడు. అయితే, ఇటీవల ఒక దుకాణంలో వస్తువులు కొని బిల్లు పే చేసేందుకు స్కానర్ క్లిక్ చేసి డబ్బులు కొడితే.. సరైన బ్యాలెన్స్ లేదని చూపించింది. దీంతో ఒక్కసారిగా పరిస్థితి అర్థం కాలేదు. ఆ తర్వాత చెక్ చేసుకుంటే డిజిటల్ పేమెంట్స్ ద్వారా తానే ఖర్చు చేసినట్లు నిర్ధారించుకున్నాడు.

- డిజిటల్ చెల్లింపులు.. జేబుకు చిల్లులు !
- పెరిగిన అనవసర ఖర్చులు
- ధర తెలుసుకోవడం దాదాపుగా మానేశారు
- రూ.5 మొదలు వేల రూపాయల లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే
- తల్లకిందులవుతున్న ఫ్యామిలీ బడ్జెట్
- కోవిడ్ తర్వాత అన్నీ డిజిటల్ చెల్లింపులే..
- చిల్లర కొరత నేపథ్యంలోనూ మారిన తీరు

పట్నంబజారు: జిల్లాలో డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి. ఒకప్పుడు ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం లాంటివి ఉపయోగించాలంటే జనం భయపడేవారు. ఇప్పుడు అవలీలగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎంతగా అంటే రూ.5 నుంచి వేల రూపాయల వరకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. ఎంత ఖర్చు పెడుతున్నారో తెలియనంతగా వీటి వినియోగం మారిపోయింది. అయితే, పెట్టే ఖర్చు మొత్తం బ్యాంకు ఖాతా ద్వారానే జరుగుతోంది. అది చిన్న మొత్తమైనా, పెద్ద మొత్తమైనా సరే అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పేమెంట్స్ ద్వారా మనకు తెలియకుండానే బ్యాంకులు ప్రభుత్వానికి చెప్పేస్తున్నాయన్న మాట.



లెక్కలేకుండా ఖర్చు

ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యేవరకు ఎంత ఖర్చు పెట్టామో తెలియని పరిస్థితి. దీనికితోడు ఏ వస్తువును ఎంతకు కొనుగోలు చేస్తున్నారో కూడా తెలియకుండా, బేరమాడకుండా కొనేస్తున్నారు. గతంలో మనం కిరాణా దుకాణానికి వెళ్తే సరుకులకు బిల్లు వేస్తే ఏదీ ఎంత అయిందని చూసుకుని చేతి ద్వారా డబ్బులు చెల్లించే వాళ్లం. కానీ డిజిటల్ పేమెంట్స్ కారణంగా ఇవేమీ పట్టించుకోవడం లేదు. షాపువారు ఎంత చెబితే అంత చెల్లించి వచ్చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్ కారణంగా డబ్బు ఎలా వస్తుందో.. ఎలా పోతుందో కూడా తెలుసుకోలేకపోతున్నారు.

కోవిడ్ తర్వాత ఊపందుకున్న పేమెంట్స్

డిజిటల్ పేమెంట్స్ రూపంలో పదేళ్ల కిందట డెబిట్, క్రెడిట్ కార్డులు, గిఫ్ట్ కార్డులు వచ్చాయి. కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి వాటిని వ్యాపార దుకాణాల్లో స్క్రాచ్ చేసి డబ్బులు చెల్లించేవారు. కొంత కాలం తర్వాత ఇవే కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లోనే వస్తువులను కొనుగోలు చేసే అవకాశం వచ్చింది. కోవిడ్ అనంతరం వ్యాపార లావాదేవీల్లో మరింత సరళతరం వచ్చింది. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌ల ద్వారా జనం డబ్బు చెల్లించడం, తీసుకోవడం ప్రారంభించారు. వ్యాపారులు సైతం క్రమంగా అంగీకరించక తప్పని పరిస్థితి. చిల్లర కొరత కారణంగా కూడా డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి.

చిల్లర కొరత తీరింది

మాది చిన్న బడ్డీకొట్టు. రూ.10 నుంచి రూ. వెయ్యి వరకు వరకు వివిధ రకాల వస్తువులు విక్రయిస్తాం. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ ఎంతో మంది వస్తుంటారు. ఈ క్రమంలో చిల్లర కొరత బాగా ఎదురయ్యేది. డిజిటల్ పేమెంట్స్‌తో సమస్య తీరింది.



– పి. శివయ్య, వ్యాపారి, గుంటూరు

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

సాక్షి, అమరావతి: వేసవి నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక విద్యుత్ సౌధలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాబా సాహెబ్ కు నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల నుంచి మారుమూల గ్రామాల వరకు నిరవధికంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఏపీ జెన్‌కో ఇన్‌చార్జి డైరెక్టర్ ఎం.సుజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీ రవాణాశాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జె.రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ప్రవీణ్ ఎన్నికయ్యారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఎన్టీఆర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. కోశాధికారిగా జె.ఆశాదేవి, అసోసియేట్ అధ్యక్షులుగా జి.ఎస్.ఎల్.వి.మంగాదేవి, సర్దార్ మనోహర్‌రాజ్, పి.రమేశ్‌బాబు, ఉపాధ్యక్షులుగా కె.వెంకటలక్ష్మి, బి.గోపీనాయక్, కె.సువర్ణకుమారి, పి.మంజుల ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.చంద్రశేఖర్, కె.శివప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా పి.వెంకటరెడ్డి, కె.జయప్రకాశ్, ఎ.వి.ఎన్.నరసింహులు, ప్రతాప్, వి.విజయసారథిని సభ్యులు ఎన్నుకున్నారు. వీరు మూడేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారు. ఎన్నికల అధికారిగా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సి.రాజశేఖర్ వ్యవహరించారు.

మీ భంగిమ వెన్నుదన్నుగా ఉందా?



డాక్టర్ సందీప్ శ్రీరామ్
సీనియర్
ఆర్థోపెడిక్ సర్జన్



ఇటీవల చాలా చిన్న వయసులో ఉన్నవారు కూడా కండరాల నొప్పులని ఒళ్లునొప్పులనీ అంటుండటం మామూలే. దీనికి కారణం ఏదో జబ్బు లేదా వ్యాధి కాకపోవచ్చు. సరిగా నిలబడటం, కూర్చోవడం వంటివి చేయకపోవడమే కావచ్చంటున్నారు నిపుణులు. చాలామంది సరిగా నిల్చోవడం, ఆఫీసుల్లో లేదా ఇతరత్రా కూర్చోవడం, ఏదైనా వస్తువులు అందుకోవడం కోసం ఒంగడం వంటివి సరిగా చేయడం లేదంటే చాలామందికి అది ఆశ్చర్యమే. కానీ ఇదే నిజమంటున్నారు నిపుణులు. సరైన రీతిలో నిలబడటం, కూర్చోవడం, వంగడం, సెల్‌ఫోన్ మాట్లాడేటప్పుడు మెడ కండరాల పైన ఒత్తిడి పడేలా ఒక పక్కకు పూర్తిగా మెడ వంచకపోవడం వంటి శారీరక భంగిమలను (పోష్చర్‌ను) సరైన రీతిలో ఉంచడం వంటి మామూలు జాగ్రత్తలతోనే చాలా నొప్పులు నివారించవచ్చనీ, ఎప్పుడో వృద్ధాప్యంలో రావాల్సిన అరుగుదల సమస్యలను ముందే తెచ్చుకోకుండా రక్షించుకోవచ్చని తెలుసుకోవడం మేలు. అదెలాగో ఇప్పుడు చూద్దాం...

సరిగ్గా నిలబడటం, నడిచేటప్పుడు ముందుకు లేదా పక్కకు ఒంగినట్లుగా కాకుండా సరిగ్గా నడవడం, కార్ లేదా బైక్ నడిపేటప్పుడు సరిగా కూర్చోవడం వల్ల ఒంటికి సంబంధించిన చాలా నొప్పులనూ, చాలా అరుగుదల సమస్యలను రాకుండా చూసుకుపోవచ్చు. ఇలా నడిచేటప్పుడు, నిలబడినప్పుడు, కార్ లైదా బైక్ నడిపేటప్పుడు మనం ఉండే శారీరక భంగిమల్లో (పోష్చర్స్‌లో) మన కండరాలు, ఎముకలపైన ఒత్తిడి పడుతుంటుంది. దాని కారణంగా ఆయా కండరాల్లో నొప్పులు రావడం లేదా అక్కడి ఎముకలు ఎప్పుడో చాలాకాలం తర్వాత అరగాల్సినవి కాస్తా ముందుగానే అరగడం జరగవచ్చు. తప్పుడు భంగిమల వల్ల కండరాల మీద పడే అలాంటి ఒత్తిడులను వీలైనంత తగ్గించగలిగితే / నివారించగలిగితే కండరాలనూ, లిగమెంట్లనూ, టెండన్లనూ చాలాకాలం బలంగా, పటిష్ఠంగా కాపాడుకోవచ్చు. దాంతో కండరాల నొప్పులు రాకుండా నివారించుకోవచ్చు. దీనికి కావల్సిందల్లా మనం సరిగ్గా నిలబడటం, సరిగా కూర్చోవడంలో సరైన భంగిమలు (పోష్చర్స్) పాటించడమే. ఇలా దేహ భంగిమను (పోష్చర్‌ను) ఎంత బాగా మెయింటెయిన్ చేసుటే ఎముకల అరుగుదల సమస్యలనూ (డీజనరేటివ్ ప్రాబ్లమ్స్‌ను), కండరాలపై పడే ఒత్తిడిని అంతగా నివారించుకోచ్చు అని తెలుసుకోవడం ముఖ్యం.

సరైన పోష్చర్ అంటే...

ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తిపైనా భూమ్యాకర్షణ శక్తి ప్రతినిత్యం పనిచేస్తూ, ప్రతివారూ నిల్చున్నప్పుడు, కూర్చున్నప్పుడు, ఆఖరికి పడుకుని ఉన్నప్పుడు కూడా మనందరి మీదా ప్రభావంచూపుతూనే ఉంటుంది. తప్పుడు పద్ధతుల్లో నిలబడటం, కూర్చోవడం జరిగినప్పుడు ఆ ప్రభావం గరిష్ఠంగా ఉంటుంది. అందుకే అరుగుదల, కండరాలపై ఒత్తిడి దుష్ప్రభావం ఎక్కువ. దీనికి బదులు సరైన భంగిమల్లో నిలబడటం, కూర్చోవడం, వాహనం నడపడం, ఫోన్ మాట్లాడటం చేస్తుంటే అన్ని అవవయవాల మీద ఒత్తిడి సమంగా పడటంతో అరుగుదల, దుష్ప్రభావాలు ఒకేచోట కేంద్రీకృతం కావడం వంటి సమస్యలు ఉండవు. దాంతో నొప్పులూ, బాధలూ లేకుండా చాలాకాలం పాటు హాయిగా ఉండవచ్చు. సరైన పోష్చరల్ భంగిమలంటే ఏమిటో, అవి ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

చాలా సేపు నిలబడాల్సిన వాళ్లు ఎవరంటే...

ఏదైనా వైకల్యమో లేదా ఆరోగ్య సమస్య ఉంటేనో తప్ప ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి వ్యక్తీ తన రెండు కాళ్లపై నిలబడటం మొదలుపెట్టిన నాటినుంచి సరిగా నిలబడటం నడవటం చేస్తుంటారు. ఇక ట్రాఫిక్‌లో నిలబడి డ్యూటీ చేసే పోలీసులు, పాఠాలు చెప్పడం కోసం బోర్డు దగ్గర లేదా టేబుల్ దగ్గర నిలబడే ఉపాధ్యాయులు / లెక్చరర్లు, సిటీ బస్సుల్లోని కండక్టర్లు, వంట చేసే మగవారు లేదా గృహిణులు, సేల్స్ గర్ల్స్, సేల్స్ బాయ్స్, మెషిన్ ఆపరేటర్లు... ఇలాంటి వారందరికీ తమ వృత్తులపరంగా చాలాసేపు నిలబడే ఉండాల్సిన అవసరముంటుంది. వీళ్లలో కాళ్ల పైనా, పాదాలపైనా ఒంటిబరువు చాలాసేపు పడటం వల్ల కాళ్లల్లో నీరసం, నిస్సత్తువ, కాళ్ల వాపులు, వేరికోస్ వెయిన్స్, మెడనొప్పి, నడుము నొప్పి వంటి సమస్యలు వస్తుంటాయి.

మంచి పోష్చర్‌లో నిలబడటం ఎలా?

సరైన శారీరక భంగిమలో (మంచి పోష్చర్‌లో) నిలబడటం వల్ల కాళ్లు, కండరాలు, నడుము, మెడ వంటి అవయవాలపై తక్కువ భారం పడుతుంది. అలా తక్కువ భారం పడేలా సరైన రీతిలో నిలబడటానికి ఈ కింద పేర్కొన్న సూచనలు / జాగ్రత్తలు పాటించడం మేలు. అవి...

- నిలబడి చేసే పనులకు ఉపయోగించే ప్లాట్‌ఫారాన్ని (ఉదాహరణకు వంట చేసేవారు వంట టేబుల్, నిలబడి డ్రాయింగ్ వేసేవారు తమ ప్లాంక్ వంటి వాటిని) తమ ఎత్తుకు తగినట్లుగా అడ్జెస్ట్ చేసుకోవడం.
- నిలబడి ఉన్నప్పుడు ఎదురుగా ఉన్న రకరకాల వస్తువులను అందుకునే క్రమంలో పూర్తిగా ఒంగి తీసుకోవాల్సి వచ్చే దూరంగా ఉంచకుండా, తేలిగ్గా తీసుకునేంత దూరంలోనే వస్తువులను ఉంచుకోవడం.
- ప్లాట్‌ఫారమ్‌కు సరిగ్గా ఎదురుగా ఉండే పనులను చేసుకోవడం (ఉదాహరణకు వంట లేదా డ్రాయింగ్ వంటివి చేసేప్పుడు మీ ప్లాట్‌ఫారానికి పక్కగా ఉండకుండా ఎదురుగానే ఉండటం అవసరం).
- మడమలను పూర్తిగా ఫ్లాట్‌గా ఉంచకుండా వాటి కింద కాస్తంత ఎత్తుగా ఉండేలా చూసుకోవడం. (అయితే మడమల కింద ఉంచుకునే ఎత్తు మరీ ఎత్తుగా లేకుండా జాగ్రత్త పడటం).
- చాలాసేపు నిలబడి వంట చేయాల్సి వచ్చినప్పుడు ఒంటి బరువును కాళ్లపై మార్చి మార్చి వేస్తుండటం. (అంతేతప్ప... మొత్తం బరువును చాలాసేపు ఒకే కాలిపైన మోపడం సరికాదని గుర్తుంచుకోవాలి).
- నిలబడి చేసే పనులు (అంటే నిలబడి ఫ్లోరింగ్ శుభ్రం చేయడం, మాపింగ్, గార్డెనింగ్) వంటివి వీలైనంత నిటారుగా నిలబడే చేయడం. (అంతే తప్ప... చాలాసేపు ముందుకు ఒంగిపోయి చేయడం సరికాదు. అలా ఒంగిపోయి చాలాసేపు పనిచేయడం వల్ల వెన్నెముకపై ఎక్కువ భారం పడుతుందని తెలుసుకోవాలి).

సరైన పోష్చర్‌లో కూర్చోవడమిలా...

గతంతో పోలిస్తే ఇటీవలి కాలంలో కూర్చొని పనిచేసే ఉద్యోగాలే ఎక్కువ. అయితే ఇలా కూర్చుని పని చేసేటప్పుడు సరైన పోష్చర్‌లో కూర్చోకపోవడమే చాలా రకాల ఆరోగ్య సమస్యలకు మూలం. కూర్చుని కంప్యూటర్‌పై పనిచేసే వారు మొదలుకొని బల్లలపై కూర్చొని రాత పని చేసే అనేక మందిలో సరిగా కూర్చోకపోవడం వల్లనే నడుమునొప్పి, కండరాల నొప్పులు, మెడ బిగుసుకుపోవడం (స్టిఫ్‌నెక్), తరచూ పాదాలకు తిమ్మిరిపట్టడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.

ఇలా అదేపనిగా, సుదీర్ఘంగా కూర్చోవడం వల్ల భవిష్యత్తులో డయాబెటిస్, గుండెజబ్బులు, కొన్ని రకాల మానసిక సమస్యలూ వచ్చే అవకాశాలున్నాయి. కండరాలు, ఎముకలపై వీలైనంత తక్కువ భారం పడేలా కూర్చోవడం ఎలాగంటే...

- కుర్చీలో వీలైనంత నిటారుగా కూర్చోవాలి. అంతే తప్ప వెన్నుపై అధికమైన భారం పడేలా భుజాలను వేలాడేసి లేదా ఒంగిపోయి కూర్చోవడం సరికాదు.
- కంప్యూటర్ మానిటర్ సరిగ్గా ఉపయోగించేవారి కళ్లకు సరిగ్గా ఎదురుగా ఉండేలా అమర్చుకోవాలి. అంతే తప్ప మెడను బాగా ఎత్తిగానీ లేదా మెడను మరీ ఎక్కువగా ఒంచి చూసేలా దాన్ని అమర్చుకోకూడదు.
- కీబోర్డు చేతులకు, వేళ్లకు సౌకర్యంగా అందేలా ఉండాలి. కీబోర్డుపై పనిచేసే పమయంలో మోచేతులకు సపోర్ట్ ఉండేలా కుర్చీ తాలూకు హ్యాండ్‌రెస్ట్‌లను అమర్చుకోవాలి. ఇలా చేయడం వల్ల చేతులు అలసిపోకుండా చాలాసేపు పని చేయడానికి వీలవుతుంది.
- కంప్యూటర్ పై పనిచేస్తున్నప్పుడు వీపును కుర్చీ తాలూకు బాక్‌రెస్ట్‌కు ఆనించి ఉంచాలి. అలాగని కుర్చీ బ్యాక్‌రెస్ట్ మరీ వెనక్కువాలి ఉండకూడదు. పనిచేసే సమయంలో వెనక్కు ఆనకపోవడం వల్ల భుజాలు, మెడ, వెన్ను సమస్యలు వచ్చే అవకాశముంది. నడుం కండరాలపై ఎక్కువ భారం పడి, ఎక్కువ శ్రమ కలుగుతుంది. పని చేసే సమయంలో కుర్చీ బ్యాక్‌రెస్ట్‌ను నిటారుగానే ఉంచి, వీపును దానికి ఆనించి ఉంచాలి. అప్పుడు వీపుకు తగినంత సపోర్ట్ దొరికి, వెన్నుపై భారం తగ్గుతుంది.
- కంప్యూటర్ అదేపనిగా కంటిన్యువస్‌గా ఉపయోగించడానికి బదులుగా ప్రతి గంటసేపు పని తర్వాత 10 నిమిషాలు విశ్రాంతి ఇవ్వడం మంచిది. అది కూడా ఆ 10 నిమిషాలూ మళ్లీ కూర్చునే ఉండటానికి బదులుగా లేచి కాస్త అటు ఇటు తిరగడం మేలు.
- ఎదురుగా ఉన్న బల్లపైన మనం తరచూ ఉపయోగించే వస్తువులను మూడు అంచెల్లో పెట్టుకోవచ్చు. మొదటి అంచెలో అనుక్షణం అందుకునే వస్తువులు / పనిముట్లు / పుస్తకాలు / ఉపకరణాలు ఉంచుకోవాలి. రెండో అంచెలో తరచూ ఉపయోగించేవి పెట్టుకోవాలి. ఎప్పుడోగాని ఉపయోగించని వాటిని డెస్క్/టేబుల్‌కు అటు చివర ఉంచాలి. ఇలా మన వస్తువుల అమరిక ఉండటం వల్ల... వస్తువులను అందుకునే సమయంలో వెన్నుపై భారం చాలావరకు తగ్గుతుంది.
- కూర్చొని ఉన్నప్పుడు కాళ్లను ఫుట్‌రెస్ట్‌పైన కాస్తంత ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. దాంతో వెన్ను/నడుము నొప్పి నివారించవచ్చు.

కార్ డ్రైవింగ్‌లో పాటించాల్సిన పోష్చర్ జాగ్రత్తలు...

డ్రైవింగ్ చేసే సమయంలో కారులో లేదా వాహనంలో కూర్చునే పోష్చర్ సరిగా లేకపోతే వెన్నుకు, మెడకు, నడుముకు సంబంధించిన చాలా సమస్యలు వచ్చేందుకు అవకాశాలెక్కువ.

డ్రైవింగ్ సమయంలో సరిగా కూర్చోకపోతే...

డ్రైవింగ్ పోష్చర్ సరిగా లేకపోతే 'రిపిటిటివ్ డ్రైవింగ్ ఇంజ్యూరీస్' (ఆర్‌డీఐ) అనే సమస్యలు వస్తాయి. దాంతో మెడ బిగుసుకుపోవడం (స్టిఫ్‌నెక్), పాదాలు, కాళ్లకు తిమ్మిర్లు రావడం, భుజాలు నొప్పి పెట్టడం, మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురికావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే కార్‌డ్రైవింగ్ చేసేవారు పోష్చర్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

డ్రైవింగ్‌లో సరిగా కూర్చోవడమిలా...

ఫోర్‌వీలర్ డ్రైవింగ్ సమయంలో వెన్నుపైన సాధ్యమైనంత తక్కువ భారం పడేలా కూర్చోవడానికి పాటించాల్సిన సూచనలివి...

- డ్రైవ్ చేసేవాళ్లు సౌకర్యంగా కూర్చునేలా డ్రైవింగ్ సీట్ ఉండాలి. డ్రైవింగ్ చేసే సమయంలో స్టీరింగ్‌పై చేతులు పెట్టే పద్ధతి ఎలా ఉండాలంటే... మన డెస్క్‌పై చేతులు ఉంచినప్పటికంటే... స్టీరింగ్‌పై చేతులు కాస్త ఎత్తుగానే ఉండాలి. స్టీరింగ్ వీల్‌కూ, డ్రైవర్ ఛాతీకి మధ్య 25 – 30 సెం.మీ. (10 – 12 అంగుళాల) స్థలం ఉండేలా స్టీరింగ్ అడ్జెస్ట్ చేసుకోవాలి. డ్రైవ్ చేసేవారు ఎలా కూర్చోవాలంటే... స్టీరింగ్‌వీల్ ఎట్టిపరిస్థితుల్లో తమ కాళ్లకు ఆనకుండా చూసుకోవడం అవసరం. అలా స్టీరింగ్ వీల్‌కూ తమ దేహానికి మధ్య అవసరమైనంత స్థలం ఉన్నప్పుడు స్టీరింగ్‌ను సౌకర్యంగా తిప్పడానికీ, ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోడానికీ వీలుగా ఉండి, ప్రమాదం జరిగినప్పుడు డ్రైవింగ్ చేసేవారికి ఎక్కువ రక్షణ కలుగుతుంది.
- కారు కుదుపుల్లో సైతం కాళ్లకు స్టీరింగ్‌కు ఆనకూడని విధంగా సీట్, స్టీరింగ్‌వీల్ అడ్జెస్ట్ చేసుకోవాలి.
- వాహనం ఆగాక డ్రైవింగ్ చేసేవారు చాలా సౌకర్యంగా దిగగలిగే విధంగా కారు సీట్ ఉండాలి. స్టీరింగ్‌కూ, సీట్‌కూ మధ్య... డ్రైవ్ చేసే వ్యక్తి దిగేందుకు అనువుగా ఉండేంత స్థలం ఉండాలి.
- డ్రైవింగ్ చేసేవారు... మరీ 90 డిగ్రీలు నిటారుగా కూర్చొని డ్రైవ్ చేయడమూ సరికాదు. కాస్తంత వెనక్కు వాలి సౌకర్యంగా కూర్చుని డ్రైవ్ చేయాలి. అయితే డ్రైవింగ్ సీట్‌లో అలా వెనక్కి వాలినప్పుడు ఆ కోణం 120 డిగ్రీలకు మించకూడదు. డ్రైవింగ్ సీట్ వర్టికల్‌గా డ్రైవింగ్ చేసేవారి వెన్నుకూ, కింది భాగంలో వారి తొడలకు మంచి సపోర్ట్ ఇవ్వాలి. అలా మంచి సపోర్ట్ ఇచ్చేలా సీట్ కుషన్ ఉండటం మేలు.
- డ్రైవ్ చేసేప్పుడు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి.
- బ్రేక్, క్లచ్ పెడల్స్ వంటి కారు భాగాలన్నీ డ్రైవింగ్ చేసేవారి కాళ్లకు సౌకర్యంగా తక్షణం అందేలా డ్రైవింగ్ సీట్ అమర్చుకోవాలి.

టూవీలర్ (బైక్) డ్రైవింగ్‌లో పోష్చర్ ఇలా...

సాధారణంగా బైక్‌ల తయారీదారులు హ్యాండిల్‌బార్స్, ఫుట్‌రెస్ట్ వంటి భాగాల అమరికలో కొన్ని ప్రమాణాలను పాటిస్తుంటారు. వాటిని అనుసరించడం వల్ల చాలా సమస్యలు రావు. అయితే బాగా స్టైల్‌గా కనిపించడం కోసం కొంత మంది తమ బైక్ హ్యాండిల్ బార్స్‌ను, సీట్ కోణాన్ని రకరకాలుగా మార్చి అమర్చుకుంటూ ఉంటారు. ఉదాహరణకు పొట్టి హ్యాండిల్ బార్స్ వాడటం, సీట్‌ను మరీ ఏటవాలుగా ఉండేలా అమర్చుకోవడ వంటివి చేస్తుంటారు. అలా కాకుండా బైక్ తయారీదారులు ప్రామాణికంగా ఉంచిన విధంగానే హ్యాండిల్‌బార్స్, ఫుట్‌రెస్ట్‌లు ఉంచుకోవడం మేలు. మరీ ఇబ్బందిగా ఉంటేనే తప్ప వాటిలో వ్యక్తిగతమైన మార్పులు చేసుకోకపోవడమే మంచిది.

బైక్ వాడుతున్నప్పుడు నడుమునొప్పి, వెన్నునొప్పి వస్తుంటే... డ్రైవింగ్ చేసేవారికి బైక్ సీట్ అనువుగా, సౌకర్యంగా ఉండేలా కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. అవి...

- బైక్‌ల హ్యాండిల్స్ తగినంత విశాలంగా, రెండు చేతులు సరైన గ్రిప్ ఉండేలా పట్టుకోవడానికి వీలుగా ఉండాలి. పొట్టిగా ఉండే షార్ట్‌హ్యాండిల్స్ వల్ల ముందుకు ఒంగిపోవడంతో ఒంటిపై భారం పడి శరీరభాగాల్లో నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ.
- హ్యాండిల్ పట్టుకున్నప్పుడు డ్రైవింగ్ చేసేవారు తమ దేహం నిటారుగా ఉండేలా కూర్చోవాలి. అయితే ఇటీవల కొన్ని స్పోర్ట్స్ బైక్‌లలోని సీట్లు, హ్యాండిల్ బార్స్ శరీరం బాగా ముందుకు వాలిపోయి ఉండేలా మార్పులు చేస్తున్నారు. ఇలా వాలిపోయినట్లుగా కూర్చొనేలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల వెన్ను నిటారుగా ఉండకపోవడంతో వెన్ను నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి హ్యాండిల్‌బార్‌నూ, సీట్లను అలాంటి ఫాల్టీ పోష్చర్స్‌కు అవకాశమిచ్చేలా అమర్చుకోవడం సరికాదు.
- కాళ్లు పెట్టుకునే ఫుట్‌రెస్ట్ మన శరీరానికి మరీ దూరంగా ఉండకూడదు. దీనివల్ల కాళ్లు సాగినట్లుగా అయిపోయి నడుముపై భారం ఎక్కువగా పడుతుంది. దాంతో నడుమునొప్పి వచ్చేందుకు అవకాశం ఉంది. కాళ్లతో బ్రేక్ వేయడానికీ, గేర్లు మార్చడానికీ సౌకర్యంగా, వీలుగా ఉండేలా ఫుట్‌రెస్ట్‌లు ఉండాలి.
- చాలామంది బైక్‌లపై ప్రయాణాలు చేసేవారు తమ వీపుపై ఉండే బ్యాగ్స్ (బ్యాక్‌ప్యాక్స్) పెట్టుకొని వెళ్తుండటం ఇటీవల చాలా సాధారణంగా కనిపించే దృశ్యం. ఈ భారం నడుంపై ఎక్కువగా పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. ఇలాంటివారు ఆ బ్యాగ్ భారం వీపుపై కాకుండా, అది సీట్‌పై ఆనేలా చూసుకోవడం చాలా మంచిది.



పైన పేర్కొన్న జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వీలైనంత ఎక్కువ కాలం పాటు నొప్పులు రాకుండా కండరాలను సంరక్షించుకోవడం, ఎముకలు అరగకుండా నివారించుకోవడం సాధ్యమవుతుందని గుర్తుపెట్టుకోవాలి.

సెల్‌ఫోన్ వాడకంలో జాగ్రత్తలివి...

ఇటీవల టూవీలర్ డ్రైవ్ చేస్తుండే వాళ్లు అలాగే డెస్క్ మీద కంప్యూటర్‌పై పనిచేస్తూనే భుజానికీ చెవికీ మధ్య సెల్‌ఫోన్ ఉంచుకుని, మెడతో ఆ ఫోన్‌ను నొక్కిపట్టి ఉంచి మాట్లాడటం చేస్తుంటారు. అది సరికాదు. ఇందుకు బదులుగా వాహనం ఆపి ఉన్నప్పుడు ఇయర్‌ఫోన్స్ వాడటమన్నది మెడ, వెన్ను ఆరోగ్యానికి చాలా మంచిది.

- డ్రైవింగ్ చేస్తూ ఇయర్‌ఫోన్స్‌తోగాని మరే రకంగానూ సెల్‌ఫోన్ మాట్లాడకూడదు. పైగా అది చట్టరీత్యా నేరం. అలాగే అది ప్రాణానికి ప్రమాదం కూడా.
- సెల్‌ఫోన్‌ను ఉపయోగించే సమయంలో బొటనవేలిని మాటిమాటికీ వాడుతుండటం వల్ల బొటనవేలి వెనక ఉండే టెండన్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాపు వస్తుంది. అ తర్వాత కూడా అదేపనిగా దాన్ని ఉపయోగించడం వల్ల ఆ గాయం మానకుండా మాటిమాటికీ తిరగబెడుతుంది. దీన్నే బ్లాక్‌బెర్రీ థంబ్ లేదా గేమర్స్ థంబ్ అంటారు. అందుకే వీలైనంత వరకు అత్యవసర పరిస్థితుల్లోనే సెల్‌ఫోన్ ఉపయోగించాలి.
- సెల్‌ఫోన్ సంభాషణలు వీలైనంత క్లుప్తంగా ఉండేట్లుగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడటం కన్నా మెసేజ్‌లనే ఎక్కువగా అలవాటు చేసుకోవడం మంచిది. అయితే ఇలా మెసేజ్‌లు ఇచ్చేటప్పుడు మెడను హానికరమైన కోణాలలో ఒంచకూడదు. మీ మెడను ఎంతగా ఒంచితే వెన్నుపై పడే భారం అంతగా పెరుగుతుందని గుర్తుంచుకోవాలి.
- సెల్‌ఫోన్ నెంబరును బాగా సన్నిహితులకు మాత్రమే ఇవ్వడం వల్ల అనవసరమైన కాల్స్‌ను అవాయిడ్ చేయవచ్చు.
- పొద్దున్నే లేవడానికి అలారం మొదలుకొని... రిమైండర్లు, ఆటలు, పాటలు, కాలిక్యులేటర్... ఇలా ప్రతిదానికీ సెల్‌ఫోన్ మీదే అతిగా ఆధారపడటం అంత మంచిది కాదు. అది వెన్నుకు చేటు చేయడంతో పాటు సెల్‌ఫోన్ అడిక్షన్‌కు దారి తీయవచ్చు.









అర్జున్‌కు ఐదో స్థానం




పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన ఇరిగేశి అర్జున్ ఐదో స్థానాన్ని సంపాదించాడు. 5-6 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో అర్జున్ 1.5-0.5తో మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. అంతకుముందు ఇయాన్ నిపోమ్‌నిషి (రష్యా)తో జరిగిన మరో వర్గీకరణ మ్యాచ్‌లో అర్జున్ 2.5-1.5తో విజయం సాధించాడు. ఐదో స్థానంలో నిలిచిన అర్జున్‌కు 50 వేల డాలర్లు (రూ. 43 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ప్రపంచ నంబర్‌వన్, నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ ఈ టోర్నీలో విజేతగా నిలిచాడు. ఫైనల్లో కార్ల్‌సన్ 1.5-0.5తో ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా)పై నెగ్గి చాంపియన్‌గా అవతరించాడు. కార్ల్‌సన్‌కు 2 లక్షల డాలర్లు (రూ. 1 కోటీ 72 లక్షలు), రన్నరప్ నకమురకు 1,40,000 డాలర్లు (రూ. 1 కోటీ 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 3-4 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా) 1.5-0.5తో విన్సెంట్ కీమెర్ (జర్మనీ)పై గెలిచాడు. మూడో స్థానంలో నిలిచిన కరువానాకు 1,00,000 డాలర్లు (రూ. 86 లక్షలు), నాలుగో స్థానం పొందిన కీమెర్‌కు 60,000 డాలర్లు (రూ. 51 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

క్వార్టర్ ఫైనల్లో పంకజ్ అద్వానీ



కార్లో (ఐర్లాండ్): అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ప్రపంచ బిలియర్డ్స్ (టైమ్ ఫార్మాట్) చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో పంకజ్ అద్వానీ 886-321 పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన దేవేంద్ర జోషిపై గెలుపొందాడు. భారత్‌కే చెందిన ధ్వజ్ హరియా, ధ్రువ్ సిత్వాలా, సౌరవ్ కొఠారి కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ధ్వజ్ హరియా 712-308తో శ్రీకృష్ణ సూర్యనారాయణ (భారత్)పై, ధ్రువ్ సిత్వాలా 518-283తో బేక్ మిన్‌హు (దక్షిణ కొరియా)పై, సౌరవ్ కొఠారి 593-375తో కేతన్ చావ్లా (భారత్)పై విజయం సాధించారు.

శ్రీజ, మనిక శుభారంభం





మకావు: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో భారత స్టార్ క్రీడాకారిణులు ఆకుల శ్రీజ, మనిక బత్రా శుభారంభం చేశారు. సోమవారం మొదలైన ఈ టోర్నమెంట్‌లో శ్రీజ, మనిక గ్రూప్ దశలోని తమ తొలి మ్యాచ్‌ల్లో విజయాన్ని అందుకున్నారు. గ్రూప్-9లోని తొలి మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన శ్రీజ 11-9, 11-4, 11-8, 6-11తో కాన్‌స్టన్‌టీనా సియోగియోస్ (ఆస్ట్రేలియా)పై గెలిచింది. లీగ్ దశ మ్యాచ్‌లకు 'బెస్ట్ ఆఫ్ ఫోర్' పద్ధతిలో జరుగుతున్నాయి. మ్యాచ్‌లో విజేత ఎవరో తేలిపోయినా మొత్తం నాలుగు గేమ్‌లు నిర్వహిస్తున్నారు. గ్రూప్-16లోని తొలి మ్యాచ్‌లో మనిక 11-1, 11-2, 11-6, 11-4తో మేలిస్ జిరెట్ (న్యూ కలడోనియా)పై విజయం సాధించింది.

పాకిస్తాన్ విజయాల 'హ్యాట్రిక్'

లాహోర్: మహిళల వన్డే వరల్డ్ కప్‌కు అర్హత సాధించే అవకాశాలను పాకిస్తాన్ జట్టు మరింత మెరుగుపర్చుకుంది. క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ 65 పరుగుల తేడాతో వెస్టిండీస్ మహిళల జట్టును ఓడించింది. టోర్నీలో పాక్‌కు ఇది వరుసగా మూడో విజయం. ముందుగా పాకిస్తాన్ 49.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిద్రా అమీన్ (54) అర్ధ సెంచరీ సాధించగా... ఓపెనర్ మునీబా అలీ (33) రాణించింది. విండీస్ బౌలర్లలో హేలీ మాథ్యూస్, ఎఫీ ఫ్లెచర్, కరిష్మా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 39.2 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌటైంది. ఆలియా అలీన్ (22)దే అత్యధిక స్కోరు. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా 16 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... రమీన్ షమీమ్, నష్రా సంధు చెరో 2 వికెట్లు తీశారు.



అతి శిక్షణ వర్జయేత్!

- భారత మహిళల టెన్నిస్‌లో గాయాల సమస్య
- ట్రెయినింగ్‌లో సరైన మార్గనిర్దేశనం కొరవడిన వైనం
- కెరీర్ కీలక దశలో వెనుకబడిన ప్రాంజల

సాక్షి క్రీడా విభాగం

యడ్లపల్లి ప్రాంజల... హైదరాబాద్‌కు చెందిన యువ టెన్నిస్ ప్లేయర్. కొన్నేళ్ల క్రితం వరకు చక్కటి ప్రదర్శనతో వరుస విజయాలు సాధిస్తూ సానియా మీర్జా తర్వాత ఆ స్థాయికి చేరుకోగల సత్తా ఉన్న అమ్మాయిగా గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఇప్పుడు ఏ స్థాయిలో ఉంది? మే, 2019లో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఆమె అత్యుత్తమంగా 265కు చేరుకుంది. మరింత మెరుగైన ప్రదర్శనతో పైకి దూసుకు పోతూ మెరుగైన భవిష్యత్తుపై ప్రాంజల ఆట నమ్మకం కలిగించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. 20 ఏళ్ల వయసులో ఆమె మళ్లీ మళ్లీ గాయాలపాలైంది. ఒక గాయం నుంచి కోలుకోగానే మరొకటి ఆమెను వెంటాడింది. 15 ఏళ్ల వయసులోనే ఐటీఎఫ్ స్థాయిలో వరుసగా టైటిల్స్ గెలిచిన ఆ అమ్మాయికి అసలు సమయంలో గాయాల విషయంలో సరైన మార్గనిర్దేశనం లేకుండా పోయింది. దాంతో కెరీర్‌లో ఎదుగుతున్న సమయంలో ఆమె ఆటకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఇప్పుడు 26 ఏళ్ల వయసులో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రాంజల 1409వ స్థానానికి పడిపోయింది! అంటే కెరీర్‌లో ఎదుగుతున్న కీలకమైన 20-25 మధ్య ఐదేళ్ల కెరీర్‌ను ఆమె దాదాపు పూర్తిగా నష్టపోయింది. 'నాకు ఇప్పటికీ టెన్నిస్ అంటే చాలా ఇష్టం. పునరాగమనం చేయాలని పట్టుదలగా ఉన్నాను. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా బాధ వేస్తుంది. గాయాలతో పాటు టోర్నమెంట్ షెడ్యూల్, ఫిట్‌నెస్‌వంటివాటిపై సరైన రీతిలో మార్గనిర్దేశనం లభించి ఉంటే పరిస్థితి ఎంత మెరుగ్గా ఉండేదో అనిపిస్తుంది' ఆమె ప్రాంజల వ్యాఖ్యానించింది.

జిమ్ ఎక్సర్‌సైజ్‌లే సమస్యగా...

ప్రాంజల మాత్రమే కాదు భారత టెన్నిస్‌లో ఎంతో మంది అమ్మాయిలు ప్రస్తుతం ఈ స్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితికి కారణం భారత టెన్నిస్‌లో ముఖ్యంగా మహిళల టెన్నిస్‌లో ఇలాంటివి చూసేందుకు ఒక సరైన వ్యవస్థనే లేదు. అసలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోలిస్తే ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ ఎక్సర్‌సైజ్‌లు కూడా ఎంత వరకు చేయాలి, అవి పరిమితి దాటితే ఎలాంటి నష్టం కలిగిస్తాయో కూడా ఎవరూ చెప్పే పరిస్థితి లేదు. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) వద్ద కూడా దీనికి సరైన సమాధానం లేదు. ఆటలో దూసుకుపోతున్న సమయంలో 'అతి'గా ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం కూడా ప్రాంజలను నష్టపర్చింది. ఒక మ్యాచ్‌లో 6-3, 5-2, 30-30తో విజయానికి బాగా చేరువైన సమయంలో కూడా అనారోగ్యంతో తప్పుకోవాల్సి రావడం ఆమె పరిస్థితిని చూపించింది. 'నేను టీనేజర్‌గా ఉన్నప్పుడు చాలా ఎక్కువగా ట్రెనింగ్ చేసేదానిని. జిమ్‌లో కూడా చాలా ఎక్కువగా బరువును ఎత్తేదానిని. దాని వల్ల ఏమైనా అయితే ఎలా కోలుకోవాలనే విషయంపై కనీస సమాచారం కూడా లేదు. వెన్నునొప్పి, తుంటి నొప్పి, మోకాలు, మడమ... ఇలా ఒకదాని తర్వాత మరో గాయం వెంటాడింది. జిమ్‌లో బరువుల ప్రభావంతో కండరాలు బాగా బిగుసుకుపోయాయి. దాంతో శరీరంలో సమతుల్యత లభించింది. రెండు నెలలో తగ్గే గాయాలకు కూడా ఆరు నెలలు పట్టింది. నేను చేసిన ఎక్సర్‌సైజ్‌లతోనే నాకు బాగా నష్టం జరిగిందనే విషయం కూడా నాకు ఇటీవల అర్థమైంది. అంతకుముందు ఏమీ తెలీదు. తెలిస్తే జాగ్రత్త పడేదాన్ని' అని ప్రాంజల తన ఆవేదనను ప్రదర్శించింది.

ఏఐటీఏ చొరవ చూపిస్తేనే...

కొన్నేళ్ల క్రితం చైనా మహిళా టెన్నిస్ ప్లేయర్ల కోసమే ప్రత్యేకంగా ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను మొదలు పెట్టింది. ముఖ్యంగా తమ అగ్రశ్రేణి క్రీడాకారిణులకు అమిత ప్రాధాన్యతనిచ్చింది. ఇప్పుడు భారత్‌లో 16-24 వయసు మధ్య టెన్నిస్ ఆడుతున్న అమ్మాయిలకు కూడా అలాంటిది అవసరం ఉంది. దీనిపై ఇప్పుడిప్పుడే డిమాండ్లు పెరుగుతున్నాయి. 'భారత మహిళా ప్లేయర్లు విడివిడిగా కాకుండా ఒక బృందంగా టోర్నీలకు వెళ్లటం మేలు చేస్తుంది. అప్పుడు ఏఐటీఏ వారి కోసమే ఒక కోచ్‌ను, ఫిజియోను పంపే అవకాశం ఉంటుంది. సరిగ్గా చెప్పాలంటే అమ్మాయిలకు 360 డిగ్రీ పర్యవేక్షణ అవసరం. న్యూట్రిషన్, మానసిక దృఢత్వం, మ్యాచ్‌ల విశ్లేషణ, సరైన షెడ్యూలింగ్, ప్రాక్టీస్‌కు స్పేర్ పార్ట్‌నర్‌లు...ఇలా అన్నింటి అవసరం ఉంది. రాబోయే రోజుల్లో భారత్‌లో పెద్ద సంఖ్యలో టోర్నీలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 3-4 ఏళ్ల పాటు ప్రస్తుత ప్లేయర్లకు అండగా నిలవాల్సి ఉంది. లేదంటే ఈ ప్రతిభ వృథా అవుతుంది' అని ప్రముఖ టెన్నిస్ అడ్మినిస్ట్రేటర్ సుందర్ అయ్యర్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడైనా ఏఐటీఏ మేల్కొనకపోతే ప్రాంజల కెరీర్‌ను దెబ్బ తీసిన అనుభవాలు మున్ముందూ ఎదురు కావచ్చు.



సింగపూర్‌లో జరిగిన డబ్ల్యూటీఏ ఫ్యూచర్ స్టార్స్ టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత చైనా దిగ్గజం, రెండు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత లీనాతో ప్రాంజల



ఐటీఎఫ్ బెంగళూరు ఓపెన్ సింగిల్స్ టైటిల్‌తో ప్రాంజల

గాయంతో మ్యాచ్‌కు దూరమై...



తాజాగా భారత మహిళల జట్టు బిల్లీ జీన్ కింగ్ కప్ మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శనతో 'ప్లే ఆఫ్స్'కు క్వాలిఫై అయింది. కానీ జట్టులోని అమ్మాయిలను చూస్తే ఎప్పుడైనా వారు గాయాలతో కుప్పకూలిపోవచ్చనే పరిస్థితి కనిపించింది. మరో హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి కండరాల నొప్పితో ఈ టోర్నీలో రెండో మ్యాచ్‌కు అనూహ్యంగా దూరం కావడం ప్రమాద ఘంటికను మోగించింది. మరో ప్లేయర్, 26 ఏళ్ల కర్మన్ కౌర్ కూడా గాయాలతో కొంత కాలంగా కోర్టుకు దూరమైంది. ఇటీవల పునరాగమనం చేసినా ఆమె ఆటలో మునుపటి పదును కనిపించలేదు. బాగా ఆడుతున్న సమయంలో ఇంకా కష్టపడే తత్వం కూడా అలవడుతుంది. మరింత వేగంగా పైస్థాయికి దూసుకుపోయే ప్రయత్నంలో వామప్, జిమ్, కోర్టు ట్రెనింగ్‌తో పాటు అన్నీ అవసరానికి మించి చేయడంతో గాయాల పాలవడం ఒకటి కాగా, కోలుకునేందుకు తగిన సమయం తీసుకోకుండా రీహాబిలిటేషన్‌లో కూడా తొందరపాటు ప్రదర్శించడం ఈ మహిళా టెన్నిస్ ప్లేయర్లపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. 'అతిగా శ్రమించవద్దని చెప్పే కోచ్ ఉండాలి. సరైన సూచనలు ఇచ్చే ట్రావెలింగ్ ఫిజియో ఉండాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే మసాజ్ చేయించుకోమని, అంతా బాగున్నట్లు నటించవద్దని చెప్పే వ్యక్తి కూడా అవసరం. లేదంటే వరుస గాయాలతో మీ పని ముగుస్తుంది' అని ప్రాంజల అభిప్రాయపడింది.



ఐదుగురికి తొలిసారి చోటు

- ఆస్ట్రేలియాతో హాకీ సిరీస్‌కు భారత మహిళల జట్టు ప్రకటన
- కెప్టెన్‌గా సలీమా టెటె కొనసాగింపు

న్యూఢిల్లీ: ఈనెలాఖరులో ఆస్ట్రేలియాలో పర్యటించే భారత మహిళల హాకీ జట్టును సోమవారం ప్రకటించారు. 26 మంది సభ్యులతో కూడిన భారత బృందానికి సలీమా టెటె నాయకత్వం వహిస్తుంది. 26 మందిలో ఐదుగురు జ్యోతి సింగ్, సుజాత కుజుర్, అజ్మీనా కుజుర్, పూజా యాదవ్, మహిమా టెటె తొలిసారి భారత సీనియర్ జట్టులోకి వచ్చారు. బన్సారి సోలంకి, అంజన డుంగ్‌డుంగ్, లాల్‌థంట్లాంగి, సాక్షి శుక్లా, ఖైదెమ్ షిలీమా చాను, దీపి మోనికా టొప్పో, సోనమ్‌లను స్టాండ్‌బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు. ఏప్రిల్ 21 నుంచి మే 4వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో భారత జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. తొలుత ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో రెండు మ్యాచ్‌లు... అనంతరం ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌లు ఉంటాయి. జూన్‌లో జరిగే యూరోపియన్ అంచె ప్రొ హాకీ లీగ్‌కు సన్నాహకంగా భారత జట్టుకు ఆస్ట్రేలియాతో సిరీస్ ఉపయోగపడనుంది.

భారత మహిళల హాకీ జట్టు: సవితా పూనియా, బిచ్చూ దేవి ఖరీబమ్ (గోల్‌కీపర్లు), జ్యోతి సింగ్, ఇషికా చౌధరీ, సుశీలా చాను, సుజాత కుజుర్, సుమన్ దేవి తౌడమ్, జ్యోతి, అజ్మీనా కుజుర్, సాక్షి రాణా (డిఫెండర్లు), సలీమా టెటె, వైష్ణవి ఫాల్కే, నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్, సునెలిటా టొప్పో, మహిమా టెటె, పూజా యాదవ్, లాల్‌రెమ్‌సియామి (మిడ్ ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, దీపిక, రుతుజా పిసాల్, ముంతాజ్ ఖాన్, బల్జీత్ కౌర్, దీపిక సొరెంగ్, బ్యూటీ డుంగ్‌డుంగ్.

డిస్కస్ త్రోలో కొత్త ప్రపంచ రికార్డు

లిథువేనియా అథ్లెట్ మికోలస్ అలెక్నా ఘనత



రామోనా (అమెరికా): పురుషుల అథ్లెటిక్స్ డిస్కస్ త్రో క్రీడాంశంలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఒక్లాహోమా త్రోస్ సిరీస్ వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ మీట్‌లో లిథువేనియాకు చెందిన మికోలస్ అలెక్నా (75.56 మీటర్లు) ఈ ఘనత సాధించాడు. స్వర్ణ పతకం గెలిచే క్రమంలో 22 ఏళ్ల అలెక్నా తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును రెండుసార్లు తిరగ రాయడం విశేషం. గత ఏడాది ఇదే మీట్‌లో అలెక్నా డిస్క్‌ను 74.35 మీటర్ల దూరం విసిరి... 1986 నుంచి జుర్గెన్ షుల్ట్ (జర్మనీ; 74.08 మీటర్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మికోలస్ రజత పతకం గెలిచాడు.

భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఒక్లాహోమా మీట్‌లో అలెక్నా తొలి ప్రయత్నంలో డిస్క్‌ను 74.89 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డును సవరించాడు. ఆ తర్వాత ఐదో ప్రయత్నంలో డిస్క్‌ను 75.56 మీటర్ల దూరం విసిరి మరో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా డిస్క్‌ను 75 మీటర్ల దూరం విసిరిన తొలి అథ్లెట్‌గా గుర్తింపు పొందాడు.

తండ్రి బాటలో...



మికోలస్‌కు ఘనమైన క్రీడా కుటుంబ నేపథ్యం ఉంది. మికోలస్ తండ్రి వర్జిలియస్ అలెక్నా కూడా విఖ్యాత డిస్కస్ త్రోయర్ కావడం విశేషం. 6 అడుగుల 7 అంగుళాల ఎత్తు, 130 కేజీల బరువున్న వర్జిలియస్ 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించాడు. 2003 పారిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2005 హెల్సింకి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకాలు నెగ్గిన వర్జిలియస్... 1997 ఏథెన్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2001 ఎడ్మంటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు. ఓవరాల్‌గా తన కెరీర్‌లో వర్జిలియస్ 12 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు గెలిచాడు. 2014లో రిటైర్మెంట్ ప్రకటించిన 53 ఏళ్ల వర్జిలియస్ రాజకీయాల్లో ప్రవేశించి లిథువేనియా పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

థెరపిస్టు చాట్‌జీపీటీ

ప్రేమ మొదలుకుని వృత్తి సమస్యల దాకా...

- సమస్యల పరిష్కారానికి ఏఐతో చాటింగ్
- యువతలో క్రమంగా పెరుగుతున్న ధోరణి



లవ్ బ్రేకప్.. ఒంటరితనం.. ఆఫీసులో కోపిష్టి బాస్ వేధింపులు.. సహోద్యోగులతో ఇబ్బందులు.. జీవితంలో ఏ సమస్య వచ్చినా చెప్పుకోవడానికి, ఓపిగ్గా వినేవారొకరు ఉండాలి. తీరా చెప్పాక జడ్జ్ చేయకుండా ఉంటారా? నిష్పాక్షికంగా పరిష్కార మార్గం సూచిస్తారా? అనుమానమే. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా మానసిక వైద్యులను సంప్రదిస్తారు. కానీ ఇప్పుడు ట్రెండు మారుతోంది. ఈ విషయంలో చాట్‌జీపీటీకే జనం ఓటేస్తున్నారు. సమస్యలను వినే మంచి ఫ్రెండ్‌గానే గాక వాటికి పరిష్కారం చూపే కౌన్సిలర్‌గా కూడా భావిస్తున్నారు.

లైఫ్ కౌన్సిలర్

27 ఏళ్ల మనీశ్ ఇంజనీర్. ప్రియురాలితో గొడవైంది. అపార్థాలతో బంధానికి బ్రేక్ పడింది. మానసికంగా అలసిపోయి ఓ సాయం వేళ చాట్‌జీపీటీని ఆశ్రయించాడు. సమస్యంతా చెప్పాడు. ఏం చేయాలో పాలుపోవడం లేదన్నాడు. చాట్‌జీపీటీ సమాధానం మనోన్ని ఆశ్చర్యపరిచింది. ''మీరు చెప్పింది ఆమె వినకపోవడం మిమ్మల్ని బాధిస్తోంది. అదే విషయం ఆమెకు నేరుగా చెప్పారా?''అని అడిగింది. అంతటితో ఆగకుండా ప్రేయసికి సందేశం పంపడంలో మనీశ్‌కు సాయపడింది. ఆమెను నిందించకుండా కేవలం అతని ఫీలింగ్స్ మాత్రమే వ్యక్తపరిచే ప్రశాంతమైన, నిజాయితీతో కూడిన నోట్ అది. అందుకున్న ఆ అమ్మాయి మనీష్‌తో మాట్లాడింది. ఇంకేముంది వారి మధ్య దూరం తగ్గిపోయింది.

వృత్తి సమస్యల్లో సాయం

26 ఏళ్ల అక్షయ్ శ్రీవాస్తవ కంటెంట్ రైటర్, మీడియా ప్రొఫెషనల్. ఆఫీసుకు వెళ్లిరావడానికే నాలుగ్గంటలు పోతోంది. నిద్ర లేదు. కుటుంబంతో గడపడానికి లేదు. ఫిర్యాదులా కాకుండా ఈ విషయాన్ని బాస్‌తో ఎలా చెప్పాలో తేలక చాట్‌జీపీటీని ఆశ్రయించాడు. వాడాల్సిన పదాలతో సహా చక్కని నిర్మాణాత్మక సలహాలిచ్చింది. అప్పటినుంచి అక్షయ్ క్రమం తప్పకుండా చాట్‌బాట్‌ను ఆశ్రయిస్తున్నాడు. ఆయేషాది మరో సమస్య. ఇన్నాళ్లు సహోద్యోగిగా ఉన్న స్నేహితులకే బాస్ అయింది. సాన్నిహిత్యం కోల్పోకుండా వాళ్లతో ఎలా డీల్ చేయాలని చాట్‌జీపీటీనే అడిగింది. అదిచ్చిన సమాధానం ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌లో క్రాష్ కోర్సులా సాయపడింది.

బెటర్ కౌన్సిలర్?

ఒక్కోసారి కౌన్సిలర్ కంటే మెరుగ్గా చాట్‌జీపీటీ ఇచ్చే సమాధానాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. జీవితంలో చాలా కోల్పోయానని అపిస్తుందనే ప్రశ్నకు.. 'మార్పు జరిగినప్పుడు అది మామూలే. అభిరుచులను పెంచుకోండి'అని కౌన్సిలర్ చెప్పారు. చాట్‌జీపీటీ మాత్రం, 'సంతోషపరిచే పనులు చేయండి. చిన్న లక్ష్యాలు పెట్టుకుని చేరుకునే ప్రయత్నం చేయండి'అని సూచించింది. స్నేహితులు అర్థం చేసుకోవడం లేదంటే వారితో ఓపెన్‌గా మాట్లాడమని థెరపిస్టు చెబితే, 'స్నేహితుల్లో అపార్థాలు మామూలే. వారితో నిజాయితీగా మాట్లాడండి'అని చాట్‌జీపీటీ సూచించింది. పని నచ్చడం లేదంటే ఒత్తిళ్లను గుర్తించి పరిష్కారానికి కొత్తగా ప్రయత్నించమని కౌన్సిలర్ చెప్పాడు. చాట్‌జీపీటీ మాత్రం, 'పనిలో పరిమితులను పెట్టుకోండి. హెచ్‌ఆర్ లేదా మెంటార్‌తో మాట్లాడండి. మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి'అని సలహా ఇచ్చింది. భాగస్వామితో విభేదాలపై ఓపెన్‌గా మాట్లాడుకుని, సమస్యకు కారణాలేంటో కనిపెట్టి పరిష్కారానికి కలిసి ప్రయత్నించండన్న చాట్‌జీపీటీ సూచనే మెరుగ్గా ఉందని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

ప్రత్యామ్నాయం కాబోదు: మానసిక వైద్యులు

మానసిక వైద్యం మనదేశంలో కాస్త ఖరీదైన విషయం. జనంలో అవగాహన లేమి కూడా ఉంది. ఆ సమస్యలకు చాలామంది క్రమంగా ఏఐపై ఆధారపడుతున్నారు. అది జడ్జ్ చేయదు. చెబుతుంటే మధ్యలో అడ్డుకోదు. ఏం చెప్పినా, ఎంతసేపు చెప్పినా, ఎప్పుడు చెప్పినా శ్రద్ధగా వింటుంది. అంతే ఓపిగ్గా సమాధానమూ ఇస్తుంది. దాంతో వ్యక్తిగతం నుంచి వృత్తిపరమైన సలహాల దాకా యూత్ చాట్‌జీపీటీపై ఆధారపడుతోంది. కానీ ఈ చాట్‌బాట్ మానసిక ఇబ్బందులకు మొత్తంగా పరిష్కారం చూపలేదంటున్నారు వైద్యులు. ''అది తాత్కాలిక ఉపశమనమిచ్చే ఔట్‌లెట్‌లా పనిచేస్తుందంతే. పూర్తిస్థాయి మానసిక చికిత్స ప్రక్రియకు ప్రత్యామ్నాయం కాబోదు. సహానుభూతి, అంతర్దృష్టి, అవగాహన వాటికుండవు''అంటున్నారు. అంతే గాక ఏఐ థెరపీ బాట్లతో ముప్పు కూడా ఉంటుందని అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ హెచ్చరించింది. ప్రత్యేకించి వాటిని పిల్లలు వాడటంపై ఆందోళన వ్యక్తం చేసింది. మనుషులను అవి మరింత ఒంటరులను చేస్తాయనీ హెచ్చరించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్(59)కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. ముంబై ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు ఆదివారం అందిన హెచ్చరికల నేపథ్యంలో కేసు నమోదు చేశారు. సల్మాన్ కారును పేల్చేస్తామని, ఆయన్ను ఇంట్లోనే కొడతామంటూ అందులో ఉంది. ఈ విషయాన్ని కంట్రోల్ రూం సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వర్లి పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని 351(2)(3)కింద గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరుపుతున్నామని ఓ అధికారి తెలిపారు. ఇటీవలి కాలంలో ట్రాఫిక్ పోలీస్ హెల్ప్ లైన్ ద్వారా సల్మాన్ ఖాన్‌కు అనేక మార్లు బెదిరింపులు వచ్చాయి. గతంలో ఆయనకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి చంపుతామంటూ బెదిరింపుల సైతం అందాయి. గత ఏడాది ఏప్రిల్‌లో ముంబై బాంద్రాలోని సల్మాన్ నివాసం వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ వ్యక్తులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత, ముంబై సమీపంలోని పన్వెల్‌లో ఉన్న ఫాంహౌస్‌కు వెళ్లిన సల్మాన్‌పై జరిగిన హత్యాయత్నాన్ని భగ్నం చేసినట్లు నవీ ముంబై పోలీసులు ప్రకటించారు. కాగా, హత్య, బలవంతపు వసూళ్ల తదితర కేసులను ఎదుర్కొంటున్న బిష్ణోయ్ ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని సబర్మతీ జైలులో ఉన్నాడు.

ఢిల్లీలో పసికందుల విక్రయం

సాక్షి, న్యూఢిల్లీ: నవజాత శిశువుల విక్రయాలకు పాల్పడుతున్న ఓ ముఠాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని, అక్కడ జన్మిస్తున్న శిశువులను కిడ్నాప్ చేస్తున్నారు. వీరిని ఢిల్లీలోని ధనికులకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే తరహా ఘటన హైదరాబాద్‌లో జరగ్గా, పోలీసులు కొందరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. ఇదే తరహా ఘటన ఇప్పుడు ఢిల్లీ దేశ రాజధాని ప్రాంత (ఎన్‌సీఆర్) పరిధిలో వెలుగులోకి వచ్చింది. దీంతో హైదరాబాద్ కేసును ఉదాహరణగా తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ద్వారక జిల్లా ఉత్తమ్ నగర్‌లో ఓ కుటుంబానికి రెండు రోజుల నవజాత శిశువును విక్రయిస్తుండగా పోలీసులు ఇద్దరు మహిళలు, ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్, గుజరాత్ ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి శిశువులను అపహరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు విచారణలో వారు వెల్లడించారు. ఇప్పటి వరకు 30 మంది శిశువులను ఇలా విక్రయించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో విక్రయించిన ముఠా పాప అయితే స్కూటీ, బాబు అయితే బైక్ అంటూ కోడ్ పెట్టుకుంది. ఇదే తరహాలో ఇక్కడ కూడా చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఢిల్లీ పోలీసులు త్వరలో హైదరాబాద్ పోలీసులను సంప్రదించనున్నట్లు సమాచారం.

ఛత్తీస్‌లో ఐదు మందుపాతర్ల వెలికితీత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన ఐదు మందుపాతరలను సోమవారం బలగాలు నిర్వీర్యం చేశాయి. జైతలూర్‌లోని కోబ్రా 13వ బెటాలియన్ బలగాలు గోర్నా–మంకేలీ మార్గంలో కూంబింగ్‌కు వెళ్లాయి. ఈక్రమంలో మంకేలీ సమీపంలోని మట్టి రోడ్డుపై సుమారు 5 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన ఐదు మందుపాతరలను గుర్తించారు. ఇందులో రెండేసి కిలోల మూడు బాటిల్ బాంబులు, మూడేసి కిలోల రెండు టిఫిన్ బాంబులు ఉన్నాయి. పోలీసు క్యాంప్‌నకు 5 కిలోమీటర్ల దూరంలోపే అమర్చిన వీటిని అదే ప్రాంతంలో నిర్వీర్యం చేశారు. దీంతో పోలీసు బలగాలకు ముప్పు తప్పినట్లయింది.

ఏడుగురు మావోయిస్టులు అరెస్ట్

బిజాపూర్ జిల్లా బైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూలేడ్ అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన ఆరుగురిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. వీరివద్ద టిఫిన్ బాంబు, కార్డెక్స్ వైర్, జిలెటిన్ స్టిక్స్, డిటొనేటర్లు, బ్యాటరీ తదితరాలు లభించాయి. మందుపాతర అమర్చేందుకు వెళ్తున్నట్లు విచారణలో అంగీకరించారు. అలాగే మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఆర్‌పీఎఫ్ బలగాలు బెచాపాల్ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యుడు అజయ్ అలియాస్ గుండి కొర్సాను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద కూడా టిఫిన్ బాంబు, బ్యాటరీ, విద్యుత్ వైర్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు.

రాణాపై రోజూ 8-10 గంటలు ప్రశ్నల వర్షం

48 గంటలకోసారి వైద్య పరీక్షలు జరిపించాలన్న కోర్టు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడుల ప్రధాన సూత్రధారి తహవ్వుర్ రాణా(64)ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)అధికారులు రోజులో 8 నుంచి 10గంటలపాటు ప్రశ్నిస్తున్నారు. పేలుళ్ల వెనుక కుట్ర కోణాన్ని ఛేదించేందుకు ప్రయత్నిస్తున్నారని అధికార వర్గాలు సోమవారం తెలిపాయి. 2008 నవంబర్ 26వ తేదీన దాడులకు ముందు అతడు దేశంలోని పలు ప్రాంతాల్లో చేసిన పర్యటనల వెనుక ఉద్దేశాన్ని కనుగొనే దిశగా విచారణ సాగుతోందన్నారు. ఈ నెల 10న అమెరికా నుంచి తీసుకువచ్చిన రాణాను ఢిల్లీ కోర్టు 18 రోజుల కస్టడీకి అనుమతించడం తెల్సిందే. రాణాకు ఆరోగ్య పరీక్షలు చేయించడంతోపాటు లాయర్‌ను కలుసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. ప్రధాన విచారణాధికారి జయా రాయ్ సారథ్యంలో విచారణ జరుపుతున్న ఎన్ఐఏ అధికారులకు రాణా సహకరిస్తున్నాడని ఓ అధికారి వెల్లడించారు. రాణా కోరిన మేరకు పెన్, నోట్ ప్యాడ్, ఖురాన్‌ను సమకూర్చామన్నారు. ఇతర నిందితులకు మాదిరిగానే ఆహారం అందిస్తున్నామని, ప్రత్యేకంగా ఏదీ అతడు కోరలేదన్నారు. రాణా ప్రస్తుతం ఢిల్లీలోని సీజీవో కాంప్లెక్స్‌లో ఉన్న ఎన్ఐఏ ప్రధాన కార్యాలయంలో అత్యంత భద్రత కలిగిన సెల్‌లో ఉన్నాడు. కుట్ర, హత్య, ఉగ్రకార్యకలాపాలకు ఊతమివ్వడం, ఫోర్జరీ తదితర ఆరోపణలను ఎదుర్కొంటున్నాడు. ముంబై దాడుల వెనుక లష్కరే తోయిబా, హర్కతుల్ జిహాదీ ఇస్లామీకి చెందిన పలువురు ఉగ్ర నేతల ప్రమేయం ఉన్నట్లు ఎన్ఐఏ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.

ఢిల్లీలోనూ దాడులకు కుట్ర

2008 నవంబర్ 26వ తేదీన ముంబై ఉగ్రదాడులకు పథకం రచన చేసిన తహవ్వుర్ రాణా అదే రోజు దేశ రాజధాని ఢిల్లీలోనూ మారణ హోమం సృష్టించేందుకు పథకం వేసినట్లు వెల్లడైంది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్ జిత్ సింగ్ ఈ నెల 10వ తేదీన జారీ చేసిన 10 పేజీల ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'దేశమంతటా విస్తృతంగా పర్యటన చేసిన రాణా పలు నగరాల్లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకున్నాడు. ఇందులో ఢిల్లీ కూడా ఉన్నట్లు ఎన్ఐఏ ఆధారాలున్నాయి. జాతీ భద్రతకు సంబంధించిన విషయం ఇది. దీని వెనుక ఉన్న భారీ కుట్రకోణాన్ని ఛేదించేందుకు రాణా కస్టోడియల్ విచారణ అవసరం. సాక్ష్యాల విచారణ, ఆధారాల సేకరణ, రాణా అతడి అనుయాయుల పర్యటనల వివరాలను రాబట్టాల్సి ఉంది. 17 ఏళ్ల క్రితం జరిగిన పరిణామాలపై రాణాను పలు కీలక ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇందుకు చాలా సమయం పడుతుంది'అని అందులో పేర్కొన్నారు. అనేక ఆరోగ్య సమస్యలున్న రాణాకు 48 గంటలకోసారి వైద్య పరీక్షలు చేయించాలని ఆయన ఆదేశించారు.

పాలస్తీనాకు గుర్తింపు... మాక్రాన్‌పై నెతన్యాహు ధ్వజం

జెరూసలెం: పాలస్తీనాను దేశంగా గుర్తించాలన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మండిపడ్డారు. ఇజ్రాయెల్ వినాశనమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న పాలస్తీనా దేశ భావనను ప్రోత్సహించడం తప్పన్నారు. ఇజ్రాయెల్ మనుగడకు ముప్పు కలిగించే పాలస్తీనా రాజ్య స్థాపన గురించి ఇలాంటి నైతిక ఉపన్యాసాలను అంగీకరించబోమన్నారు. కోర్సికా, న్యూ కాలెడోనియా, ఫ్రెంచ్ గయానా తదితర భూభాగాలకు స్వాతంత్ర్యమివ్వడాన్ని వ్యతిరేకించే వారు తమకు సుద్దులు చెబుతున్నారంటూ దుయ్యబట్టారు. నెతన్యాహు కుమారుడు యైర్ కూడా మాక్రాన్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'న్యూ కాలెడోనియా, ఫ్రెంచ్ పాలినేషియా, కోర్సికా, బాస్క్యూ, ఫ్రెంచ్ గయానా స్వాతంత్ర్యం కోసం నిన్ను నలిపేస్తాం' అని ఎక్స్ పోస్టులో హెచ్చరించారు. పాలస్తీనాను గుర్తించే దిశగా అడుగులు వేస్తామని బుధవారం మాక్రాన్ అన్నారు. జూన్‌లో జరిగే ఐరాస సదస్సులో ఫ్రాన్స్ ఈ దిశగా నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారు. ఫ్రాన్స్‌లోని మితవాద గ్రూపులు దీన్ని తప్పుబట్టడంతో పాలస్తీనావాసుల చట్టబద్ధమైన హక్కుకు మాత్రమే మద్దతిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

క్షీణించిన సంబంధాలు

ఇజ్రాయెల్, ఫ్రాన్స్ సంబంధాలు ఇటీవల బాగా క్షీణించాయి. పాలస్తీనాను అధికారికంగా గుర్తిస్తే ఇజ్రాయెల్, ఫ్రాన్స్ మధ్య శత్రుత్వంగా మారే ఆస్కారముంది. మాక్రాన్ ప్రకటనను హమాస్ స్వాగతించింది. పాలస్తీనా దేశాన్ని దాదాపు 150 దేశాలు గుర్తిస్తున్నాయి.

కాంగ్రెస్‌కు అవసరమైనప్పుడు రాజకీయాల్లోకి: రాబర్ట్ వాద్రా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి అవసరమైనప్పుడు రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని సోనియా గాంధీ అల్లుడు, ఎంపీ ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నన్ను అభిమానించే ప్రజలు పార్లమెంట్‌లో ఎప్పుడు అడుగుపెడతారంటూ ప్రశ్నిస్తున్నారు. చూద్దాం, నేను కూడా కష్టపడి పనిచేస్తా. 'నా అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించినప్పుడు, నా కుటుంబం కోరుకున్నప్పుడు నేనూ పార్లమెంటులో ఉంటా. ప్రియాంక ఇప్పటికే ప్రజల సమస్యలపై సభలో పోరాడుతున్నారు' అన్నారు. బెల్జియంలో మెహుల్ చోక్సీ అరెస్ట్‌పై ఆయన.. ఆరోపణలున్న వ్యాపారవేత్త అదానీని కూడా విచారించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

అంబేడ్కర్‌కు నివాళులు

న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలతోపాటు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా కూడా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశ ప్రజలకు సోమవారం రాష్ట్రపతి ముర్ము శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్డీఏకు పరాస్ గుడ్‌బై

పట్నా: కేంద్ర మాజీ మంత్రి పశుపతి కుమార్ పరాస్ సారథ్యంలోని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ(ఆర్ఎల్‌జేపీ) ఎన్డీఏతో తెగదెంపులు చేసుకుంది. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పరాస్ ఈ విషయం ప్రకటించారు. దివంగత రాం విలాస్ పాశ్వాన్ సోదరుడే పరాస్. పాశ్వాన్ కుమారుడు చిరాగ్‌తో పొసగక లోక్ జనశక్తి పార్టీని వీడి బయటకు వచ్చిన పరాస్ 2021లో ఆర్ఎల్‌జేపీ ఏర్పాటు చేసుకున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జనశక్తి పార్టీ(రాం విలాస్)పార్టీకి ఐదు సీట్లు కేటాయించడంపై అసమ్మతి వ్యక్తం చేస్తూ పరాస్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. పరాస్ సొంత సీటు హజీపూర్ సహా ఆ ఐదు సీట్లనూ చిరాగ్ పార్టీ గెలుచుకుంది. ఎన్డీఏను అంటిపెట్టుకునే ఉన్నా ఆయన పార్టీకి ఇచ్చిన బంగ్లాను ప్రభుత్వం ఖాళీ చేయించి, చిరాగ్‌కు కేటాయించింది. ఈ పరిస్థితుల్లోనే పరాస్ తాజా నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.



రోదసిలోకి మహిళా సెలబ్రిటీలు

రోదసి పర్యాటకానికి ఊపు తెచ్చే దిశగా ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ మరో ముందడుగు వేసింది. మహిళా సెలబ్రిటీలతో 10 నిమిషాల బుల్లి రోదసి యాత్రను సోమవారం విజయవంతంగా నిర్వహించింది. బెజోస్ కాబోయే భార్య లారెన్ శాంచెజ్‌తో పాటు ప్రఖ్యాత అమెరికా గాయని కేటీ పెర్రీ, జర్నలిస్టు గేల్ కింగ్, సినీ నిర్మాత కెరియన్ ఫ్లిన్, సైంటిస్టు అమండా గుయెన్, నాసా మాజీ ఇంజనీర్ ఆయేషా బోవ్ ఇందులో భాగస్వాములయ్యారు. న్యూ షెపర్డ్ వ్యోమనౌకలో భూ ఉపరితలానికి 107 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లి కాసేపు భారరహిత స్థితిని ఆస్వాదించారు. అనంతరం పారాచూట్ల సాయంతో వ్యోమనౌక భూమికి తిరిగొచ్చింది. బ్లూ ఆరిజిన్‌కు ఇది 11వ మానవసహిత అంతరిక్ష యాత్ర.

టారిఫ్ యుద్ధంలో విజేతలుండరు: జిన్‌పింగ్

హనోయ్: వాణిజ్యం యుద్ధం లేదా టారిఫ్‌ల యుద్ధంలో విజేతలంటూ ఎవరూ ఉండరని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. 'చైనా, వియత్నాంలు రెండూ బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను, స్థిరమైన ప్రపంచ పారిశ్రామిక, సప్లయ్ చైన్‌ను, సహకారాత్మక అంతర్జాతీయ వాతావరణాన్ని దృఢంగా కాపాడుకోవాలి'అని పిలుపునిచ్చారు. పొరుగు దేశాలతో దౌత్య సంబంధాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తామని, ఆసియా ఆధునీకరణపై చైనా దృష్టి పెడుతుందని చెప్పారు. ఈ మేరకు వియత్నాం అధికార వార్తా పత్రిక వ్యాసాన్ని ప్రచురించింది. ఆగ్నేయాసియా దేశాల పర్యటనలో భాగంగా సోమవారం వియత్నాం రాజధాని హనోయ్‌కి జిన్‌పింగ్ చేరుకున్నారు. టారిఫ్‌ల యుద్ధంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేస్తున్న క్రమంలో జిన్‌పింగ్ పొరుగుదేశాలైన వియత్నాంతోపాటు మలేసియా, కాంబోడియాల్లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2013లో చైనా అధ్యక్ష పగ్గాలు చేపట్టాక వియత్నాంలో జిన్‌పింగ్ చేపట్టిన మూడో పర్యటన ఇది. ఆగ్నేయాసియా చైనాకు ఎంత అవసరమో ఈ పర్యటనతోనే వెల్లడవుతోందని పరిశీలకులు అంటున్నారు.

పుతిన్ నిర్వాకం చూద్దురు రండి!

సుమీ ఘటనపై ట్రంప్‌కు జెలెన్‌స్కీ ఆహ్వానం

కీవ్: ఉక్రెయిన్‌లోని సుమీ నగరంపై ఆదివారం రష్యా జరిపిన క్షిపణుల దాడిలో 34 మంది మరణించడం తెల్సిందే. ఈ ఘటనను ఫ్రాన్సు అధ్యక్షుడు మేక్రాన్ సహా పలువురు ప్రపంచ నేతలు నిరసించారు. అదే సమయంలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమ దేశంలో ఒకసారి పర్యటించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆహ్వానించారు. యుద్ధానికి సంబంధించిన ఏదైనా నిర్ణయం తీసుకునేందుకు ముందుగా సుమీ నగరంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ పాల్పడిన దురాగతాన్ని కళ్లారా చూడాలని కోరారు. 'చర్చలు, సంప్రదింపులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనుకున్నా దయచేసి ముందుగా మీరు ముందుగా మా దేశం రండి. 'ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు, పౌరులు, సైనికుల బాధలు, రష్యా దురాక్రణతో ధ్వంసమైన ఆస్పత్రులు, చర్చిలను చూడండి'అని సీబీఎస్‌కు ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, కాల్పుల విరమణ ఒప్పందానికి దిగివచ్చేలా రష్యాపై గట్టి చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ఫ్రాన్స్ భాగస్వామ్య దేశాలతో శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న దౌత్య ప్రయత్నాలను పుతిన్ లెక్కలోకి తీసుకోవడం లేదు'అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చెప్పారు. యూరప్ దేశాలు చేస్తున్న శాంతి ప్రయత్నాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ బలహీనతగా భావిస్తున్నారని ఎన్నికైన జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ వ్యాఖ్యానించారు. సుమీపై రష్యా దాడిని పిరికిపంద చర్యగా ఇటలీ ప్రధాని మెలోనీ అభివర్ణించారు. రష్యాతో తక్షణమే పూర్తిస్థాయి కాల్పుల విరమణ చేయించాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. కాగా, రష్యా క్షిపణి దాడిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విచిత్రంగా స్పందించారు. 'ఈ యుద్ధమే ఒక భయంకరమైన ఘటన. రష్యా తప్పు చేసినట్లు నాకు చెప్పారు'అని అన్నారు. తప్పు అంటే అర్థమేంటన్న మీడియా ప్రశ్నకు ట్రంప్..ఎవరు, ఏమిటి అనే వివరణ ఇవ్వకుండా 'వాళ్లనే అడగండి'అంటూ వెళ్లిపోయారు.

నిప్పు మిమ్మల్నీ కాల్చేస్తుంది

యూనస్‌కు హసీనా హెచ్చరిక

న్యూఢిల్లీ/ఢాకా: మహమ్మద్ యూనుస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై బంగ్లాదేశ్ బహిష్కృత నేత, మాజీ ప్రధాని షేక్ హసీనా విరుచుకుపడ్డారు. ''బంగ్లా చరిత్రను, స్వాతంత్ర్య పోరాటంలో అవామీ లీగ్ పాత్రను యూనుస్ చెరిపేస్తున్నారు. స్వాతంత్ర్య యోధులను అవమానిస్తున్నారని, వారి జ్ఞాపకార్థం నిర్మించిన స్మారకాలను తగలబెడుతున్నారు''అంటూ మండిపడ్డారు. 'నిప్పుతో చెలగాటమాడితే అది మిమ్మల్ని కూడా కాల్చేస్తుంది'అని హెచ్చరించారు. హసీనా ఆదివారం తన మద్దతుదారులను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. విదేశాల నుంచి వచ్చిన నిధుల సాయంతో దేశాన్ని యూనుస్ నాశనం చేశారని ఆరోపించారు. అవామీ ప్రభుత్వాన్ని కూలదోయడంతో పారిశ్రామికంగా బంగ్లా కుప్పకూలిందన్నారు. ''వేల ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. అవామీ నేతలతో సంబంధమున్న ఫ్యాక్టరీలను తగలబెట్టారు. పరిశ్రమలు, హోటళ్లు, ఆసుపత్రులు నాశనమవుతున్నాయి. పోలీస్ స్టేషన్లను తగలబెట్టి, పోలీసులను చితకబాదిన వారిపై కేసుల్లేవు. అవామీ నేతలపై మాత్రం కేసులు బనాయిస్తున్నారు''అని ఆవేదన వ్యక్తం చేశారు. యూనుస్‌ను కేవలం అధికార దాహమే నడిపిస్తోందని ధ్వజమెత్తారు.

హత్యలన్నీ కుట్రలో భాగం

తన పదవీచ్యుతికి దారితీసిన కోటా ఆందోళనలకు మూలకారణమైన విద్యార్థి నిరసనకారుడు అబూ సయీద్ మరణంపై హసీనా అనుమానాలు వ్యక్తం చేశారు. ''అతడిని పోలీసులు చంపలేదు. వాళ్లు రబ్బరు బుల్లెట్లే వాడారు. ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వే క్రమంలో ఓ బండరాయి సయీద్ తలను పగలగొట్టింది. పైగా అతని ఒంట్లో 7.62 ఎంఎం తూటా దొరికింది. అదెక్కడి నుంచి పేలింది? ఆ తుపాకీని వాడిందెవరు?''అని ప్రశ్నించారు. దీనిపై నిజాలు వెలికితీసేందుకు ప్రయత్నించిన ఉన్నతాధికారిని యూనుస్ తొలగించారని ఆరోపించారు. సయీద్ మృతదేహాన్ని వెలికితీసి ఫోరెన్సిక్ పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో భాగంగా జరిగిన హత్యలన్నీ కుట్రలో భాగమేనన్నారు.

హిందువులను ఏకం చేసేందుకు అంబేడ్కర్ జీవితాన్ని అంకితం చేశారు

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

కాన్పూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశంలో హిందువులను ఏకం చేసేందుకు జీవితాన్ని అంకితం చేశారని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. చిన్న నాటి నుంచే అనేక కష్టాలు ఎదుర్కొన్నా, దేశం అభివృద్ధి కోసం, సామాజిక సామరస్యం కోసం పాటుపడ్డారన్నారు. ఉత్తరప్రదేశ్ రాజధాని కాన్పూర్‌లో కొత్తగా నిర్మించిన నాలుగంతస్తుల ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. 'బాబా సాహెబ్ జీవితాంతం తీవ్ర కష్టాలను అనుభవించారు. చిన్నతనం నుంచే వివక్షను, అసమానతను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, హిందూ సమాజాన్ని ఏకం చేసే కృషిని మాత్రం ఆపలేదు. సామాజిక ఐక్యతకు, పురోభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసి, అందరికీ ఆదర్శంగా నిలిచారు'అని భగవత్ తెలిపారు. అంబేడ్కర్ జయంతి నాడు ఆర్ఎస్ఎస్ నూతన భవనాన్ని ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నట్లు భగవత్ తెలిపారు. కాగా, కేశవ్ భవన్‌గా పిలిచే ఈ భవనంలోని హాలుకు డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టడం విశేషం. భగవత్ పర్యటనను పురస్కరించుకుని కాన్పూర్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

యెమెన్‌పై అమెరికా దాడులు.. ఏడుగురు మృతి

దుబాయ్: యెమెన్ రాజధాని సనాపై ఆదివారం రాత్రి అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఏడుగురు చనిపోగా 30 మంది వరకు గాయపడ్డారు. అమెరికా దాడుల్లో సనా శివారులోని సిరామిక్ ఫ్యాక్టరీ ధ్వంసమైందని హౌతీలు తెలిపారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ ఎర్ర సముద్రం జలాల్లో ప్రయాణించే ఓడలపై హౌతీలు దాడులకు పాల్పడుతుండటం తెల్సిందే. ఇందుకు ప్రతిగా హౌతీల సైనిక వసతులే లక్ష్యంగా మార్చి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు 200కు పైగా దాడులు చేపట్టినట్లు అమెరికా తెలిపింది. ఈ దాడుల్లో 120 మందికి పైగా మృతి చెందినట్లు హౌతీలు అంటున్నారు. కాగా, అమెరికాకు చెందిన శక్తివంతమైన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్‌ను కూల్చేసినట్లు హౌతీలు ప్రకటించారు. హజ్జాహ్ ప్రాంతంలో ఈ ఘటనకు సంబంధించిన వీడియోను వారు విడుదల చేశారు. స్థానికంగా తయారు చేసిన క్షిపణుల సాయంతో రెండు వారాల వ్యవధిలో ఇలాంటి నాలుగు డ్రోన్లను ధ్వంసం చేసినట్లు హౌతీల ప్రతినిధి తెలిపారు. కాగా, జనరల్ ఆటమిక్స్ రీపర్స్ ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.257 కోట్లు. ఇవి 40 వేల అడుగుల ఎత్తులో ఏకబిగిన 30 గంటలపాటు ప్రయాణించగలవు. వీటిని కూల్చినట్లు హౌతీలు చేసిన ప్రకటన విషయం తమకు తెలిసిందని మాత్రమే అమెరికా సెంట్రల్ కమాండ్ స్పందించడం గమనార్హం.

అయోధ్య ఆలయం చుట్టూ నాలుగు కిలోమీటర్ల రక్షణ గోడ

అయోధ్య: అయోధ్యలోని రామాలయం చుట్టూతా సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఎత్తైన రక్షణ గోడ నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్‌పర్సన్ నృపేంద్ర మిశ్రా సోమవారం తెలిపారు. కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతి, కొత్తగా చేపట్టాల్సిన రక్షణ చర్యలు, పరిసర ప్రాంతాల అభివృద్ధి, విగ్రహాల ఏర్పాటుపై చర్చించామన్నారు. ఆలయ నిర్మాణ పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నాలుగు కిలోమీటర్ల రక్షణ గోడను ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ చేపడుతుందని, గోడ ఎత్తు, మందం, డిజైన్ అంశాలు త్వరలోనే ఖరారవుతాయన్నారు. సప్త మండల ఆలయ విగ్రహాలు ఆదివారమే ఆయా ఆలయాల నుంచి అయోధ్యకు చేరుకున్నాయని మిశ్రా చెప్పారు. అంతకుముందు, ప్రధాన ఆలయ గోపురంపై కలశ స్థాపన వేడుక వైభవంగా జరిగింది.

ఎల్‌జీబీటీక్యూ+ వర్గాల ప్రదర్శనలపై నిషేధం

హంగెరీలో రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం

బుడాపెస్ట్: లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్ తదితర (ఎల్‌జీబీటీక్యూ+) వర్గాల బహిరంగ ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ హంగెరీ దేశంలో రాజ్యాంగ సవరణ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం చట్టప్రకారం నేరంగా గుర్తిస్తారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణకు సంబంధించిన బిల్లును హంగెరీ పార్లమెంట్‌లో సోమవారం ఆమోదించారు. బిల్లుకు అనుకూలంగా 140 ఓట్లు, వ్యతిరేకంగా 21 ఓట్లు వచ్చాయి. ఈ రాజ్యాంగ సవరణను మానవ హక్కుల సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. భిన్న వర్గాల ప్రజల హక్కులపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని మండిపడ్డారు. రాజ్యాంగ సవరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హంగెరీ రాజధాని బుడాపెస్ట్‌లో ప్రతిఏటా పాపులర్ ప్రైడ్ పేరిట భారీ వేడుక జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎల్‌జీబీటీక్యూ+ వర్గాల ప్రజలు పాల్గొంటారు. ఇకపై ఈ వేడుక జరగకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సుప్రీంకోర్టు భవన రూపశిల్పి ఎవరు?

ప్రభుత్వాంగాల్లో న్యాయశాఖకు అత్యంత ప్రాముఖ్యం ఉంటుంది. న్యాయశాఖ సామర్థ్యం కంటే ప్రజాస్వామ్యానికి మరో గీటురాయి లేదని 'లార్డ్ బ్రైస్' అనే రాజనీతి విశ్లేషకుడు వ్యాఖ్యానించారు. ఈస్ట్ ఇండియా పరిపాలనా కాలంలో 1773లో రూపొందించిన రెగ్యులేటింగ్ చట్టం ద్వారా కలకత్తాలోని ఫోర్టు విలియమ్స్‌లో 1774లో మొదటిసారిగా సుప్రీంకోర్టును స్థాపించారు. భారతదేశంలో న్యాయ వ్యవస్థ అభివృద్ధిలో కార్న్‌వాలీస్ ప్రధాన పాత్ర పోషించాడు. అందువల్ల ఇతడిని 'భారత న్యాయ వ్యవస్థ పితామహుడు' అంటారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ - సుప్రీంకోర్టు

భారత రాజ్యాంగం అయిదో భాగంలో ప్రకరణ 124 నుంచి 147 వరకు సుప్రీంకోర్టు నిర్మాణం, అధికారం, విధుల గురించి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ చట్టం-1935 ద్వారా ఫెడరల్ కోర్టును అత్యున్నత న్యాయస్థానంగా ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగం ద్వారా 1950 జనవరి 28న సుప్రీంకోర్టు అమల్లోకి వచ్చింది. సుప్రీంకోర్టు అమల్లోకి వచ్చిన తర్వాత అంతకుముందున్న ప్రివి కౌన్సిల్ (ఇంగ్లండ్‌లో ఉండేది) రద్దయింది. ఇది అత్యున్నత న్యాయస్థానంగా పనిచేసేది.

'Whence Law, Thence Victory' (ధర్మమే జయిస్తుంది) అనేది సుప్రీంకోర్టు మోటో (Moto). సుప్రీంకోర్టు భవన రూపశిల్పి 'గణేష్ బికాజీ డియోల్కర్'.

భారత న్యాయ వ్యవస్థ-లక్షణాలు: భారత న్యాయ వ్యవస్థ ఏకీకృత, సమగ్ర, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సర్వోన్నత న్యాయ వ్యవస్థ. సాధారణంగా సమాఖ్య ప్రభుత్వాల్లో ద్వంద్వ న్యాయ వ్యవస్థ ఉంటుంది. అంటే కేంద్ర, రాష్ట్ర వ్యవస్థలకు వేర్వేరుగా న్యాయ శాఖలుంటాయి. కానీ భారతదేశంలో న్యాయశాఖ విభజన లేదు. దేశంలోని న్యాయస్థానాలన్నీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తాయి.

నిర్మాణం

ప్రకరణ 124(1) ప్రకారం సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్ నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. 2009 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ఒక ప్రధాన న్యాయమూర్తి, 33 ఇతర సాధారణ న్యాయమూర్తులు ఉన్నారు.

ప్రారంభంలో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు సాధారణ న్యాయమూర్తులు ఉండేవారు. వీరి సంఖ్యను..

- 1956లో 11కు
- 1960లో 14కు
- 1977లో 18కి
- 1986లో 26కు
- 2008లో 31కి పెంచారు. ఈ సవరణ 2009 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం మొత్తం 34 మంది ఉన్నారు.

న్యాయమూర్తుల నియామకం:

ప్రకరణ 124(2) ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. రాష్ట్రపతి అధికార ముద్రతో స్వయంగా సంతకం చేసిన ఆదేశం (By Warrant Under Hand and Seal) ద్వారా వీరు నియమితులవుతారు.

ప్రధాన న్యాయమూర్తి నియామకం:

రాజ్యాంగంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ప్రత్యేక అర్హతలను పేర్కొనలేదు. సాధారణంగా సీనియర్ న్యాయమూర్తిని నియమిస్తారు. 1950 నుంచి 1973 వరకు ఇదే నియమాన్ని పాటించారు. కానీ, 1973లో కేశవానంద భారతి కేసు తర్వాత ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులను (జె.ఎం.షలాత్, ఎ.ఎన్. గ్రోవర్, కె.ఎస్.హేగ్డే) కాదని, జూనియర్ అయిన ఎస్.ఎన్.రేను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా 1977లోనూ సీనియర్ న్యాయమూర్తి అయిన హెచ్.ఆర్.ఖన్నాను కాదని ఎం.హెచ్. బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి:

ప్రకరణ 126 ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఖాళీ ఏర్పడినా లేదా అనివార్య కారణాల వల్ల విధులను నిర్వర్తించలేని సందర్భంలో.. రాష్ట్రపతి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని నియమిస్తారు.

తాత్కాలిక న్యాయమూర్తులు (Ad hoc judges):

ప్రకరణ 127 ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో 'కోరమ్' లేనప్పుడు, రాష్ట్రపతి పూర్వానుమతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, కొంతమంది తాత్కాలిక న్యాయమూర్తులను నియమించవచ్చు. తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యే వ్యక్తికి,సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి సంబంధించిన అన్ని అర్హతలు ఉండాలి.

ప్రకరణ 128 ప్రకారం, సుప్రీంకోర్టులో కేసులు అధికంగా ఉన్నప్పుడు పదవీ విరమణ చేసిన జడ్జీలను కూడా పదవిలో కొనసాగమని రాష్ట్రపతి అనుమతితో ప్రధాన న్యాయమూర్తి కోరవచ్చు.

జడ్జీల నియామకం-వివాదం-కొలీజియం

సుప్రీంకోర్టు జడ్జీల నియామక విషయంలో రాష్ట్రపతి ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించే విషయంపై సుప్రీంకోర్టు విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించింది. 1982లో మొదటి జడ్జీ కేసులో తీర్పు చెబుతూ 'సంప్రదించడం అంటే సాధారణంగా అభిప్రాయాలు తెలుసుకోవడమే, వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు, తీసుకోకపోవచ్చు' అని స్పష్టం చేసింది. రెండో జడ్జీ నియామకం సందర్భంగా 1993 కేసులో 'సంప్రదింపు అంటే సమ్మతి (Concurrence)' అనే అర్థాన్ని చెప్పారు. అదేవిధంగా 1998లో 3వ జడ్జీ నియామకం కేసులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాతో పాటు, నలుగురు సీనియర్ న్యాయమూర్తులను (కొలీజియం) కూడా సంప్రదించాలని పేర్కొంది. ఈ నలుగురు జడ్జీల్లో ఇద్దరు భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరిస్తే, కొలీజియం సలహాను రాష్ట్రపతికి పంపాల్సిన అవసరం లేదు.

లోపాలు: అధికార పృథక్కరణ సూత్రం ప్రకారం ప్రభుత్వ అంగాలైన శాసన, కార్య నిర్వాహక, న్యాయ శాఖలు తమకు నిర్దేశించిన విధులను మాత్రమే నిర్వర్తించాలి. ఒకరి విధుల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదు. అలా జరిగితే ప్రజల హక్కులకు భంగం కలగడంతో పాటు నియంతృత్వానికి దారితీస్తుందని ప్రఖ్యాత ఫ్రెంచి రాజనీతి తత్వవేత్త 'మాంటెస్క్యూ' పేర్కొన్నాడు. నియామకాలు కార్య నిర్వాహక పరిధిలోకి వస్తాయి. ఇందులో న్యాయస్థానాల జోక్యం సాధారణంగా అనుమతించరు. రాజ్యాంగంలోని కొలీజియం విధానం సుప్రీంకోర్టు సృష్టించిన వివాదాస్పద అంశం. న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించడం సమంజసం కాదు. ఇది వృత్తిపరమైన సౌభ్రాతృత్వానికి (Professional Fraternity)కి దారితీస్తుంది. పారదర్శకత, జవాబుదారీతనానికి విఘాతం వాటిల్లుతుంది.

ప్రత్యేక వివరణ: ప్రస్తుతం పై పద్ధతిలో మార్పు తీసుకు వస్తూ 'జాతీయ న్యాయ నియామకాల కమిషన్'ను ఏర్పాటు చేస్తూ 99వ రాజ్యాంగ సవరణ బిల్లును 2014లో ఆమోదించారు.

జాతీయ న్యాయ నియామకాల కమిషన్ - రాజ్యాంగ సవరణ: కొలీజియం వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి, న్యాయమూర్తుల నియామకం, బదిలీ, క్రమశిక్షణ చర్యలు, ఖాళీల గుర్తింపు మొదలైన అన్ని విషయాల్లో మరింత పారదర్శకంగా ఉండేందుకు, పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పిస్తూ కొత్త పద్ధతిని ఈ సవరణ ద్వారా ప్రతిపాదించారు.

జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్-ఎన్.జె.ఎ.సి.) బిల్లు-2014ను ఆగస్టు 13న లోక్‌సభ, ఆ మరుసటి రోజునే రాజ్యసభ ఆమోదించింది. సగానికి తక్కువ కాకుండా రాష్ట్ర శాసనసభలు ఈ బిల్లును ఆమోదించాయి. ఈ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడానికి 99వ రాజ్యాంగ సవరణ చేశారు. ఇది రాజ్యాంగబద్ధ సంస్థ.

కమిషన్ - నిర్మాణం - ప్రకరణ 124ఎ

జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్.జె.ఎ.సి)లో మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారు.

- కమిషన్‌కు ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు.
- సుప్రీంకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు.
- మరో సభ్యుడు కేంద్ర న్యాయశాఖ మంత్రి.
- ఇద్దరు ప్రముఖులు పౌర సమాజం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన వారై ఉండాలి. లేకపోతే మహిళ ఉండాలి. ఈ ఇద్దరు సభ్యులను ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రధాని అధ్యక్షతన ఉన్న ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉంటారు. పౌర సమాజం నుంచి ఎన్నికైన ప్రముఖుల పదవీకాలం మూడేళ్లు. వీరిని ఒకసారి మాత్రమే నియమించాలి. పునర్ నియామకానికి అర్హులు కారు.

ఎన్.జె.ఎ.సి. - విధులు (ప్రకరణ 124బి)

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతరన్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల నియామకానికి కమిషన్ సిఫార్సులు చేస్తుంది.
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల బదిలీల్లో చొరవ తీసుకుంటుంది.
- ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల ఖాళీలను గుర్తించి ప్రభుత్వానికి తెలియజేస్తుంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామక పద్ధతి

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపార అనుభవం ఉన్న సీనియర్ న్యాయమూర్తినే నియమిస్తారు.
- ప్రకరణ 124 బి ప్రకారం సమర్థత, ప్రతిభ ఉన్నవారినే ఇతర న్యాయమూర్తులుగా నియమించాలి.
- కమిషన్‌లోని ఏ ఇద్దరు సభ్యులు అంగీకరించకపోయినా, అలాంటి వారిని న్యాయమూర్తిగా నియమించేందుకు వీలులేదు.

హైకోర్టు న్యాయమూర్తుల నియామకం

- ప్రధాన న్యాయమూర్తిగా నియమించడానికి సీనియార్టీతో పాటు, సమర్థత, ప్రతిభ పరిగణనలోకి తీసుకుంటారు.
- హైకోర్టు ఇతర న్యాయమూర్తులను 217(2) ప్రకారం నియమిస్తారు. ఈ సందర్భంలో ఇద్దరు ఇతర సీనియర్ న్యాయమూర్తులను, న్యాయవాదులను ప్రధాన న్యాయమూర్తి సంప్రదించాలి.
- సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్‌లను కూడా ఎన్‌జేఏసీ సంప్రదించాలి.
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల బదిలీ విషయంలోనూ రాష్ట్రపతి నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ (NJAC)ని సంప్రదించాల్సి ఉంటుంది. కమిషన్ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంటే తప్పనిసరిగా ఆ నిర్ణయం మేరకు వ్యవహరించాలి.

99వ రాజ్యాంగ సవరణ-ముఖ్యాంశాలు

- **కొత్తగా చేర్చిన ప్రకరణలు:** 124(ఎ), 124(బి), 124(సి)
- **124(ఎ):** జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ నిర్మాణం.
- **124(బి):** జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ విధులు.
- **124(సి):** నియామక ప్రక్రియకు సంబంధించి చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌కు కల్పించడం.
- **సవరించిన ప్రకరణలు:** 124, 127, 128, 217, 222, 224, 224(ఎ), 231.

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్‌పీసీఎల్‌లో 63 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)లోని రిఫైనరీ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 63.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(మెకానికల్)-11, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్)-17, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్‌స్ట్రుమెంటేషన్)-06, జూనియర్ ఎగ్జిక్యూటివ్(కెమికల్)-01, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్-సేఫ్టీ)-28.
» **అర్హత:** అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో మూడేళ్ల డిప్లొమా కలిగి ఉండాలి.
» **వయసు:** 30.04.2025 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:**నెలకు రూ.30,000నుంచి 1,20,000
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్/టాస్క్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.04.2025
» **వెబ్‌సైట్:** https://hindustanpetroleum.com

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు, కోల్‌కతాలో 10 ట్రైనీ డాక్ పైలట్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో మెరైన్ ఒప్పంద ప్రాతిపదికన ట్రైనీ డాక్ పైలట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నాటికల్ సైన్స్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.03.2025 నాటికి 25 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రొఫిషియెన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, మెరైన్ డిపార్ట్‌మెంట్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా,15వ స్ట్రాండ్ రోడ్, కోల్‌కతా -700001 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.04.2025.
» **వెబ్‌సైట్:** https://smp.smportkolkata.in

క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం?

ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ట స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
రసాయన శాస్త్రం

ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు.సాధారణ పరిభాషలో వీటిని మందులుగానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి,నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemothe rapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు.

అవి:

1. **నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.

ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పనిచేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందువల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.

2. **నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** ఓపియమ్ పాపీ (నల్లమందు) నుంచి గ్రహించే మార్ఫీన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి. అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు. ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్సైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధి కానిది?
   1) స్పృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫీన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడీన్ 2) రెనిటిడీన్
   3) ఒమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బోనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఓమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫీన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్ల వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫీన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పని చేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫీన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫీన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ - కెఫీన్ 2) పొగాకు - నికోటిన్
    3) సింకోనా - క్వినైన్
    4) పెన్సిలియం బూజు - క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథింగ్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిత్రిన్
    3) ఈథర్ 4) ఆలిటేమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 1; 9) 4; 10) 2; 11) 2; 12) 1; 13) 1; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 4; 21) 1; 22) 1; 23) 3; 24) 1; 25) 2; 26) 4; 27) 1.

నిజాం వ్యక్తిగత సైన్యం పేరేంటి?

నిజాం హయాంలో
భూ పరిమితి కాలం, సాంఘిక వ్యవస్థ, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్, వెట్టి

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

అసఫ్‌జాహీలు

నిజాం రాజ్య పాలకులు గతంలో మొగలులు, కుతుబ్‌షాహీలు అనుసరించిన భూమిశిస్తు విధానాలనే కొనసాగించారు. స్థానిక అవసరాల దృష్ట్యా కొన్ని మార్పులు చేశారు.


హైదరాబాద్ రాజ్య విస్తీర్ణం 82,698 చదరపు మైళ్లు. దీనిలో 60 శాతం దివానీ భూమి, 30 శాతం భూమి జాగీర్దార్ల ఆధీనంలో ఉండేది. మిగిలిన 10 శాతం భూమిని నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించేవారు. ఆ భూములను సర్ఫ్-ఎ-ఖాస్ అనేవారు.

దివానీ భూమి శిస్తు విధానం

- రాజ్యానికి చెందిన భూమిని 'దివానీ లేదా ఖల్సా' భూములు అనేవారు. ఇందులో 60 శాతం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది.
- దివానీ భూముల నుంచి వచ్చే పన్నులను ప్రభుత్వ నిర్వహణకు ఉపయోగించేవారు.
- 1875లో దివానీ పద్ధతిలో క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానం 1317 ఫసలీ చట్టం ద్వారా సాలార్‌జంగ్-1 ప్రవేశపెట్టాడు.
- 1948లో హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేనాటికి సంస్థానం దివానీ భూమిలో 13,816 గ్రామాలు ఉన్నాయి.
- కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేసి నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచారు. తెలంగాణలో ఎక్కువ శాతం వ్యవసాయం చెరువులు, వర్షం ఆధారంగా సాగయ్యేది.
- సాగు భూముల నుంచి వచ్చే ఆదాయం తక్కువ ఉండటం, సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం వల్ల గుత్తేదార్లు, దళారీలు రైతులను వీలైనంత ఎక్కువ దోచుకొనేవారు. ఫలితంగా 15 శాతం సాగు భూమి వృథాగా ఉండేది.
- నిజాం రాజ్యంలో రైత్వారీ విధానంతోపాటు ఇతర భూమి శిస్తు పద్ధతులు కూడా ఉండేవి. రైత్వారీ విధానం ఎక్కువ ప్రాచుర్యం పొందింది. నిజాం పాలకుల కింద అధిక భూభాగం ఈ విధానం కిందే ఉండేది. రాజ్యంలో రైత్వారీ పద్ధతితోపాటు సరబాస్తా, ఇజారా, పాన్‌మక్తా వంటి ఇతర పద్ధతుల కింద కూడా భూమి ఉండేది.

రైత్వారీ విధానం

ఈ విధానంలో భూమి దున్నే రైతులకు యాజమాన్య హక్కులు ఇచ్చారు. ఈ విధానంలో మధ్యవర్తులు ఉండేవారు కాదు. దాదాపు 200 మిలియన్ల ఎకరాలకు పైగా భూమి రైత్వారీ విధానం కింద ఉండేది.



- హైదరాబాద్ రెవెన్యూ కోడ్ (1879) కింద ప్రభుత్వం భూయజమానులకు వాస్తవ హక్కులను కల్పించింది. ఈ కోడ్ ద్వారా రాజ్యంలో రైతును అసలైన యజమానిగా గుర్తించారు.
- భద్రత, సమర్థమైన పూర్తి హక్కులకు కోడ్ ప్రకారం రైతులకు అప్పగించారు. కొన్ని నియమ నిబంధనలతో రైతు ప్రభుత్వానికి క్రమం తప్పకుండా భూమి పన్ను కట్టాలి.
- రైత్వారీ విధానంలో పట్టాదారు తన భూమిని విక్రయించడానికి లేదా తనఖా పెట్టడానికి హక్కు ఉండేది.
- చట్టపరంగా సేద్య భూమిని వ్యక్తిగతంగా లేదా వ్యవసాయ కూలీల ద్వారా సేద్యం చేసేవారు. దీన్ని పట్టాదారు విధానం అనే వారు.
- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ రైతులు సేద్యం ద్వారా ఉమ్మడిగా లేదా వాటాదారులుగానీ ఉత్పత్తి చేసిన దాంట్లో సమాన భాగస్వామ్యం కలిసి ఉన్న విధానమే 'పాథ్ పట్టాదారీ'.

పాన్‌మక్తా:
ప్రభుత్వ భూములను కౌలుకు తీసుకొని స్థిరమైన శిస్తు చెల్లించే కౌలుదారీ విధానమే పాన్‌మక్తా. ఇందులో పన్ను పెరుగుదల ఉండేది కాదు.

ఇజారా పద్ధతి:
వ్యవసాయ క్షేత్రాలు బ్రిటిష్ ప్రాంత పరిపాలనలోకి వెళ్లకుండా, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామాలను పునర్జీవనం చేయడానికి, బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పద్ధతే ఇజారా పద్ధతి. పరిపాలనలో అవినీతిని నిరోధించడానికి, గుత్తేదార్లు, భూస్వాముల నుంచి వ్యవసాయదారులను రక్షించడానికి సాలార్‌జంగ్ సంస్కరణల ఫలితంగా ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

వతన్‌దారీ పద్ధతి:
ఇది చాలా ప్రాచీన భూమిశిస్తు పద్ధతి. రాజుకు సేవ చేసినందుకు ప్రభుత్వం ఈ భూములను ఇచ్చేది. వతన్ అంటే స్థానిక లేదా సొంత ప్రాంతం అని అర్థం.

- స్థానిక రెవెన్యూ అధికారులైన పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, సర్దేశ్‌పాండేలు, గ్రామంలోని వృత్తి పనివాళ్లకు, గ్రామ సేవకులకు నగదు రూపంలో ఇచ్చే జీతాలకు బదులుగా ఈ భూములను ఇచ్చేవారు.

సర్ఫ్-ఎ-ఖాస్:
సర్ఫ్-ఎ-ఖాస్ పదాన్ని అరబిక్ భాష నుంచి గ్రహించారు. సర్ఫ్-ఎ- ఖాస్ అంటే వ్యక్తిగత వ్యయం అని అర్థం.

- నిజాం రాజు సొంత ఖర్చుల నిమిత్తం కేటాయించిన భూమే సర్ఫ్-ఎ-ఖాస్ (సర్ఫేఖాస్). వీటి విస్తీర్ణం 10,000 చదరపు మైళ్లు.
- 1948లో హైదరాబాద్ సంస్థానం, భారత యూనియన్‌లో విలీనం అయ్యేంత వరకు సర్ఫేఖాస్ భూముల ఆదాయం, వనరులను రాజ కుటుంబానికి కేటాయించారు.
- రెండో నిజాం కాలంలో దార్-ఉల్-సిఫ్రా అనేది సర్ఫేఖాస్ భూముల కేంద్ర పరిపాలన విభాగం.
- నిజాంకు వ్యక్తిగత సైన్యం ఉండేది. దాన్ని సర్ఫేఖాస్ సైన్యం అని పిలిచేవారు.
- సర్ఫేఖాస్ ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో కలిపేవారు కాదు. ఈ భూముల్లో వసూలైన పన్నులను జిల్లా సర్ఫేఖాస్ ఖాతా నుంచి పర్యవేక్షకుడి ఖాతాలో చేరుతుంది. వీటిని ప్రభుత్వ ఆజ్ఞ ద్వారా సర్ఫేఖాస్ అధికారి పర్యవేక్షించేవాడు. ఖాతా ధనం మొత్తం సర్ఫేఖాస్ కార్యదర్శి ద్వారా సర్ఫేఖాస్ అధికారికి చేరుతుంది.
- సర్ఫేఖాస్ భూములను సర్దార్-ఉల్-మహమ్ అనే అధికారి పర్యవేక్షించేవాడు. ఇతడు ప్రత్యక్షంగా నిజాం ఆధీనంలో పనిచేసేవాడు.
- సర్ఫేఖాస్ భూములను ముఫ్‌వాజా(అప్పగించిన భూములు), జేర్‌నిగరాని(పర్యవేక్షించే తాలూకాలు)గా విభజించారు.

జాగీర్దారీ పద్ధతి:
నిజాం నవాబుకు, ప్రభుత్వానికి సేవచేసిన వారికి ఇచ్చిన భూములను జాగీర్లు అనేవారు. జాగీరు పొందిన వ్యక్తి ఆ ప్రాంతం మీద పూర్తి హక్కులు పొందుతాడు. అలా పూర్తి హక్కులు పొందినవారినే జాగీర్దార్లు.

- ఈ జాగీర్దారీ విధానాన్ని కాకతీయుల కాలంలోని నాయంకర విధానం, విజయనగర కాలంలో అమర నాయక విధానం, మొగలుల కాలంలో మున్సబ్‌దారీ విధానాలతో పోల్చవచ్చు.
- జాగీర్దారీ విధానాన్ని మధ్యాసియా ప్రాంతం నుంచి ఢిల్లీ సుల్తాన్లు తీసుకువచ్చి భారతదేశంలో ప్రవేశపెట్టారు.
- జాగీర్దార్ అనే పదం రెండు పర్షియన్ పదాల కలయిక. జాగీరు అంటే భూమి, దార్ అంటే అధికారి. భూమి మీద హక్కులు ఉన్న అధికారి అని జాగీర్దార్ అర్థం.
- నిజాం రాజు మొత్తం భూభాగంలో 40 శాతం జాగీర్దార్లకు ఇచ్చారు.
- జాగీర్దారు తన జాగీరులో పన్నులు వసూలు చేసుకొని శాంతి భద్రతలు కాపాడుతూ, సైన్యాన్ని నిర్వహించేవారు. రాజుకు అవసరం ఉన్నప్పుడు సైన్యాన్ని పంపేవారు.

జాగీరు రకాలు

పాయిగా జాగీర్:
పాయిగా జాగీరు భూములకు మరో పేరు జాగిరత్-ఇ-నిగదిస్తు జామతి. ఇది ఒక సైనిక జాగీరు. పాయిగా జాగీరును నవాబ్ నిజాం అలీ ఖాన్ బహదూర్ నుంచి అబ్దుల్ ఖాహిర్ ఖాన్, నవాబ్ షంషల్ ఉమ్రా, అమీర్-ఇ-కబీర్ గుర్రాల నిర్వహణ కోసం భూములను పొందారు. తర్వాత కాలంలో ఈ భూములను పాయిగా జాగీరుగా మార్చారు.

- పాయిగా అంటే స్థిరత్వం. ఈ జాగీరు మొత్తం విస్తీర్ణం 2000 చ.మైళ్లు. ఇందులో సుమారు 1000 గ్రామాలు ఉన్నాయి.

అల్‌తమ్‌గా జాగీర్:
అల్‌తమ్‌గా తుర్కీ భాషకు చెందిన పదం. అల్‌తమ్‌గా అంటే రాజు చిహ్నానికి ఉన్న రెండు గుర్తులు. ఇది భూమిశిస్తు లేని జాగీరు. ఈ జాగీరును రాజు తన ముద్ర ద్వారా కేటాయిస్తారు. ఈ జాగీరు శాశ్వతమైన వంశపారపర్యంగా పొందే హక్కు. దీన్ని విక్రయించే హక్కు లేదు. ఒకవేళ ఈ భూమిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలంటే ముందుగా రాజు అనుమతి తీసుకోవాలి.

జాట్ జాగీర్‌లు:
నిజాం కాలంలో అతిపెద్ద భూ విస్తీర్ణం ఉన్న జాగీరు. జీవితాంతం నిజాం కోసం సేవ చేసే వారికి ఇచ్చే భూములే జాట్ జాగీరులు.

- ఈ జాగీరు పొందినవారు తమ జీవితాంతం ఆ భూమిని అనుభవించవచ్చు.
- ఈ జాగీరుకు మరో పేరు ఖాన్‌కా జాగీరు. ఈ జాగీర్దారుకు తమకు వచ్చే ఆదాయం పై న్యాయపరమైన హక్కు ఉండేది.
- వీరికి ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, భూమి కొలతల శాఖ మొదలైన వాటిపై పొందిన భూమిపై అన్నిరకాల పన్నుల నుంచి మినహాయింపులు ఉండేవి. వీరు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన హోదాను కలిగి ఉండేవారు.

ఉమ్రా-ఇ-అజమ్ జాగీరు:
వీరు కూడా నిజాం రాజు సేవకులే. పాయిగా జాగీరు తర్వాత స్థాయికి చెందినవారు. ఈ జాగీర్లను ఇలాఖాలు అని కూడా పిలిచేవారు. నిజాం రాజ్యంలో మొత్తం ఇలాఖాలు తొమ్మిది. ఇందులో ప్రధానమైనవి నాలుగు.

- ఈ నాలుగు ఇలాఖాలు అత్యంత పలుకుబడి ఉన్న అధికారుల ఆధీనంలో ఉండేవి. ఇవి నవాబ్ సాలార్‌జంగ్, మహారాజా శ్రీ కిషన్ ప్రసాద్, నవాబ్ ఖాని ఖానన్, నవాబ్ ఫఖుర్-ఉల్-ముల్క్ అనే ప్రధాన మంత్రులకు చెందినవి.
- ఈ ఇలాఖాల్లో మొత్తం 769 గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాలను నాలుగు సంస్థానాలుగా విభజించారు.
- ఈ నాలుగు సంస్థానాల్లో సాలార్‌జంగ్‌కు చెందిన ఇలాఖా పెద్దది. ఇందులో 1126 చదరపు మైళ్ల విస్తీర్ణంతో 359 గ్రామాలుండేవి. ఇలాఖా నుంచి ఏడాదికి 20 లక్షల సిక్కాల ఆదాయం లభించేది.
- ఈ నాలుగు ఇలాఖాలు విడివిడిగా రెవెన్యూ, చట్ట నిర్వహణ చేసేవి.

మశ్రుతి జాగీర్లు:
రాజ్యంలో ప్రజల కోసం, సైనిక వ్యవస్థ కోసం, మతం కోసం పనిచేసిన వ్యక్తులకు ఇచ్చే జాగీర్లు. ఇది షరతులతో కూడిన జాగీరు.

జాగీరు భూముల్లో రెవెన్యూ పరిపాలన

అన్ని జాగీరుల భూముల విస్తీర్ణం, ఆదాయం ఒకే విధంగా ఉండేది కాదు. ఈ జాగీరు ప్రాంతాల్లో వివిధ రకాలైన పరిపాలన ఉంటుంది. కాబట్టి కౌలుదార్ల నుంచి జాగీర్దార్లు ఎక్కువ కౌలు వసూలు చేసేవారు. నిజాం కూడా పెద్ద జాగీరుల ఆగడాలను నిలువరించలేకపోయాడు. కొన్ని సందర్భాల్లో నిజాం దివానీ హక్కులను కూడా జాగీర్దార్లు ధిక్కరించారు. తొంభై శాతం జాగీర్దార్లు నిజాం రాజు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానం కాకుండా తమ స్వతంత్ర శిస్తు విధానాన్ని అమలు చేశారు.

ఇనాం భూములు:
ఇనాం అనేది బహుమతిగా ఇచ్చిన భూమి లేదా భూమిశిస్తు. పాలకులు పొందిన సేవలు లేదా భవిష్యత్తులో పొందే సేవలకు గాను సేవకులకు ఇనాం భూములు ఇచ్చారు.

అగ్రహారాలు:
అగ్రహారాలు నిజాం కాలంలో ప్రధాన హిందూ విద్యా కేంద్రాలుగా ఉండేవి. విద్య బోధించడానికి బ్రాహ్మణులకు అగ్రహార గ్రామాలను శిస్తులేకుండా ఇచ్చేవారు. ఈ అగ్రహార భూములు వంశపారంపర్యంగా వారసులకు లభించేవి. ఈ విద్యాకేంద్రాలపై ఎటువంటి అజమాయిషీ ఉండేది కాదు.

వెట్టి:
వెట్టి అంటే బలవంతంగా లేదా తప్పనిసరిగా దేశ్‌ముఖ్‌లకు, దొరలకు తక్కువ వేతనాలకు లేదా అసలు వేతనం లేకుండా పని చేయడం.

బాగేలా(వెట్టి చాకిరి) పద్ధతి:
హైదరాబాద్ నిజాం కాలంలో సమాజంలో భూమి లేని వర్గాలకు చెందినవారు బాగేలా పద్ధతిలో పనిచేసేవారు. తీసుకున్న అప్పు తీరే వరకు కుటుంబంలో ఒక వ్యక్తి దేశ్‌ముఖ్ లేదా దేశ్‌పాండే ఇంట్లో పని చేసేవారు. తనఖా ఉన్న బాగేలా జీతం చాలా తక్కువగా ఉండేది. బాగేలా చనిపోతే ఆ అప్పు తన కుమారుడికి వారసత్వంగా వెళ్లేది.

- 1992లో చిలుకూరులో జరిగిన నిజాం ఆంధ్ర మహాసభ సమావేశంలో వెట్టిచాకిరి నిర్మూలన కోసం అవగాహన వారాలను నిర్వహించింది.
- 1944 భువనగిరి, 1945 మణికొండ నిజాం ఆంధ్ర మహాసభల్లో 'వెట్టిచాకిరిని రద్దు చేయాలి' అని తీర్మానం చేశారు.

The full step wise process..

Bank Exams

COMPUTER AWARENESS

1. Secret word which is used to prevent access to a file system or network is called:
a) Login b) Password
c) Account No
d) Net ID e) System ID
2. The comprehensive software system that builds, maintains and provides access to a database is called ___
a) CPU b) DASD
c) CAI d) DBMS
e) Data base
3. A series of specially designed documents, which are all linked to be viewed on internet, is called:
a) World Wide Web
b) Web Server
c) Search Engine
d) Both b and c
e) All the above
4. Compilers are:
a) Both OS and hardware dependent
b) Only OS dependent
c) Only hardware dependent
d) Cannot be generalized for all compilers
e) Only application dependent
5. A device that generates the periodic signals used to control the timing of all CPU operations is called:
a) COM b) Collate
c) Chip d) Clock
e) CORE
6. A ____ is a design tool that graphically shows the logic in a solution algorithm.
a) flowchart b) hierarchy chart
c) structure chart
d) context diagram e) Pie Chart
7. A multi-purpose window which opens nearly for everything is:
a) Main desktop
b) Explorer Window
c) Browser Window
d) Error Window
e) File Window
8. ___ means to enlarge a window to its maximum area so that it will fill entire desktop.
a) Maximize b) Zoom
c) Enlarge d) Extend
e) Insert



9. The full step wise process of closing a computer:
a) Shutting b) Closing
c) Log off d) Shut down
e) Sleeping mode
10. A connection from one HTML document to another HTML document is called:
a) Hyper Link
b) Connecting Link
c) Icon d) All of these
e) None of these
11. Capability of computer to perform more than one task at the same time is called:
a) Batch processing
b) Real time processing
c) Multitasking
d) Scheduled processing
e) Multiple tasking
12. The smallest dot that can be uniquely drawn on a computer screen is called:
a) Boxel b) Computer Dot
c) Cursor d) Pixel
e) Clip
13. A picture, map, graphics or image that can be used in a document is known as ___
a) Clip b) Object
c) Clip Board d) Drag Drop
e) Cursor
14. Display bar that list all the open folders and active application is called:
a) Menu bar b) Toolbar
c) Taskbar d) Window List
e) Review
15. ___ is the process of getting access to a computer.
a) Sign in b) Log in
c) Log off d) Enter
e) Shut down
16. A program written in high-level language:
a) Compiled Program
b) Source Program
c) Objective Program
d) All the above e) None of these
17. A unit for measuring data transmission speed is called ___
a) cache
b) broad band channels
c) byte d) baud
e) bit
18. Which of the following is / are interpreted language?
a) C b) C++
c) Java d) Visual Basic
e) Both c and d
19. Digital photos and scanned images are typically stored as ____ graphics with extensions such as bmp, png, jpg, tif and gif.
a) vector b) bitmap
c) either vector or bitmap
d) neither vector nor bitmap
e) image
20. Which of the following language is CPU can directly understand?
a) C b) C++
c) Assembly d) Java
e) Advanced java
21. Manipulating data to create information is known as ___
a) Feedback b) Programming
c) Processing d) Analysis
e) All the above
22. A normal compiler takes source code as input and produces this as output ____
a) Assembly code
b) Object Code
c) Machine code
d) System code
e) Network IP code
23. Language which can easily interact with the hardware:
a) High Level Languages
b) Low Level Languages
c) Middle Level Languages
d) They are not normally used computer languages
e) Very high level languages
24. Detecting, locating and removing errors in program and/or malfunctions in equipment is called ___
a) Compile b) Debug
c) Interpret d) DSS e) DNS
25. Which of the following is the most powerful type of computer?
a) Super computer
b) Micro Computer
c) Main Frame computer
d) Mini Computer
e) Bio computer
26. What is the expanded form of CPU?
a) Central Power Unit
b) Core Processing Unit
c) Central Performance Unit
d) Core Point Unit
e) None of these

KEY:

1) b;	2) d;	3) a;	4) a;
5) d;	6) a;	7) b;	8) a;
9) d;	10) a;	11) c;	12) d;
13) b;	14) c;	15) b;	16) b;
17) c;	18) e;	19) b;	20) c;
21) c;	22) c;	23) b;	24) b;
25) a;	26) e.		

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో 18 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

మైసూరులోని సీఎస్ఐఆర్-సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2025.
- **రాతపరీక్ష తేది:** జూన్/జూలై, 2025.
- **వెబ్‌సైట్:** https://www.cftri.res.in/

హెచ్ఏఎల్, బెంగళూరులో విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టులు

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) బారక్‌పూర్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** విజిటింగ్ కన్సల్టెంట్(జనరల్ మెడిసిన్)-01, విజిటింగ్ కన్సల్టెంట్(ఆర్థోపెడిక్స్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంబీబీఎస్, ఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.04.2025 నాటికి 65 ఏళ్లలోపు ఉండాలి. • **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ మేనేజర్(హెచ్ఆర్), హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బారక్‌పూర్ డివిజన్, 9 తోప్‌ఖానా రోడ్, కోల్‌కతా-700120.
- **దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
- **వెబ్‌సైట్:** http://https//www.hal-india.co.in/

సీపెట్, చెన్నైలో వివిధ ఉద్యోగాలు

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** కన్సల్టెంట్(స్కిల్ డెవలప్‌మెంట్)-02, అనలిస్ట్(స్కిల్ డెవలప్‌మెంట్)-03, క్వాలిఫైడ్/సెమీ క్వాలిఫైడ్ సీఏ/సీఎంఏ-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు కన్సల్టెంట్ పోస్టుకు రూ.70,000, అనలిస్ట్ పోస్టుకు రూ.50,000, క్వాలిఫైడ్/సెమీ క్వాలిఫైడ్ సీఏ/సీఎంఏకు రూ.35,000 నుంచి రూ.70,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. • **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.cipet.gov.in/

సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో 14 పోస్టులు

మైసూరులోని సీఎస్ఐఆర్-సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-04, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్-ఏ)-04, జూనియర్ స్టెనోగ్రాఫర్-06.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 07.05.2025 నాటికి జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లు, స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.36,220, స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.47,415.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.05.2025.
- **వెబ్‌సైట్:** https://cftri.res.in/

టీజీ పాలీసెట్-2025

తెలంగాణ రాష్ట్రంలోని స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు పాలీసెట్-2025 ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.04.2025.
- **ప్రవేశ పరీక్ష తేది:** 13.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.polycet.sbtet.telangana.gov.in/